రాత్రి చిగుళ్ళు

అడిగోపుల వెంకటరత్నమ్

RAATI CHIGULLU
(Collection of Poems)

Author :

Adigopula Venkataratnam
Nagarjuna University
Guntur - 522 510

First Edition : August, 1998

·Copies : 1000

Cover painting : Srikanth Adigopula

894.8131
VEN

For copies :

Prajasakti Book House
Karl Marx Road
Vijayawada - 520 002 - and all its branches

Visalaandhra Book House
4-1-435, Vignana Bhavan, Bank Street
Hyderabad - 500 001 - and all its branches

Pallavi Publications
Karl Marx Road
Vijayawada - 520 002

Printed at :

Sree Lakshmi Press
14/2 Arundelpet, Guntur

Price : **Rs. 20-00**

ఆత్మీయులు
కర్నాటి లక్ష్మీనరసయ్య గారికి
రవణం శ్రీరాములు గారికి
శీలం దివాకరరావు గారికి

సుహృదుడు
తెలకపల్లి రవి గారికి

కవితల్ని ప్రచురించిన
ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి దిన, వారపత్రికల
ప్రజాశక్తి, విశాలాంధ్ర, ఆంధ్రభూమి దినపత్రికల
ఆహ్వానం, స్రవంతి, ప్రజాసాహితి మాసపత్రికల
సంపాదకులకు......
హృదయపూర్వక కృతజ్ఞతలు.

—అడిగోపుల వెంకటరత్నమ్

సూచిక :

వేయి కళ్ళ నిఘా	7
ప్రాణయంత్రం	9
కట్టెల గూళ్ళు	11
పునరపి	13
శ్రీకారానికి ముందు	15
వీస్తున్న గాలి	17
వెలుగు వెల్లువ	19
ముందడుగు	21
అభేద ప్రశ్న	23
తడిమంట	25
వందేమాతరం	27
పరాజిత ప్రతిఘటన	29
అర్ధశతాబ్ది స్వాతంత్ర్యం	31
అతడ్ని కల్సుకోవాలి	33
రాతి చిగుళ్ళు	35
బట్టబయలు బందీ	37
గళం విప్పిన కాలహరణం	39
ఎగరేసిన బావుటా	41
గుండె నిండిన పాట	43
కీలు తప్పిన వెన్నెముక	45
అసంపూర్ణ గీతం	47
శ్వేతహాసం	49
మారని దృశ్యం	51
కొడిగట్టిన కాలం	53

మట్టిని చదివితే	55
స్వేద సముద్రం	57
గుప్పెడు ఆశ	59
మౌన ఝంఝ	61
బతుకు కర్పూరం	63
మనిషి ముందుకు కథ వెనక్కు	65
నీతికి ఉప్పు పాతర	67
అద్దంలో బొమ్మ	69
ప్రాణప్రతిమ	71
కన్నీటిని కత్తి చీల్చితే	73
హరివిల్లు రెక్కలపై	75
ఇంకా తెల్లారలేదు	77
అనాదిగా అదే నీతి	79
కూలుతున్న గోడలు	81
భూగోళం ఆమె శిశువు	83
రూపుకు రెండు ముఖాలు	85
కాస్త అలసట తీరాక	87
నిర్మాణం జరుగుతూవుంది	89

వేయి కళ్ళ నిఘా

ప్రయాణం నడుస్తూ వుంటుంది
ఓటమి విజయమౌతున్నప్పుడు
గెలుపు గుత్తాధిపత్యమై గర్జన
అలసట లేని ఆనందం
అవధుల్లేని ఆవేదన నన్ను చుట్టిన వర్తమానం
ప్రియుడా, ప్రేమికుడా, ధీరుడా, విప్లవకారుడా
మనమెప్పుడూ కలుసుకునే వుంటాం
శారీరక సంసర్గమే కలయిక కాదు
చెట్టును గాలి తాకని క్షణం వుండదు.
కదలికలుంటాయి కనురెప్పకు తెలియదు
కనురెప్పలుంటాయి కదలిక వుండదు
వేయి కళ్ళ నిఘాపై ఒంటి కన్ను మాటు నీది.
ఆకు కదిలితే నీ శ్వాస
పక్షి ఎగిరితే నీ అలికిడి
భ్రమ పుట్టి ఆశ రేపుతుంది
తడిపొడి చూపు తడబడకుండా నిలుస్తుంది.
ఒంటరిగా నిల్చిన వాటి వెంట తిరిగే సెలయేరు

అన్నిటికి ప్రాణహిత
నువ్వు పసి పిందైన చోట
కవచాలై కప్పిన ఆకు చేతులు
విస్ఫులింగమై జ్వలించిన చోట
రక్షణ వలయాలై సంధించిన విల్లులు
అభయమై ఎక్కుపెట్టిన బందూకులు.
ప్రియుడా, ప్రేమికుడా, ధీరుడా, విప్లవకారుడా
నేను నిలబడి వుంటాను
నాకు కనబడకుండా చుట్టి వెళ్ళు
నువ్వు నిల్చుని వుంటావు
నీకు తెలియకుండా నిన్ను ప్రదక్షిస్తాను
బాలచంద్రుడికి కర్తవ్య బోధనలో
నేను మాంచాలను
ఉద్యమానికి తల్లిని.... ఊపిరిని.

ప్రాణయంత్రం

తొలికోడికి ముందో
వేగుచుక్కకు వెనకో
ఉలిక్కిపడ్డ గాఢనిద్ర
మెలకువ మజిలీ వేస్తుంది.
అమ్మ అలికిడి నా చెవులు చేరవేస్తాయి
నిద్రపోలేని బతుకు రెక్కల మోత
ఇల్లంతా మార్మోగుతుంటే
మూసిన కళ్ళతో అమ్మ పరిశ్రమ చూస్తాను.
నిద్రిస్తున్న నా కాళ్ళముందు అమ్మకాళ్ళు
పునరపి జననమౌతాయి
చేతులు అటక మీదకు ఎక్కుతూనో
పాత్రల్లో దూరుతూనో
పచ్చడి బండ మధ్య నలుగుతూనో
కాల్తున్న రొట్టెపై అట్లకాడై మాడుతూనో
మంట మండిస్తూనో
మంటనార్పుతూనో వుంటే
దేహాన్ని దుప్పట్లో చుట్టిన నా చేతులు

పొత్తి కడుపున వొదుగుతాయి.
కేవలం కాలహరణకు ఆమె పెదాలు
లిపికందని భాషను వల్లిస్తుంటే
కడుపు రిజర్వాయర్లో మాటల్ని నిల్వచేసి
నా పెదాలు అనకట్ట కడతాయి.
అమ్మకేదో సాయం చేద్దామనో
ఆమె పరిశ్రమలో
పదిపైసల వాటా పంచుకుందామనో
పైకి లేవబోయి
తల్లి మమతా సామ్రాజ్యంలో
కొడుకు సింహాసనం గుర్తొచ్చి
హఠాత్తుగా అధిష్ఠించి నిద్రలోకి జారుతాను.
మేల్కొల్పే ప్రక్రియలో అమ్మవేళ్ళు
మెల్లగా సుతిమెత్తగా స్పృశిస్తున్నప్పుడు
బద్ధకపు నా వొళ్ళు ఆవలింపులు పూస్తుంది.
ఆహార్యం ధరించిన సూర్యుడు
నటనాలయంలో నటిస్తుంటాడు
పగటి జీవనపోరాటానికి రాత్రిభూమిక
అమ్మకు నిండైన నిర్వచనం
పగలు రాత్రి పరిశ్రమించే ప్రాణయంత్రం.

కట్టెల గూళ్ళు

రూపం అస్థిపంజరమై
ఒక మట్టిగర్భం పండుతుంది
దొర్లుడు పుచ్చకాయలు కాదు గదా
తల్లి గర్భంలోంచి దొర్లడానికి—
ఎముకలు సూదులై చురకత్తులై
గుచ్చి చీల్చి
కట్టెలు కట్టెల్ని కంటాయి.
పుట్టీ గిట్టే సూర్యుడ్ని రోజూ కొలిచే
వెర్నియర్ కాలిపర్స్ కొలతల్లో
ఒక్క సెంటీమీటరూ తేడా వుండదు
అతడు అన్ని గ్రహాలకూ ఆదర్శతనయుడు.
పుట్టిన బిడ్డ పరిణామదశ చుట్టూ
ఋతువుల కర్తవ్య నిర్వహణ ప్రారంభం
చిగురించడం, పుష్పించడం, రాలడం—
ఒంటినిట్టాడు మోడుకు
ఎన్ని కొమ్మల కుటుంబాలో
ఎన్నెన్ని ఆకుల బిడ్డలో—

కదులుతున్న అస్థిపంజరానికి
ఒక కండా చిగురించదు
మొదళ్ళను ఎండగడుతూ తోటమాలి
భగీరధుడ్ని తరుముతూ ఎండమావి.
ఎముకలు వరలై
వొళ్ళంతా కన్నీటి బావి
అభ్యంగన స్నానాల్లో
మునిగి తేలుతూ కళ్ళు
మట్టి పుట్టుక చుట్టూ
దినదిన గండం.
అస్థిపంజర పరిణామ ప్రక్రియలో
రూపం అస్థిపంజరమై
మరో అస్థిపంజరం గర్భం పండుతుంది.
మరణించిన అస్థిపంజరానికి
జన్మించిన అస్థిపంజరం
మళ్ళీ ప్రత్యామ్నాయం—

పునరపి

విత్తునాది, చెట్టునాది
పొలంనాది, పుట్టనాది
ఊరు వూరంతా నా ఆనవాళ్ళు
సువిశాల దేశం మూరెడు పతాకమై ఆనవాలు
ఎగిరే జెండాలో ఒక అణువు నా ఆనవాలు.
వాడు ప్రశ్నిస్తాడు, గర్జిస్తాడు
ఉరుముతాడు, శిక్షిస్తాడు
చెట్టు గాలికి ఊగితే నేరం
నీరు పల్లానికి పారితే నేరం
ఎదురొచ్చిన గుండెలపై బూట్లు
ఎదురొడ్డిన గుండెలపై బాయినెట్లు.
ఊరు వూరులా లేదు
ఊడ్చిన కల్లంలా వుంది
కంటి మీద కునుకుండదు
యుగాలు గడిచినా రాత్రి తెల్లారదు.
హఠాత్తుగా జొరబడ్డ ఆనవాలు లేనివాడు
నా ఆనవాలు నా యింట ప్రశ్నించి శంకించి

జీర్ణతృణంగా విదిల్చి హేయపరుస్తాడు
ఎంటితో బంధించబడ్డ
ఆశ్వికదళం చూపుతాను
అణువును జేసి హేళన చేస్తాడు
చూపును నుసి చేసిన
రేణువుల జాబితా విప్పుతాను.
వాడి ప్రశ్నకు నేను జవాబు
వాడి ఉరుముకు నేను పిడుగు
వాడి తూటాకు నేను తిరుగుబాటు
గురిపెట్టిన తుపాకి నా గుండెల్లో పేలుతుంది
ఆనవాళ్ళ సమూహం చుట్టూ
మరణమృదంగం
నాకు మరణమెక్కడిది ?

శ్రీకారానికి ముందు

ప్రాతఃకిరణాల లేత పొద్దు కాదు
మధ్యందిన మార్తాండుని ఉష్ణతరుణము కాదు
మసక చీకట్ల మునిమాపు వేళకాదు.....
కాలంగాని కాలంలో నిర్ఘోష
వేగుచుక్కవేళ మిన్నంటిన డప్పునాదం
ఊరూ వాడా శబ్ద సముద్ర ఘోష
అది మల్లయ్య డప్పు గర్జన.....
తరతరాల వారసత్వపు వీలునామా
మల్లయ్య స్థిరచరాస్తి డప్పు
నిర్దిష్ట వేళలో మల్లయ్య డప్పు
మీసాలపై నిమ్మకాయలు నర్తింపజేస్తే
రాళ్ళు రప్పలు క్షణకాలం జీవం తొడిగేవి
మోరెత్తి కోడెలు పట్టెడ రవళి వినిపించేవి.
నేటి అసాధారణ శబ్దలహరి హేలకు
ఉలిక్కిపడ్డ ప్రజ ఏకాగ్రత కోల్పోయి
అకాలనాదానికి హేతువు వెతుకుతూంది.
ఊరచెరువు చేపల వేలం పాట కాదు

జమాబంది చాటింపు విషయం కాదు
పంటకాల్వ పూడికతీత ప్రకటన కాదు.
కారణాన్వేషణ కార్యక్రమంలో
అకాలనాదం అంతుబట్టడం లేదు
అప్రతిహతమై నాదం సాగుతూంది.
చిర్రా చిటికెన శరీరాలు చిట్లి
పగిలిన వేళ్ళు రక్తపుటేర్లు కట్టాయి
మల్లయ్య మాట్లాడ్డం లేదు
మూసిన కళ్ళతో మౌనంగా
మరోప్రపంచం చూస్తున్నాడు.
గుమిగూడిన ప్రజానీకం
మంత్రముగ్ధమై మూగబోయింది
వేగం తగ్గిన మల్లయ్య మేను మాగన్నుగా మారి
శబ్దం నిశ్శబ్దమై కూర్చుంది
అది వారసత్వపు డప్పుకు రాజీనామా.
మేల్కొన్న జనావళి నోరు మెదపబోయి
ఉదయాద్రిని చూసి ఉలిక్కిపడింది
తూర్పుకొండపై మొలకెత్తిన డప్పు
శబ్దం వినా వెలుగులు చిమ్ముతూ
అరుణారుణ రూపావిష్కరణ చేస్తూంది.

వీస్తున్న గాలి

ఆలమందలో గోముఖ వ్యాఘ్రం
జలరాశిలో నిగూఢ విషరాశి
ఆశ చుట్టూ అగడ్తల పద్మవ్యూహం.
ఒకటి గుర్రపు స్వారి
సెకండ్లు గంటలు కొలిచిన చరిత్ర సృష్టి,
ఒకటి తాబేలు నడక
రోజులు సంవత్సరాలు కూర్చిన తలగడ.
కత్తి పట్టి ఎదురు నిల్చొని
కలలు కనొద్దంటూ ఒకడి శాసనం.....
ఏది నీ జీవితంలో విస్ఫోటనం
ఏది నీ జ్వలిత చరిత కేతనం ?
విరామ మెరుగక చిగురు
గాల్లో ఈతకొడుతూ శ్రమిస్తూంది
హక్కు ఆయుధం కానప్పుడు
ఫలితం నిర్వీర్యం.
అక్షరాలు నిరక్షరాస్యాలై నిద్రిస్తున్నాయి
ఎంతమంది చేతుల్లో మేల్కొన్నాయి

మరెంతమంది కలాల్లో
సాక్షర కుసుమాలై వికసించాయి?
వేణువు తన ముడి పదార్థాన్ని వెక్కిరిస్తే
ముడి పదార్థం మురళైతేనే దీటైన జవాబు
అద్దె సంతకం అరువు సంతకం మధ్య
మరచిపోయిన సొంత సంతకం.
దిక్కులు మార్చే ఎత్తుగడ సాగనివ్వను
నేను నిల్చింది ముమ్మాటికీ తూర్పుదిక్కు
బొడ్డూడని తూర్పు తల్లి బిడ్డ కదూ
నిశ్శబ్దంగా నా నుదుటిపై దొర్లేది.
శ్వాసలు మొలుస్తున్నాయి
సంకెళ్ళు బ్రద్దలౌతున్నాయి
వీస్తున్న గాలి అంచనాకై
కదుల్తున్న చెట్లే పడికట్టు—

వెలుగు వెల్లువ

పలకబట్టి బయల్దేరితే
కలుపు తీసిన పొలంలా
అమ్మ ముఖం విప్పారి మెరిసేది.
అ ఆ లు రాసిన పలక
అమ్మవేళ్ళకు అందిస్తే
ఏరుకున్న అక్షరాల్ని వొళ్ళో దాచి మురిసేది
అమ్మ రూపం నా రూపానికి అద్ది మాసిపోయాక
పలకా బలపం లేని నా బాల్యం
బడికి స్వస్తి పలికింది.
పసివాడి నగ్నరూపం మొలతాడుగట్టి వీధికెళితే
మొలతాడు లేని మొలల మధ్య మొలతాడే మిన్న
అవయవాల్ని కప్పుతూ గోచి పెట్టినపుడు
గోచీలు లేని గోలీలాటలో గోచీదే ఆధిపత్యం
ఆరు తర్వాత ఎంతకూ గుర్తురాని అంకె కోసం
మోరెత్తిన బడిపిల్లాడ్ని చూసి
ఇరవై గొడ్లను ఏకధాటిగా లెక్కించడం నా విజయగర్వం.
పుల్లతో పంటకాల్వ లోతు కొలిచి

పారబోయే పొలం లెక్కలు ఆశువుగా నా నోట దొర్లేవి
సూర్యగమనం చూసి గంటలు నిర్ధారించినపుడు
గతి తప్పిన గడియారం విస్మయ దృష్టులు పరిచేది.
కాళ్ళకు తగిలిన రాళ్ళను సమగ్రంగా పరిశీలించి
ఏ ఖనిజ సంపద నిక్షిప్తమో ఏకరువు పెట్టేవాడిని
కమ్మిన మబ్బు సాంద్రత బట్టి వర్షపాతపు అంచనాకు
కురవబోయే మేఘం అబ్బురపడేది.
రాతిమీద సుద్దగీతలు రాతలు కానేరవు
కాళ్ళూచేతుల వేళ్ళు లెక్కించడం లెక్కలు కానేకావు.
ఎక్కాల్సిన బస్సు చిరునామా ఎంతకూ చదవలేక
జార్చుకున్న కాలం కాలచక్రంలో శూన్యం
నేర్పిన అక్షరం నక్షత్రాల్ని కోసి తెస్తుందని
మరణించే వరకు మనిషి విద్యార్థేనని
అజ్ఞాన తిమిరాన వెలుగు జల్లుతూ
అక్షరాస్యత శాస్త్రీయ ప్రతిమ అంటూంది.

ACC NO. 23934
894.8131
VEN
20.00

ముందడుగు

ఆరంభం లేదు అంకురం లేదు
చూర్నుండి చుక్కలు రాలినట్టు
గానుగెద్దు గుడ్డిగా తిరిగినట్టు
పల్లానికి నీరు పారినట్టు
ఒక యాంత్రిక చలనం
ఒక అసంకల్పిత గమనం.
కర్మభూమి కులాలు
పుణ్యాత్ములు పాపాత్ములు
తలకొరివి పెట్టేంతవరకు
తలరాతను అనుభవించండి.
పుణ్యభూమి రాగాలు
స్వర్గం నరకం
చేసుకున్న వాళ్ళకు చేసుకున్నంత
అనుభవించండి అనుభవించండి.
సాగిపోయే సుఖాల నదులకు
చెదరని కరకట్టలు ఒక వర్గం.
ఎన్నో ఏళ్ళుగా ఏకశిలా రథాన్ని

మానవుడు చెక్కుతూనే వున్నాడు
గుర్రాలు రూపం దాల్చలేదు
సారథి ఇంకా నిరాకారుడే
ఒక అంకిత భావం
ఒక తపస్సు
నిను నిన్నుగా మలుస్తుంది.
బహుదూర ప్రయాణమని భీతి చెంది
బయల్దేరిన చోటే ఆగిపోవడం
అసమర్థుని జైత్రయాత్ర.
పొదుగును దూడ కుదపందే
తల్లి చేపదు
అంగుళాల కలయిక
అడుగులౌతుంది
వేల మైళ్ళ కొలతౌతుంది.
ఆకాశం అందుకున్న వాడికి
సముద్రం మోకాలి లోతు
సూర్యుడ్ని చేరుకున్న వాడికి
భూమి నారింజ పండు.

అభేద ప్రశ్న

వేయి పుట్ల నిద్ర నెత్తికెత్తుకుని పరుగెత్తి
నీరో చక్రర్తిలా నిల్చివున్న నిన్ను చూసి
పాలవాడి చేతి పాలపొట్లం అందుకుంటాను.
ఉషోదయ వార్తాప్రపంచంలో రక్తసిక్త చిత్రం దగ్గర
సంకల్పితంగానో అసంకల్పితంగానో నా చూపు ఆగితే
ఆనక ఊళ్ళేలవచ్చు అన్నం వండమని
పేపరు మడుస్తూ నీ ప్రబోధ వాక్యం.
అలిసి కోపించిన వంటపాత్రలు నన్ను కాల్చితే
వంటింటి గాయాలు ఇల్లాలికి మామూలన్న ప్రకటన.
వడ్డించిన వేడి అన్నానికి వేళ్ళు తగలకముందే
ఆగ్రహించి విప్పిన బూతుపంచాంగం ముందు
నా చేతి గాయం స్త్రీ జాతికి పెట్టుమచ్చ.
కుర్చీ సింహాసనంపై టీవి వొలకబోస్తూ కూర్చొని
కదిపిన నీ కాళ్ళకింద నేను కసువు చిమ్ముతూ
తగిలిన పొరకట్టను చూసి
అపర దుర్వాసుడవై అవతారమెత్తితే
సూది కైవారం చీపురుకట్టకై

కంప్యూటర్ యుగాన్ని కరుణించమంటాను.
కుర్చీలకు మంచాలకు నీ సోమరితనం చుట్టుకుంది
అన్ని వస్తువుల్నీ నీ అనుమానం ఆక్రమించింది
స్త్రీలకు ఉలుకెందుకు, పలుకెందుకు
మనసెందుకు, ఆలోచనెందుకు
చీకట్లో ప్రవహించి పడకటింట్లో వెన్నెలై ఉప్పొంగే
నిశ్శబ్ద నిమజ్జనం నీ అభీష్టం.
వాకిట్లో నిలబడతాను
గోధూళి చూస్తాను, పక్షుల్ని చూస్తాను
సూర్యచంద్రుల ద్యూటి మార్పిడి చూస్తాను
చంద్రుడు ధవళవస్త్రం కప్పి పడకెయ్యడం చూస్తాను.
ఎవరికోసం నిల్చొని ఎదురుచూస్తున్నావంటావు
సమఉజ్జీనై ముఖాముఖి ప్రశ్నిస్తాను
ఎవరెవర్ని నిశిరాత్రి కలిసివచ్చావంటాను
పురుషులకు స్త్రీలకు ప్రశ్నలు ఒక్కటే
స్త్రీ పురుషుల జననం ఒక్కటే.

తడిమంట

తడబడే కాళ్ళకు ప్రతిగా
కళ్ళు తత్తరపాటు
వణికే చేతులకు ప్రతిచర్యగా
కళ్ళు బిత్తరచూపు
శరీర సముద్రంలో కళ్ళు
నిరంతర సంచార నౌకలు
ఏ రుగ్మత ఎదుర్కొన్నా
కంటిపడవ అశ్రు సముద్రంలో మునక.
ఇంకిన ధరిత్రి కన్నీరు
భూగర్భ నదులై సముద్ర సంగమం
నవ్వుల కోనేటి నీళ్ళు
దుఃఖపు జలాశయానికి వలసెళ్ళితే
నవ్వడానికి నవ్వెక్కడిది?
రసాయన పరీక్షలో కన్నీటికోరూపం
కన్నీరు ఘన పదార్థమైతే
రాసులు పోసి తూమకొందురు
కన్నీరు బిందువైతే

ముత్యాల సరాలు పేర్చుకొందురు.
వందేమాతరం నేపథ్యం కన్నీరు
సుఫలానికి కన్నీరు సుజలం.
రెప్పతల్లి మాటున దాగి
భీతిలో కన్ను కువకువలాడితే
ఓదార్పు ఉగ్గుబోసిన తల్లి
కంటి బిడ్డకు కదనరంగం చూపుతుంది.
కన్నీటి వర్షానికే కన్ను పరిమితం కాదు
ఏడుస్తూ నడుస్తూ చరిత్ర ఒక రోజు
రక్తాభిరామమై పట్టాభిషిక్తం
సువర్ణాక్షరాల శుభారంభం.
ఎదిర్చి నిల్చిన గొడుగుల్ని కూలుస్తూ
కన్నీరు వడగళ్ళు కురుస్తుంది
పిడుగులు రాలుస్తుంది.
ఇన్నాళ్ళూ తడిసిన కళ్ళ పొయ్యిని
ఎర్రెర్రగా రాజుకోమంటున్నాను.

వందేమాతరం

అంతరాంతర జ్ఞాపకాల్ని
వయసుడిగిన నేను నెమరేస్తే
తొలకరి వాన నన్ను తడిపేస్తుంది
ఎద పగిలిన జ్ఞాపకం
మాటకందని మౌనం
అది సజీవ వర్ణ కాన్వాసు.
ఎన్నింటిని కంటితో నివేదించేది
ఎన్నని మనసులో ప్రతిధ్వనించేది?
స్వాతంత్ర్యం సంగ్రామమయ్యాక
నా వొళ్ళంతా లాఠీల ప్రతిరూపం
స్మృతి వచ్చిపోయే స్థితిలో
ఒకానొక కార్డు ముక్క కబురు
నా అర్ధాంగి అకాల మరణం.
ఆమరణ నిరాహారదీక్ష
మాతృభూమికి నే రాసిచ్చిన
రక్తాక్షర వీలునామా.....
కఠిన కారాగారవాసం

తల్లి స్వేచ్ఛకు నే పొందిన
చిత్రాతి చిత్రహింస.
ఉరికొయ్యకు ఊగి ఊగి
ఆగిన వీరుని ఊపిర్లో
నేలంతా పిగిలిన ఉద్యమకారులు
నూలువడికి నేత నేసి
స్వదేశీ వస్తు ఆవిష్కరణ
విదేశీ వస్తు బహిష్కరణ
తల్లి భారతికి నే తీర్చిన ఋణం.
ఆనాటి పోలీసు స్టేషను ఆక్రమణ
స్వాతంత్ర్యం సిద్ధించినంత సందడి
వీరోచిత గాథ పారాణి ఆరకముందే
నా కుమారుని ఆకస్మిక అస్తమయం.
దుఃఖం వెల్లువై నా తల్లిదండ్రుల
యాదృచ్ఛిక మరణం
సకాలంలో చేరని వార్త.
నెమరేసిన జ్ఞాపకం
పండిన వయస్సును వెనక్కు పరుగెత్తించి
కాయగా మారుస్తుంది
కాలాన్ని స్తంభిస్తుంది
శాశ్వత శిలాఫలకమౌతుంది.

పరాజిత ప్రతిఘటన

వరకట్నపు వార్త లోగిట్లో
మావారు రోజా
ముద్రించని పెళ్ళి పత్రిక
మామ ఆకాశ పందిరి
అత్త భూదేవి అరుగు.
బాధల మధ్య బాల్యస్మృతి ఉపశమనం
చాక్లెటు సగం కొరికి చెల్లికి పంచిన క్షణం
రెండు గుండెలు ఒకటై స్పందన
వంతుల వారీ అరకొర జీవితంలో
నా వంతు దుస్తుల కొనుగోలు సంబరపు సౌరభం
నేటికి వసివాడని గుబాళింపు.
తెల్లార్లూ ఒళ్ళో గువ్వయిన భర్త
తెల్లారే పులిపంజా విసరడం
మానవ మృగ జన్యులక్షణ విశేషం
ఖడ్గమృగం కొమ్ములు త్రిశూలం చూపులు
వరాహం కోరలు మనిషి మర్మ నేపథ్యం.
చేతలు నడకల మధ్య

అనురాగం ఆత్మీయతల మధ్య
సరిహద్దులు విభజనరేఖలు
సమాంతరాలు వక్రరేఖలు.
మనసు తూస్తున్న మనుషుల మధ్య
గెలుపు భవనానికి
ఓటమి పునాదులు
గాయం మానక ముందే గాయం
పరాజిత ప్రతిఘటన—
నల్దిక్కులా వలపన్నితే
ఐదవ దిక్కు ఆకాశంపై ఆశ.
ఉత్తరం కొసమెరుపుగా
నీకు తెలియని నిజం చెప్పనా నాన్నా
ఒక రోజు ఆత్మహత్య వార్తైతాను
తల పంకాకు వేలాడుతూ
కాళ్ళు నేలను ముద్దాడుతూ సాక్ష్యం.
కన్నీటి ఏరై యిక్కడకు ప్రవహిస్తావు
కపట శోకతటాకాలు నిలగట్టి వుంటాయి
అనూహ్య సంగమం జరిగిందా
కథ కాంచీపురానికి
వియ్యంకుడు మళ్ళీ విడిదింటికి—
ఆశ ఆకాశం తాకిన నక్షత్రాల చెట్టు.

అర్ధశతాబ్ది స్వాతంత్ర్యం

యాభైయ్యేళ్ళ స్వాతంత్ర్యానికి
అర్ధశతాబ్ది ఉత్సవాలు
అందరికీ ఆహ్వానం
మామిడి తోరణాల పసిడి మండపాల
పరిమళ పుష్పమాలికల స్వాగతాంజలి
దయచేయండి దయచేయండి—
స్వాతంత్ర్యం జన్మహక్కని
అసువులు బాసిన త్యాగధనుల సాక్షిగా
స్వార్థమయ స్వాతంత్ర్యం మనది.
ఆడించేది ఒక్కడే
ఆడేది కోకొల్లలు
అడిగేందుకు హక్కులేదు
అణిచేందుకు హక్కుభుక్తం
నిండు బతుకుల మధ్య ఎండిన బతుకులు
కొండల పక్కన చిరురప్పల చిరునామాలు
చేతులు యాచనకే అంకితం
మాటలు అర్థింపుకే పరిమితం

అవినీతి, దోపిడి, దౌర్జన్యాలు జాతీయం.
గంగా గోదావరుల నిత్యజీవధారలో
పవిత్ర భారతి పదఘట్టన రవళులు మృగ్యం
న్యాయాన్యాయ నిర్ణయాధికార పీఠం పై
న్యాయదేవత ఆశ్రిత పక్షపాతం.
అధర్మం రహదారి ప్రయాణం
ధర్మం సందుగొందుల సంచారం
మాటలు రానివాడు పాటలు పాడుతాడు
నడకలు లేనివాడు పరుగులు తీస్తాడు
చదువు రానివాడు ఉద్గ్రంథాలు రాస్తాడు.
ఆసేతు హిమాచలం ఒక్క కుటుంబం కాదు
వేరు కుంపట్ల వేర్పాటు వాద నిలయం
మతాల రణక్షేత్రం కులాల కురుక్షేత్రం
ఆగని ఆరని కయ్యాల ఉలిపి కట్టె నెయ్యం.
తప్పు ఒప్పుగా చిత్రీకరణలో ఐకమత్యం
ఒప్పు తప్పుగా ఒప్పించడంలో సఫలీకృతం
పుణ్యభూమి చిగురుకు చీడ
కూకటి వేరుకు క్రిమి చుట్టుకుంది.
అర్ధశతాబ్ది స్వాతంత్ర్యానికి జయమంగళం పాడి
మళ్ళీ మొక్కను నాటి లెక్కను ప్రారంభిద్దాం
మరో స్వాతంత్ర్యం మనం పంచుదాం.

అతడ్ని కల్సుకోవాలి

అరచేతి దుప్పట్లో అభాగ్యుల తలలు
ఫుట్‌పాత్‌ల పై ఒదిగున్న రాత్రి
రోడ్లను నిద్రలేపే వాళ్ళూ
నిద్రలేవని సమయమది.
దోపిడి దౌర్జన్యం అవినీతి పై
సారించిన నారి అతడు
అతడ్ని కల్సుకోవాలి.
పాదానికి రోడ్డుకు మధ్య
మంచు బిందువులు నలుగుతున్నాయి.
అతడు నీటికి అద్దాల బిడ్డ
ఉప్పెనలు, సుడిగుండాలు
ఆరు నిలువుల లోతు నీళ్ళూ అతడ్ని
నిబ్బరంగా నింపాదిగా దాటిస్తాయి.
అతడు గాలికి పురిటి బిడ్డ
పైరగాలి, హోరుగాలి
సుడిగాలి, తుఫాను
అన్ని గాలులు అతనికి సైదోడు.

అతడు అడవికి చనుబాల బిడ్డ
శత్రువు నిఘా పై నిఘా
ఎత్తుకు పైయ్యెత్తు వేసి
అడివి అతనికి కాపలా.
విజ్ఞానం, ఆశయం, సిద్ధాంతం
ఉద్యమాల సమాహారం
అతడ్ని కల్సుకోవాలి.
పాటలు, అనుభవాలు
జయాపజయాల అనుభూతికి
మళ్ళీ ఎప్పుడో ఎక్కడో
ఏ రూపులో ఏ వయసులో—
అతడి ఊపిరి - నీది నాది
చెట్టుది, పుట్టది, అందరిదీ
అతడ్ని కల్సుకోవాలి.
గది తెరిచే వుంది ... అంతా నిర్మానుష్యం
సూర్యుడ్ని మరిపిస్తూ వెలుగు వెల్లువ
ఇంకా ఆరని పాద ముద్రలు
నడుం విరిగి లేస్తున్న కాగితాలు
అక్కడి కాల సూచికలు
ఒక్క వస్తువును వంద చేతులు
ఒక్క కాగితాన్ని వేల చూపులు
పరీక్షించిన గుర్తులు.
అర్థాంతరంగా అతడ్ని రాల్చకముందే
అత్యవసరంగా జాడ తెల్సుకోవాలి
అతడ్ని కల్సుకోవాలి.

రాతి చిగుళ్ళు

రాతిని నమ్ముకుంటాను
శిల్పం యిస్తుంది
నీటిని నమ్ముకుంటాను
హరితం పూస్తుంది
గాలిని నమ్ముకుంటాను
ప్రాణం పోస్తుంది.
రాయి శిల్పమై
కరుణ కురిపిస్తుంది
మనిషి రాయై
అగ్ని వర్షిస్తాడు.
విశాల సముద్రాన్ని పిడికిట్లో యిమిడ్చి
ఆశ్చర్యం అవధులు మీరేలోగా
అంత సముద్రాన్నీ బిందువుగా మారుస్తాడు.
చిటారు కొమ్మను శరణుకోరి
తెగిపడ్డ గాలిపటం
ఉగ్గబట్టి ప్రాణం వూగుతుంటే
కొమ్మను తుంచి దుష్టహస్తం

నిర్లజ్జగా నేలపాలు చేస్తుంది.
విధ్వంసకుడి వడిసెల వేటుకు
అర్ధరాత్రి జడివానలో
ఆకుల్లో ఈనెలై వొదిగిన పక్షులు
రెక్కలాడక అల్లాడుతూ గాల్లో ఈతలు.
గ్రాసం లేక మూగజీవులు జీవచ్ఛవాలై
బందెల దొడ్లో బందిఖానా
నోరున్న జీవుల ఘాతుకాలు.
రాతికి నమస్కరిస్తాను
శిల్పమై చిగురించినందుకు
నృత్యమై రవళించినందుకు—
మనిషిని సంస్కరిస్తాను
హృదిలో సుధలు చిందేందుకు
మదిలో మమతలు పండేందుకు—

బట్టబయలు బందీ

శ్రీ చక్రం ముగ్గు
వెన్నెల వాకిట ఓ కళాఖండం
ఆమె చేతి మహత్త్వం
కళకు అన్నీ వస్తువులే.
అత్తల ఆడపడుచుల
అభినందన సగర్వంగా ధరించి
ఆమె నవ్వుతుంది
విరియని మల్లెలు ఆమె పలువరస
విరిసిన గులాబి ముఖవర్చస్సు
ఆనంద తరంగంపై తేలిన ఆమెకు
సనసన్నని మందలింపు
ఆమె ముఖం మారేడుకాయ
చూపు వాడిరాలిన పూరేకు.

....

ఆమె స్వరం లయబద్ధం
బడినేర్పని చదువు ఆమె
భావానికి రూపం ఆమె

వరకట్న రుగ్మత పై
స్పందించిన ఆమెకు
సుతిమెత్తని హెచ్చరిక
మాట మనసులో దాగి
మూగబోతుంది ఆమె.

....

ఆమె ముగ్ధమోహన లావణ్యం
ధరించిన దుస్తులకే అందం
అందానికి నడక ద్విగుణీకృతమై
రాజహంసలా నడిచే ఆమెకు
వినీ వినపడని ఆజ్ఞ
నరాలు నీరసించి
కూలబడుతుంది ఆమె.

....

ఆమె చూపు సూక్ష్మాతి సూక్ష్మం
మంచికి కారుణ్యమై
చెడుకు రౌద్రమైన ఆమెకు
మెలమెల్లని అనుశాసనం
కళ్ళు రెప్పల్లో దాగి
అంధకార మౌతుంది ఆమె.

....

ఆజ్ఞ అనుశాసనం
సన్నని మందలింపుల
సుతిమెత్తని హెచ్చరికల
పురుషాధిక్య ప్రపంచంలో
బట్టబయలు ఐందీ ఆమె.

గళం విప్పిన కాలహరణం

హిమసమూహాల చల్లదనం మల్లె రేకుల తెల్లదనం సాక్షి
పరిశోధన కందని ప్రశ్నేస్తున్నాను క్షమించండి
మేధకందని ప్రహేళికిస్తున్నాను మన్నించండి.
తెగిపడ్డ అవయవం ఏకులానిది
కారిపారిన రక్తం ఏ జాతిది?
తెలియవుగాక తెలియవు.
ఊరి వూరికో వాడ నిర్మాణం
కొమ్మరెమ్మల ఫలితం పూవంటే
కొమ్మ వినా రెమ్మలేదని అపహాస్యభాషణం
ఊరు వూరంతా వాడపై విధ్వంసం
ఎంతసేపూ పర్యాయపదాల
ద్వంద్వార్థాల, వ్యంగ్యార్థాలపట్టాభిషేకం.
గంగా గోదావరి కృష్ణా కావేరీలను
మలేసి, నిలేసి, ఎగేసి ఎదురీది
పరివాహిక భూమిపై పచ్చదనం కాయించి
నీటి ఊట చూడని కడగొట్టు భూములం.
ఆడుతున్న నెమళ్ళకు, పాడుతున్న కోకిళ్ళకు

కాళ్ళతో రాళ్ళతో ఛీత్కార సత్కారం
నన్ను వేరుపరచి గాయపరచి
నువ్వాడే ఆట ముసలం.
న్యాయం బుకాయించిన చోట
వెలుగు వెల్లువ దివ్యోద్భవం
వాడను వెంటాడి వేటాడే విభూతీ
శరీరం వద్దులే కాస్త తల తిప్పి చూడు
రొమ్ము విరిచిన నీ వెన్నుకు
బాణం ఎక్కు పెట్టి వుంది.
సిందూరం ఎర్రదనం సాక్షి
మనోవాయువేగాల్లో
ఏది అత్యంత తీవ్రమో నీకు ఎరుకే.

ఎగరేసిన బావుటా

పిండి బొమ్మగా మారినచోట
బొమ్మను పిండి చెయ్యడమే పని
జైలు నోరు తెరిచే వుంటుంది.
జైలు ప్రణాళికల్ని తిని బలుస్తుంది
పలుగుపారల దాడి జయించి
డైనమైట్ల పోటీగా నిలుస్తుంది.
నడిచే నదికి కరకట్టలు రక్షణ
నడవని సర్కారీకి జైళ్ళు సంరక్షణ.
ఏనుక్కి కందకం, లేడికి వల
కవులు, గాయకులు, మేధావులు
ఉద్యమకారులు, ఉప్పెనైనవారు
అందరూ.....అన్నీ బందీకృతం.
శీతలగదుల్లో మేను మరిచిన వాడికి
కాలికింద కార్పెటు వాడికి
కుబేరుడు తాకట్టుపడ్డ వాడికి
కలొచ్చి ఉలిక్కిపడకుండా
కలతనిద్ర లేకుండా

జైలు నోరు తెరిచే వుంటుంది.
కట్టుకథ కేసులో నేను విడుదల
కల్పితకేసులో మళ్ళీ రిమాండు
ఎక్కడ్నుంచి వచ్చి వాల్తుందో పక్షి
కిటికీ నిండా స్వేచ్ఛ పండిస్తుంది
చిటికెడు తిండి నోట కరిచి
ఆకాశం హద్దు చేసుకుంటుంది.
చినిగిన వెల్ల పరప్రభుత్వ పీడన స్ఫురింపు
చితికిన నేల మాతృభూమి కర్కశ వేధింపు
సూర్యుడి దూత స్వర్ణకిరణం రగిలి
గది నిండా చింతనిప్పుల కాన్వాసు చిత్రం
జైలు పేలుతుంది......
శకలాలుగా, అణువులుగా—
జైలు మృత్యుముఖం కాదు
జ్ఞాన జనన మందిరం
బందీ ఎగరేసిన బావుటా.....

గుండె నిండిన పాట

పాటకు కుడి ఎడమల్లేవు
ఆకాశం మీద, సముద్రం మీద
నదుల మీద, పొలాల మీద
ఎడారుల మీద, మానవాళి మీద
గుండెనిండిన పచ్చదనంతో
పాడుకుంటూ పరుగెత్తాలి పాట.
ఎందుకో పాటకు రంగులేదు
మరెందుకో చలనం లేదు.
ఊపిరాడక ఉక్కబోస్తూంది
ఎవరో గాలిని తోలుకెళ్తున్నారు
ఎండిన నోరు ఎక్కిళ్ళు వేస్తూంది
ఎవరో నీటిని మలేస్తున్నారు
వర్తమానం స్ఫటికమై కళ్ళల్లో గూడుగట్టి
రోదన రోడ్డు నడిబొడ్డుపై నడక.
వేదన వేణువులో నిండి
పెల్లుబికి రంధ్రాల్లో ప్రవహిస్తూంది
వీణ కడుపులో దుఃఖం దాగి

తీగ పెదాలు వణుకుతున్నాయి.
కోటలు అంతఃపురాలు ఎన్నో కూలాయి
ఒక్క సిపాయి రక్షించిన రాజ్యాలెన్ని
రాణుల ప్రాణం కాచిన చెలికత్తెలెందరు?
నిన్నటి కథ బొత్తిగా జ్ఞప్తి లేదు
నిండిన కడుపుకు మంట గుర్తురాదు
శరశయ్యలపై క్షతగాత్రులు
వసుధ వెన్నున రాచపుండ్లు
సంతోషామృతానికి
దుఃఖసాగర మథనం.
గుండె తెరిస్తే కవిత్వం లావా
మూస్తే కవిత్వం బడబాగ్ని
నేను సమూహం
సమూహాల శబ్దం
నేను శబ్దాల యుద్ధభేరి
కదన రంగాన ఖడ్గం
నేను గుండెనిండిన పాట.

కీలు తప్పిన వెన్నెముక

అన్ని పండుగల ఆర్థిక మూలవేదిక
అన్ని వర్గాల ఏకైక పర్వదినం ఏరువాక
ఆశల పంటకై బీజం వేసి
ఊరంతా వుత్సాహం వుప్పొంగే పండుగ.
నాగలి తెచ్చిన కర్రును పదును చేసి
సాదరంగా కొలిమి సాగనంపుతూ
పచ్చపచ్చగా నువ్వు పండితేనే
ఎర్రెర్రని మంట నాకంకితమంటుంది.
మేడికి కాడికి కట్లుకట్టిన ఉలి
పుట్లకు పుట్లు కల్లాల్లో రాల్తేనే
నా పరిచర్యకు పారితోషికమంటుంది.
చిలకపచ్చ ముక్కుతాళ్ళు
చిరుమువ్వల పట్టెళ్ళు
గంగడోలు సోయగాల దుక్కిటెద్దులు
ఎలపట దాపట సమవుజ్జీలై
ఏరువాకకు గంతులేస్తూ
నందికేశులై రంకెలేస్తాయి.

వాకిట మామిడితోరణాలు
ఇంటిల్లిపాదీ అభ్యంగనస్నానాలు
ముంగిట కళ్ళాపి చల్లి
ముత్యాలముగ్గు అలంకరణలు.
పెళ్ళినాటి పట్టుచీర
చంద్రాకార సిందూరబొట్టు
అష్టలక్ష్మిగా ఎదురైన ఇంటి ముత్తైదువను చూసి
హలాలు పట్టిన కర్షకులు
పొలాలకు పయనం.
కర్రు తగిలిన నేల పువ్వులా విచ్చుతుంది
విత్తిన నేల హరితమై రూపెత్తుతుంది
నాటి నుండి కర్షకుడి కష్టాలు ఆరంభం
పల్లవించిన హరితం
విప్లవించకనే అనావృష్టి
ఆరుగాలం కష్టించి పండించిన పంట
ఇంటికి చేరకనే అతివృష్టి.
మట్టిని నమ్మిన రైతుకు
ఒట్టి చేతుల మట్టివోడ్కోలు.

అసంపూర్ణ గీతం

అల్లిన కథ ఆశువై ప్రవాహం
కళ్ళకు గంతకట్టి న్యాయదేవత
అర్ధరార్ధరని అబద్ధాలు ఏర్చికూర్చి
ఆయువు నియంత్రించి
లలాట లిఖితమంటుంది.
రాజ్యాంగం నల్లబజారు వ్యాపారం
పదవీ హోదాల అమ్మకం
మూడు సింహాల పాలన ముంచెత్తుతూంది
బుద్ధం శరణం గచ్ఛామి మార్మోగుతూంది
సత్యాగ్రహం గుమ్మడి తీగై అల్లుకొంటూ వుంది
నన్ను తూకం వేసుకుంటూ నడుస్తాను
పట్టుమని పది కేజీలు తూగను.
ఒకడు దేశద్రోహి, ఒకడు స్మగ్లర్
ఒకడు బందిపోటు, ఒకడు వంచకుడు
ఒక్కడూ చట్టానికి చిక్కడు.
ముద్దాయి స్థానంలో
రెడీమేడ్ ముద్దాయిన్నేను

కొలతలు కొాస్త అటూ యిటూ మారినా
కాగితంపై పకడ్బందీగా సరిదిద్దబడతాయి
సుడిగాలులు, చిత్రవధలు నా పరం
వింజామరలు, సుఖరాత్రులు వాళ్ళవి.
బలపం పట్టి పలక లేదని ఏడ్చే కొడుక్కి
వాకిట కళ్ళతికించి ఎదురు చూసే భార్యకు
పై కప్పు తప్పు పక్కకు చూళ్ళని అమ్మకు
నా వార్త చేరదు గాక చేరదు
శివరాత్రులు శివభక్తులకే పరిమితం.
అన్నీ మొక్కలే .....
మొక్కలన్నీ ఒకటికాదు
ఇన్నేళ్ళ గులాబి రాజసం చిన్నబోయింది
మోదుగు ఎరుపు రంగు ముందు మోకరిల్లింది
తన కూత మధురాతి మధురమని
కోకిలకు తెలిసిపోయింది.

శ్వేతహాసం

నన్ను నేను వెతుక్కునేలోగా వల్లో చిక్కి
ముత్యపు చిప్పనయ్యాను
పొంగిపొర్లిన విశ్వాసం ఒకానొక రోజు
అప్రమత్తతను ప్రమత్తతలోకి జార్చింది
పొరపాటుకు మూల్యం నవమాసాలు
ఇంటా బయటా చిరునామా
ఇన్నాళ్ళూ రాసినవాడే చెరిపి
బంగారు పిచ్చుకై వెండి భవంతికి ప్రవేశం.
శకుంతలను కాలేదు
కణ్వమహాముని ఎక్కడ?
ఆనవాళ్ళు చూపలేదు
అంగుళ్యాభరణమేది?
ఊసులు బాసలు అటకెక్కాయి
అవమానం ఆపై నువ్వూ
నాకు పుట్టిన కవల పిల్లలు.
కన్నా! బోసినవ్వులు పూసి
ఏడేడు లోకాలు వెదజల్లుతావు

నీ శ్వేతహాసం చూసి
తెల్లదనం దాచుకుంటాయి మల్లెలు
కేరింత రాగాలు విని
మూతబడతాయి కోకిళ్ళ నోళ్ళు
విరిసిన చిరుపాదాల్ని చూసి
వెలవెలబోతుంది వెయిరేకుల కమలం.
అమ్మకు అత్తకు నీది ఒకే పిలుపు
అన్వయించి అర్థం చేసుకోవడంలో
ఆనందం ఇమిడి వుంది
ఎన్నని మేము లెక్కించేము
ఎన్నని మేము గుర్తించేము:
అరిషడ్వర్గాల కావల నీ ఉనికి
సప్త వ్యసనాల కీవల మా స్తబ్దత
నీ ఆటపాటలు నన్ను బంధించి
కాలాన్ని మూటగట్టి పడేస్తాయి
నువ్వు కొలువు దీరిన చోట
ఆకలుండదు దాహముండదు.
నీ నిండు పున్నమి ముద్దాడని
నీ పాత్రిళ్ళ పొర్లింతలు చూళ్ళని
నీ తండ్రిదెంత దురదృష్టమో......
నాకు నువ్వు నీకు నేనున్నాను
నన్నెవరు జయించగలరు?

మారని దృశ్యం

నది పొత్తిళ్ళలోనే నా పెంపకం
నదీగర్భాన చేపనై ఈదాను
నీటిలో నీరై కలసి పారాను
ఇసుకను ఎత్తిన పసితనపు పిడికిళ్ళు చూసి
"ముందుందిలే మోయలేని భారం"
నా తల్లి నది నవ్వుతూ అనేది.
పచ్చని పైర్లను చూసి ముచ్చటపడి
నది పొంగి పొర్లి దొర్లేది
చనిపోయిన పంటబిడ్డల శవాలపై బడి
రోదించి చిక్కి శల్యమై
ఒడ్డు మంచానికి అతుక్కుపోయేది
గుడిసె మునిగి వరద బాధితుణ్ణైన నాడు
చేపనై ఒడ్డున కొట్టుమిట్టాడిన నాడు
కష్టాల జాబితాలో పద్దులు రాసుకున్నా.
ఒళ్ళు కాలిన ఇసుక మేటకు
క్షణకాలం నా చెమట బిందువులు పూరట
బట్టల్తో పాటు బాధల్నీ ఆరేస్తే
ఒడ్డుపై నా కన్నీటి కోత—
ఆనకట్ట, వంతెనలు ఆవిష్కరణై

ద్వారబంధాల్లా నదీతీరాలు తీర్చబడి
మొట్టమొదటి రైలు బల్లిలా పాకినపుడు
నా అరచేతులే పట్టాలై ఆనందించాను.
మహత్తర వారథి నిర్మాణానికి
రాళ్ళెత్తిన కూలీలెవ్వరో అన్న ప్రశ్నకు
పేరు పేరున బారులు తీరిన మాకు
అధినాయకుడి ప్రశంస ఆకలి తీర్చలేదు.
ఒకడి ఉద్ధరణ కోసం ఒక కట్టడం
ఫకీర్ని పాదుషా చేసే ప్రక్రియ
దృశ్యం ఒక్కటే మరింత తెల్లని తెలుపు.
మారిన నదీ రూపం ముందు
మారని మా రూపురేఖలు
చింపిరి జుట్టూ చినిగిన బట్టా
బక్కచిక్కిన శరీరం — అంతే అంతే.
ఆకల్ని మంత్రించాము
మట్టిని మంత్రించాము
దోపిడి మమ్మల్ని మంత్రించింది.
ఉదయానికి ఉదయానికి మధ్య
ఎన్నిరకాల వేటలో
చంపకుండా గాయపరచడం
చదువుల ఎత్తుగడ.
ఒకడు జైలు లోపల
ఒకడు జైలు వెలుపల
ఎవడి స్థానం ఎక్కడో చట్టం నిర్దేశించింది
మారిన స్థానం రాజ్యాంగాన్నే శాసించింది.
ప్రయాణాన్ని చూసి
పాదం భయపడనంత కాలం
ప్రయాణం భయపడుతుంది.
మట్టి ఎత్తుతూనే వున్నాం
మారని మీ చేతలు చూస్తూనే వున్నాం.

కొడిగట్టిన కాలం

ఆదిత్యుని ఆయుర్దాయం ఒకే ఒక్క రోజు
దినం మారి రోజుకోమారు జన్మించినా
ఆదిత్యుని మనుగడ అక్షరాలా పన్నెండు గంటలు
వందేళ్ళ జీవితం ఒక్క రోజులో వెలిగించి
మరో పార్శ్యమండల సేవకై పయనం
అంతా లిప్తకాల గమనం.
మనిషి మార్పు వేరుగా వుంది
వీధి రచ్చబండపై ఊకదంపుడు కబుర్లు
పాలపండ్ల బాలభాస్కరుడు
పండు ముదుసలిగా మారినా
నడుం విరిగిన రచ్చబండ
నిరసన వెదజల్లినా
కాలం తెలియని మనుషుల మధ్య
కాలం కరిగిపోతూంది.
ఒక్క నిముషం ఒకే ఒక్క నిముషం
సాచివేత నిర్ణయానికి
ఓడిపోయిన యుద్ధాలెన్నో—

తెగిపోని ఆగిపోని నిరంతర
ధారావాహిక బాతాఖానీ
సిగరెట్లు కాలిపోతున్నాయి
తాగిన పానీయం ఉనికి గుర్తించడానికి
బొట్టు మిగలడం లేదు
ఎడతెగని తొక్కిడికి సోఫాలు
కీళ్ళు విరిగి ఆక్రోశించినా
కాలం తెలియని మనుషుల మధ్య
కాలం ఖర్చయిపోతూంది.
ఒక్క నిముషం ఒకే ఒక్క నిముషం
అనుకోని జాప్యానికి
ఆగిపోయిన గుండెలెన్నో—
కప్పుకున్న సోమరితనం
బద్ధకమై నిశ్శబ్దమై
మత్తుగా పడున్న మనుషులు
మంచం అసహ్యించినా
గది ఈసడించినా
మేల్కొనని నిద్రాళువులు.
ఒక్క క్షణం ఒకే ఒక్క క్షణం
అప్రమత్త చర్యకు
తప్పిపోయిన ప్రమాదాలెన్నో—
కాలం తెలియని మనుషుల మధ్య
కాలం కాలిపోతూంది.

మట్టిని చదివితే

చూపు కేంద్రీకృతమై
పాదాల వద్ద ప్రదక్షిణ
చేతివేళ్ళు తినడానికి
తలగడగా మారడానికే కాదు
పెను నిద్ర లేపడానికి
పలు ప్రశ్నలు సంధించడానికీ.
కన్నభూమికి కన్నబిడ్డ
కలమో హలమో
ఖడ్గమో కాని నాడు
కన్నమట్టికి రూపంలేదు.
సముద్రాలు, పర్వతాలు
అరణ్యాలు, నదులు, హద్దులు కావు
ఏకత్వానికి భిన్నత్వాలు.
హద్దుల కోటగోడలు
ఇనుప తెరల అంతఃపురాలు చూసి
ఎల్లలు చెరిపిన దిక్కులు నవ్వుతాయి.
వినువీధిన ఇరుగ్గా నడుస్తూ

ఎదురొచ్చిన మేఘాలు ఆహ్వానిస్తే
ముడుచుకు కూర్చుంటాయి
మరుగుజ్జు ఆలోచనలు.
సముద్రం ఎదురై
క్షణంలో దాటిస్తానంటే
ఒడ్డుపై భీష్మిస్తుంది
ఒంటికాలి నడక.
చూపుకు పరిమితి లేదు
ఒక్క చూపుతో
సౌరకుటుంబం చిత్రీకరణ.
రక్తం అభిషిక్తమైన చోట
మట్టిని చదివితే
మనిషి చరిత్ర.
చదువుకు లిపి అక్కర్లేదు
లక్ష్యం లిపిని పుట్టిస్తుంది.

స్వేద సముద్రం

ఉషోదయంలో ఆకసానికి ఎగిరి
పింజ మబ్బుల్ని వెండి ఆభరణం చేసి
పక్షుల మధ్య పక్షినౌతాను.
అరేబియన్ ఫెలికాన్ పక్షుల వలసకు
సుస్వాగతం పలికి
సైబీరియన్ కొంగలకు
హృదయపూర్వక వీడ్కోలు యిచ్చి
నేనో రంగునై ఆకాశానికి అద్దుతాను.
అనురాగం అనుబంధం పెనవేసి
ఒంటరితనం మటుమాయం
పోటీ వుండదు, ఓటమి వుండదు
ఎవరి పరుగులు వాళ్ళవి
ఎవరి శక్తి వాళ్ళది
పూట బత్తెం చేజిక్కాక
గూటికి చేరుతాను.

....

ఈతగాళ్ళకు గజఈతగాణ్ణయి
సముద్రాన్ని లంఘిస్తాను

నీటిని ఆటవస్తువు చేసి
చేతులు ఆడుకుంటాయి.
అలుపెరగని చేపల మధ్య
అలసట అంతమౌతుంది
నా స్వేదం రుచి చూసిన సముద్రం
తన ఉప్పదనం ఒకపాలు తక్కువని
ఓటమినంగీకరిస్తుంది.
అడుగడుగును గాలించి
బత్తెం దొరికిన ఆనందంతో
భూమికి చేరుతాను.

....

బత్యాన్ని భోజనంగా మార్చే ప్రక్రియలో
నీరు నిప్పుకై నేలపై పరుగెడతాను
ఆకల్ని ఆకలిగానే పెంచి
దారిద్ర్యాన్ని దారిద్ర్యంగానే వుంచి
బొక్కసం నింపుకోడం
ఎదిరించిన నేను
బలిచక్రవర్తి నౌతాను.

గుప్పెడు ఆశ

నలుపు చేసిన కాగితాన్ని
నీ తెలుపెంతని అడిగితే
ఖరాబు చేసిన వాడి మనసంతని జవాబు
సముద్రాన్ని నీ లోతెంతని
సావధానమై ప్రశ్నిస్తే
నింగి తాకిన నీ గుండె నిలువంతని సమాధానం
విడిపడ్డ ప్రశ్నలు రెండింటికి
ముడిపడ్డ జవాబు ఒక్కటే ....
పరుగు తియ్యలేని వాణ్నిచూసి
పరుగెత్తే మేఘం బాధతో
హిమగిరికి తలబాదుకుని ఒళ్ళంతా నీరు
నడకలేని వాణ్నిచూసి ఉరకలేసే నది
ఏడ్చి ఏడ్చి విశాల సముద్రమైంది.
మనిషి కథ శవం చెపుతుంది
తవ్విన నేలలో ఎన్నెన్ని సెలలో .....
సీతాకోక చిలుకను
చేతివేళ్ళ జైళ్ళు బంధించాయి

కటకటాల్లేని పారదర్శక జైళ్ళు
మృదు స్పర్శ మృత్యుమాళిగలు.
కథ మారిపోయింది
కథలన్నీ సజీవం
కథలన్నీ సశేషం
సంపూర్ణానికి పూర్ణకుంభం స్వాగతిస్తే
సశేషం ఒక ఉప్పెన.
కాలికింద గరికపోచలూ
గాల్లో ఎండుటాకులూ
చీకట్లో చిదుగులు
ఉద్యమానికి మీరు ఉచ్ఛ్వాస నిశ్వాసలు.
విశ్వ విజేతా
ఏ చేత్తో భూమండలాన్ని ముక్కలు చేశావో
ఆ చేత్తో అతికించి ఆవిష్కరించవూ ......

మౌన ఝుంఝ

పొద్దెక్కినా పొడవని కళ్ళకు
నాది సుప్రభాత సేవ.
రోలు ద్వేషిస్తుంది
రోకలి కోపిస్తుంది
గింజలు దుఃఖిస్తాయి
నా వేళ్ళు ఏడుస్తాయి
అయినా దంచుతాయి.
ప్రశ్నకు నేను జవాబు
జవాబుకు నేను ప్రశ్న.
చిక్కంగట్టిన దూడ అరుస్తుంది
చేపిన గేదె శపిస్తుంది
నా చేతులు వణుకుతాయి
అయినా పితుకుతాయి.
మాసిన దుస్తుల రూపుకు
వెండి రంగు అద్దుతాను
కసువు కమ్మిన నేలకు
మిసిమి కాంతులు పూస్తాను

మనకేసిన అంట్లకు
మెరుపులు రుద్దుతాను
ఇంట్లో అందరూ అతిథులు
ఆతిథ్యానికి శాశ్వత ప్రతినిధులు.
నేను పడకటింట పాదచారిణి
వంటగది సహధర్మచారిణి
పసిబిడ్డ పాలఖజానా
మెట్టినింట దాస్యకాంత.
ఉద్యమంపై ఉద్యమం
ఉద్యమాల వెల్లువ చూశాం
ఏ ఉద్యమం ఎందుకు జరిగిందో
ఉద్యమం పాఠ్యగ్రంథమై చదివాం
పాతాళానికి అధఃపాతాళానికి
స్త్రీ జనోద్ధరణ పయనించడం చూశాం.
ఉద్యమం వేసిన ఒక్కోమెట్టు
వంటగదికే పయనం
మమ్ము అణిచేందుకు దూరదృష్టి
మీరు పెరిగేందుకు హ్రస్వదృష్టి.

బతుకు కర్పూరం

కటిక పస్తుల కథకు
అన్నం దొరికిన కలలు అనుబంధాలు
చేతబట్టిన జానెడు కడుపుకు
జోలెడు విద్యలు చేయూత
తోటమాలితనం ఓ విద్య.
మొక్కలు కాళ్ళకు అడ్డం పడి
పసిబిడ్డల్లా ఉనికి చాటితే
జాలిపడ్డ గాలి చీడకొమ్మల్ని
విసురుగా వూపి దృష్టికి తెస్తుంది
తోటమాలిగా క్షేత్రానికి కన్నతండ్రిని
ఆహారం, ఆరోగ్యం, సంరక్షణ నా బాధ్యత.
నా నీడ నావెంట రాదు
నేనో చెట్టు వద్ద గొంతు కూర్చుంటే
మరో మొక్క ఉపచర్యలో నా నీడ
ఆశ ఆత్మవిశ్వాసాల్లో ఒంటరి కాను
చుట్టూ చెట్ల సమూహం వుంది
నాకు నేను జవాబుదారీ.

చెట్టు కడుపున పిందె పడ్డాక
వైద్యునిగా నా పాత్ర మార్పు
ఎన్ని సూచనలు ఎన్ని జాగ్రత్తలు
ఎన్ని సందేహాల నివృత్తులు.
పండుగా మారిన పిందెను
యజమానికి అందించాకే తృప్తి
హిమాలయాన్ని అధిష్ఠించిన సంతృప్తి.
యజమాని ముఖం విప్పారదు
తోటమాలికి ప్రశంసలుండవు
అదనపు విలువపై తీవ్ర అసంతృప్తి
అంతా యజమాని సేవకుల సంబంధం.
ఘట్టం ముగిసి మరో అంకం ప్రారంభం
మళ్ళీ చెట్టు కడుపున పిందె
యజమాని సేవకు పునరంకితం
మఱ్ఱిచెట్టు కింద మొక్క మొలవని సత్యం.
నా కడుపున బడ్డ బిడ్డపిందెల
సంరక్షణలో విఫలమౌతూ నేనూ
ఎండిన ఒయాసిస్సు నా భార్యా........

మనిషి ముందుకు కథ వెనక్కు

అస్త్రులు వాచిన మరుగుజ్జు చేతులు
విధ్వంసాల వీరమల్లులు
నోబుల్ శాంతి బహుమతికై వేట.
చుట్టుముట్టిన అశాంతి రావణకాష్ఠం
క్షణక్షణం శాంతికోసం కలవరింపు
నియంత్రణ నోచుకోని
అణ్వాస్త్ర గోదాములు పిగిలి
పలుదేశాల ఆర్థికవ్యవస్థ విధ్వంసం.
అణుబాంబు తయారీదారుల
అక్రమ ఆక్రమణదారుల
కపట నాటక శాంతి ప్రదర్శనలు
అశాంతి సప్తసముద్రాల వైశాల్యం.
ఒక మైత్రి అలీనవిధాన ఉద్భవం
ఒక కలయిక ఐక్యరాజ్యసమితి ఆవిర్భావం
ఒక స్నేహం రాధేయుడి పట్టాభిషేకం.
స్నేహం ద్వంద్వార్థానికి జారి
వ్యంగ్యమై హేయమై

నిఘంటువు అర్థం మార్చుకుంది.
స్నేహానికి కరచాలనం ప్రతీకై
కలిసిన చేతుల ముఖాన పుట్టెడు నవ్వులు
ఎదలో ఏడు నిలువుల విషజలాలు.
ఊగుతూ వూగుతూ
ముడివడి విడివడని కరచాలనం ముందు
చెలరేగిన సరిహద్దు ఘర్షణలు
స్నేహానికి పెను అపహాస్యం
అమైత్రి అనంత వ్యాప్తం
అహింస మహాత్ముడంత ఎత్తు
అడుగులు ఆమడలు కొలతకు చాలవు
యుద్ధం చేసిన అభినవ అశోకులు
ఖడ్గాలు దాచిన నటన
బోధివృక్షచ్ఛాయ నుండి లేచిన
ప్రబుద్ధులు ప్రవచనాల వల్లింపు
అహింస మాటున పుట్టిన హింస
సమస్త నదుల ప్రవాహం.
క్షుద్ర జీవి అసురునిపై
మానవుని యుద్ధమేది?

నీతికి ఉప్పు పాతర

శాస్త్రీయ ప్రణాళికాబద్ధంగా
నేలపై నీతి తరమబడింది
అస్పృశ్యమై అదృశ్యమైంది.
ఎప్పుడో ఎక్కడో కాలంగాని కాలంలో
నీతి తలెత్తితే
తలా కొంచెం దానం చేసిన పిడికెడు ఉప్పుతో
నిండుగా నీతికి ఉప్పు పాతర.
నీతి మాట్లాడ్డం, చర్చించడం, బోధించడం
స్వాభిమానానికి చిన్నతనం
అంతస్తుకు అథఃపతనం
పగలు నిండు హరితం
రాత్రి పండు వెన్నెలై
అవినీతి వెల్లివిరుస్తూంది.
ఆవిరై ఆకాశపు అమ్మగారింట
మేఘాల్ని కంటూంది
నదులు, కాలువలు, సరస్సులు, సముద్రాలై
నేల పునీతమౌతుంది

అవినీతి అధిష్ఠించిన వాడికి
అఖండ జయజయధ్వానాలు.
క్షిపణి వెళ్ళినంత వేగంగా
క్షణంలో కోట్ల సంపాదన
సుఖాల లోగిలి.
రాజ్యాంగాన్ని ఆసాంతం బట్టీపట్టండి
చట్టాన్ని ఆమూలాగ్రం ఒప్పజెప్పండి
శిక్షపడ్డ నాయకుల్ని వేళ్ళపై లెక్కించండి
చేతి పదివేళ్ళూ శేషాలే.
అవినీతికి జేజేలు
నీతికి మంగళారతులు.

......

అణిచినా అణగని నీతి తరచూ
ఉప్పు పాతర్లోంచి సజీవమై లేస్తూంది
ఇంటింటా పిడికెడు ఉప్పు పంచి ఉద్యమిస్తూంది
ఎంతైనా నీతి ఇంట్లో పూర్వపక్షాన
ఉప్పు తిన్న మనుషులం కదూ ....
కృతజ్ఞతతో కృతఘ్నతను గుర్తు చేసి
నిలువెత్తు ప్రశ్నను నాటుతూంది.

అద్దంలో బొమ్మ

గోధూళి వేళ ....
ఎఱ్ఱమట్టి పులుముకున్న
చెట్లముఖాల మురికిరూపులు
ఉగ్గబట్టిన కడుపుతీపి వుప్పొంగి
పచ్చికబీళ్ళ నుండి పశువులు ఇంటికి పరుగు
అష్టకష్టాలూ అదనంగా
మరో కష్టం అనుభవించినా
కాపరికి అదుపుగాని ఆలమంద
చెంగుచెంగున గంతులేసి స్వాగతించి
తల్లి పొదుగులో తలదూర్చి
ఎండిన డొక్కలు ఎగరేస్తూ దూడబిడ్డ.
పడి చచ్చిన పందికొక్కును
మూతి చేత్తో పక్కకు నెట్టి
కుడితి తాగుతూ తల్లి ఆవు.
చెట్టు నీడన విశ్రమించిన
బహుదూరపు బాటసారి
విప్పిన కూటి మూటలో

చూపుడువేలు వచ్చిన ఈగను చూసి
బొటనవేల్తో బాణమై సంధింపు.
విగతజీవి ఎగిరి ఎటుపడిందో
కడుపుమంటకు యివేమీ కావు అనర్థం.
హిమశీతల భోజనగదిలో
అరవయ్యారు ఆహారపదార్థాల మధ్య
ఒకడి ఆర్భాటం దశదిశల వ్యాప్తి
వడ్డించిన విస్తట్లో ఒకే ఒక ఎఱ్ఱచీమ
భోక్త సూక్ష్మవీక్షణానికి పట్టుబడి
విస్తరి చెత్తకుండీకి తరలింపు....
బాల్య యౌవన వృద్ధాప్యాల ఉనికి
చూసింది చూసినట్టుగా చూపిన అద్దం
భళ్ళున బ్రద్దలైన కారణం
కలత చెందిన నడక
కనురెప్పల కన్నీటి మునక.

ప్రాణప్రతిమ

కొనుగోలు అమ్మకపు జాబితాల్లో
జంతువుల వస్తువుల్తో బాటు
స్త్రీ జాతి నరుకై చేర్చబడింది
అత్తగారిళ్ళకు
వ్యభిచార గృహాలకు
స్వేచ్ఛా క్రయవిక్రయ వాణిజ్యం.
బోన్లూ గూళ్ళూ
జంతువులు పక్షుల్తోపాటు
స్త్రీలకూ కేటాయింపులు
స్త్రీ రెక్కలేని పక్షి.
అమ్మా నాన్నలు
ఇంటింటా న్యాయమూర్తి ద్వయం
అన్నా చెల్లికి ఒకే నీతి వర్తించదు
కొడుకు స్వర్గలోక ప్రదాత
కూతురు త్రిశంకు స్వర్గ ప్రదీప్తి
ఒక చేతిని నరుక్కుని
ఒంటిచేతి వికృతానందం

ఒక కంటిని పెకలించి
ఒంటికంటి మహదానందం.
కదలి వెళ్ళే కూతురుకో న్యాయం
ముడుపుల మూపు భారంతో
మంచమెక్కుతుంది పుట్టిల్లు
తరలి వచ్చే కోడలికో న్యాయం
కట్నం కానుకల కాంక్షతో
మంకుపట్టు మెట్టినిల్లు మంచం దిగదు.
ఇంట్లో న్యాయాన్ని పాతిపెట్టి
ఇంటి న్యాయమూర్తులిద్దరూ
ఇల్లెక్కి ఆర్తనాదాలు
వేడికోలుకు ద్రవించి
ఎగిరే పక్షి దోసిట్లో వాలదు
దూకుడుగా దూసుకొచ్చే అల
అరికాలి అడ్డుకు ఆగదు.
అవమానంలోంచి
అణచివేతలోంచి
అసమానతలోంచి
అపరకాళికలు జన్మిస్తారు
వాళ్ళిప్పుడు
నెలలు నిండిన బిడ్డలు.

కన్నీటిని కత్తి చీల్చితే

మనిషి వాయిస్తున్న మతం పియానోల మధ్య
వాలేపక్షికి మందిరాల మతలబులు తెలియవు
దారుల్లో పారే రక్తం నీళ్ళనుకుని
నడిచిపోయే నాగరికుల మధ్య
జ్ఞప్తికి జలాశయాలు నిర్మించాల్సి వుంది.
ఇది విషాదాల అంగడి
ఇది వెతల వారసత్వం
ఇది కన్నీటి తీగల చెట్టు
తాత నుండి తండ్రికి ఆపై కొడుక్కి
వెట్టిచాకిరి చక్రవడ్డీ
బరువైనప్పుడు కూలిపోతూ
కోలుకోలేక చితికిపోతూ
అద్రుపుండు జీవితం—
శిలాఫలకం చెక్కకుండానే భూస్థాపితం
ముందు తరానికి శ్వేతపత్రం.
కాంతికి కాపలా కాసి కాసి
పగటికి నిద్రలేదు

చీకటికి ఊడిగం చేసి చేసి
రాత్రికి కునుకు లేదు
సామంతరాజుల ప్రచ్ఛన్న యుద్ధం
రారాజుల కేళీవిలాసం.
నోరాడితే పంటి కింద పన్ను తగిలే బతుకులు
కన్నీటి గోధుమల్ని పండిస్తాయి
కన్నీరు వరదగుడైన చోట
గాయపడ్డ చూపు గేయమౌతుంది.
అనంతమై విర్రవీగిన ఆకాశం
పక్షి చేతిలో ఓడిపోతుంది.
రాలిపడే చినుకుల్ని ఆకాశం అడ్డుకోలేదు
ఎగిసిపడే జలధారను భూమి బంధించలేదు.
కన్నీటిని కత్తి చీల్చితే
కారి పారేది రక్తమే
స్వేదం చేసిన సంతకం
రక్తం కంటే సాంద్రం.

హరివిల్లు రెక్కలపై

ఓ విత్తనం ఉగ్గిన్నెడు నీళ్ళ మైత్రి
మనకిచ్చిన మహత్తర బహుకృతి ఓ మహావృక్షం
ఆకులిచ్చిన అభయంతో
కట్టని ఇల్లయిన చెట్టుకింద
గూడులేని మానవుడి నివాసం.
చెట్టు ఎన్ని కోకిళ్ళ రాగాలు
ఎన్ని పక్షుల కలకలలు
ఎన్ని గాలుల కలయికలు
ఎన్ని గూళ్ళ కట్టడాలు
ఎన్ని పండుటాకుల వర్ధంతులు
ఎన్ని పిందెల బాలింతలు.
పట్టు సరిగెల కలనేత
ఒకానొక సీతాకోకచిలక
హరివిల్లు రెక్కలపై రాసుకుని
నక్షత్రాల్ని అద్దుకుని
ఆకు ఆకున వాలి వాలకుండా
చెట్టు శిరస్సున కోహినూరు వజ్రం.

ఆకు పరదాలు కట్టుకుని
కొమ్మల్లో కూర్చున్న మధుకలశాలకు
తేనెటీగలు రక్షణకవచం.
ఒళ్ళంతా పువ్వొళ్ళు పూసి
సరాగాల భృంగాలకు
పరాగాల విందు చేస్తూ
చెట్టంతా ఆనందాల సందడి.
చెట్టుకొమ్మ తొలకరి నాగలై
కొండ్రవేస్తే
విశ్వం ఆకుపచ్చ తివాసీ.
తలవంచిన మనిషికి
చెట్టు తలెత్తడం నేర్పిన జయపతాక
ఊర్ధ్వ ముఖంగా విశ్రమించిన మనిషికి
నుదుటిపై మొలిచిన బోధివృక్షం.

ఇంకా తెల్లారలేదు

సంక్షుభిత జనారణ్యాన
నిశ్శబ్దమై నిలుస్తాను
భువనఘోష చుట్టుముట్టుతుంది.
నడుం విరిగిన చెప్పుల్ని విశ్రాంతికి వొదిలి
పాదాల్ని ప్రయాణానికి సిద్ధం చేస్తాడు చిన్నకొడుకు
పారదర్శక ప్లాస్టిక్ పేపర్లో బంధించిన డిగ్రీకి
హస్తరేఖ అంటనివ్వని జాగ్రత్త అతనిది
ఆశ సప్తవర్ణమై ఆకాశానికి లాక్కెళ్ళి
నిరాశ సప్తపాతాళాల్లో పడేస్తుంది.
ఏ ఇంటర్వ్యూ ఫలించదు
ఎక్కే మెట్లపై ఉత్సాహం
దిగే మెట్లపై ఆవేశం
అవ్యక్త మహావిస్ఫోటనం....
ఒక యంత్రాంగం అవిశ్రాంతమై వెంటబడి
వాడి ముద్ర ఎక్కడా అంటనివ్వదు
అస్తిత్వం కోసం ఏ ప్రయత్నమూ ఫలించదు
ఓటమి ఆలోచనల్లో పడేసి

స్వాభిమానం ఇంటికి రానివ్వదు.
వాకిట్లో కొడుకు రాకకు వేచి చూస్తూ
వండిన వంట చల్లారకుండా
గుండెల్లో దాస్తుంది అమ్మ.....
పట్టుదొరకని ఇసుకలో పాదాలు దూర్చి
సాగరతీరాన నిశ్శబ్దమై నిలుస్తాను
సముద్రఘోష వెంబడిస్తుంది.
అలల్ని పడవతో కోసుకుంటూ పెద్దకొడుకు
సుదూర ప్రయాణపు మజిలీలో
వల విసిరి వేట ప్రారంభం
ఎత్తును పసిగట్టిన చేపలు
రక్షిత స్థలాలకు ఈది పైయ్యెత్తు వేస్తాయి.
ప్రభాకరుడు పడమరకెళ్ళి
అంబుధిని తొంగిచూస్తాడు
గాయపడి ఎగిరిపడ్డ నీళ్ళు నెమ్మదించి
పడవను పసిబిడ్డ ఉయ్యాల్లా వూపుతాయి
పట్టుమని పది చేపలు పట్టుబడక
పెద్దకొడుకు ఒడ్డున పునరుత్థానం.....
వేటగాడ్ని వెంటాడిన దళారి
పదిరూకల పెట్టుబడితో శ్రమశక్తి దోపిడి.
పప్పుకు ఉప్పుకు పైసల్లేక
ఇల్లాలి నీళ్ళోండిన కళ్ళ నిరీక్షణ—
ప్రళయఘోష విలయతాండవం మోస్తూ
భూమి గానుగెద్దయి సూర్యుడి చుట్టూ ప్రదక్షిణ
సూర్యుడు రాల్చిన వెలుగు నూనెను
అక్రమ నిల్వలు చేస్తూ అవినీతిదార్లు—

అనాదిగా అదే నీతి

భారంగా దిగింది బాలింత తల్లికోడి
పొదుగు బుట్టను వదిలి పసిపాపల్తో
నలుపు తెలుపు గోధుమ వర్ణం కొన్ని
అమ్మ రంగుకు అచ్చం ప్రతిరూపం కొన్ని.
బుడి బుడి నడకల్తో
అమ్మ మెడ మీద మావటై స్వారీ చేస్తూ కొన్ని
రెక్కల దుప్పట్లో చలి కాచుకుంటూ కొన్ని.
అమ్మ ఆదేశం మార్గదర్శనం మధ్య
పసిబిడ్డల ఏవో మాటలు ఏవేవో పాటలు
చిరు చిరు నడకలు చిన్నారి చూపులు
పిల్లలు కొమ్మారెమ్మల్లేని పుడమి పూసిన పువ్వులు.
వీధి బతుకులు పేద బతుకులు
పరిశ్రమిస్తేనే కడుపుకు నాలుగు నూకలు.
గోళ్ళతో నేలను చీలుస్తూ
ముక్కుతో పొడుస్తూ
తల్లికోడి ఆహారం సేకరిస్తూంది
అమ్మను అనుకరిస్తూ పెరట్లో బిడ్డలు

పాలుగారే ముక్కును నేల వెక్కిరిస్తుంటే
ప్రథమాధ్యాయంలో అభ్యాసం సాగుతూంది.
హఠాత్తుగా ముక్కుగన్ను పైకెక్కు పెట్టి
తల్లికోడి పెడబొబ్బలు పెడుతూంది
కాలివేళ్ళు పిడికిళ్ళు బిగించి
రెక్కలు భూమ్యాకర్షణ చీల్చి
పైపైకి ఎగిసిపడుతున్నాయి
లోకం తెలియని కూనలు
చూపు రిక్కరించి పైకి చూస్తున్నాయి
గగనాన మాటేసిన గద్ద
గిరికీలు తిరిగి పల్టీలు కొడుతూంది.
పైన తిరిగేదేమిటో పసికూనలకు తెలియదు
అమ్మ ఉగ్రత ఎందుకో తెలియదు
ప్రాణమంటే తెలియదు
ప్రాణం పోవడమంటే తెలియదు.
అధోముఖం పట్టిన అంతరిక్షవాహనంలా గద్ద
నేల తాకి రివ్వున పైకిలేచింది
కాలిగోళ్ళ మధ్య నలిగి బిడ్డ ప్రాణం
అనంత వాయువుల్లో కలిసిపోయింది
మమతానుబంధం తెగిన క్షణమది
అమ్మ దుఃఖానికి అంతులేదు
బిడ్డల ఆక్రందనకు ఎల్లల్లేవు.
నోరున్న బలవంతుడిది ఒకనీతి
నోర్లేని బలవంతుడిదీ అదేరీతి
అనాదిగా బలహీనత మూల్యం చెల్లింపు
యుగయుగాలుగా ఇదే ముగింపు.

కూలుతున్న గోడలు

స్వేచ్ఛ రాజ్యాంగం ఇచ్చిన
సంపూర్ణ హక్కే ఐనా
ఒకడు వెంబడించి నియంత్రిస్తాడు
ఒకడు నిశ్చలమై యాంత్రీకరిస్తాడు
ఒకడు మాటున దాగి ఆడిస్తాడు
ఎక్కడో నరాలు తెగిపోతూ
నిట్టనిలువునా కూలిపోతూ
జడత్వం తొడుక్కుంటూ నువ్వు.....
హద్దులు చెరుపుకుంటూ
చలిచీమల చేత చిక్కని సర్పాలు
సరిహద్దుల్ని విస్తరిస్తుంటాయి
నిన్నాక్రమించిన వాడికి రెండు కళ్ళూ
రెండు చేతులూ, రెండు కాళ్ళే ఐనా
ఎదుర్కోడానికి రెండు కళ్ళూ
రెండు చేతులూ, రెండు కాళ్ళూ చాలవు.
సముద్రం పాతది దారులు కొత్తవి
నేల పాతది ఆలోచనలు కొత్తవి

ఆకాశం పాతది వెలుగులు కొత్తవి
మనిషి మందగిస్తేనో
బద్ధకంగా విశ్రమిస్తేనో
కాలం కంచు ఢక్కా అవుతుంది.
కొత్త అద్దంలో వృద్ధాప్యం
యౌవనంగా ప్రతిఫలించదు
సత్సందేశం ఇక్కడే ప్రారంభం
ఎవరి మొద్దుబారిన మెదళ్ళు
వారి దగ్గరే సురక్షితం
దొంగిలించబడవు, అమ్ముడు కావు.
శక్తిపై నిఘావేసి
చుట్టూ శత్రువు పహరా
స్తబ్ధత చలనమై
సంఘటించటం ఉద్యమం
అందిన ఆకురాయితో
పదును పెట్టడం ఉద్యమం.
నరలోకపు అడ్డుగోడలు
కూలుతున్న దృశ్యం
గొలుసుబలం లింకులపై ఆధారం.

భూగోళం ఆమె శిశువు

ఒక సామ్రాజ్యం గెలుస్తుంది
వీరమాతకు విజయం
ఒక సామ్రాజ్యం ఓడుతుంది
మాతృమూర్తికి పరాజయం.
నారు పోసి నీరు పోసేది అమ్మ
నారు నాటి కోత కోసేది అమ్మ
పంటకాల్వ నీటిఅద్దంలో కదలాడే రూపు అమ్మ
అక్షరం నేర్చి పెదాలు "అమ్మ"ను చదివినపుడు
యక్షకన్యై ఆకసానికి ఎగిసేది అమ్మ
పుల్లల్లేని పొయ్యిలో
అమ్మ వేళ్ళెట్టి ఉడకెయ్యడం చూస్తాం
వండిన వంటలో
తనకో ముద్ద మిగుల్చుకోనితనం చూస్తాం
నిలకడ నీటిలో రూపాన్ని చూసి
నీటితైలంతో తల దువ్వుకోవడం చూస్తాం
రాజూ పేద. భేదాల వేదభూమిలో
బతుకెప్పుడూ పెరగని పొట్టిది.

ఆకులో గాలిలో అమ్మ
నీటిలో మట్టిలో అమ్మ
నిన్ను చూసిన వాళ్ళకు అమ్మే నువ్వు
నువ్వు అద్దంలో చూస్తే నువ్వే అమ్మ.
నిండుకున్న దొంతి కుండల్లో అమ్మ వేళ్ళు వెతుకుతుంటే
అర్థమైన పిల్లి నిర్భయంగా పొయ్యిలో నిదురిస్తుంది
శోధించినా తిండిగింజల్ని సాధించలేమని తెలిసినా
ఆశ చావని వేళ్ళు కుండల్లో తిరిగి అరుగుతుంటాయి.
పగలు గ్రీష్మానికి ఒళ్ళు పెనం చేసిన అమ్మ
రాత్రి కడుపున పేగులు కాల్తాయి.
ఆనందానికి ఆవేదనకూ అమ్మ వుంది
ఆవేశానికి ఆక్రోశానికీ అమ్మ వుంది
అమ్మకు అందరూ శిశువులు—
అమ్మ చేయి గోరుముద్దయి నోటికి చేరితే
అలిగి బిగిసిన నోరు అలవోకగా విప్పారుతుంది
బావిని బానలో నింపి భుజంపై ఇంటికి మోస్తుంటే
భగీరథుడి బహిరంగ పరాజయం—
ప్రతి అమ్మకో స్వార్థం వుంది
కన్నబిడ్డ ఎదగాలని
ప్రతి అమ్మకో త్యాగం వుంది
కన్నబిడ్డకై కరగాలని—

రూపుకు రెండు ముఖాలు

1

శుక్ల కృష్ణ పక్షాల చుట్టూ
జీవన భ్రమణం
భీకర బీభత్స భూకంపమై
భీషణ భయానక అగ్నిపర్వతమై
పచ్చని బతుకును మసి చేసిన భూమి.
ఫెళఫెళారవంతో ఒక్కసారి
నింగి సముద్రమై నేలకూలి
చరాచరాల్ని ఎండుటాకుల్లా ఎగరేసి
సముద్ర నిమజ్జనం చేసిన నింగి.
అమానవీకరణ యాంత్రిక జీవితం
కలుషిత విష వాతావరణం
మత వైషమ్యాలు మాఫియా గ్యాంగుల మధ్య
ఏకాకితనం కప్పిన నగరం.
మోతుబరి దౌర్జన్యం కులరక్కసి
ఫ్యాక్షన్ కక్షల్తో యుద్ధశిబిరాలై
పంట కాలువలో శవాలు పారుతున్న గ్రామం.

ఇప్పుడు రంగు వెలిసిన నమ్మకానికి
మనసు పిండి అద్దాల్సి వుంది.

2

విత్తును మహావృక్షం చేసి
హరిత పత్రపు పాత్రిళ్ళలో
పండిన పంట గోరుముద్దలేసి
ఆత్మీయతారాగంతో
అన్నప్రాశన చేసిన భూమి.
మానవ కళ్యాణానికి
మేఘాలు సుశిక్షిత సైనికులై
అక్కరమేరకే వర్షించి
పసిడిని పండించిన నింగి.
ఉన్నత విద్య, ఆధునిక వైద్యం
విస్తరించిన పారిశ్రామికీకరణ
శాస్త్ర సాంకేతికం నిండిన నగరం.
పాడి సంపద, పండు వెన్నెల
పిల్ల తెమ్మెర, రంగవల్లి
హరిత విప్లవ సింధువైన గ్రామం.
చెదిరిన రూపుకు శిల్పించిన ఆకృతి
ప్రేమను వమ్ముజేసే కృత్యాలపై
మనిషి అజేయుడని నమ్మి
విశ్వప్రేమిగా విస్తరించాల్సివుంది.

కాస్త అలసట తీరాక

నిద్రిస్తున్న ఆమెను మేల్కొల్పవద్దు
చెదిరిన చీర, జారిన పైట ఆమెకు పట్టదు
నిద్ర సిగ్గెరగదు, వయసెరగదు
మనిషి నిద్రకు అమ్ముడయ్యాక
క్రయం విక్రయం పై ఆధిపత్యం
నేలను పసిడి తల్పం చేసి
ముంజేయి మెత్తని తలదిండై ఆమె పడక.
చెట్టును ఓడించిన సూర్యకాంతి
ఆమె ఒంటిపై కాంతి మచ్చలు
కాంతిని ఓడించిన చెట్టు
ఆమె మేను పై నీడ మరకలు
నిద్రకు నిర్ణీత కాలమూ
నియమిత స్థలమూ వుండవు
నిద్ర శ్రమ జోల
నిద్ర అలసట ఊయల.
రాళ్ళెత్తిన కూలీ ఆమె
రాళ్ళుల్లో రప్ప ఆమె
భీకరారణ్యాన కాలిబాట ఆమె

పడిపోయిన తరంగానికి ఆశ ఆమె
పైకి లేస్తున్న అలకు ఊపిరి ఆమె
లోయలు దాటి లోకాలు దాటి
ఎక్కడో నిశ్శబ్దంగా శబ్దించుకుంటూ నిద్రిస్తూంది.
ఆమె చేతులు కొండల్ని ఒణికిస్తాయి
రాళ్ళు పిండిగా మారుతాయి
ఆమె పాదాలు భూమిని కంపిస్తాయి
లోయలు రోడ్లుగా రూపం చెందుతాయి
మట్టిలో పవ్వళించి మట్టిని కప్పుకున్న
మట్టిమనిషి ఆమె.
రోడ్డు పూర్తైనట్టు, స్వాగతాలు పలుకుతున్నట్టు
నడకల విగ్రవీగుడు వినమ్రంగా స్వీకరిస్తున్నట్టు
ఆమెను స్వప్నంలోకి జారనివ్వండి
అలసట తీరాక శ్రమదానం మీ కోసమే
వాయినాలు అందుకుందురు వరుసగా నిలబడి.
ధ్వని వాతావరణ కాలుష్యాలకు
ఆమె చెక్కుచెదరదు పక్క దొర్లదు
ఆకలి నవనాడులు కేంద్రీకృతమైన చోట
సున్నితంగా రిమోట్ స్పృశిస్తే చాలు
మీ అధికార దర్పధ్వని "ఒసే ఓబులమ్మా"
ఆమెకు వేయి సైరన్ల మేలుకొలుపు.
ఆమె ఘనీభవించిన ఘర్మజలం
ఆమె పసిడి ముడి లోహం
నిద్రిస్తున్న ఆమెను మేల్కొల్పవద్దు
అలసట తీరాక శ్రమదానం మీ కోసమే
వాయినాలు ..... అందుకుందురు వరుసగా నిలబడి.

నిర్మాణం జరుగుతూవుంది

మీపై మాకు అనుమానాల్లేవు అన్నీ నమ్మకాలే
వామనుడి మూడోపాదం మాకు కేటాయించడం
నమ్మకాల్లో ఒక నమ్మకం.
ఒక బుగ్గ మాడితే ఒక బుగ్గ గులాబి
పుట్టిన ప్రతివాడు బ్రతకడం హక్కు
బ్రతకనివ్వడం ప్రతిపౌరుడి బాధ్యత.
హీనులుగా మమ్మ జమకడితే
ఏ తల్లి ఇరవైమాసాలు మోసి కన్నదో
లెక్క చెప్పాల్సి వుంది
మా నుదుటి పై బ్రహ్మరాత చూపితే
మీ నుదుటిపై రాసిన బ్రహ్మను చూపాల్సి వుంది.
వెయ్యికోట్లు ఒక్కడే నెమరేస్తే
తిరగబడ్డ ఒక్కడే కోటిమంది ప్రతినిధి
గోడపక్కనో రాళ్ళకిందనో పారాడే చీమలబారు
వాసన పసిగట్టి
చుట్టుముట్టడం వాస్తవిక చిత్రం.
గోవులు ముప్పును పసిగడితే

కొమ్ములు తుపాకి బాయ్‌నెట్లను తలదన్నుతాయి.
ఒకడు ఏతం వేస్తే ఒకడికి వెయ్యేపుట్లు
మేఘం తన బిడ్డని సముద్రం విర్రవీగితే
నదులు, చెరువులు వాగులు, వంకలు వ్యాజ్యమాడుతాయి.
మట్టి వెలిగించిన కరెంటు బల్బులు
మట్టిని వెలిగించడం లేదు
తలొంచి నడవడం భయానికి సంకేతం కాదు
వెల్లావెదురైన బలాన్ని ఏరుతూ కూడగట్టడం .....
నులిమిన గొంతుల్లోంచి పొగడ్తలు రావు
పొంగిన లావా తప్ప
నీరు ఎండిపోయిందని నది నిద్రపోదు
రాబోయే నీటిబిడ్డ కోసం
కరకట్టలు ఉయ్యాళ్ళై ఎదురుచూస్తాయి
ఆశయం కొండవీటి చేంతాడు.....
ధరించిన శిరస్త్రాణం చెదరకనే
శిరస్సు తెగిపడుతుంది
అష్టదిక్పాలకులు అంగరక్షకులై నిల్చినా
గుండెను బాణం నిలువునా గుచ్చుతుంది.

పరమోపాయం" అంటూ అందుకున్నాడు కృష్ణుడు, "నేనూ, అన్నయ్యా మధుర వొదిలి వెళిపోతాం. మామీద పగ కాని మధురమీద పగకాదు జరాసంధుడికి. అంచేత మేం లేమంటే మధురమీదికి రాడు. వచ్చినా మేం లేకపోడం చూసి, మాకోసం గాలించి మా వెంట పడతాడు. మా పలాయనం పరాజయంకాదు, పరమోపాయం. అదును చూసి జరాసంధుడ్ని హరీ అనిపిస్తాను."

పలాయనం

రహస్యంగా మారువేషాలు వేసుకుని మధురనించి పారిపోయారు రామకృష్ణులు. ఆ పోవడం పోవడం దక్షిణ దేశానికి నడిచారు. వేణీనది దగ్గిర కరవీరపురం చేరారు. అక్కడ అడివిలో పరశురాముణ్ణి చూశారు. అతడు చెప్పిన ప్రకారం వేణీనది దాటారు. అక్కడ యజ్ఞగిరిమీద ఒక రాత్రి వున్నారు. అవతల ఖట్వాంగనది దాటి క్రౌంచపురం చేరారు. అనంతరం గోమంతపర్వతం మీదికి వెళ్ళారు. రకరకాల చెట్లతోనూ, మృగాలతోనూ, పిట్టలతోనూ, సెలయేళ్ళతోనూ ఎంతో గొప్పగా వుంది గోమంతం. విరబూసిన పువ్వులు గమ్మమంటున్నాయి. ఆరముగ్గిన పళ్లు నోరూరిస్తున్నాయి. కమ్మని పిల్లగాలులు హాయి కల్పిస్తున్నాయి.

గోమంతం శిఖరాలు ఆకాశం అంటుతున్నట్టుంటాయి. దీనికి ప్రస్రవణం అనికూడ పేరు. హెచ్చువర్షాలు కురిసే కొండ కనక దానికా పేరు వచ్చింది.

రామకృష్ణులు వచ్చి గోమంతంమీద తిరుగుతూ వుండగా ఒక కదంబం చెట్టు తొర్రలోంచి కారుతూ కల్లు కనబడింది బలరాముడికి. కదంబం చెట్టునించి కారడంచేత దాని పేరు కాదంబరి. వాసన మత్తుగా వుంది.

కాదంబరిమద్యం కడుపారా తాగాడు బలరాముడు. కైపెక్కి కళ్లు తిప్పాడు.

ఆ కైపులో అతడికి కాదంబరి అందమైన ఆడదిగా వరించింది. తనపేరు వారుణి అంది. అలాగే మరిద్దరు అందకత్తెలూ అతణ్ణి వరించారు. అందులో ఒకామె పేరు కాంతి.

ఇంతలో గరుడు వచ్చి కృష్ణుడికి కిరీటం ఇచ్చి వెళ్ళాడు.

కొండకి నిప్పు

రామకృష్ణులు మధురనించి దక్షిణాదికి పారిపోయారని తెలుసుకున్నాడు జరాసంధుడు. మధుర ముట్టడికి వెళుతున్న సైన్యాలు దక్షిణాదికి మళ్ళించాడు. కొండలూ, అడవులూ గాలించి, తుదకి ప్రస్రవణ పర్వతంమీద రామకృష్ణులున్నట్టు కనిపెట్టాడు. రాజులతోనూ, రాణువతోనూ, ప్రస్రవణం ముట్టడించాడు. "కొండ కొండంతా నేలమట్టం చేయండి" అంటూ హుకుం వేశాడు.

గుదియలూ, గునపాలూ, గడ్డపారలూ, గండ్రగొడ్డళ్ళూ పట్టుకుని సైనికులు కొండమీద పడ్డారు, మిడతలదండులాగ. రాళ్లు తవ్వారు. పణుకులు పెల్లగించారు. మాళ్లు నరికారు. సెలయేళ్లు కప్పారు.

సాధ్యపడలేదు కొండ. చదరమయినా నదును కాలేదు కొండ. మీదికెగబడ్డారు రాజులు. ముళ్ళలో రాళ్ళలో ముందుకి సాగలేకపోయారు. చిటారు సిఖరం మీదున్నారు రామకృష్ణులు. తెలుపు నలుపు మేఘాల్లా అవుపిస్తున్నారు. యుద్ధానికీ సిద్ధంగానే వున్నారు వారు.

"మహారాజా!" అదంతా చూసి జరాసంధుడితో అన్నాడు శిశుపాలుడు. "ఈ కొండ ఎక్కడమే మనకి చేత కాకండా వుంది. ఎక్కలేకదా, వాళ్ళతో యుద్ధం. ఇంతకీ నేల మీద ఎంత యుద్ధమైనా చేస్తాం. పదివేల బలరామ కృష్ణుల్ని పాతిపెట్టేస్తాం. కాని కొండ యుద్ధం తెలిసినవాడు మన దండులో ఒక్కడూ లేడు. ఈ రామకృష్ణులా సామా న్యులు కారు. దీంతో పద్దెనిమిది సార్లు మనల్ని మూడు చెరు వుల నీళ్ళా తాగిస్తున్నారు. కనక నేనో మంచి ఉపాయం చెపుతాను. దీంతో వీళ్ళ శని విరగడైపోతుంది.

ఈ కొండచుట్టూ కర్రా, కంపా, గడ్డీ, గాదా, కప్పేట్టు నిప్పు పెడదాం. చెట్టు చేమలతో మండిపోతుంది కొండ. రామకృష్ణులు కాలిపోతారు. చచ్చి వూరుకుంటారు."

బాగుందంటే బాగుందన్నారు కడపరాజులు.

"అయితే అగ్గి పెట్టండి" అని అరిచాడు జరాసంధుడు. సింహనాదాలు చేశారు సైనికులు. ఎండు కట్టెలూ, ఎండు గడ్డీ కప్పి, కొండకి నిప్పుముట్టించారు.

చుట్టూ పొగలతో మంటలు కక్కింది కొండ. పెద్ద పెద్ద చెట్లు భగభగా మండిపోయాయి. రాళ్ళు పగిలి

పోయాయి. మృగాలూ, పక్షులూ పారిపోయాయి. పెద్దపెద్ద పాములు తగలబడిపోయాయి. పొగలు ఆకాశం ఆవరించాయి. చుట్టుపట్ల అడవులూ, కొండలూ పొగలో అవుపడకండా పోయాయి. జరాసంధుడి దండు అరకోసు వెనక్కి పోయింది. వేడి తట్టుకోలేకపోయింది.

ఈ గందికలో కొండశిఖరం దూకేసి తప్పుకుపోయారు రామకృష్ణులు.

అన్నదమ్ములిద్దరూ అగ్గిలో బుగ్గయిపోయారను కున్నాడు జరాసంధుడు. నిశ్చింతగా మగధ మళ్ళిపోయాడు. రాజులందరు తమ తమ సేనలు తర్లించుకుపోయారు.

కాని, బలరామకృష్ణుల మేనత్త మగడూ, శిశుపాలుడి తండ్రీ, ఛేదిదేశం రాజూ అయిన దమఘోషుడు ఎలాగో రామకృష్ణుల్ని కలుసుకున్నాడు. తన చుట్టరికం చెప్పి వారితో నమ్మకంగా మాట్లాడాడు.

"మీరంటే ఇష్టం నాకు. జరాసంధుడు. లాక్కు వచ్చినా, మీతో యుద్ధం వద్దని చెవిలో గూడుకట్టుకుని చెప్పాను. కాని వినుకోలేదు మూర్ఖుడు. ఇప్పటికి వెళ్ళి పోయినా, పగ ఒదలడు. తెలిసిందంటే మళ్ళీ విరుచుకుపడ తాడు. ఇక్కడ వుండకూడదు మీరు. వాడు ముట్టడించలేని చోట గట్టి పట్టణం కట్టుకోవాలి ముందు ముందు.

ఇక్కడికి కొంతదూరంలో కరవీరపురముంది. వెనక పద్మవర్ణుడు కట్టిన పట్టణమది. దాన్ని ఇప్పుడు సృగాలవాసు

దేవుడు పరిపాలిస్తున్నాడు. జరాసంధుడి సామంతుడతడు. ఎగిరి పరిగెత్తే రథముందని మిడిసిపడుతుంటాడు. మనమొక సారి కరవీరపురం వెళదాం. అతణ్ణి చూద్దాం, తరవాత మీరు మధుర వెళుదురుకాని. కొత్త రాజధాని కోసం ప్రయత్నం చేద్దురుకాని, నా వెంట నా సైన్యముంది. మీా కోసం మంచి రథమూ వుంది'' అన్నాడు.

"సరే'' అన్నారు రామకృష్ణులు. దమఘోషుడితో రథమెక్కారు. దమఘోషుడి సేనతో కూడా మూడురాత్రిళ్లు ప్రయాణంచేసి, కరవీరపురం చేరారు.

సృగాల వాసుదేవుడు

బలరామకృష్ణులు తనమీాదికే ఎత్తివచ్చారని అనుకున్నాడు సృగాల వాసుదేవుడు. తన ఎగిరే రథమెక్కి పెద్ద రాణువతో వచ్చి ఎదిరించాడు. కృష్ణుణ్ణి ద్వంద్వయుద్ధానికి కవ్వించాడు.

"సైన్యంతో పనిలేదు. మన ఇద్దరం సరాసరి యుద్ధం చేద్దాం. ఇద్దరు వాసుదేవులు వుండడానికి వీల్లేదు. నువ్వో నేనో తేలిపోవాలి'' అంటూ కలబడ్డాడు. వాడి వాడి బాణాలు కుమ్మరించాడు. నవ్వుతూ చూశాడు కృష్ణుడు. సుదర్శనం తీశాడు. గురిచూసి వేశాడు.

మెరుపులా వెళ్ళింది సుదర్శనం. నరికి పారేసింది సృగాలుణ్ణి. రథం మీాంచి క్రింద పడిపోయింది అతడి కళేబరం. కకావికలైపోయింది కరవీరసైన్యం.

కోటకి కబురందింది. సృగాలుడి అంతఃపుర స్త్రీలు గుండెలు బాదుకుంటూ వచ్చారు. మగడిమీదపడి గోలు గోలు మన్నారు.

సృగాలుడి కొడుకుని తీసుకుని కృష్ణుడి దగ్గిరికి వచ్చింది అతడి రాణి పద్మావతి. కుమారుణ్ణి కనికరించమని కాళ్ళా వేళ్ళా పడింది.

ఆమె కొడుకుని తండ్రి సింహాసనంమీద కూచో పెట్టాడు కృష్ణుడు. కరవీరపురానికి రాజు చేశాడు. రాణులకి ధైర్యం చెప్పాడు. పౌరుల్ని వోదార్చాడు. తరువాత మధురకి బయలుదేరారు రామకృష్ణులు. అయిదురాత్రిళ్ళు, అయిదు పగళ్ళు పయనంచేసి మధుర చేరుకున్నారు. తల్లీదండ్రుల్నీ బంధువుల్నీ, ప్రజల్నీ సంతోషపరిచారు.

కుండిన పయనం

విదర్భదేశం రాజధాని కుండిన నగరం. భోజవంశం భీష్మకుడు దానికి రాజు.

దక్షిణాపథంలో మంచి బలవంతుడైన రాజు అతడు. రుక్మీ, రుక్మరథుడూ, రుక్మబాహుడూ, రుక్మకేశుడూ, రుక్మమాలీ అని అయిదుగురు కొడుకులూ, రుక్మిణి అని ఒక కూతురూ వుండేవారతడికి.

రుక్మి మంచి వీరుడు. అయితే అతడు జరాసంధుడి మనిషి, కృష్ణుడంటే పడేదికాదు.

రుక్మిణి అపురూపమైన అందకత్తె. ఆనోటా, ఈనోటా

కృష్ణుడి అందచందాలు విని అతడిని పెళ్ళి చేసుకోవాలను కుంటూ వుండేదామె. అలాగే కృష్ణుడూ ఆమెని చేసు కోవాలనుకుంటూ వుండేవాడు.

ఇలా వుండగా భీష్మకుడు కూతురి పెళ్ళి తలపెట్టాడు. దేశదేశాల రాజులు స్వయంవరానికి తర్లి వచ్చారు.

జరాసంధుడు, శిశుపాలుడు, దంతవక్త్రుడు, సాల్వుడు మొదలైన రాజులు తమతమ సేనలతో దూరాదూరాలనించి వచ్చారు.

అదంతా విన్నాడు కృష్ణుడు. తానూ కుండిన బయలు దేరాడు.

కృష్ణుడు వచ్చాడనగానే స్వయంవరానికి వచ్చిన రాజుల్లో కలకలం బయలుదేరింది. వారిలో హెచ్చుమంది జరాసంధుడి పక్షంవారు.

"కృష్ణుడు వచ్చాడంటే మనందరినీ కన్ను గప్పి రుక్మిణిని ఎత్తుకు పోతాడు. ఇది మనం సహించకూడదు." అంటూ మంతనాలు సాగించారు. రుక్మి కారాలూ, మిరి యాలూ నూరాడు.

"అవును, వీడు అసాధ్యుడు. నేను ఎన్నిమార్లు దండెత్తినా తప్పించుకుంటూ నేవున్నాడు." అన్నాడు జరా సంధుడు.

"నిజమే నువ్వన్నది." అంటూ అందుకున్నాడు దమ ఘోషుడు, "స్వయంవరంలో ఎవరిని రుక్మిణి వరిస్తుందో తెలియదు. ఎవరిని వరించబోయినా కృష్ణుడు వూరుకోడు,

ఎత్తుకుపోడానికే ప్రయత్నిస్తాడు. యుద్ధం తప్పదు. అందుకు సిద్ధపడే వచ్చాడు. కుండిన రణగుండమవుతుంది. స్వయంవరానికి ఆపద ఇది. ఆలోచిస్తే స్వయంవరం ఆపడమే మంచిది. ఉన్నమాట చెప్పాలంటే బలరామకృష్ణుల్ని పారద్రోలగల బలవంతులు నాకు కనపడలేదు."

"దమఘోషుడు సరిగానే చెప్పాడు." అంటూ ఎత్తుకున్నాడు కరూషం రాజు దంతవక్త్రుడు, "ఇంతకీ మనమెలా, వచ్చామో కన్యకోసం, కృష్ణుడూ అలాగే వచ్చాడు. ఇందులో వింతేముంది? దీనికి భయపడవలిసిందికాని, పగపట్టవలసిందికాని ఏమీ లేదు, అందరిలాగే అతడినీ గౌరవిద్దాం, మంచిగా వుందాం" అన్నాడు.

"ఏమిటీ మాటలు!" అన్నాడు సాల్వుడు, "తనని చులకన చేసుకోడం, ఎదటివాణ్ణి మీదికెత్తడం రాజయినవాడికి తగనిపని. మేమూ ఎరుగుదుం కృష్ణుణ్ణి. భయం మనకి కూడదు. భయపడినంత మాత్రాన ఎవడూ వుట్టిగట్టుకు వుండిపోడు. ఇంతకీ కృష్ణుడు యుద్ధానికి రాలేదు. స్వయంవరానికి వచ్చాడు. ఎవరినో ఒకర్ని వరిస్తుంది రుక్మిణి. కాదంటే కృష్ణుణ్ణే వరిస్తుంది. వరించనీ చూద్దాం. ముందే ఈ రభస ఎందుకూ?"

రుక్మిణి కృష్ణుణ్ణి వరిస్తుందంటే రుసరుసలాడాడు రుక్మి.

అదంతా చూశాడు భీష్మకుడు. తనలో తాను ఆలోచించాడు. స్వయంవరం నిలుపు చేయడమే మంచిదనుకున్నాడు. 'తరవాత సావకాశంగా నచ్చిన వరుడికి కన్యాదానం చేస్తాను. ఇప్పటికి ఈ ఆపద గట్టెక్కుతుంది.' అని

నిశ్చయించుకున్నాడు. కృష్ణుడి విడిదికి వెళ్ళాడు. అతడికి అన్ని మర్యాదలూ జరిపించాడు. నెమ్మదిగా ఇలా ఎత్తుకున్నాడు:

"కృష్ణా! నా మట్టుకు నాకు స్వయంవర వివాహాలు నచ్చవు. ఏమంటే, పీథిగుమ్మం ఎరగని కన్యలు ఏ రాజు ఎలాంటివాడో ఎలా తెలుసుకుంటారు? అంచేత ఈ స్వయంవరం నేను తలపెట్టలేదు. మా రుక్మి ప్రయత్నమిది. ఉత్తి మూర్ఖుడు వాడు. తనకి ఎంత తోస్తే అంత. నే నిప్పుడు ఈ స్వయంవరం నిలుపుచేశాను. నాకు నచ్చిన వరుణ్ణి చూసి అమ్మాయిని కన్యాదానం చేస్తాను సావకాశంగా. రాజులందరితోపాటు నువ్వూ మన్నించు." అన్నాడు.

"సరే, అన్నీ తెలిసిన మహారాజువి నువ్వు. అలాగే కానీ" అన్నాడు కృష్ణుడు. మధురాపురానికి మళ్ళిపోయాడు. కొంతదూరం అతడిని సాగనంపి వచ్చేశాడు భీష్మకుడు.

కుట్ర

భీష్మకుడి నిశ్చయం విన్నారు రాజులు. జరాసంధుడి అడుగుజాడల్లో నడిచేవారంతా ఒక దగ్గర సమావేశమయారు. "మన కలలన్నీ గాలి కెగిరిపోయాయి" అంటూ చేతులు పిసుక్కున్నారు. "ఎలా అయినా ఈ కృష్ణుడి పని పట్టించాలి" అంటూ పళ్ళు కొరికారు.

"దీనికి ఒక్కటే ఉపాయముంది" అంటూ అందుకున్నాడు సాల్వుడు. "కృష్ణుణ్ణి చంపడానికి కాలయవనుడు ఒక్కడే సమర్థుడు. మధురవాళ్ళ నందరినీ మసిచేస్తా డతడు

"గార్గ్య పురోహితుడి కొడుకు కాలయవనుడు. కట్టుకున్న ఇల్లాలుండినా బ్రహ్మచారిగా గడిపేవాడు గార్గ్యుడు. అంచేత సంతానం కలగలేదతడికి. దానికి విచారపడుతూ అతడి బావమరిది ఓనాడు అతణ్ణి "నపుంసకుడివి" అని హేళన చేశాడు యాదవ సభలో. విరగబడి నవ్వారు యాదవులు. తల కొట్టేసినట్టయింది గార్గ్యుడికి. కళ్ళు మొయ్యా కోపమూ వచ్చింది. అడివికి వెళ్ళిపోయాడు. మధుర యాదవుల్ని మాడ్చెయ్యగల కొడుకు కలగాలని, లోహాభస్మం తింటూ, పన్నెండేళ్లు తపస్సుచేసి, వరం పొందాడు.

అది తెలిసి యవనదేశంరాజు అతణ్ణి ఒక ఆలమందలో వుంచి, మంచి వయసులోవున్న గొల్ల పడుచుల్ని అతడికి అప్పగించాడు. కమలపాలిక అని ఒక అప్సరస గొల్లపడుచుగా వచ్చి గార్గ్యుణ్ణి వలపించింది. ఆమెతో కలిశాడు గార్గ్యుడు.

కుమారుణ్ణి కంది కమలపాలిక. బాలుణ్ణి కొడుకుగా పెంచాడు యవనరాజు. అదిగో ఆ బాలుడే కాలయవనుడు. యవనరాజు కాలం చేశాక, కాలయవనుడే రాజయ్యాడు. మధురవాళ్ళని మసి చేయగల బలవంతుడు. కృష్ణుడు మధురలో పుట్టినవాడు కనక అతణ్ణి మట్టిలో కలిపేస్తాడు. అందుకని అతణ్ణే ఆశ్రయించాలి మనం. జరాసంధుడు అతణ్ణి కోరుతూ దూతని పంపాలి." అన్నాడు.

"నా మట్టుకు నేను యుద్ధం చేయడమే కాని ఒకణ్ణి ఆశ్రయించడం నాకు తెలియదు. అయినా మీ అందరికీ ఇష్టమయితే సాల్వుణ్ణే దూతగా పంపండి" అని చెప్పి మగధ

వెళిపోయాడు జరాసంధుడు. సాల్వుణ్ణి దూతగా కాల యవనుడి దగ్గిరికి పంపి తక్కిన రాజులు తమ తమ దేశాలకు దారితీశారు.

కృష్ణుడు వచ్చి వెళ్ళిపోయాడని వింది రుక్మిణి. ఎంతో విచారపడింది. రాజుల కుట్రా వింది. 'ఏమైనా కానీ, కృష్ణుణ్ణి తప్ప మరొకర్ని పెళ్ళాడను' అని నిశ్చయం చేసుకుంది. పగలూ, రాత్రీ కృష్ణుణ్నే తలుచుకుంటూ వచ్చింది.

కాలయవనుడు

ఇనపకొండలాటివాడు కాలయవనుడు. ధనబలం తోనూ, జనబలంతోనూ, యవనదేశం ఏలుతూ వుండేవా డతడు.

కాలయవనుడు నిండు కొలువులో వుండగా ఆకాశ రథంమీంద సాల్వుడు దిగాడు. మంత్రులతో ఎదురు వెళ్లాడు కాలయవనుడు. సగౌరవంగా తీసుకువచ్చాడు. కుశలప్రశ్న లయాక సాల్వుడు ఇలా అందుకున్నాడు :

"జరాసంధుడు నీ సహాయంకోరి, నన్ను దూతగా పంపాడు. రాజులందరికీ ఒక ఆపద వచ్చిపడింది. అది నీ వల్లకాని గట్టెక్కదు. యాదవులలో కృష్ణుడు బలవంతుడయి మిడిసిపడుతున్నాడు. కంసుణ్ని చంపేశాడు. అల్లుణ్ని చంపా డన్న కోపంతో జరాసంధుడు పద్దెనిమిది సార్లు మధుర ముట్టడించినా కృష్ణుడిని చంపలేకపోయాడు. రాజులందరికీ పక్కలో బల్లెంలా తయారయాడు వాడు.

294.592
Acc no. 4528
APP

ఇలా వుండగా భీష్మకుడు తన కూతుర్ని స్వయంవరంలో పెళ్ళి చేయాలనుకున్నాడు. పానకంలో పుడకలాగ అక్కడా తయారయాడు కృష్ణుడు. భీష్మకుడు భయపడిపోయాడు. స్వయంవరం మానుకున్నాడు. రాజులందరికీ తలకొట్టేసినట్టయింది. కృష్ణుడిని చంపితేగాని శాంతిలేదు. రుక్మిణికి పెళ్ళికాదు. అందుకని జరాసంధుడూ, యావన్మంది రాజులూ నీ సహాయం కోరుతున్నారు. మధుర యాదవులు నిన్ను గెలవలేరు. నీ ముందు నులనుల మాడిపోతారు. నేనే బలవంతుడినని జబ్బలు చరుస్తున్నాడు కృష్ణుడు. అదేదో తేలిపోతుందిప్పుడు" అంటూ ఎన్నో చెప్పి కాలయవనుడిని పురెక్కించాడు.

"నాకంటే బలవంతుడా కృష్ణుడు ?" కళ్ళెర్ర చేస్తూ లేచాడు కాలయవనుడు, "నాతో పోట్లాడేవాడు ఎవడైనా దొరుకుతాడా అనే ఎదురుచూస్తున్నాన్నేను, ఇన్నాళ్ళూ.

జరాసంధుడంతటి మహారాజు నన్ను కోరడమూ, రాజులందరూ నన్ను అర్థించడమూ, నువ్వు దూతగా రావడమూ — ఇంతకంటే నాకు గొప్పేముంది ? నా బతుకు సార్థకమయింది, ధన్యుడిని. ఇవాళే మధుర మీదికి తర్లి వెళతాను. కృష్ణుడు మరి లేడే అనుకోమని జరాసంధుడితో చెప్పు." అంటూ రాజ మర్యాదలతో సాల్వుడిని సాగనంపాడు. మధురమీదికి దండయాత్ర చాటించాడు.

రథాలూ, ఏనుగులూ, గుర్రాలూ, గాడిదలూ,

ఒంటెలూ, కాలిబంట్లూ - ఆకాశమంత దండుతో బయలు దేరాడు కాలయవనుడు. శకులూ, తుషారులూ, దరదులూ, పారదులూ మొదలైన రాజులు ఎంతోమంది అతడివెంట వచ్చారు.

అలా హుటాహుటిని వచ్చి మధుర ముట్టడించాడు కాలయవనుడు.

చూశాడు కృష్ణుడు ఉగ్రసేనుడూ మొదలైన యాదవ ప్రముఖుల్ని సమావేశపరిచాడు. ఏం చెయ్యాలో ఆలోచించాడు.

"జరాసంధుడి దండయాత్రలతో బాగా అలిసి పోయారు మీరు. అయినా యాదవులు అసాధ్యులు అనిపించు కున్నారు. ఇప్పుడు కాలయవనుడు పగపట్టి వచ్చాడు. మనం వీణ్ణి యుద్ధంలో గెలవలేం. వీడితో చేయిచేసుకుంటే వినాశం తప్పదు. పగవాడు బలవంతుడయినప్పుడు ఉపాయంతో అపాయం తప్పించుకోవాలి. పలాయనమే పరమోపాయం.

ఇటు కాలయవనుడి దాడి విని అటు జరాసంధుడూ వచ్చి పడవచ్చు. అప్పుడు మన పని మరింత కష్టమవుతుంది. నేను పన్నవలిసిన ఉపాయం పన్నుతాను. మీరేమీ భయ పడకండి.

ఇంతకీ ఈ మధురాపురం క్షేమంకాదు మనకి. పగ వాడు తేరిచూడలేని మంచి దిట్టమైన పట్టణం కట్టుకోవాలి. మధుర విడిచిపెట్టాలి తప్పదు. అందుకు మీరు సిద్ధంగా వుండాలి" అన్నాడు.

"నువ్వేం చెపితే అదే చేస్తాం. నీతోనే వుంటాం. నువ్వే మాకు నాయకుడివి." అన్నారు యాదవులు.

ముందుగా ఒక నల్లతాచు తెప్పించి, పెట్టెలో పెట్టి కాలయవనుడికి పంపాడు కృష్ణుడు.

"కృష్ణుడంటే నల్లతాచు సుమా!" అని దీని అర్థం. ఇది తెలుసుకుని కాలయవనుడు వెళ్ళిపోవచ్చునని కృష్ణుడి అభిప్రాయం.

కనిపెట్టేశాడు కాలయవనుడు. నల్లతాచు పెట్టెలో చలిచీమలు పెట్టి తిప్పి పంపాడు.

"బలవంతమైన సర్పం చలిచీమలచేత చస్తుంది" అని దాని భావం.

శత్రువు బెదిరింపులకి లొంగడనుకున్నాడు కృష్ణుడు. అన్న బలరాముడితో "పట్నం జాగ్రత్త. యవనసేన లోపలికి చొరబడనివ్వకు." అంటూ ఏ ఆయుధమూ పట్టుకోకండా పట్నం బయటికి వచ్చేశాడు. కాలయవనుడి కళ్ళ ఎదటినుంచే పరిగెత్తి పారిపోయాడు.

చూశాడు కాలయవనుడు. "ఎవడు వీడు? నల్లగా నిగనిగలాడుతున్నాడు. మోకాళ్ళకి అందుతున్నాయి చేతులు. పసుప్పచ్చటి పట్టుబట్టలు కట్టుకున్నాడు. ఇలాగే వుంటాడని విన్నాను కృష్ణుడు. వాడే అయుంటాడు. పారిపోతున్నాడేం నల్లతాచు? భయపడిపోయాడు. పారిపోతే వాదిలేస్తానా? అయితే ఆయుధ మేదీ చేతిలో లేదు. ఆయుధం లేనివాణ్ణి ఆయుధంతో కొట్టకూడదు." అంటూ

ఆయుధాలు పడేసి, వుత్తి చేతులతో వెంట తరిమాడు కృష్ణుణ్ణి.

పగవాడు వెంట తరమడంతో పరుగు నడి హెచ్చించాడు కృష్ణుడు. దొరికిపోయినట్టే నటించి తుర్రుమనేవాడు. కనపడినట్టే కనపడి, కనపడకుండాపోయేవాడు. అలిసిపోయినట్టే ఆగిపోయేవాడు. అంతలోనే గాలిలా ఎగిరిపోయేవాడు.

వదల్లేదు కాలయవనుడు. దొరకని కృష్ణుడికోసం దొంగని తరిమినట్టు తరిమాడు. రొజుకుంటూ తరిమాడు. రోషంతో తరిమాడు. ముప్పతిప్పలు పెట్టాడు కృష్ణుడు. తుప్పలు దాటాడు. తోపులు దాటాడు. అడవులు దాటాడు. వళ్ళు దాటాడు. ఎంతో దూరం పారిపోయాడు. వెళ్ళి వెళ్ళి ఒక కొండగుహలో దూరిపోయాడు. కాలయవనుడూ దూరాడు.

చీకటిగా వుంది గుహ. ఎంత దూరముందో అది! చీకటిలో చీకటి. నలుపులో నలుపు. కృష్ణుడు కనపడలేదు.

కడముట్ట గాలించాడు కాలయవనుడు. ఒక పొడవాటి మనిషి నిద్రపోతూ కనిపించాడు.

"దొంగా దొరికావు. నిద్దరలా నటిస్తున్నావు" అంటూ ఒక్క తాపు తన్నాడు కాలయవనుడు.

నిద్రపోతున్న మనిషి కళ్ళు విప్పాడు. ఎర్రగా చూశాడు. కాలిపోయాడు కాలయవనుడు. బూడిదయి కూలిపోయాడు.

ముచికుందుడు

అంతవరకూ అవుపడకండా వున్న కృష్ణుడు నిద్ర లేచిన మనిషి ఎదటికి వచ్చాడు.

"ఎవరు నాయనా నువ్వు ?" అడిగాడు నిద్రలేచిన పొడవు మనిషి. "ఇంత గొప్పగా అవుపిస్తున్నావు! నన్ను ముచికుందు డంటారు. ఎంతోకాలంనించి నిద్రపోతున్నాను. నన్ను నిద్ర లేపినవారు నా చూపుతో మండిపోవాలని కోరు కున్నాను. అలాగే మండిపోయా డిపు డెవరో నా నిద్రలేపి. ఎవరతడు ?"

తన వృత్తాంతమూ, కాలయవనుడి కథా చెప్పాడు కృష్ణుడు.

"అవును, ఇది ఇలాగే జరుగుతుందని వెనక పృథు చక్రవర్తి ఆస్థానంలో వుండిన జ్యోతిష్కుడు వృద్ధగర్గుడు చెప్పాడు. నువ్వు కారణజన్ముడివి. తనంతవాడు లేడను కున్నాడు కాలయవనుడు. కాలి బూడిద అయిపోయాడు. మనిషికి మిడిసిపాటే చావు. పదవి శాశ్వతం కాదు. బతుకూ శాశ్వతం కాదు. పుట్టిన ప్రాణి గిట్టక తప్పదు.

కామం, క్రోధం మొదలైనవాటికి లొంగిపోయిన వాడికి శాంతి వుండదు. పదవి వున్నప్పుడు, ధనము వున్న ప్పుడు, మాట చెల్లుతున్నప్పుడు కళ్ళు కనపడవు. చావుతో అన్నీ చల్లారిపోతాయి. కృష్ణా! అదిగో అదే జరిగింది కాల యవనుడికి. రేపు జరాసంధుడికీ అదే జరుగుతుంది. లోకంలో మంచీ, చెడ్డా రెండే మిగులుతాయి. నేను ఆ కాలం

మనిషిని. అప్పటికీ ఇప్పటికీ కాలం ఎంతో మారింది. అన్నీ కురచపడ్డాయి.

ఇక నేను తనువు చాలిస్తాను. కడపదినాలు బదరికాశ్రమంలో గడుపుతాను" అంటూ కృష్ణుడితో చెప్పి, కొండ గుహనించి బదరికాశ్రమం వెళ్ళిపోయాడు ముచికుందుడు. అక్కడ మునిలాగ కాలంగడిపి కాలంచేశాడు.

కృష్ణుడు తిరిగివచ్చి, పట్నం చుట్టివేసిన కాలయవనుడి సైన్యాలు కడముట్టించాడు. వారి ఆయుధాలూ, వాహనాలూ, సొమ్ములూ- అన్నీ ఉగ్రసేనుడికి సమర్పించాడు. యాదవుల ఆనందానికి అంతుపంతూ లేకండా పోయింది. ఇంటింటా కృష్ణుణ్ణే ఆరాధించారు.

ద్వారకా నగరం

"మధురమీద మాటిమాటికి దండయాత్రలు జరుగుతూనే వున్నాయి. జరాసంధుడు మళ్ళీ దండెత్తి రావచ్చు. ఇక్కడవుంటే దినదిన గండం తప్పదు. మనం దూరంగా పారిపోవాలి. పగవాడు తేరి చూడలేని పట్నం కట్టుకోవాలి." అంటూ ఆలోచించారు బలరామకృష్ణులు.

పడమట రైవతక పర్వతం దగ్గిర కుశస్థలి అని ఒక పట్టణముండేది. వెనక రాముడి కొడుకు కుశుడు కట్టిన పట్టణమది. ఎంతో అందమైన పట్టణం. అన్ని వసతులూ వున్నాయక్కడ. మధురనించి కుశస్థలం లేచిపోడానికి నిశ్చయించారు రామకృష్ణులు. మధుర సంపద జ్ఞాతులకి సమంగా పంచిపెట్టి, అందరినీ కొత్తచోటికి తర్లించారు.

కుశస్థలం మహాపట్నంగా తయారుచేయించాడు కృష్ణుడు. నలభైఎనిమిది చదరపుకోసుల పట్టణమది. పట్టణమంతా ఒక మహాదుర్గం. చుట్టూ సముద్రమే అగడ్త. పట్నానికి ఎనిమిదిమూలలు. పన్నెండుకోసుల రైవతపర్వతం పెట్టని కోట. ప్రతి నాలుగుకోసులకీ మూడేసి సేనాశిబిరాలు; నూరేసి ద్వారాలు. ప్రతిద్వారమూ దిట్టమైన దండుతో పగవాడు తేరి చూడడానికి వీలుండదు.

నగరం అపురూపంగా తయారయింది. రాజనగళ్ళూ, రాజవీధులూ, ఉపవనాలూ, మేడలూ, మిద్దెలూ, గుళ్ళూ, గోపురాలూ, కోనేళ్ళూ, నడబావులూ— ఒకటేమిటి, అన్నిటితోనూ అన్నివిధాలా నిండుగావుంది నగరం. నగరం నడుమ యాదవవీరుల రాజమందిరాలు కన్నుల పండువుగా తయారయాయి. ప్రతివీధి కూడలిదగ్గిరా అంగళ్ళు కట్టారు. నాలుగు వేపులా ద్వారాలు పెట్టారు. తోరణాలు కట్టారు. శిల్పులు తమ నేర్పరితనమంతా వినియోగించారు. పట్టణంచుట్టూ మేఘాలంత ఎత్తు గట్టి ప్రాకారం కట్టారు. ఆవుల సాలలూ, ఆయుధాల సాలలూ, ఏనుగుల సాలలూ, రథాల సాలలూ వేలువేలు తయారుచేశారు. పెద్దపెద్ద కోశాగారాలు తయారుచేశారు. రాజభవనమూ, బలరామకృష్ణుల భవనాలు చెప్పతరంకానంత గొప్పగా తయారయాయి. ఎటుచూసినా ద్వారాలే కనిపించాయి. అందుకని కుశస్థలం పేరుపోయి ద్వారక అనీ ద్వారవతి అనీ పేరు వచ్చింది.

కోటలో తగినచోట యాదవ ప్రముఖుల సభా

భవనం తయారయింది. ఎంతో అంత గొప్పగా వుందది. దాని పేరు సుధర్మ.

మధుర యాదవులందరినీ ద్వారకకి తర్లించుకు వచ్చాడు కృష్ణుడు. ఎవరికి తగిన భవనాలు వారికిచ్చాడు. నిత్యకల్యాణం పచ్చతోరణంగా కలకలలాడింది ద్వారకా నగరం.

ద్వారకకీ ఉగ్రసేనుడ్ని రాజుచేశాడు కృష్ణుడు. సాందీపుడ్ని పురోహితుడిగా నియమించాడు. అనాధృష్టుడ్ని సేనానాయకుడిగా చేశాడు. విక్రుడ్ని ప్రధానమంత్రిగా ఏర్పరిచాడు. సాత్యకిని వీరులమీద పెద్దగా పెట్టాడు. తనతో ఉద్ధవుడూ, కంకుడూ, విప్రుథుడూ, శ్వఫల్కుడూ, చిత్రకుడూ, గదుడూ, బలరాముడూ, సత్యకుడూ, ప్రుసుడూ రహస్యమంత్రులుగా ఏర్పడ్డారు.

అదంతా అయాక రైవతుడి కూతుర్ని రేవతిని పెళ్ళి చేసుకున్నాడు బలరాముడు.

రుక్మిణి పెళ్ళి

కొన్నాళ్ళయాక కూతురు రుక్మిణికి పెళ్ళి తలపెట్టాడు భీష్మకుడు. ఆమెని శిశుపాలుడికిచ్చి పెళ్ళి చెయ్యమన్నాడు జరాసంధుడు. శిశుపాలుడ్ని కన్నకొడుకులా చూసేవాడు జరాసంధుడు. అతడిని తన సేనాధిపతిగానూ చేసుకున్నాడు. అందుకని రుక్మిణిని అతడికి ఇమ్మన్నాడు. రుక్మికూడా అదే చెప్పాడు. పౌండ్రక వాసుదేవుడూ, జరాసంధుడి సామంతు లయిన అంగ, వంగ, కళింగదేశాలరాజులూ జరాసంధుడ్ని

సమర్థించారు. సరే, అన్నాడు భీష్మకుడు. రుక్మిణికి శిశుపాలుడితో పెళ్ళి నిశ్చయమయింది. రుక్మి, అతడి తమ్ములు రుక్మరథుడూ, రుక్మబాహుడూ, రుక్మకేతుడూ, రుక్మమాలీ పెళ్ళిపనులు చురుకుగా సాగిస్తూ వచ్చారు.

పెళ్ళి దగ్గిరపడుతూ వుంది. మరి మూడురోజులే వుంది. దిగులు పెట్టుకుంది రుక్మిణి. మనసార కృష్ణుణ్ణే మగడుగా వరించిందామె. అన్నదమ్ముడు రుక్మి అహంకారి. కృష్ణుడంటే కిట్టదతడికి. తండ్రి భీష్మకుడు కాదనుకుని కాదన లేడు. పైగా జరాసంధుడంటే జంకు. ఏందారి? ఆలోచించిం దామె. తనకి నమ్మకమైన ఒక బ్రాహ్మణ్ని ద్వారక పంపింది. తన అవస్థ విన్నవించమంది. "ఎలా అయినా వచ్చి తనను తీసుకువెళ్ళమంది. అలా కాకపోతే ప్రాణం వొదిలేస్తాను. పెళ్ళికి ముందు పూజకని బయటికి వస్తాను. అదిగో అప్పుడు నన్ను పట్టుకుపోవాలి. అంతవరకు సేనతో వచ్చి పొంచి వుండాలి. రాజుల ఆచారమే రాక్షస వివాహం" అంటూ కబురు పెట్టింది కృష్ణుడికి.

జేగీరావులా వెళ్ళాడు బ్రాహ్మడు. ద్వారకలో కృష్ణుణ్ణి కలుసుకున్నాడు. రహస్యంగా రుక్మిణి కబురందించాడు.

ఇదిగో ఇలాటి కబురుకోసమే ఎదురుచూస్తున్నాడు కృష్ణుడు. బ్రాహ్మణ్ణి అప్పుణ్ణి గౌరవించినట్టు గౌరవించాడు. వెంటనే దారుకుణ్ణి రథం సిద్ధం చేయమన్నాడు.

సుగ్రీవం, మేఘపుష్పం, శైబ్యం, వలాహకం అని

నాలుగు గుర్రాలూ పూసి రథం పట్టుకు వచ్చాడు సారథి దారుకుడు. రథమెక్కి, బ్రాహ్మణ్ణీ ఎక్కించుకున్నాడు కృష్ణుడు. గాలిని వెంట తరిమినట్టు కుండినవేపు పరిగెత్తింది రథం.

తమ్ముడు ఒక్కడే వెళ్ళాడు, ఎందుకైనా మంచిది అంటూ సైన్యాలతో వెనక వెళ్ళాడు బలరాముడు.

కుండిననగరం గుబగుబలాడిపోతూవుంది. శిశుపాలుడు పెళ్ళికి తరలి వచ్చాడు. జరాసంధుడూ, దంతవక్త్రుడూ, విదూరథుడూ, పౌండ్రకుడూ మొదలైన మగపెళ్ళివారితో విడుదులు కోలాహలంగా వున్నాయి. వారి సేనల గందిక చెప్పనే అక్కరలేదు.

"పెళ్ళి సమయం దగ్గిరపడుతూవుంది. రుక్మిణి ప్రాణాలు ప్రాణాల్లో లేవు. ద్వారకనించి కబురు లేదు. వెళ్ళిన బ్రాహ్మడు ఏమయ్యాడో?!

ఇదే చింతతో కూచుందామె. ఇంక దేనిమీదా లేదామెకి.

ఇంతలో బ్రాహ్మడు వచ్చాడు 'శుభ కబురు' సూచించి వెళ్ళాడు. కలివిడితో కలకల్లాడింది పెళ్ళి కూతురు-రుక్మిణి.

కృష్ణుడిరాక ముందే తెలుసుకున్నాడు దమఘోషుడు. కృష్ణుడి మేనత్త సాత్వతి మగడు. ఈ చుట్టరికంవల్లే ఈ పెళ్ళికి వచ్చాడనుకుని ఎదురు వెళ్ళి కృష్ణుణ్ణి తన విడిదికి తీసుకువచ్చాడు.

రివాజు ప్రకారం పెళ్ళికి ముందు గౌరీపూజకని కోటలోంచి గుడికి వచ్చింది రుక్మిణి. పెళ్ళికూతురు ముస్తాబుతో మురిసిపోతూ వుందామె. శిశుపాలుడిదే అదృష్టం అన్నారు చూసిన రాజకుమార్లు. "కృష్ణుడయితే ఈడూ జోడూ సరిపోయేది" అనుకున్నారు అమ్మలక్కలు.

మంగళవాద్యాలు మోగుతున్నాయి. పెళ్ళినడకలు నడుస్తూవుంది రుక్మిణి. పునిస్త్రీలూ, పేరంటాళ్ళూ వెంట నడుస్తున్నారు. ఆయుధాలు పట్టుకుని ఎంతోమంది సైనికులు చుట్టూ కాపలాకాస్తూ వచ్చారు.

గుడిలో పూజ పూర్తయింది. తిరిగి వస్తూ వుంది రుక్మిణి. పద్మపత్రాల్లా సుకుమారమైనవి ఆమె పాదాలు-ముందుకి పడటంలేదు. నడవలేక నడవలేక నడుస్తూవుందామె. కడకంటి చూపులు చూస్తూవుంది. బెదురు బెదురుగా వుంది.

ఇంతలో ఎక్కణ్ణుంచి వచ్చాడో కృష్ణుడు. డేగలా వాలాడు. రుక్మిణిని పొదివిపట్టుకున్నాడు. అమాంతంగా రథంమీదికి ఎత్తుకుపోయాడు. పగ్గాలు సడిలించాడు దారుకుడు. గాలిలా ఎగిరిపోయింది రథం. అంతా చిటికెలో జరిగిపోయింది.

"ఏమయింది ? - ఏమయింది ?"

"అనుకున్నంతా అయింది !"

"రుక్మిణిని కృష్ణుడెత్తుకుపోయాడు !"

కుండినవగరం కుతకుతలాడిపోయింది. జరాసంధుడూ మొదలైన రాజులు నేలతన్ని చిందులు తొక్కారు. కవ

చాలు తొడిగీ, ఆయుధాలు పట్టుకుని, రథాలెక్కి రాణువతో కృష్ణుడి వెంటపడ్డారు. పొలికేకలు వేశారు. బాణాలు రువ్వారు. ధనుస్సులు మోగించారు.

జాలిగా కృష్ణుణ్ణి చూసింది రుక్మిణి.

"భయంలేదు. చూస్తూవుండు."

ఇంతలో బలరాముడి యాదవసేన కవిసింది. రెండు సముద్రాలు గుద్దుకున్నట్టయింది. బలరాముడూ, సాత్యకీ, అక్రూరుడూ, గదుడూ, కృతవర్మా, విపృథుడూ, చక్రదేవుడూ, సుదేవుడూ, సారణుడూ, విదూరథుడూ మొదలైన యాదవ వీరులు జరాసంధుడూ మొదలైన వారిని అడుగు ముందుకి వెయ్యనీయకండా అడ్డుకున్నారు. దారుణమైన యుద్ధం జరిగిపోయింది.

జరాసంధుడూ సాత్యకీ, దంతవక్త్రుడూ అక్రూరుడూ, శిశుపాలుడూ విపృథుడూ, శిశుపాలుడి తమ్ముడు బలీ చక్రదేవుడూ, పౌండ్రక వాసుదేవుడూ కృతవర్మా దారుణంగా ద్వంద్వ యుద్ధం చేశారు.

బలరాముడు పెద్ద మాను పెరికి మగధసేన పడమోదాడు. కళింగ, కారూష, అంగ, వంగ యోధుల్ని హతమార్చాడు.

శవాలతో నెత్తురు వరదలు కట్టింది. తన్నుకు చస్తున్న గుర్రాలతోనూ, పడి మూలుగుతున్న ఏనుగులతోనూ, గుండ పిండయిన రథాలతోనూ, తలకాయలెగిరిపోయిన మొండాలతోనూ, ఏడుపు మొర్రలతోనూ పరమ భీభ

త్సంగా తయారయింది రణరంగం. అంత యుద్ధంలోనూ యాదవులదే పైచేయి అయింది.

రుక్మిణి అన్న రుక్మి గొప్పవీరుడు, ఆత్మాభిమాని. ప్రపంచంలోని మూడు గొప్ప ధనుస్సులలో అతడి దొకటి. అందుకని అతడి అహంకారానికి అంతులేదు. తన చెల్లెల్ని కృష్ణుడు ఎత్తుకుపోడం - అందునా పెళ్ళికి సిద్ధంచేసిన పిల్లని! ఓర్చుకోలేకపోయాడతడు.

"కృష్ణుణ్ణి చంపేస్తాను. రుక్మిణిని తెస్తాను. శిశుపాలుడికి పెళ్ళి చేస్తాను. కృష్ణుణ్ణి చంపందే కుండిన తిరిగిరాను" అంటూ శపథంచేసి, రథమెక్కి బయలుదేరాడతడు.

సరాసరి కృష్ణుడిమీదికే వెళ్ళాడు రుక్మి. తన విల్లు 'విజయం' మోగించాడు. శార్ఙ్గం సారించాడు కృష్ణుడు.

విజయం, శార్ఙ్గం, గాండీవం — ఈ ధనుస్సులు మూడూ మూడే లోకంలో. అయితే రుక్మికంటే మేటి విలుకాడు కృష్ణుడు. రుక్మి వేసిన బాణాలన్నీ తుక్కు తుక్కు చేసేశాడతడు. పదే పదే వింటినారి తెగేశాడు. పరిఘా, పట్టిసం, తోమరం, శూలం, శక్తీ, కత్తి—రకరకాల ఆయుధాలు ప్రయోగించాడు రుక్మి. అన్నీ గుండపిండి చేసేశాడు కృష్ణుడు. ఆ వూపుని అతడి గుర్రాలూ కూలగొట్టాడు. సారథిని నరికేశాడు. దొరికిపోయాడు రుక్మి. నరికేయాలని కత్తి ఎత్తాడు కృష్ణుడు. చప్పున అడ్డుపడింది రుక్మిణి. బతికిపోయాడు రుక్మి.

కానైతే అతడ్ని పెడరెక్కలు విరిచి కట్టేశాడు

కృష్ణుడు. అంతతో వూరుకోలేదు. "అయ్యో బావగారూ!" అంటూ అతడి తల పెళ్ళికి క్షౌరం చేసినట్లు కత్తిరించేశాడు. మీసం, గడ్డం సగం సగం కోసి విడిచిపెట్టాడు.

చావుతప్పి కన్ను లొట్టపోయినట్టయింది రుక్మికి. మొహమెత్తలేకపోయాడు.

రుక్మి వెంటవచ్చిన దక్షిణాది రాజుల్ని, అంశుమంతుడూ, వేణుదారుడూ, శ్రుతపర్వుడూ, క్రథుడూ, కైశికుడూ మొదలైనవారిని ఓడించాడు. వారి రాణువని హతమార్చాడు.

అలా గెలుపు సాధించి రుక్మిణితో ద్వారక వచ్చేశాడు కృష్ణుడు. గెలుపుకేకలతో ఇన్నూ మన్నూ ఒక్కటి చేస్తూ వెంటవచ్చింది యాదవసేన. ద్వారకానగరం ఉల్లాసంతో ఉప్పొంగిపోయింది.

అలా రుక్మిణిని ఎత్తుకువచ్చి రాక్షస వివాహం చేసుకున్నాడు కృష్ణుడు.

రాక్షస వివాహం రాజులలో ఆనవాయితీగా వుండేది. పరాక్రమమే దానికి కన్యాశుల్కం.

ద్వారకలో ఎంతో గొప్పగా జరిగింది రుక్మిణిపెళ్ళి.

జాంబవతి

యాదవ ప్రముఖులలో సత్రాజిత్తు ఒకడు. సూర్యుడ్ని పూజించి ఒక మణి సంపాదించాడతడు. ఎంతో కాంతివంతమయిన మణి అది. దానిపేరు శ్యమంతకం. అది వున్నచోట

దొంగల భయముండదు. పాముల భయముండదు. రోజుకి వందాలర్నై తులాల బంగారం ఇస్తుందది. అయితే నియమం లేనివారు దాన్ని ధరిస్తే ప్రాణహాని కలిగిస్తుంది.

సత్రాజిత్తు నియమవంతుడు. అందుకని అతడి ఇంట అది అన్ని సంపదలూ కల్పిస్తూవుండేది.

మణిసంగతి విని, సత్రాజిత్తుని పిలిపించాడు కృష్ణుడు. మణి ఉగ్రసేనుడికి ఇమ్మన్నాడు. ఇవ్వనని వెళ్ళిపోయాడు సత్రాజిత్తు. 'పోనీ' అని వూరుకున్నాడు కృష్ణుడు.

కొన్నాళ్ళయ్యాక, సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనజిత్తు శ్యమంతకమణి మెళ్ళో వేసుకుని అడివికి వేటకి వెళ్ళాడు. సత్రాజిత్తులాగ నియమవంతుడు కాడతడు. అందుకని అడివిలో ఆపద వచ్చిందతడికి. ఓ సింహం అతడ్ని చంపేసింది.

ఆ అడివిలోనే ఓ కొండగుహలో రుక్షులరాజు జాంబవంతుడున్నాడు. అతడు వచ్చి సింహాన్ని చంపేసి మణి పట్టుకుపోయాడు.

ఎప్పటికీ ప్రసేనజిత్తు అడివినించి తిరిగి రాకపోవడంతో సందేహించాడు సత్రాజిత్తు. "మణికోసం తమ్ముడ్ని అడివిలో కృష్ణుడే చంపేశాడు" అంటూ నిందవేశాడు.

నింద చావుకంటే ఘోరమైంది. సహించలేకపోయాడు కృష్ణుడు. కొంతమందిని వెంట వేసుకుని, ప్రసేనజిత్తుని వెదుకుతూ అడివిలోకి వెళ్ళాడు. ప్రసేనజిత్తు శవం చూశాడు. మణి అతడి దగ్గరలేదు. కొంతమేరలో సింహం చచ్చిపడుంది. దాని దగ్గరా మణి లేదు. ఏమయింది?

జాంబవంతుడి అడుగులు అవుపించాయి. అడుగులు పట్టి గుహదాకా వెళ్ళాడు కృష్ణుడు.

వెంటవచ్చిన వాళ్ళని బయటే వుండండని తాను ఒక్కడే గుహలోకి వెళ్ళాడు. లోపల పెద్ద భవనం. ఓ కుర్రాడు మణితో ఆడుకుంటున్నాడు. జాంబవంతుడి కొడుకతడు. దగ్గిర కూచుని దాది ఆడిస్తూ వుంది. కొత్తమనిషిని చూసి, కేకలు వేసింది.

లోపలినుంచి దూసుకువచ్చాడు జాంబవంతుడు. కృష్ణుడిమీాద కలబడ్డాడు. సిద్ధంగానే వున్నాడు దానికి కృష్ణుడు.

ఇద్దరికీ పోట్లాట మొదలయింది. కనీ వినీ ఎరగని పోట్లాట అది. ఒకరోజూ రెండురోజులూ కాదు. ఒకరాత్రీ రెండురాత్రులూ కాదు. పద్ధెనిమిది రేయింబగళ్ళు జరిగింది.

గుహ మొగని కనిపెట్టుకు కూచున్న యాదవులు పన్నెండు దినాలవరకూ చూసిచూసి ద్వారక వెళ్ళిపోయారు. కృష్ణుడు చచ్చిపోయాడే అనుకున్నారు. ద్వారకానగరం దుఃఖంలో మునిగిపోయింది. దేవకీ వసుదేవులూ, రుక్మిణీ, ఉగ్రసేనుడూ మొదలైనవారు కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చారు. యాదవకులంలో అంతా చీకటే చీకటి అల్లుకుంది.

గుహలో పద్ధెనిమిది రోజులయేసరికి అలిసిపోయాడు జాంబవంతుడు. వీగిపోయాడు, చేతులు జోడించాడు.

"మాామ్మూలు మనిషివి కావు నువ్వు. నా తప్పు మన్నించు" అంటూ వేడుకున్నాడు.

జాంబవంతుడికి ఒక కూతురుంది. ఆమె పేరు జాంబవతి. చక్కని చుక్క. మంచి వయసులోవుంది. ఆమెని కృష్ణుడికి భార్యగా కానుక పెట్టాడు జాంబవంతుడు.

జాంబవతితో పాటు శ్యమంతకమణీ తీసుకుని ద్వారక వచ్చేశాడు కృష్ణుడు. చీకటి తరవాత పొద్దుపొడిచి నట్టయింది ద్వారకలో.

సుధర్మ సభలో యాదవుల సమావేశం జరిగింది. ఉగ్రసేనుడు కొలువులో కూచున్నాడు. కృష్ణుడు సత్రాజిత్తుని పిలిపించాడు. జరిగిన నిజం వినిపించాడు. సత్రాజిత్తు మణి సత్రాజిత్తుకిచ్చేశాడు. అలా తనమీద పడిన నీలాపనింద తాను తీర్చుకున్నాడు.

సత్యభామ

సత్రాజిత్తుకి కొడుకుల్లేరు. సత్యభామ అని ఒక కూతురుమాత్ర ముండేది. ఆమె అందానికి ఆమే సాటి. అందుకని ఎంతోమంది ఆమెని పెళ్ళిచేసుకోవాలని ఉవ్విళ్ళూరుతూ వుండేవారు. శతధన్వుడూ, కృతవర్మా వంటివారు ఆమెని మాకిమ్మంటే అలాగే అంటూ వచ్చాడు. కాని ఎవరికీ మాట ఇవ్వలేదు.

శ్యమంతకమణి కోసం కృష్ణుడిమీద వూరికే నిందవేసినందుకు ఎంతో కించపడ్డాడతడు. అంత శ్రమపడి అది తనకు తెచ్చినందుకు అతడి మనస్సు కృతజ్ఞతతో నిండి సత్య

భామని కృష్ణుడికిచ్చి, తన తప్పు సవరించుకోవాలనుకున్నాడతడు.

అలాగే సత్యభామని కృష్ణుడికిచ్చి పెళ్ళిచేశాడు. కూతురితోపాటు శ్యమంతకంకూడా కృష్ణుడికిచ్చేశాడు. కాని శ్యమంతకం పుచ్చుకోలేదు కృష్ణుడు, సత్రాజిత్తుకే తిరిగి ఇచ్చేశాడు.

ఇంతలో తమ మేనత్త కుంతీ, ఆమె కుమారుల్నూ వారణావతం లక్క-ఇంట్లో కాలిపోయారని విన్నారు రామకృష్ణులు. బంధువుల్ని పలకరించటం కోసం హస్తినాపురం వెళ్ళారు.

సత్యభామని తమకివ్వలేదని రుసరుసలాడుతూ వుండేవారు కృతవర్మా మొదలైనవారు. రామకృష్ణులు లేని సమయం చూసి అక్రూరుడూ, కృతవర్మా శతధన్వుడిని రెచ్చగొట్టారు. సత్రాజిత్తుని చంపేసి శ్యమంతకం చపాయించమన్నారు.

చక్కని సలహా అన్నాడు శతధన్వుడు. నిద్రపోతున్న సత్రాజిత్తుని నరికేసి, శ్యమంతకం ఎత్తుకుపోయాడు.

గోలుగోలుమంది సత్యభామ. తండ్రిచావుకి తానే కారణమని మరింత కుంగిపోయింది. వెంటనే రథం పూయించింది. ద్వారక పరుగెత్తింది. కృష్ణుడితో చెప్పి వలవలా ఏడ్చింది.

సత్యభామని వెంటపెట్టుకుని, బలరాముడితో కలిసి

హుటాహుటిని ద్వారకకి వచ్చాడు కృష్ణుడు. శతధన్వుడి మీదికి దండెత్తాడు.

కృతవర్మని శరణువేడాడు శతధన్వుడు.

కృష్ణుడితో విరోధం నా వల్ల కాదన్నాడు కృతవర్మ. చావు తప్పదనుకున్నాడు. అక్రూరుడి దగ్గిరికి వెళ్ళాడు. శ్యమంతకం అతడి దగ్గిర దాచిపెట్టాడు. ఒక్కడూ గుర్రమెక్కి ఊరినించి పారిపోయాడు.

దినానికి నాలుగువందల కోసులు పరిగెత్తే గుర్రమది. శతధన్వుడు పారిపోతున్నాడనగానే రథమెక్కి వెంటబడ్డారు రామకృష్ణులు.

రథం చూసి మరింత వడిచేశాడు శతధన్వుడు. వెళ్ళి వెళ్ళి మిధిల సమీపంలో పడిపోయింది గుర్రం. దాన్ని వొదిలేసి, పరుగు తీశాడు శతధన్వుడు. రథం నడవలేని ఇరుకుదారి పట్టాడు.

బలరాముడ్ని రథంమీద వుంచి శతధన్వుడ్ని తరుముకు వెళ్ళాడు కృష్ణుడు. కొంతదూరం వెళ్ళి సుదర్శన చక్రం విసిరాడు. శతధన్వుడి తల తెగి కిందపడింది.

దగ్గిరికి వెళ్ళాడు కృష్ణుడు. శ్యమంతకమణి కోసం వెదికాడు. శతధన్వుడి దగ్గిర శ్యమంతకం కనపడలేదు.

రథం దగ్గిరికి తిరిగి వచ్చేశాడు కృష్ణుడు.

"చచ్చాడు శతధన్వుడు."

"పీడా వొదిలింది. శ్యమంతకం తెచ్చావా ?"

"లేదు. వాడి దగ్గిర కనబడలేదు."

"అదేమిటి ?"

కృష్ణుడి మాట నమ్మలేదు బలరాముడు. తనను మభ్యపెట్టి మణి దాచేశాడనుకున్నాడు. మోసం చేశాడని నొచ్చుకున్నాడు. దాంతో కృష్ణుడితో కలిసి ద్వారకరావడానికి మనస్కరించలేదతడికి.

"సరే, నువ్వు ద్వారక వెళ్ళు. నేను మిధిలరాజుని చూసివస్తాను. నా స్నేహితుడతడు. ఎలాగూ దగ్గిరికి వచ్చాను మరి." అంటూ మిధిల వెళ్ళాడు బలరాముడు.

స్నేహితుణ్ణి చూసి సంతోషించాడు మిధిలరాజు. రాజమర్యాదలతో సత్కరించాడు. కృష్ణుడు తనదగ్గిర అబద్ధం చెప్పాడన్న అలకతో కొన్నాళ్ళదాకా మిధిలలో వుండిపోయాడు బలరాముడు.

గదాయుద్ధంలో బలరాముడంతవాడు మరొకడు లేడు. అతడు మిధిలలో వున్నప్పుడు, హస్తినకుంచి వచ్చి దుర్యోధనుడు అతణ్ణి ఆశ్రయించి గదాయుద్ధం నేర్చుకున్నాడు. కనకనే దుర్యోధనుడంటే అభిమానంగా వుండేది బలరాముడికి. తన చెల్లెలు సుభద్రని దుర్యోధనుడికే ఇవ్వాలనుకున్నాడు. భారతయుద్ధంలో భీముడు అతడి తొడలు విరగొట్టినప్పుడు నొచ్చుకున్నాడు.

తండ్రిని చంపిన వాడి చావు వింది సత్యభామ. కాని శ్యమంతకం ఏమయింది?

'అవును, శ్యమంతకమణి ఏమయింది?' విచారించాడు

కృష్ణుడు, 'ఎందరి చావుకో కారణమయింది. అన్నయ్య అను మానించాడు. ఏమయిందో, ఎక్కడుందో?'

సత్రాజిత్తు చావుకీ, శతధన్వుడి సాహసానికీ తామే కారకులమని తెలిస్తే, మణి మనదగ్గిర బయలుపడితే ప్రాణాలు దక్కవు అని భయపడ్డారు అక్రూరుడూ, కృతవర్మకూడా. దాంతో చెప్పాచెయ్యకండా ద్వారకనించి వెళ్ళిపోయారు.

అప్పుడే కరువుకాటకాలు కనబడ్డాయి ద్వారకలో. అక్రూరుడు ద్వారకనించి వెళ్ళిపోడమే కరువుకి కారణమను కున్నారు ప్రజలు. కృష్ణుడి దగ్గిరికి వెళ్ళి మొరపెట్టారు.

"నీ చల్లని చూపువల్ల ఏ బాధా ఎరగం మేము. కాలం కలిసిరాక కరువు కనపడిందిప్పుడు. మాకు తెలుసు, అక్రూరుడుంటే అయేది కాదిది. అతడున్నచోట అదునుకి వానలు పడతాయి. పాడీపంటా లోపముండదు. కరువు కాట కాలుండవు. ఈ ప్రభావం ఇతడి తండ్రి శ్వఫల్కుడినించీ వుంది.

ఇలాగే కాశీలో వెనక కరువుపట్టింది. కాశీ రాజు శ్వఫల్కుణ్ణి తీసుకువెళ్ళాడు. తన కుమార్తెని గాందినిని అతడికి పెళ్ళిచేశాడు. కాశీలో కరువుపోయింది. అంచేత అక్రూరుడు ఎక్కడున్నదీ వెదికించు. ద్వారక పిలిపించు." అన్నారు.

కరువుకి కారణం ఏదైనా, ప్రజలమాట మన్నించాడు కృష్ణుడు. అక్రూరుడి వునికి తెలుసుకున్నాడు. అతణ్ణి ద్వారక పిలిపించాడు. గౌరవంగా ఆదరించాడు. పినతండ్రికి చేయ దగిన మర్యాదలన్నీ చేశాడు.

"అక్రూరా! నాకు తెలుసు, నీ దగ్గిరే వుంది శ్యమంతక మణి. అది నాకు అక్కర లేదు. నియమం కలవాడివి నువ్వు. నీ దగ్గిరే వుండనీ. కాని ఈ మణివల్ల రెండుమార్లు నిందల పాలయ్యాన్నేను. అన్నయ్యలాంటివాడు అనుమానించాడు; అలిగాడు. అంచేత మనవాళ్ళందరికీ మణి చూపించు. నిజం తేల్చి నా నింద పోగొట్టు. నీ మీద ఏమాత్రం కోపం లేదు" అన్నాడు.

"నన్ను మన్నించు" అంటూ అందరిముందూ తీసి మణి చూపించాడు అక్రూరుడు.

తమ్ముణ్ణి అనుమానించినందుకు ఎంతో నొచ్చుకున్నాడు బలరాముడు. 'నిజం నిలకడమీద తేలింది' అనుకున్నారు యాదవులు.

కాళింది

పాండవులు లక్కఇంట కాలిపోలేదు. తల్లితోకూడా తప్పించుకున్నారు. బ్రాహ్మల వేషంలో కొన్నాళ్ళు ఏకచక్రపురంలో గడిపారు. పాంచాలరాజు ద్రుపదుడు తన కూతురు కృష్ణకి—అదే ద్రౌపదికి స్వయంవరం చాటించాడని విని అక్కడికి వెళ్ళారు. ఆ స్వయంవరం చూడడానికి ద్వారకనించి బలరామకృష్ణులూ వెళ్ళారు. మారువేషాలతో వున్న పాండవుల్ని కనిపెట్టేశాడు కృష్ణుడు. ఫలానా ఫలానా అని బలరాముడికి పోల్చి చూపాడు. తరవాత, పాండవులు బసచేసిన కుమ్మరి కొండకి వెళ్ళి పలకరించి వచ్చారు బలరామకృష్ణులు.

పాండవులు అయిదుగురూ ద్రౌపదిని పెళ్ళి చేసుకుని, ఇంద్రప్రస్థంలో రాజ్యం చేస్తున్నప్పుడు కృష్ణుడు వచ్చి కొన్నాళ్ళు వాళ్ళతో గడిపాడు. అర్జునుడూ, తానూ ఒకటే ప్రాణంలా వుంటూ వచ్చారు. ద్రౌపదిని సొంత తోడబుట్టువులా చూసుకున్నాడు. కృష్ణుడు ఎంతంటే అంత ధర్మరాజుకి. భీముడూ, నకుల సహదేవులూ అతణ్ణి గురువులా భావించేవారు. మేనత్త కుంతిని ఎంతగానో మన్నించేవాడు కృష్ణుడు. ఆమె కష్టాలు విని వోదార్చేవాడు.

ఒకనాడు యమున ఒడ్డు అడివికి వేటకి వెళ్ళాడు అర్జునుడు. అతడితో కృష్ణుడు వెళ్లాడు. వేట అయ్యాక, యమునలో నీళ్ళుతాగి ఓ దగ్గిర కూచున్నారు. అనుకోకండా అక్కడికో అమ్మాయి వచ్చింది. అందమంతా ఆమెలోనే వున్నట్టుంది.

ఎవరీమె అన్నట్టు అర్జునుడ్ని చూశాడు కృష్ణుడు. ఆమెనే అడిగాడు అర్జునుడు.

"సూర్యుడు మా తండ్రి. కాళింది అంటారు నన్ను."

"అడివిలో ఏం పని?"

"తపస్సు."

"ఎందుకని?"

"కృష్ణుడ్ని భర్తగా పొందాలని."

"ఈయనే కృష్ణుడు."

సిగ్గుతో తల వొంచుకుంది కాళింది. ఆమెని రథం మీద ఇంద్రప్రస్థం తీసుకు వచ్చేశారు కృష్ణార్జునులు.

ద్వారక తిరిగి వచ్చాక కాళిందిని పెళ్ళి చేసుకున్నాడు. అయితే రావడానికి ముందు ఖాండవవనం కాల్చినప్పుడు అర్జునుడికి అండగా నిలిచాడు. మంటల్లోంచి బయటపడిన మయుడికి ధర్మరాజుకోసం మంచి సభ నిర్మించమని నియోగించాడు.

ఇంద్రప్రస్థంలో పాండవులు ద్రౌపది విషయంలో ఒక నియమం చేసుకున్నారు. ఆమె ఒక్కొక్కరిదగ్గిరా ఒక్కొక్క ఏడాది వుండాలి. ఒకరితో రహస్యంగా వున్నప్పుడు ఇంకొకరు వెళ్ళకూడదు. అలా వెళితే పన్నెండేళ్ళు తీర్థయాత్ర చేయాలి. అయితే ధర్మరాజుతో ద్రౌపది వున్నప్పుడు తప్పనిసరిగా వెళ్ళవలిసివచ్చింది అర్జునుడు. నియమం ప్రకారము తీర్థయాత్ర చేశాడతడు. చివర సన్యాసి వేషంలో ద్వారక వెళ్ళాడు. తెలిసే అతడ్ని అంతఃపురంలోకి తీసుకువెళ్ళి, చెల్లెలు సుభద్రని అతడి పరిచర్యకు నియోగించాడు కృష్ణుడు.

మేనత్త కొడుకుని అర్జునుడ్ని పెళ్ళాడాలని కలలు కంటూ వుండేది సుభద్ర. అర్జునుడికీ ఆమెమీదే వుండేది. అది బాగా తెలుసు కృష్ణుడికి. అందుకని అర్జునుడు సుభద్రని ఎత్తుకుపోయి పెళ్ళి చేసుకుందికి అన్ని అవకాశాలూ కల్పించాడతడు.

సుభద్రని ఎత్తుకుపోయాడు అర్జునుడు. బలరాముడు మండిపడ్డాడు. అడ్డుకుని సర్ది చెప్పాడు కృష్ణుడు. అలా కృష్ణార్జునుల చుట్టరికం మరింత బలపడింది.

మిత్రవింద

కృష్ణుడి మరో మేనత్త రాజాదేవి. అవంతి రాజుని పెళ్ళాడిందామె. విందుడూ, అనువిందుడూ అని ఇద్దరు కొడుకులూ, మిత్రవింద అని కూతురూ వుండేవారామెకు. మిత్రవింద చక్కదనాల చుక్క. కృష్ణుడ్నే పెళ్ళాడాలని ఉవ్విళ్ళూరుతూ వుండేదామె. కాని విందానువిందులు దుర్యోధనుడి పక్షం వాళ్ళు. భారతయుద్ధంలో కౌరవులవేపే పోరాడారు.

స్వయంవరంలో రాజులందరూ చూస్తూవుండగా మిత్రవిందని ఎగరేసుకుపోయాడు కృష్ణుడు. ద్వారకకి తీసుకు వచ్చి పెళ్ళి చేసుకున్నాడు గొప్పగా.

నాగ్నజిత్తి

అయోధ్యరాజు నగ్నజిత్తు. అతడి కూతురు నాగ్నజిత్తి, అందానికి పెట్టింది పేరు. ఎంతోమంది రాజులు ఆమె కోసం వచ్చారు. అయితే నగ్నజిత్తు ఒక వింత షరతు పెట్టాడు. తన దగ్గిర ఏడు కోడెదూడ లుండేవి. ఎంపిక చేసిన మంచి జాతి దూడలవి. అసాధ్యమైనవి. ఎంతటి వాడికీ లొంగేవికావు. "అదిగో ఆ ఏడు గిత్తల్నీ ఎవరు అదుపులో పెడితే వారికి మా అమ్మాయినిచ్చి పెళ్ళి చేస్తాను." అని చాటించాడు.

"ఇంతేనా ? ఇదెంతలో మాట!" అంటూ దేశ దేశాల రాజులు అయోధ్య దిగబడ్డారు. అయితే ఆబోతు

ల్లాగా బుసకొట్టాయి గిత్తలు. దగ్గరికైనా చేరనివ్వలేదు రాజుల్ని. అవి బుసకొట్టి తోకలెత్తేసరికి తోకలు ముడిచే వారు రాజులు. నవ్వుకునేది నాగ్నజిత్తి. 'అందరూ వస్తున్నారు కృష్ణుడు వస్తే బాగుండేది.' అనుకునేది.

అనుకున్నట్టు ఓనాడు రానే వచ్చాడు కృష్ణుడు. కృష్ణుడు కోడెదూడలు ఏడింటినీ ఇట్టేలొంగదీశాడు. అతడేం చెపితే అది చేశాయవి.

కన్యనిచ్చి గొప్పగా పెళ్ళిచేశాడు అయోధ్యరాజు నగ్నజిత్తు విలువైన అరణమిచ్చి కూతుర్ని సాగనంపాడు. తక్కిన రాజుల కళ్లు కుట్టాయి. దారికాచి దాడిచేశారు.

అయితే అవాళ అర్జునుడూ వున్నాడు, కృష్ణుడి వెంట. రాజులందరినీ తరిమికొట్టాడు. కొత్త పెళ్ళికూతురితో ద్వారక చేరాడు కృష్ణుడు.

భద్ర

కృష్ణుడి మరో మేనత్త శ్రుతకీర్తి కూతురు భద్ర. తండ్రి కేకయ దేశం రాజు ధృతకేతుడు.

మేనత్త కూతురు కనక భద్రనీ పెళ్ళాడాలనుకున్నాడు కృష్ణుడు. పైగా ఆమెకూడా కృష్ణుడ్నే వలచింది. మేనరికం పెళ్ళే జరిగింది. గొప్పగా జరిగింది. భద్రకి రోహిణి అని మరో పేరుండేది.

లక్షణ

మద్రరాజ్యం రాజు బృహత్సేనుడు. ఇతడి కూతురు లక్షణ. అందానికి పేరు మోసిందామె.

బృహత్సేనుడు చిత్రమైన మత్స్యయంత్రం పెట్టి తానిచ్చిన విల్లు ఎక్కుపెట్టి, యంత్రంలో చేపని కొట్టినవారికి లక్షణనిచ్చి పెళ్ళి చేస్తానని, స్వయంవరం చాటించాడు. దేశదేశాల రాజులు వచ్చారు. చేపని కొట్టలేకపోయారు. ధనుస్సె ఎత్తలేకపోయారు కొందరు పేరుపడ్డ విలుకాళ్ళందరూ తల వొంచుకు వెళ్ళిపోయారు.

చివరికి కృష్ణుడు వెళ్ళాడు. అవలీలగా విల్లు తీశాడు. అల్లెతాడు ఎక్కుపెట్టాడు. అవుపడీ అవపడనట్టున్న చేప నీడ నీళ్ళలో చూశాడు. చేపని పడగొట్టాడు. లక్షణని పెళ్ళి చేసుకుని ద్వారక వచ్చేశాడు.

ప్రద్యుమ్నుడు

పెళ్ళయిన కొన్నాళ్ళకి మన్మధుడిలాంటి కొడుకుని కంది రుక్మిణి. అతడి పేరు ప్రద్యుమ్నుడు.

శంబరుడని ఒక రాక్షసరాజు వుండేవాడు. రుక్మిణి కొడుకు తనను చంపుతాడని విని, పురిటి గదిలోంచే బిడ్డని ఎత్తుకుపోయి, సముద్రంలో పడేశాడు. సముద్రంలో పెద్ద చేప పిల్లడ్ని మింగేసింది. మింగీ మింగడంతోనే ఒక జాలారి వలలో చిక్కుకుందది. దాన్ని పట్టుకెళ్ళి శంబరుడికిచ్చి ఇనాం పుచ్చుకున్నాడు జాలారి.

శంబరుడి కోటలో ఎన్నాళ్ళయో ఒక వంటలక్క వుండేది. ఆమెపేరు మాయావతి. ఎప్పుడూ వయసులోనే వుండేదామె. నిజంగా రతీదేవిలా వుండేది. చేపని కోసిం దామె. పిల్లడ్ని చూసి మురిసిపోయింది. పెంచి పెద్దచేసింది.

అతడికి నూనూగు మీసాల వయసు వచ్చేసరికి, తన వలపు వొలకపోసింది.

అంతవరకు ఆమెని అమ్మగానే చూస్తున్నాడు ప్రద్యు మ్నుడు. "ఇదేమిటి ?" అని తిరగబడ్డాడు.

పెద్దకథ చెప్పింది మాయావతి :

"నువ్వు నా కొడుకువి కావు. మీ అమ్మ రుక్మిణి. అయ్య కృష్ణుడు. మీ వూరు ద్వారక. పురిటి గదినించి నిన్ను ఎత్తుకువచ్చాడు శంబరుడు. సముద్రంలో పారేశాడు.

పెద్దచేప నిన్ను మింగేసింది. జాలారి శంబరుడి కిచ్చాడు. నేను కోసితీశాను; పెంచాను. ఇది ఎవరికీ తెలీదు. అంతా నాకు తెలుసు. నేను మామ్మూలు మనిషిని కాను. రతిని. నువ్వు వెనకజన్మలో మన్మథుడివి. నీ కోసమే ఇన్నాళ్ళూ కనిపెట్టుకున్నాను.

శంబరుడ్ని చంపు. మీ అమ్మ నీ కోసం ఏడుస్తూనే వుంది. శంబరుడ్ని చంపి ద్వారక పోదాం."

మాయావతిని నమ్మాడు ప్రద్యుమ్నుడు. శంబరుడి మీద తిరగబడ్డాడు. అతడి కుమాళ్ళని చిత్రసేనుడూ, కృత సేనుడూ, సేనస్కంధుడూ, అతిసేనుడూ, నికలుడూ, శాన్తాన్తకరుడూ మొదలైన వారిని హతవార్చాడు. అలా

అతడి వందమంది కొడుకుల్నీ వూడ్చేశాడు. అతడి మంత్రుల్నీ చంపేశాడు. చతురంగ సైన్యాలూ చంపేశాడు.

తుదకి శంబరుడే వచ్చి పడ్డాడు. బలమైన బాణాలతో ప్రద్యుమ్నుడ్ని ముంచెత్తాడు. బ్రహ్మాండమైన బలశాలి ప్రద్యుమ్నుడు. శంబరుడి బాణాలన్నీ ఎగరగొట్టేశాడు. ఒక్కడే లెక్కలేనంతమందిలా పోరాడాడు. తుదకి వైష్ణవాస్త్రంతో శంబరుడ్ని చంపేశాడు ప్రద్యుమ్నుడు.

రతీ ప్రద్యుమ్నులు ద్వారకి వచ్చారు. అచ్చంగా మూడు పోలికలూ కృష్ణుడిలాగే వున్నాడు ప్రద్యుమ్నుడు. తమ కళ్ళే తాము నమ్మలేకపోయారు ప్రజలు. తిన్నగా కృష్ణుడి లోగిళ్ళ వెళ్ళారు రతీ ప్రద్యుమ్నులు.

లోగిళ్ళ స్త్రీలందరూ వచ్చి మూగారు. రుక్మిణీ వచ్చింది. 'నా ప్రద్యుమ్నుడు కొడుకదా!' అనుకుంది. అనుకోకండా ఆమెకు చనుబాలు చేపాయి. "ఉంటే ఇలాగే, ఇంతవాడే అయేవాడు." అంటూ కంట తడిపెట్టుకుంది. ఆమెకి నమస్కరించాడు ప్రద్యుమ్నుడు.

కృష్ణుడూ వచ్చాడు. చూడడంతోనే పోల్చుకున్నాడు. తెలిసినట్టే పలకరించాడు. అడుగులకి మ్రొక్కాడు ప్రద్యుమ్నుడు.

కథంతా చెప్పింది రతి. అందరూ ఆశ్చర్యపడుతూ ఆలకించారు. కొడుకుని గుండెల కద్దుకుంది రుక్మిణి. గుచ్చి కౌగిలించుకున్నాడు కృష్ణుడు. అందరూ అపురూపంగా ఆదరించారు. "తప్పిపోయిన కొడుకు తిరిగి రావడమే కాదు, కోడలితో తిరిగి వచ్చాడు" అంటూ సంబరపడ్డారు.

శంబరుడు పురిటి గదినించి ప్రద్యుమ్నుణ్ణి పట్టుకుపోయిన నెలరోజులలోనే జాంబవతి కొడుకుని కంది. అతడి పేరు సాంబుడు. చిన్నప్పటినించీ సాంబుడికి అస్త్రవిద్యనేర్పి ప్రయోజకుణ్ణి చేశాడు బలరాముడు.

పదహారు వేల మంది కన్యలు

ప్రాగ్జోతిషపురం రాజు నరకుడు. ఎంతో బలవంతుడు. ఎంతమందినో రాజుల్ని జయించి పదహారు వేలమంది రాచ కన్నెల్ని ఖైదులో వుంచాడు. ఇతడి ఏనుగు పేరు సుప్రతీకం. ఇతడి దుడుకుతనం విని కృష్ణుడు సత్యభామతో కలిసి ప్రాగ్జోతిషం ముట్టడించాడు. నరకుణ్ణి నరికేశాడు. అతడి కుమారుణ్ణి భగదత్తుని ప్రాగ్జోతిషానికి రాజు చేశాడు. ఈ భగదత్తుడు భారతయుద్ధంలో కౌరవుల పక్షం పోరాడాడు. ఇతడూ, ఏనుగు సుప్రతీకమూ అర్జునుడి చేత అంతరించాయి.

నరకుణ్ణి చంపి, అతడు చెరలో వుంచిన పదహారు వేల మంది రాచకన్నెల్ని విడిపించాడు కృష్ణుడు. పదహారు వేల మందీ కృష్ణుణ్ణే వరించారు. అంతమందినీ ఒక్కడే కట్టు కున్నాడు కృష్ణుడు. వారినీ, మంచి మంచి ఐరావతం జాతి ఏనుగుల్నీ ద్వారక తర్లించాడు. గొప్పగొప్ప మణులూ అవీ అక్కడివారు కృష్ణుడికి కానుక పూజించారు.

అరవై వేలమందికీ అరవై వేల లోగిళ్ళు కట్టించాడు కృష్ణుడు. అందరినీ ఒక్కలాగే ఏలుకున్నాడు. మొదటి ఎనిమిదిమంది భార్యలకీ తలా పదేసిమంది కొడుకులు కలిగారు.

ప్రద్యుమ్నుడూ, చారుదేష్ణుడూ, సుదేష్ణుడూ, చారుదేహుడూ, సుచారుడూ, చారుగుప్తుడూ, భద్రచారుడూ, చారుచంద్రుడూ, విచారుడూ, చారుడూ రుక్మిణి కొడుకులు.

సాంబుడూ, సుమిత్రుడూ, పురుజిత్తూ, శతజిత్తూ, సహస్రజిత్తూ, విజయుడూ, చిత్రకేతుడూ, వసుమంతుడూ, ద్రవిడుడూ, క్రతుడూ జాంబవతి కొడుకులు.

భానుడు, సుభానుడు, స్వర్భానుడు, ప్రభానుడూ, భానుమంతుడు, చంద్రభానుడు, బృహద్భానుడు, అతిభానుడు, శ్రీభానుడు, ప్రతిభానుడు సత్యభామ కొడుకులు.

వీరుడు, చంద్రుడు, అశ్వసేనుడు, చిత్రగుడు, వేగవంతుడు, వృషుడు, ఆముడు, శంకుడు, వసుడు, కుంతీ నాగ్నజిత్తి కొడుకులు.

శ్రుతుడు, కవి, వృషుడు, వీరుడు, సుబాహువు, భద్రుడు, శాంతి, ధర్ముడు, వర్ణమానుడు, సోమకుడు, కాళింది కొడుకులు.

వృకుడూ, హర్షుడూ, అనిలుడూ, గృధ్రుడూ, వర్ధనుడూ, అన్నాదుడూ, మహాశుడూ, పావనుడూ, వహ్నీ, క్షుధీ మిత్రవింద కొడుకులు.

సంగ్రామదత్తుడూ, బృహత్సేనుడూ, శూరుడూ, ప్రహరణుడూ, అరిజితుడూ, జయుడూ, సుభద్రుడూ, వాముడూ, ఆయువూ, సత్యకుడూ భద్ర కొడుకులు.

ప్రదోషుడూ, గాత్రవంతుడూ, సింహుడూ, బలుడూ,

ప్రబలుడూ, ఊర్ధ్వగుడూ, మహాశక్తి, సహుడూ, ఓజుడూ, అపరాజితుడూ లక్షణ కొడుకులు.

వీళ్ళందరూ అంగ కృష్ణుణ్ణే పోలివుంటారు. కడప భార్యలకీ ఇలాగే కొడుకులు కలిగారు.

రుక్మిణికి ఒక కూతురు కూడా పుట్టింది. పేరు చారుమతి. ఆమెని కృతవర్మ కొడుకు బలి పెళ్ళి చేసుకున్నాడు.

ఇలా కృష్ణుడి సంతానం వేలు వేలుగా, తామర తంపరగా పెరిగింది. యాదవకులం సముద్రమంత అయింది. మనమలూ, మున్మనములూ కిలకిల్లాడారు. చుట్టాలూ పక్కాలూ చెప్పే అక్కరలేదు.

ప్రభావతి

వజ్రనాభుడని ఒక రాక్షస రాజుండేవాడు. మేరు పర్వతం దగ్గిర తపస్సు చేసి వరాలు పొందాడు. అతడి రాజధాని వజ్రపురం. అతడి అంగీకారం లేందే ఎంతటి వాడూ వజ్రపురంలో అడుగు పెట్టడానికి వీలుండేదికాదు.

వజ్రనాభుడికి ప్రభావతి అని ఒక కూతురుండేది. అపురూపమయిన సుందరి ఆమె.

ఇలా వుండగా ఓ నాడు ఓ రాజహంసలమంద వజ్రపురంలో దిగింది. చెరువుల్లోనూ, నడబావుల్లోనూ, వాలి ఈతాలాడాయి హంసలు. అందులో ఒకటి ప్రభావతి లోగిలి కోనేట్రిలో వాలింది. దానిపేరు శుచిమతి.

శుక్తిమతిని చూసి ముచ్చటపడింది ప్రభావతి. మెల్లి మెల్లిగా దాన్ని మచ్చిక చేసుకుంది.

మాటలు నేర్చిన హంస శుక్తిమతి. మచ్చికరాం, ప్రభావతితో ఘాసులాడ్డమూ, కబుర్లు చెప్పడమూ మొదలెట్టింది. ఓ నాడు ఏకాంతంగా ప్రభావతితో ఇలా మొదలెట్టింది :

"ప్రభావతీ! నిజంగా ప్రభావతివే నువ్వు. నీ అంతటి సుందరిని ఎక్కడా చూడలేదు. వజ్రాల తునకవి నువ్వు. అందానికి తగిన వయసులో వున్నావు. వయసున్నప్పుడే అనుభవించాలి. ఏదన్నా వస్తుంది, కాని వయసు పోతే మరిరాదు.

"నువ్వు మరోలా అనుకోను అంటే చెపుతాను. నీ మేలుకోరే చెపుతున్నాను. నీకు తగిన వరుడు- నాకు తెలుసు.

ద్వారక అని ఒక పట్టణముంది. వినే వుంటావు. మన వజ్రపురం దానిముందు ఏమూల! ఆ మేడలూ, ఆ మిద్దెలూ, ఆ తోటలూ, ఆ బాటలూ- వాటికి అవేసాటి. శ్రీకృష్ణుడు కట్టించిన యాదవుల రాజధాని ద్వారక.

కృష్ణుడి పెద్దభార్య రుక్మిణి. రుక్మిణి పెద్దకొడుకు ప్రద్యుమ్నుడు. అతణ్ణి పోలిన అందగాణ్ణి ఎక్కడా చూడలేదు. కృష్ణుడే అందగాడు, అతడికంటే అందగాడు ప్రద్యుమ్నుడు. అన్నివిధాలా నీకు తగినవాడు. ఎంత అందముందో అంత మగసిరి వుంది అతడిలో. మొనగాళ్ళలో

మొనగాడు. యాదవుల సేనాపతి. చిన్నప్పుడే శంబరుణ్ణి చంపాడు. అతడి మాయలన్నీ చేజిక్కించుకున్నాడు.

ప్రభావతీ! అతడి అందచందాలు విడమర్చి చెప్పాలంటే, నేనుకాదు, నాలాటి వెయ్యిమందయినా చాలరు.”

ఇలా ఎన్నో ప్రభావతి చెవిలో వూదింది రాజహంస శుక్తిమతి. నిట్టూరుస్తూ వింది ప్రభావతి. ఒళ్ళంతా చెవులు చేసి వింది. పులకరిస్తూ వింది.

“శుక్తిమతీ!” కొంచేపు వూరుకుని అంది ప్రభావతి, “ప్రద్యుమ్నుడు సాక్షాత్తూ మన్మథుడే అని నేనూ విన్నాను చూచాయగా. కానైతే మా వజ్రపురం నిజంగా వజ్రపురమే. పరాయి మగాడు నాన్నగారి అనుమతిలేందే తొంగి చూడలేడు. యాదవులకి మా నాన్న కన్యనివ్వడు. మరి మాకెలా కుదురుతుంది పెళ్ళి? ఇంతకీ అతడికి నేను నచ్చవద్దూ?”

“నచ్చడమూ నచ్చకపోడమూ - అది నాకు విడిచి, పెట్టు ప్రభా! నేను మంచి మంచి కథలు చెపుతాననీ, మాటలు నేర్చినదాననని మీ నాన్నతో చెప్పు. మీ నాన్న నన్ను తీసుకురమ్మంటాడు. అప్పుడు చూద్దువు కాని నీ శుక్తిమతి పాచిక” అంటూ రెక్కలు జాడించింది రాజహంస.

తండ్రి దగ్గిరికి వెళ్ళింది ప్రభావతి. హంసలాగే నడిచి వెళ్ళింది. కొలువులో వున్నాడు వజ్రనాభుడు. అతడి పేరంటే పిట్టలు నీళ్ళుతాగేవి కావు. గాలి కదిలేది కాదు. కూతుర్ని ఆదరంగా కూచోపెట్టుకున్నాడు దగ్గిర. సిరసు ముద్దాడాడు. మెల్లిమెల్లిగా ఎత్తుకుంది ప్రభావతి.

"నాన్నారండీ, మన వూళ్ళోకి హంసలు వచ్చాయండీ!"

"అవును, విన్నాను. నీకు కావాలా?"

"ఉఁ హూఁ, నా కోనేట్లోకే వచ్చింది ఒకట్టి. దాని పేరు శు క్తిమతి. మనలాగే మాట్లాడుతుందది. దేశదేశాలు తిరిగిందేమో, ఎన్నో కథలు చెబుతుంది. నాతో మచ్చికగా వుంటుంది."

కూతురు మాట విని కుతూహలం కలిగింది వజ్రనాభుడికి. శు క్తిమతిని తీసుకురమ్మన్నాడు. వచ్చి హంసతో చెప్పింది ప్రభావతి. రాజసభకి వెళ్ళింది రాజహంస. ఎన్నో కబుర్లు చెప్పింది.

ఎంత ముచ్చట పడాలో అంత ముచ్చటా పడ్డాడు వజ్రనాభుడు. ఆమాటా, ఈమాటా చెప్పి నటుల ప్రశంస ఎత్తింది హంస.

"మహారాజా! భద్రుడని ఒక నటుడున్నాడు. పేరు పడ్డ నటుడతడు. అతడి నటన చూడనివారి నేత్రాలు నేత్రాలు కావు. అతడి పాట వినని వారి చెవులు చెవులు కావు" అంది.

"అవును, మేమూ విన్నాం. అతడి ఉనికెక్కడ?"

"ఉనికి ఒక దగ్గరంటూ లేదు భద్రుడికి. కాని తరచు ద్వారకలో అవుపిస్తూ వుంటాడు. రసికులున్న దేశాలకి వెళుతూ వుంటాడు. కానుకలూ, కట్నాలూ, మోసుకు వస్తాడు."

"అయితే ఈమారు నీ కంటపడినప్పుడు ఓ మారు ఈ వేపు రమ్మను."

"అలాగే" అని చెప్పి వచ్చేసింది శుక్తిమతి.

"ప్రభావతీ! నీ రొట్టె నేతిలోపడింది. ప్రద్యుమ్నుణ్ణి పట్టుకు వస్తాను, విచారపడకు" అని చెప్పి వజ్రపురంనించి ద్వారక వెళ్ళింది. సముద్రం మధ్యాన లంకాపురంలా వుంది ద్వారక. యాదవులతో సముద్రంలో రెండో సముద్రంలా వుంది.

వెన్నెల ముద్దలా కిందకి దిగింది హంస. ఒంటరిగా ప్రద్యుమ్నుణ్ణి కలుసుకుంది. ప్రభావతి విషయం చెప్పింది. ఆమె రూపు రేఖలూ, వయసు తీరూ వర్ణించింది. ఆమె మీద వలపు రేకెత్తించింది. నీ కోసమే ఎదురుచూస్తూ కూచుంది ప్రభావతి." అంటూ తొందరచేసింది.

"అయితే ఉపాయమూ నువ్వే చెప్పు" హంసని నిమురుతూ అడిగాడు ప్రద్యుమ్నుడు.

"నువ్వెరగని మాయ ఏముంది?" అంటూ అందుకుంది శుక్తిమతి, "అయినా ఉపాయం సిద్ధంచేసే వుంచాన్నేను. నటుడు భద్రుడున్నాడు కదా! అతడి నటన చూడాలనుకుంటున్నాడు వజ్రనాభుడు. నువ్వు నటులలో నటుడివి, గాయకుల్లో గాయకుడివి. భద్రుడి వేషంలో వజ్రపురం దయచెయ్యి. ప్రభావతిని పట్టుకురా." అంది.

వజ్రపురానికి పయనమయాడు ప్రద్యుమ్నుడు. తన పయనం తండ్రి కృష్ణుడికి చెప్పాడు. గ్రహించాడు కృష్ణుడు.

సాంబుణ్ణీ, గదుణ్ణీ మరికొంతమందినీ ప్రద్యుమ్నుడి వెంట వెళ్ళమన్నాడు. భద్రుడి నటబృందంలాగే వారికీ వేషాలు వేయించాడు. ప్రద్యుమ్నుడు భద్రుడయ్యాడు. అతడే ఆ జట్టుకి నాయకుడు. సాంబుడు, విదూషకుడు. గదుడు సూత్రధారుడు. కొంతమంది పాటగాళ్ళు, కొంతమంది వాద్యగాళ్ళు, కొంతమంది సానులు.

ఇలా ఈ నటబృందం బయలుదేరి ముందు వజ్రపురం (దగ్గిర) శివారుపట్నం సుపురం ప్రవేశించారు.

సుపురంవారు అంతకిముందే భద్రుడి పేరు వినే వుండడంచేత ఈ నటులనందరినీ ఆప్యాయంగా ఆదరించారు.

ఎప్పటి కబుర్లు అప్పుడు ప్రభావతికి అందజేస్తూ వుండేది శుచిమతి.

సుపురంలో రామాయణం అభినయించారు యాదవులు. దశరథుడు సానుల్ని పంపి ఋష్యశృంగుణ్ణి తెప్పించడం, శాంతనిచ్చి పెళ్ళిచేయడం, కొడుకులకోసం యజ్ఞం చేయడం, రామలక్ష్మణులూ భరతశత్రుఘ్నులూ పుట్టడం— చక్కగా అభినయంచేసి చూపారు. చక్కగా పాటలు పాడారు. వాళ్ళ వేషాలూ, దుస్తులూ, అభినయాలూ, రంగస్థలమూ చూస్తూ సుపురం వాళ్ళందరూ ఆశ్చర్యపోయారు. ఆనందం పట్టలేకపోయారు. కొసరి కొసరి మళ్ళీ మళ్ళీ ఆడించారు. బంగారు నగలూ, మంచి మంచి బట్టలూ బహూకరించారు.

భద్రుడి నాటకసంఘం సుపురం వచ్చిందనీ, అద్భుతంగా నాటకాలు వేస్తున్నదనీ విన్నాడు వజ్రనాభుడు. తన

వజ్రపురానికి రమ్మని కబురు పంపాడు. నటుల వేషంలో యాదవులు వజ్రపురంలో ప్రవేశించారు. మంచి భవనం బసగా యిచ్చాడు వజ్రనాభుడు. అన్ని సదుపాయాలూ కలిగించాడు. మంచి రంగస్థలం తయారయింది. వజ్రనాభుడు సభతీర్చి కూచున్నాడు. రాణివాసం స్త్రీలకోసం ప్రత్యేకం చోటు కేటాయించారు. అవాళ శివుడి పండగ. అందుకు సరిపోయినట్టు గంగావతరణం అభినయించారు యాదవులు. ముందుగా ప్రద్యుమ్నుడూ, సాంబుడూ, గదుడూ, రకరకాల వాద్యాలతో రాగాలాపన చేశారు. పాటలు పాడారు. వీణల తోనూ, వేణువులతో శ్రుతులు కలిపారు. సభ సభంతా వోలలాడించారు. నాంది మోయించారు.

గంగావతరణం తరవాత రంభా నలకూబర నాటకం వేశారు యాదవులు. ప్రద్యుమ్నుడు నలకూబరుడి వేషం వేశాడు. వేశ్య మనోవతి రంభపాత్ర ధరించింది. శూరుడు (యాదవుడు) రావణుడి వేషం వేశాడు. సాంబుడు విదూషకు డయాడు.

ఈ రంభానలకూబర నాటకంలో తమ నేర్పంతా అవుపరిచారు యాదవులు. రంగస్థలంలో వారు తయారు చేసిన కైలాసపర్వతం ఆశ్చర్యం కలిగించింది.

ఈ నాటకాలు చూసి ఆనందం పట్టలేకపోయాడు వజ్రనాభుడు. వజ్రాలూ, నగలూ, పట్టుబట్టలూ ఎన్నో అన్ని కట్నాలూ, కానుకలు ఇచ్చి సత్కరించాడు. ఎంతో కాలం ఆ నాటకాలవాళ్ళని వజ్రపురంలోనే వుంచేశాడు.

ప్రభావతీ ప్రద్యుమ్నుల మధ్య రాయబారం నడు

పుతూ వచ్చింది రాజహంస. రహస్యంగా అంతఃపురంలో ప్రవేశించాడు ప్రద్యుమ్నుడు. ప్రభావతిని గాంధర్వ వివాహము చేసుకున్నాడు. ప్రతిదినం తెల్లవార్లూ ఆమెతో వుండి వచ్చేసేవాడు.

వజ్రనాభుడికి సునాభుడని తమ్ముడుండేవాడు. అతడికి చంద్రవతీ, గుణవతీ అని ఇద్దరు కూతుళ్ళుండేవాళ్ళు. ఇద్దరూ రూపవతులు, గుణవతులు. ఇద్దరూ ప్రభావతితో స్నేహంగా వుండేవారు. తరుచు ఆమె దగ్గిరికి వచ్చేవారు. ఓ నాడు ప్రభావతీ ప్రద్యుమ్నులు కలిసివుండగా వాళ్ళు వచ్చి చూశారు. "ఏమిటక్కా ఇది?" అని అడిగారు.

"నాకు దూర్వాసముని ఒకమంత్రం మప్పాడు" అంది ప్రభావతి, "ఈ మంత్రం మహిమతో కోరుకున్న మగడు వస్తాడు. మీరూ కావాలంటే చెప్పండి. నా ప్రియుడులాంటి అందమైన మగళ్ళని మీ దగ్గిరికి వచ్చేట్టు చేస్తాను."

"అయితే పంపించు" అంటూ సంబరపడ్డారు వాళ్ళు.

చంద్రవతీ, గుణవతీ వెళ్ళాక ప్రద్యుమ్నుడితో నవ్వుతూ చెప్పింది ప్రభావతి:

"మీ తమ్ముళ్ళని సాంబుడ్నీ, గదుడ్నీ మా చెల్లెళ్ళ దగ్గిరికి పంపించు."

ప్రభావతి చెప్పినట్టే చేశాడు ప్రద్యుమ్నుడు. సాంబుడు గుణవతినీ, గదుడు చంద్రవతినీ రహస్యంగా

గాంధర్వ వివాహం చేసుకున్నారు. వారితో కూడి సుఖపడుతూ వచ్చారు.

ఇదంతా రెండో కంటివాడికి తెలియకుండానే జరుగుతూ వచ్చింది. అంతఃపురాల రహస్యం ఎప్పుడూ అంతే.

ప్రభావతీ, చంద్రవతీ, గుణవతీ — ముగ్గురూ నీళ్ళాడారు. ముగ్గురూ ముత్యాలలాంటి కొడుకుల్ని కన్నారు.

మూడుమూర్తులా ప్రద్యుమ్నుడ్ని పోలిన కొడుకుని కంది ప్రభావతి. అలాగే తండ్రిని పోలిన కొడుకునే కంది చంద్రవతి. అతడి పేరు చంద్రప్రభుడు. గుణవతి కొడుకు గుణవంతుడు.

ఈ ముగ్గురూ మేడలమీద ఆడుకుంటూ ఓ నాడు కావలివాళ్ళ కంటపడ్డారు.

"ఇదేమిటి, కాపలా కాపలాలాగే వుంది, కన్యలు కొడుకులు కన్నారు! మన పీకలు తెగిపోతాయి" అంటూ భయపడిపోయారు. పడుతూ లేస్తూ వజ్రనాభుడి దగ్గిరికి పరిగెత్తారు. వింతకబురు విన్నవించారు.

ఉగ్రుడే అయిపోయాడు వజ్రనాభుడు. "కన్యల లోగిళ్ళలో కనపడ్డ మగపురుగునల్లా చంపెయ్యండని సైన్యం పంపాడు. తానూ, తమ్ముడు సునాభుడూ గదలు పట్టుకు బయల్దేరారు.

ప్రభావతీ, చంద్రవతీ, గుణవతీ కొడుకుల్నీ, మగల్నీ పట్టుకుని గోలుగోలుమన్నారు. ధైర్యంచెప్పి వోదార్చారు యాదవ కుమారుళ్ళు. ముగ్గురూ ఆయుధాలు పట్టుకున్నారు. యుద్ధానికి సిద్ధమయ్యారు.

ఇంతలో వజ్రనాభుడి సైనికులు యాదవ కుమాళ్ళని చుట్టుముట్టారు. ఘోరంగా మొదలయింది యుద్ధం.

కృష్ణుడి తరవాత కృష్ణుడంతవాడు ప్రద్యుమ్నుడు. పైగా మాయాయుద్ధం తెలిసినవాడు. మాయ విమాన మెక్కి, మబ్బుల్లోంచి మాయాయుద్ధం చేశాడతడు. ఒక్కడే ఎక్కడపడితే అక్కడ అవుపించాడు. వజ్రపుర మంతా శవుకులు పెట్టేశాడు. వందలు వందలు, వేలు వేలు మందిని హతమార్చాడు. అవాళ తెల్లవార్లూ జరిగింది యుద్ధం. సాంబుడూ, గదుడూ, నటులవేషంలో వున్న యాదవులందరూ హోరాహోరి పోరాడారు.

ఇక్కడ యుద్ధం మొదలయిందో లేదో, ద్వారకకి ఎగిరి, ఉష్పందించింది శుక్తినుతి. పొద్దుపొడిచే సరికి మర్నాడు, వజ్రపురం పొలిమేర మేఘా లురిమినట్టు మారుమోగింది పాంచజన్యం. దాంతో ఎక్కడలేని బలమూ, సాహసమూ, ఉత్సాహమూ పుంజుకున్నారు యాదవ కుమాళ్ళు.

తండ్రి దగ్గిరికివచ్చి నమస్కరించాడు ప్రద్యుమ్నుడు. గదా, సుదర్శన చక్రమూ ఇచ్చి, వజ్రనాభుడిమీదికి పురి కొల్పాడు కృష్ణుడు. పేట్రేగాడు ప్రద్యుమ్నుడు. గద పట్టుకుని వజ్రనాభుడిమీది కురికాడు. వజ్రనాభుడూ గద ఎత్తాడు. ఇద్దరూ గదలతో కొట్టుకున్నారు. ఇద్దరూ మూర్ఛ పోయారు. అంతలో తెలుసుకున్నారు. పొలిమేరనించే పాంచ

జన్యం పూరించాడు కృష్ణుడు. సుదర్శనం ప్రయోగించాడు ప్రద్యుమ్నుడు.

ధగధగా మెరిసిపోతూ వెళ్ళింది సుదర్శనం. లిప్తలో వజ్రనాభుడి తల నరికేసింది.

ఇటు వజ్రనాభుడి తల కిందపడిందో లేదో, సునాభుడి తల ఎగరగొట్టేశాడు గదుడు. అప్పటికే సాంబుడు వజ్రనాభుడి సైన్యాలు తునాతునకలు చేశాడు. రాజు తెగిపోడంతోనే మిగిలిన సేనంతా చేతులు జోడించి నిలబడిపోయింది.

వజ్రపురం చుట్టుపట్ల చిలవలు పలవలుగా సుపురం లాటివి ఎన్నో అన్ని పట్నాలున్నాయి. వాటితో కూడా వజ్రపుర రాజ్యం సకల సంపదలతోనూ ప్రద్యుమ్న, సాంబ, గదుల కుమాళ్ళకి పంచి ఇచ్చి, వాళ్ళ నక్కడ రాజులుగా అభిషేకించాడు కృష్ణుడు. అదంతా అయాక తాను ద్వారక వచ్చేశాడు.

ప్రద్యుమ్నుడూ, సాంబుడూ, గదుడూ మరో ఆరు మాసాలు వజ్రపురంలో వుండి, కొడుకుల రాజ్యం స్థిర పడ్డాక, ద్వారక వచ్చేశారు.

వజ్రపురరాజ్యం చిరకాలం మేరుపర్వతానికి ఉత్తరంగా ఎదుగుతూ వచ్చింది.

జలక్రీడ

సముద్రంలో జలక్రీడ జరపడంకోసం పిండారక తీర్థానికి బయలుదేరాడు కృష్ణుడు. ఉగ్రసేనుణ్ణీ, వసుదేవుణ్ణీ ద్వారకలో వుంచి యాదవులందరినీ బయలుదేరదీశాడు.

రుక్మిణీ, సత్యభామా, జాంబవతీ, కాళిందీ, నాగ్నజితీ, భద్రా, లక్షణా, మిత్రవిందా — ఎనమండుగురు దేవేరులూ, పదహారు వేలమంది భార్యలూకూడా వెళ్ళారు. బలరాముడు రేవతితో విడిగా బయలుదేరాడు. యాదవ కుమాళ్ళందరు తమ తమ భార్యలతో పయనమయ్యారు.

వ్రజపురంనించీ, ఇతర చోట్లనించీ పట్టుకు వచ్చిన వేశ్యలు వందలు వందలు వెంట వచ్చారు. అందరూ అందంగా ముస్తాబులు చేసుకున్నారు. అంతమందీ అలా తర్లి వస్తూవుంటే అపురూపమైన శోభగా అవుపించింది.

కబురంది సుభద్రతో అర్జునుడూ అక్కడికి వచ్చాడు.

పెద్ద మంచినీళ్ళ సరస్సులా నిర్మలంగా వుంది సముద్రం. ప్రశాంతంగానూ వుంది. ఎంతోమేర మెడలోతు నీళ్ళతో వుంది.

పదహారువేల ఎనమండుగురు భార్యలతోనూ నీటిలోకి దిగాడు కృష్ణుడు. ఉల్లాసంగా జలక్రీడ మొదలెట్టాడు. అంత మందితోనూ అన్నిరూపులా చెట్టాపట్టాలు పట్టాడు. నీటిలో సంయాట లాడాడు. వలపులు కులికించాడు. ప్రతి భార్యా తనతో కృష్ణుడున్నాడనుకునేది. తననే వలిచాడనుకునేది.

తన రొమ్ముల గోట్టినొక్కులు చూసి మురిసిపోయేది. పెదవుల పంటినొక్కులికి గగుర్పొడిచేది.

నల్లమబ్బు జడివాన కురిసినట్టు అంతమందిమీదా నీళ్ళు చల్లేవాడు కృష్ణుడు. అంతమందీ అతడిమీద నీళ్ళు చల్లేవారు. కిలకిలా నవ్వేవారు. కేరింతలు కొట్టేవారు.

కుమాళ్ళందరూ తమతమ స్త్రీలతో నీళ్ళలో దిగారు. విచ్చలవిడిగా జలకేళి సలిపారు. అంతమందీ వుల్లిపొరలాటి పల్చటి బట్టలు కట్టుకున్నారు.

కొందరు ఈతకొట్టారు. కొందరు మునుగుతూ తేలారు. కొందరు నిలువీతలీదారు. కొందరు వెల్లకిలా ఈదారు. కొందరు బారలతో ఈదారు. కొందరు మునుగీత లీదారు.

కొందరు పడవలమీద వెళ్ళారు, నావలమీద వెళ్ళారు. ఆ పడవలూ, ఓడలూ కొన్ని హంసల్లా వున్నాయి. కొన్ని నెమళ్ళలా వున్నాయి' కొన్ని ఏనుగుల్లాగా, లొట్టిపిట్టల్లాగా వుండేవి.

కొందరు పాటలు పాడారు. కొందరు ఆటలాడారు. కొందరు వాద్యాలు వాయించారు.

"అమ్మో! పడిపోయాం, పడిపోయాం, పట్టుకోండి, పట్టుకోండి" అంటూ కొందరు స్త్రీలు మగల మెడలు పట్టుకు వేలాడారు. కొంతమంది కిలకిలా నవ్వారు. చప్పట్లు చరిచారు.

రేవతితో విడిగా నీటిలో క్రీడించాడు బలరాముడు.

సముద్రం నీలాకాశంలాగా, కృష్ణుడు చంద్రుడిలాగా, ఎనమండుగురు దేవేరులూ గ్రహాలలాగా, పదారు వేలమంది భార్యలూ నక్షత్రాల్లాగా అవుపించారు.

నా వ కే ళి

ఎర్రపొద్దుపడింది. బంగారం పూతపోసినట్టు కనపడింది సముద్రం. జలకేళి చాలించాడు కృష్ణుడు. అంతమందీ వొడ్డుకి వచ్చారు. మంచి మంచి పొడిబట్టలు కట్టుకున్నారు. మైపూతలు పూసుకున్నారు. పూలదండలు వేసుకున్నారు. కృష్ణుడు పసుపురంగు పట్టుబట్టలు కట్టుకున్నాడు. బలరాముడు నీలిరంగు పట్టుబట్టలు కట్టుకున్నాడు. ఆడంగులు పద్మాల పట్టుచీరెలూ, రత్నాల రవికలూ కట్టుకున్నారు.

అంతమందీ మంచి మంచి పిండివంటలు తిన్నారు. మాంసాలతో మద్యపానం చేశారు. మద్యపానంలో బలరాముడిదే పైచేయి.

అనంతరం నావకేళి మొదలుపెట్టాడు కృష్ణుడు. రకరకాల నావలు సిద్ధమయాయి. నవరత్నాలు చెక్కిన నావలవి. కొన్ని నిడివిగా వుంటే కొన్ని చౌకమైనవి. కొన్ని చక్రంలా వుంటే కొన్ని పలకలుగా వుండేవి. మరికొన్ని స్వస్తికాకారమైనవి. కొన్ని గరుడపక్షుల్లాగా, కొన్ని నెమలిపిట్టల్లాగా, చిలకపిట్టల్లాగా చిత్రచిత్రంగా వుండేవి. కొన్ని రకరకాల మృగాల్లా వుండేవి. కొన్ని మరీ పెద్దవిగా, ఎంతోమంది పట్టడానికి వీలుగా వుండేవి. అవసరమైన అన్ని పదార్థాలతోనూ నిండివుండేవవి. ప్రతిదానికీ చుక్కాని

మనిషి వుండేవాడు. ప్రతి నౌకలోనూ తెల్లచిలకలు పాడుతూ వుండేవి. నెమళ్ళు ఆడుతూ వుండేవి. చలీ, వేడీ లేకండా పిల్లగాలులు వీస్తూ వుండేవి.

కొన్ని నావలు చక్కని సవారీలలాగ వుండేవి. కొన్ని మేడల్లాగా, మిద్దెలలాగా వుండేవి. కొన్ని మండపాలలాగా, మందువాలలాగా వుండేవి. కొన్ని కొండల్లా వుండేవి.

కొన్ని నావలు సముద్రం చీల్చుకుంటూ చువ్వల్లా పరిగెత్తాయి. ఒకదాంతో ఒకటి పోటీ పడ్డాయి. కొన్ని కెరటాల మీాద హంసల్లా తేలాడాయి. కొన్ని అల్లిబిల్లిగా పాముల్లా పరిగెత్తాయి. కొన్ని అడ్డదిడ్డంగా, కొన్ని మండలాకారంగా తిరిగాయి. వాట్ని రంగురంగుల జెండాలు రెపరెపలాడుతూ పిట్టల్లా ఎగిరాయి.

యాదవ కుమారాళ్ళందరు తమతమ భార్యలతో తనివి తీరా క్రీడించారు. పాటలు పాడారు, ఆటలాడారు.

సరదాతీరా నావకేళి జరిపాక బయటికి దిగి భార్యలతో ఒడ్డుకి వచ్చేశాడు కృష్ణుడు. అలాగే యాదవులందరూ వచ్చేశారు. అంతమందీ స్నానాలు చేశారు. తెల్ల మడతలు కట్టుకున్నారు. గంధాలు రాసుకున్నారు. ముస్తాబులు చేసుకున్నారు. పూలదండలు వేసుకున్నారు.

ఛాలిక్య గానం

భార్యలందరితోనూ కృష్ణుడూ, రేవతితో బలరాముడూ, సుభద్రతో అర్జునుడూ, తమ తమ భార్యలతో

ప్రద్యుమ్నుడూ, సాంబుడూ మొదలైన కృష్ణుడి కుమాళ్ళూ, బలరాముడి కుమాళ్ళూ, సాత్యకీ, అక్రూరుడూ మొదలైన యాదవ నాయకులూ, తక్కిన యాదవులందరూ తమ తమ స్త్రీలతో కలిసి భోజనాలచోటికి చేరారు.

అప్పటికే వంటలు సిద్ధం చేసి పెట్టారు వంటవాళ్ళు. అంతమందీ పిండివంటలతో, మాంసంకూరలతోనూ, తృప్తిగా భోజనాలు చేశారు. శూలాలతో గుచ్చి వండిన పిట్టల మాంసాలు తిన్నారు. ఇనప పుల్లలతో గుచ్చి నేతిలో వండిన రకరకాల మృగాల మాంసాలు తిన్నారు. మైరేయం మొదలైన రకరకాల సారాలు కుత్తుకబంటిగా తాగారు.

అనంతరం సభతీర్చి సంగీతాలు పాడారు. కృష్ణుడు తన 'ఝల్లీసకం' అనే పిల్లనగోవి మోయించాడు. విశ్వ మోహనంగా పాడింది ఝల్లీసకం పిల్లనగోవి. తాగుడు మత్తులో స్త్రీలు మరింత మత్తుతో నృత్యం చేశారు. దిశలు పులకరించాయి. సముద్రం పొంగులు వారింది.

అంతమంది యాదవులూ, ఆడా, మగా తాగినా ఉద్ధవుడూ, మరి కొందరు మాత్రం ఆ పొంతకు పోలేదు. పళ్ళరసాలతో మాత్రమే తృప్తిపడ్డారు వారు.

పిల్లనగోవి పాట చాలించి ప్రద్యుమ్నుడి వేపు చూశాడు కృష్ణుడు. తండ్రి ఇంగితం గ్రహించాడు ప్రద్యుమ్నుడు. ఛాలిక్యగానం మొదలుపెట్టాడు.

కృష్ణుడికి ఎంతో ఇష్టమయిన గాంధర్వ గానం ఛాలిక్యగానం. తానే ఇది ఈ లోకంలో వ్యాప్తి చేశాడు.

తాను నేర్చి ఇతరులకి నేర్పాడు. తన తరవాత బల రాముడూ, ప్రద్యుమ్నుడూ, అనిరుద్ధుడూ, సాంబుడూ ఈ గానంలో పేరుపడ్డారు. వారున్నూ తక్కినవారికి నేర్పారు.

ఛాలిక్యగానం తన్మయం కలిగిస్తుంది; సుఖం కలిగిస్తుంది; శుభమూ కలిగిస్తూంది. వెనకటికి రేవతుడు అని ఒక గంధర్వులరాజు ఈ ఛాలిక్యగానం వింటూ యుగాలు దినాలుగా గడిపేశాడట.

ఈ గానంతో జరిపే క్రీడ ఛాలిక్యక్రీడ. పిల్లలకీ, పెద్దలకీ,అందరికీ నచ్చిన క్రీడ ఛాలిక్యక్రీడ.

ప్రద్యుమ్నుడు ఛాలిక్యగానం సాగిస్తున్నా, యావన్మందీ తన్మయులై వింటున్నారు. ఇంతలో ద్వారకనించి వేగిరావులు కబురు తెచ్చారు.

భానుమతి

వజ్రపురం వజ్రనాభుడికి నికుంభుడని మరో తమ్ముడుండేవాడు. షట్పురం అతడి నివాసం. అతడు ఉత్తర కురు భూమిలో తపస్సుచేసి, మూడు శరీరాలు పొందాడు. మాయలో ఘటికుడు, మంచి బలవంతుడు కూడా.

వజ్రనాభుణ్ణి చంపేసి, ప్రభావతిని పట్టుకుపోయారని, యాదవుల మీద పగపట్టాడు నికుంభుడు. యాదవులు పిండారక క్షేత్రం వెళ్ళారని తెలిసి ద్వారక వచ్చాడు. అవుపడకుండా అంతఃపురంలో చొరబడ్డాడు.

అంతఃపురాలలో కన్యలు కిమాత్రమున్నారు. జలకేళి

పిండారకం వెళ్ళలేదు వాళ్ళు. పోతుటీగ లోపలికి పోకండా కాపలా కాస్తున్నారు కావలిభటులు. మాయచేసి కనపడ కండా దూరాడు నికుంభుడు. రెండు శరీరాలు షట్పురం లోనే విడిచి ఒక శరీరంతో వచ్చాడతడు. అవుపడకండా అంతఃపురం ఉపవనంలో ఒక పొదరింట్లో కూచున్నాడు.

కొంచేపటికి అక్కడికే తిరుగుతూ వచ్చింది భాను మతి. భానుడి కూతురామె. అందాలబరిణ. నిండు యౌవ్వన వతి కన్య.

దొంగచాటున వచ్చి ఆమెని పట్టుకున్నాడు నికుం భుడు. కెవ్వుమంది భానుమతి. కేకలు వేసింది. పెద్దపెట్టున ఏడ్చింది, గింజుకుంది.

అంతఃపురమంతా విరగబడింది. ఉగ్రసేనుడూ, వసు దేవుడూ పరిగెత్తుకు వచ్చారు.

భానుమతి ఏడుపు వినబడుతూవుంది. ఆమె కాని, నికుంభుడు కాని అవుపడలేదు. వెంటనే బేగీరావుల్ని పిలిచి కృష్ణుడి దగ్గిరికి కబురు పంపాడు ఉగ్రసేనుడు.

అదిగో ఆ బేగీరావులే పిండారక క్షేత్రంలో ఛాలిక్యగానంలోవున్న కృష్ణుడి దగ్గిరికి కబురు పట్టుకు వచ్చారు.

కబురు వినడమే తడువు, అర్జునుడితో కలిసి ద్వారక బయలుదేరాడు కృష్ణుడు. అతడి అడుగుల్లో అడుగులు వేస్తూ ప్రద్యుమ్నుడూ బయలుదేరాడు.

వారు వచ్చేసరికి భానుమతిని ఎత్తుకుపోతున్నాడు నికుంభుడు. వెంట తరిమారు వారు.

గోకర్ణ క్షేత్రంలో భానుమతిని విడిచిపెట్టి షట్పురం పారిపోయాడు నికుంభుడు. వెంటపడ్డారు కృష్ణార్జునులు.

భానుమతిని ద్వారక చేర్చి, షట్పురం వచ్చాడు ప్రద్యుమ్నుడు.

ఈ ముగ్గురితో హోరాహోరి పోరాడాడు నికుంభుడు. తుదకి సుదర్శనచక్రంతో అతడి తల నరికేశాడు కృష్ణుడు. ద్వారక తిరిగివచ్చి పాండవుల చిన్నతమ్ముడికి-సహదేవుడి కిచ్చి భానుమతిని పెళ్ళిచేశాడు.

కౌ పి త్తు లు

వసుదేవుడికి బ్రహ్మదత్తుడని ఒక స్నేహితుడుండే వాడు. ఇద్దరూ చిన్నప్పుడు ఒక్క గురువు దగ్గరే చదువుకున్నారు.

బ్రహ్మదత్తుడు మంచి పండితుడు. యాజ్ఞవల్క్యుడి శిష్యుడు. వేదాలూ, వేదాంగాలూ తెలిసినవాడు. బుద్ధిమంతుడు. అతడికి కొంతమంది కూతుళ్ళుండేవాళ్ళు. అంతమందీ అందగత్తెలు.

వసుదేవుడి సాయంతో ఓమారు పెద్ద యజ్ఞం తలపెట్టాడు బ్రహ్మదత్తుడు. ఏడాది యజ్ఞమది.

షట్పురం ఆవర్తనది ఒడ్డున యజ్ఞశాల తయారయింది. యాజ్ఞవల్క్యుడూ, వ్యాసుడూ, సుమంతుడూ,

జైమినీ, జాబాలీ, దేవలుడూ - ఇంకా ఎంతోమంది మునులూ వచ్చారు. ద్వారకనించి దేవకీవసుదేవులూ వచ్చారు.

పట్నురంలో కాపిత్థులని దానవులుండేవారు. బలవంతులు వాళ్ళు. కపిత్థవృక్షాల (వెలగచెట్ల) కింద తపస్సు చేశారు వాళ్ళు. అందుకని కాపిత్థులయారు. బ్రహ్మదత్తుడి యజ్ఞం దగ్గిరికి వాళ్ళుకూడా వచ్చారు. ఎంతో ధనం ఖర్చుపెడుతున్నాడు యజ్ఞదత్తుడు. అతడి దగ్గిర రత్నాలు చూశారు కాపిత్థులు. అతడి కూతుళ్ళనీ చూశారు. వాళ్ళ నోరూరింది.

"బ్రహ్మదత్తా!" బింకంగా అడిగారు వాళ్ళు. "అందంగా వున్నారు మీ అమ్మాయిలు. వీళ్ళని మాకిచ్చెయి. వీళ్ళతో నీ రత్నాలూ కావాలి."

కాపిత్థుల నాయకుడు నికుంభుడు. "అవును. కాళ్ళు కడిగి కన్యాదానం చెయ్యి. కట్నాలూ, కానుకలూ ఇయ్యి. కాదంటావా, నీ యజ్ఞం గిజ్ఞం తగలబెట్టేస్తాం. అంతేకాదు; యజ్ఞంలో మాకూ వాటా ఇవ్వాలి" అంటూ గద్దించాడు.

"నికుంభా!" నెమ్మదిగా చెప్పాడు బ్రహ్మదత్తుడు, "అల్లరి చెయ్యకండి. మీరు కోరినన్ని రత్నాలిస్తాను. కావలిస్తే తీసుకోండి. నా కూతుళ్ళు కావాలనడం కూడదు. యజ్ఞంలో వాటా మీకు లేదు. దుడుకుతనానికి దిగితే మీరే చెడతారు. చూడండి, వసుదేవుడిక్కడే వున్నాడు. యాదవుల ప్రభువు కృష్ణమూర్తి నాపాలి దేవుడు."

"అలాగా?" కవ్వించి నవ్వారు కాపిత్థులు. యజ్ఞ

శాల వూడ పెరికారు. బ్రహ్మదత్తుడి కూతుళ్ళకోసం మాటు కాశారు.

కృష్ణుడికి వుప్పందింది. ప్రద్యుమ్నుణ్ణి ఆగమేఘాల మీాద పట్నురం పంపాడు.

"ప్రద్యుమ్నా! చప్పున పట్నురం వెళ్ళు. నువ్వు శంబరుడి దగ్గిర నేర్చిన మాయకి పనిపడిందిప్పుడు. బ్రహ్మ దత్తుడి కూతుళ్ళు కాపిత్థులకి కనపడకండా చెయ్యి. మాయ కన్యలు కల్పించు. నీ అడుగుల్లో అడుగులు వేసి నేనూ వస్తున్నాను. తాతా, నానమ్మా అక్కడే వున్నారు, జాగ్రత్త" అన్నాడు.

తండ్రిగారు చెప్పడమే తడువు, పట్నురంలో వాలాడు ప్రద్యుమ్నుడు. తాతగారికి ధైర్యం చెప్పాడు. బ్రహ్మదత్తుణ్ణి ఓదార్చాడు. అతడి కూతుళ్ళని అవుపడకండా చేశాడు. అచ్చంగా అలాటివాళ్ళనే మాయకూతుళ్ళని సృష్టించాడు. కాపిత్థుల కంటపడ్డారు మాయకన్యలు. పట్టుకుపోయి గంతులు వేశారు కాపిత్థులు. భద్రంగా సాగింది బ్రహ్మదత్తుడి యజ్ఞం.

దేశదేశాల రాజులు యజ్ఞానికి వచ్చారు. అందరినీ గౌరవించాడు బ్రహ్మదత్తుడు. ఘనమైన ఆతిథ్యమిచ్చాడు.

బ్రహ్మాండమైన వ్యక్తి బ్రహ్మదత్తుడు. అయిదువందల మంది భార్యలతడికి. అందులో బ్రాహ్మణ భార్యలు రెండు వందలమంది. క్షత్రియ స్త్రీలు వందమంది. కోమటి పడు చులు వంద. శూద్ర స్త్రీలు నూరుగురు. ప్రతి భార్యకీ ఒక కొడుకూ, ఒక కూతురూ పుట్టారు.

అయిదువందల కూతుళ్ళూ అయిదువందల రత్నాలు.

అందాల చందమామలు. వారిలో నాలుగువందల కూతుళ్ళని ఎంచి ఎంచి, మంచి మంచి రాజులకిచ్చి పెళ్ళిచేశాడు. మిగిలిన వందమందినీ ఈ యజ్ఞసమయంలో రాజులకిచ్చి పెళ్ళి చేయాలని పిలిపించాడు. వాళ్ళకోసమే కలబడ్డారు కాపిత్థులు. మాయకన్యల్ని పట్టుకుపోయారు.

బ్రహ్మదత్తుడి యజ్ఞానికి జరాసంధుడూ, శిశుపాలుడూ, దంతవక్త్రుడూ, మాళవుడూ, రుక్మి, ఆహ్వృతి, నీలుడూ, ధర్ముడూ, విందుడూ, అనువిందుడూ, శల్యుడూ, శకునీ, కర్ణుడూ, కౌరవులూ, పాండవులూ, ఇంకా ఎందరో రాజులూ, షట్పురం వచ్చారు. వీరిలో కొందరు బ్రహ్మదత్తుడి కన్యల కోసం నికుంభుడితో చేతులు కలిపారు. మాయకన్యల్ని కొందరు పంచుకున్నారు. పాండవులు మాత్రం ఆ పొంతకి పోలేదు.

ఆ కన్యలందరూ అందగత్తెలు మాత్రమే కాదు. అప్సరసలలాగ ఆటపాటలు నేర్చినవారు.

ఎత్తుకువచ్చిన కన్యల్ని లంచమిచ్చి ఎంతోమంది రాజుల్ని వశపరుచుకున్నాడు నికుంభుడు. వసుదేవుడి సాయంతో బ్రహ్మదత్తుడు తనమీదికి యాదవుల్ని తర్లించుకు వస్తాడని ముందే సిద్ధపడ్డాడు. కాపిత్థసేనంతా కట్టుదిట్టం చేశాడు.

ఇంతలో పెద్ద యాదవసేన వేసుకుని షట్పురం వచ్చాడు కృష్ణుడు. ఆవర్తనది ఒడ్డున మంచి విశాలమైన ప్రదేశంలో డేరాలు వేయించాడు. శిబిరం కట్టుదిట్టం చేయించాడు.

మర్నాడు ఉదయం యాదవులందరు రణభేరి వేయిం చారు. కవచాలు వేసుకుని, ఆయుధాలు పట్టుకుని సింహ నాదాలు చేశారు. పాండవులు యాదవులతో చేరారు. యజ్ఞం కాపాడడానికి వారిని నియమించాడు కృష్ణుడు.

గదుడూ, సాంబుడూ కలిసి మకరవ్యూహం పన్నారు. సారణుడూ, ఉద్ధవుడూ, సాత్యకీ, భోజుడూ, వైతరణుడూ, అనాదృష్టీ, అనిరుద్ధుడూ, చారుదేష్ణుడూ, విపృథువూ, కృతవర్మా, దంష్ట్రుడూ, విచక్షుడూ, అరిమర్దనుడూ - ఇంకా కొందరు యోధులూ వ్యూహం కీలకస్థానాల్లోనూ, ముందు వెనకల్లోనూ, నిలబడ్డారు. పట్సురం ముంచెత్తే సముద్రంలా నడిచింది మకరవ్యూహం. దానికి నాయకుడు యాదవవీరుడు అనాదృష్టి.

కయ్యానికి కాలుదువ్వుతూనే కాసుక్కూచున్నారు కాపిత్థులు. ఏనుగులమీాదా, ఎనుపోతులమీాదా, గాడిదల మీాదా, గుర్రాలమీాదా "బప్పరి సింగా" అంటూ బయలు దేరారు. కొంతమంది మొసళ్ళమీాద కూచున్నారు. కొంత మంది తాబేళ్ళమీాద కూచున్నారు. కొందరు ఒంటెల మీాదెక్కారు.

ఆ రాణువంతటకీ నాయకుడు నికుంభుడు. పెద్ద రథం మీాద బుసకొడుతూ వచ్చాడు.

శిశుపాలుడి నాయకత్వంకింద దుర్యోధనుడూ, అతడి తమ్ములూ, రుక్మీ, శల్యుడూ, శకునీ, భగదత్తుడూ, జరా సంధుడూ, సుశర్మా, విరాటుడూ నికుంభుడి సహాయానికి వచ్చారు.

యాదవసేనా, కాపిత్థసేనా కలబడ్డాయి. బాణాలూ, పరిఘలూ, పట్టిసాలూ, శతఘ్నులూ - రకరకాల ఆయుధాలతో కొట్టుకున్నాయి.

మాయాయుద్ధం మొదలెట్టాడు నికుంభుడు. కనపడకండా అయిపోయాడు. పట్నంలో మాయగుహాలు కల్పించాడు. ధృష్టినీ, కృతవర్మనీ, చారుదేష్ణుడూ, భోజుడూ, వైతరణుడూ, రుక్షుడూ, సనత్కుమారుడూ, ఉల్ముకుడూ మొదలైన వారినీ ఆ గుహాలలో కట్టేశాడు.

అది కనిపెట్టి కృష్ణుడూ, బలరాముడూ, ప్రద్యుమ్నుడూ, అనిరుద్ధుడూ మండిపడ్డారు. గుడ్లురిమాడు కృష్ణుడు. ధనుస్సు సంధించాడు. విషనాగుల్లాటి బాణాలు కుమ్మరించాడు.

వందలు వందలు, వేలు వేలు కూలిపోయారు కాపిత్థులు. రాళ్ళూ రప్పలూ, మాళ్ళూ మాకులూ, ముసలాలూ ముద్గరాలూ వాన కురిపించారు. గావుకేకలు వేశారు. గొల్లు గొల్లు చేశారు. జడివాన లెక్కచెయ్యని ఆబోతులా వాట్టిని రవంతా లెక్క చెయ్యలేదు కృష్ణుడు. వరసపెట్టి పగవాళ్ళని పడగొట్టాడు. అగ్గిపిడుగుల బాణాలు కురిపించాడు.

నిలవలేకపోయింది నికుంభుడి దండు. కకావికలయిపోయింది. కాళ్ళకి బుద్ధిచెప్పింది.

నికుంభుడి కంటే మాయలో ఏడాకులు ఎక్కువ చదివాడు ప్రద్యుమ్నుడు. పెద్ద మాయసారంగం కల్పించాడు. తానుమాత్రం కనిపించకండా కాపిత్థులకి సాయం వచ్చిన మొనగాళ్ళని ఒకొక్కళ్ణ్ణీ ఆ సారంగంలోకి పడదోశాడు.

మాయపాశాలతో బంధించాడు. అలా తన మాయతోనే కర్ణుణ్ణీ, దుర్యోధనుడూ, దుశ్శాసనుడూ, భీష్ముడూ, శకునీ, శల్యుడూ మొదలైన వారినీ; నీలుడూ, ద్రుపదుడూ, విరాటుడూ, విందాను విందులూ మొదలైన వారినీ; జరాసంధుడూ, శిశుపాలుడూ, త్రిగర్తుడూ, రుక్మీ, భగదత్తుడూ, వాసంతుడూ, మొదలైనవారినీ సారంగంలో కట్టేసి పెట్టాడు. వారిని కనిపెడుతూ వుండమని అనిరుద్ధుణ్ణి నియమించాడు. వారి రథాలూ, ఏనుగులూ గుర్రాలూ, ఆయుధాలూ అన్నీ లాక్కున్నాడు. ఆ వూపున వచ్చి, కాపిత్థ సేనమీద విరుచుకు పడ్డాడు. బాణాలవాన కురిపించాడు.

అటు కృష్ణుడూ, ఇటు ప్రద్యుమ్నుడూ, చిచ్చుల పిడుగుల్లా రెచ్చిపోడంతోనే మరింత జజ్జరిల్లిపోయింది నికుంభుడి చతురంగసేన. దిక్కూ తెన్నూ తెలీకుండా పిక్కబలిమి చూపింది. పారిపోతున్న వాళ్ళని చూశాడు, నిప్పులు కక్కాడు నికుంభుడు. పౌరుషం వురెక్కించాడు. మళ్ళించాడు. ఎలాగో నిలబడింది నికుంభు సేన.

ఇంతలో కొంత సేన బ్రహ్మదత్తుడి యజ్ఞంమీదికి నడిచింది. అయిమగుపూ అయిదు కొండల్లాగా నిలబడ్డారు పాండవులు. వచ్చిన కాపిత్థులందరినీ నరికి నరికి రక్తం నదులు పారించారు.

ఆ రక్తం నదుల్లో కాపిత్థుల జుత్తులే నాచు. రథ చక్రాలు తాబేళ్ళు. రథాలు సుడిగుండాలు. ఏనుగులు కొండలు. ఈటెలూ, జెండాలూ, చెట్లూ, ఏదుపులూ మొర్రలూ పురుములు.

నిలువునా మండిపోయాడు నికుంభుడు. మళ్ళీ మాయ లంకించుకున్నాడు. అవుపడకండా అర్జునుడిమీదా, మిగిలిన పాండవులమీదా అగ్నిబాణాలు కుమ్మరించాడు. కృష్ణుడి మీదా అలాగే కురిపించాడు.

కృష్ణుడు ధ్యానదృష్టితో చూశాడు. నికుంభుడి మాయ మాయమయింది. అందరికీ అతడు అవుపించాడు. అవుపించడంతోనే అర్జునుడు గాండీవం సారించాడు. పిడుగుల్లాంటి బాణాలు కొట్టాడు. కానీ ఒక్కటీ నికుంభుణ్ణి దూసుకుపోలేదు. వంకరపోయి కింద పడిపోయాయి.

ఆశ్చర్యపోయాడు అర్జునుడు. కృష్ణుణ్ణి అడిగాడు.

"ఏమిటీ చిత్రం?"

"తపస్సుచేసి సంపాదించిన శక్తి" నవ్వుతూ చెప్పాడు కృష్ణుడు. "తపస్సుచేసి మూడు శరీరాలు సంపాదించాడు వీడు. వెనక మేము వజ్రనాభుడ్ని చంపిన పగ పెట్టుకుని మా భానుడి కూతుర్ని భానుమతిని ఎత్తుకుపోయినప్పుడు వీడి ఒక శరీరం నాశనం చేసేశాను. మరో శరీరం తపస్సులో వుండి వీడ్ని కాపాడుతూ వుంది. అంచేతే నీ బాణాలు పని చేయడంలేదు. వీడికాలం దగ్గిర పడింది"

కృష్ణుడి మాటలు విన్నాడు నికుంభుడు. పట్నంలోకి పారిపోయాడు. పట్నంలోనే అతడి అసలు శరీరం తపస్సులో వుంది. భయంకరమయిందది.

నికుంభుడ్ని వెంట తరుముకు వెళ్ళాడు కృష్ణుడు.

ఒక చీకటి సొరంగంలో చొరబడ్డాడు నికుంభుడు. విడవకండా వెంటపడ్డాడు కృష్ణుడు.

వెళుతూ వెళుతూ ఎదురు తిరిగాడు నికుంభుడు. పెద్ద పరిఘ తీసి కృష్ణుడిమీద విసిరాడు. కృష్ణుడు గద విసిరాడు. పరిఘ తగిలి కృష్ణుడూ, గద తగిలి నికుంభుడూ జుమాలుమని పోయారు. అంతలోనే జల్దుకున్నారు. యుద్ధానికి సిద్ధపడ్డారు.

ఇంతలో బలరాముడూ, పాండవులూ అక్కడికి వచ్చారు.

మాయచేసి నికుంభుడు గుహల్లో కట్టిపెట్టిన రాజుల్నీ, యాదవుల్నీ ప్రద్యుమ్నుడు విడిపించాడు. తాను బంధించిన కర్ణుడూ, దుర్యోధనుడూ మొదలయిన వాళ్ళనీ విడిపించాడు. సిగ్గుపడి తలలు వొంచుకున్నారు కౌరవులు.

కృష్ణుడూ, నికుంభుడూ ఎంతోసేపు యుద్ధం చేశారు. రకరకాల ఆయుధాలతో కొట్టుకున్నారు.

చివరికి సుదర్శన చక్రం తీశాడు కృష్ణుడు. గురిచూసి విసిరాడు. తళతళా మెరుస్తూ మెరుపులు మెరుస్తూ వెళ్ళింది సుదర్శనం. నికుంభుడి తల నరికేసింది.

సింహనాదాలు చేశారు యాదవులు. శంఖాలు పూరించారు పాండవులు. కనపడకండా పారిపోయారు కాపిత్థులు.

బ్రహ్మదత్తుడి అశ్వమేధం అడ్డూ ఆపూ లేకండా పూర్తయింది. అతడికి షట్పురం దఖలు పరిచి, పరివారంతో ద్వారక వచ్చేశాడు కృష్ణుడు.

షట్పురం కాపిత్థ కన్యకల్ని, అందగత్తెల్ని, యౌవనవతుల్ని యాదవకుమాళ్ళు ద్వారకానగరం తెచ్చుకున్నారు.

కృష్ణుడిచ్చిన ఎన్నో రథాలూ అవీ పాండవులు తెచ్చుకున్నారు.

దుర్యోధనుడూ మొదలయినవారు దుఃఖపడుతూ ఇళ్ళకి మళ్ళారు.

పరాచికం

ఇంతమంది భార్యలున్నా ఎవతెనీ నొప్పించేవాడు కాడు కృష్ణుడు. ప్రతి ఇల్లాలూ తానే భాగ్యవంతురాలు అనుకునేట్టు నటించేవాడు. ప్రేమించేవాడు. మురిపించేవాడు. మురిసిపోయేవాడు. పరియాచకాలాడేవాడు. ఉలికించేవాడు. ఉబ్బించేవాడు. కృష్ణప్రేమలో తమ్మితాము మరిచిపోయే వారు వాళ్ళు.

"రుక్మిణీ!" ఓనాడు ఆమెతో అన్నాడతడు, "ఏం చూసి నన్ను కట్టుకున్నావు చెప్పూ! చిన్న రాజునయినా కాను నేను. శిశుపాలుడిలాటి మహామహా రాజుల్ని కాదని నా వెంట వచ్చేశావు. కబురుపెట్టి మరీ నన్ను రమ్మన్నావు. అన్నకి అవమానమయినా ఓర్చుకున్నావు. పాపం, తిరిగీ ఇంటి మొహం చూడలేదు మీ అన్న! మహారాజుని కట్టుకుంటే మహారాణివయే దానివి. రాజ్యాలేలేదానివి! ఇప్పుడైనా చెప్పు, మించిపోయింది లేదులే. మహారాణివి కావాలనుంటే—"

వినలేకపోయింది పాపం రుక్మిణి. తట్టుకోలేకపోయింది పరియాచికం. కన్నీళ్ళతో తెలివితప్పి పడిపోయింది.

నాలిక కరుచుకున్నాడు కృష్ణుడు. ఆమెని పొదివి పట్టుకున్నాడు. ఉపచారాలతో తెలువుకున్నట్టు చేశాడు.

"పరియాచికానికే ఇలా అయిపోతారా ?"

"పరియాచికమా ఇది"

వెక్కి వెక్కి ఏడ్చింది రుక్మిణి.

"నీ నోట ఈ మాట వినాలనే అన్నాను, అంతే. నాకు తెలీదూ, నువ్వు నా రాణివి" అంటూ బుజ్జగించాడు కృష్ణుడు.

"మహారాణిని కావాలన్నానా నేను !" మెల్లిమెల్లిగా కళ్ళు తుడుచుకుంటూ అంది రుక్మిణి, "నీ రాణిని కావాలనే నీ వెంట వచ్చాను. నిలకడలేని సంపదలమీద ఎన్నడూ లేదు నాకు. నిన్ను ప్రేమిస్తున్నానూ అంటే నీ ఈ లలాటమూ, నేత్రాలూ, మీసమూ, గెడ్డమూ – ఈ అందమూ చూసికాదు. ఏదో చెప్పలేని - దానికోసమే ప్రేమిస్తున్నాను. ప్రపంచంలోని ఐశ్వర్యమంతా దానిముందు దిగదుడుపు. రాజ్యాలూ, సామ్రాజ్యాలూ అన్నీ దాని కాలిగోటికి పోలవు." అంటూ తల వంచుకుంది.

"ఇదిగో ఇది వినడానికే వుడికించాను" అంటూ ఆమెని దగ్గిరికి తీసుకున్నాడు కృష్ణుడు.

కృష్ణుడి భార్యలందరిలోనూ అభిమానవతి సత్యభామ. ఈసుకి పెట్టిందిపేరు. తనంత అందకత్తె వేరొకతె లేదని గర్వం. కృష్ణుడు ముప్పొద్దులా తనదగ్గరే వుండాలనీ, తన తోనే గడపాలనీ ఆమె కోరిక. ఆమె దగ్గిర అలాగే నటించే వాడు కృష్ణుడు.

ఓనాడు పారిజాతపుష్పం రుక్మిణికి కృష్ణుడిచ్చాడని ంధామె. తోకతొక్కిన పాములాగ లేచింది. నగలూ అవీ

తీసి పారేసింది. మొహాన కుంకుం చెరిపేసుకుంది. మాసిన చీరెకట్టి, అలకగదిలో పడుకు ది.

కృష్ణుడు వచ్చి బుదిరించాడు. తుదకి పారిజాతం చెట్టే తెచ్చి ఆమె పెరట్లిలో నాటాడు.

అలా అంతమంది భార్యల్నీ ఆనందపరుస్తూ కాపరం చేస్తూ వుండేవాడు. సత్యభామమాత్రం అప్పుడప్పుడు ఉపద్రవం తెస్తూనే వుండేది. కృష్ణుణ్ణి తన కొంగుని ముడికట్టుకోవాలని "పుణ్యకవ్రతం" వంటి వ్రతాలూ చేసేది.

జరాసంధుడి అంతం

ఇంద్రప్రస్థంలో కృష్ణుడు చెప్పివచ్చిన ప్రకారం ధర్మరాజుకోసం సభ తయారుచేశాడు మయుఁడు. అంతా బంగారంతోనూ, రకరకాల రత్నాలతోనూ తయారయిందది. నీళ్ళున్నచోట లేనట్టూ, లేనిచోట వున్నట్టూ, ద్వారం లేనిచోట వున్నట్టూ, వున్నచోట లేనట్టూ భ్రాంతి కలిగించేదది. ఎక్కడా అంత చిత్రమైన సభ లేదు.

మయసభతో ధర్మరాజు కీర్తి మరింత హెచ్చింది. దాంతో రాజసూయం చేయాలని సంకల్పం కలిగిందతనికి. అందుకని ఇంద్రసేనుణ్ణి కృష్ణుడి దగ్గరికి ద్వారక పంపాడు.

అందెవేసిన సారథి ఇంద్రసేనుడు. ఆగమేఘాలమీాద వచ్చి కృష్ణుణ్ణి దర్శించాడు.

కాలకృత్యాలు తీర్చుకుని, ముస్తాబు చేసుకుని, సుధర్మ సభలో కూచున్నాడు కృష్ణుడు. తన వాళ్ళ మంచిచెడ్డలు

విచారించాడు. ప్రజల కష్టసుఖాలు ఆలకించాడు. మంత్రులతో మంతనాలు సలిపాడు. కళలూ శాస్త్రాలూ చర్చించాడు.

ఇంతలో ఇంద్రసేనుణ్ణి చూసి ఎంతో ఆదరించాడు. ఇంద్రప్రస్థంలోని అందరి క్షేమం విచారించాడు.

"ఏం, తొందరపని కలగలేదు కదా?"

చిరునవ్వుతో అడిగాడు.

చేతులు జోడించి చెప్పాడు ఇంద్రసేనుడు.

"నీ సెలవు ప్రకారం మయసభ తయారయింది. నీ దర్శనం కోరుతూ వుంది.

ధర్మరాజు రాజసూయం చేయాలనుకుంటున్నాడు. నీ సెలవు కావాలి. దయచేయమని నన్ను పంపాడు."

ఇంద్రసేనుడి నోట్లో మాట నోట్లోనే వుంది. మగధ నించి ఒక మనిషి వచ్చి చేతులు జోడించి నుంచున్నాడు.

"ఎవరు?" అన్నట్లు చూశాడు కృష్ణుడు.

"ప్రభూ! జరాసంధుడు మగధ గిరివ్రజంలో ఖైదు చేసిన రాజులు పంపిన దూతని నేను. జరాసంధుడు వెనక దిగ్విజయం చేసినప్పుడు, అతడి అడుగులికి మడుగులొత్తని రాజుల్ని ఇరవయి వేలమందిని బంధించి చెరసాలలో పెట్టి హింసపెడుతున్నాడు. బంధీలయిన రాజులందరూ పంపుకున్న విన్నపం చిత్తగించు. కృష్ణప్రభూ! జరాసంధుడి బంధిఖానాలో అష్టకష్టాలూ అనుభవిస్తున్నాం. చావుబతుకుల్లో వున్నాం. ఈ దుర్మార్గుడు బలివేయకముందే మమ్మల్ని బతి

కించు. నీ వాళ్ళం మేం. నీ నీడ కోరుతున్నాం. నువ్వు తప్ప ఇంకే దిక్కు లేదు మాకు."

మగధ మనిషి సందేశం విన్నాడు కృష్ణుడు. ఉద్ధవుడూ, విత్రదుడూ, విదూరథుడూ బభ్రుడూ, మొదలైన మంత్రుల వేపు తిరిగి 'ఏమంటారు?' అన్నట్టు చూశాడు.

అందరిలోకీ బుద్ధిమంతుడు ఉద్ధవుడు. కృష్ణుడి పరమ నేత్రం వంటివాడు. ఇలా అందుకున్నాడతడు:

"ఇటు ఇంద్రప్రస్థం నించీ, అటు మగధనించి ఒక్క మారే వచ్చారు దూతలు. కాగల కార్యం గంధర్వులే తీరుస్తారిక. రాజుల రక్షణా, ధర్మరాజు రాజసూయం ఒక్కపనితోనే నెరవేరతాయి. అంతేకాదు మన పక్కలో బల్లెమూ ముక్కలవుతుంది. రాజులందరినీ గెలిచినవాడే రాజసూయం చెయ్యాలి. అందరిలోకీ బలవంతుడు జరాసంధుడు. అతణ్ణి గెలిస్తే కడమరాజులు ఇష్టే తలవొగ్గుతారు.

జరాసంధుడు ఆయుధాలతో చావడు. ద్వంద్వ యుద్ధంలో దారికి వస్తాడు. ధర్మరాజు తమ్ముడు భీముడు దానికి తగినవాడు."

యాదవ సభంతా ఉద్ధవుణ్ణి సమర్థించింది. ఇంద్రప్రస్థం పయనమయాడు కృష్ణుడు. రథం సిద్ధం చేశాడు దారుకుడు.

మగధ మనిషిని సాదరంగా సెలవిచ్చి పంపాడు కృష్ణుడు. "వెళ్ళు, రాజులకి ధైర్యం చెప్పు. మీ కష్టాలు గట్టెక్కడానికి ఎంతో కాలం పట్టదు - అని నా మాటగా

చెప్పు" అన్నాడు. రథమెక్కి తన రాణువతో ఇంద్రప్రస్థం వచ్చాడు.

అతడు వస్తాడని ఇంద్రప్రస్థం ముస్తాబు చేసిపెట్టారు. జనం బారులు తీర్చి నుంచున్నారు. వీధి గుమ్మాల్లోనూ, మేడలమీదా ఆడంగులు కళ్ళప్పగించి నుంచున్నారు. చీరెలు జారిపోతున్నా, కొప్పులు విడిపోతున్నా, చెంగులు ఎగిరి పోతున్నా కానుకోలేదు వాళ్ళు.

ఎదురు వచ్చారు పాండవులు. ధర్మరాజుకి నమస్కరించాడు కృష్ణుడు. భీమార్జునుల్నీ, నకుల సహదేవుల్నీ గుచ్చి కౌగిలించుకున్నాడు. వారి వందనాలందుకున్నాడు. లోగిలిలోకి వెళ్ళి మేనత్త కుంతికి నమస్కరించాడు. చెల్లెలు సుభద్రనీ, ద్రౌపదినీ ఆదరించాడు. వారి వందనాలందు కున్నాడు.

కృష్ణుడి వెంట అతడి భార్యలూ, పరివారమూ వచ్చారు. ఎవరికి తగిన మర్యాదలూ, సత్కారాలూ జరిగించారు పాండవులు.

కుశల ప్రశ్నలూ అవీ అయ్యాక ఓనాడు కృష్ణుడితో కూడా కొలువులో కూచున్నాడు ధర్మరాజు. తమ్ములు భీముడూ, అర్జునుడూ, నకులుడూ, సహదేవుడూ ఎవరి స్థానాల్లో వారు కూచున్నారు.

కులాసాగా అందరూ కూచున్నాక, కృష్ణుడ్ని చూస్తూ నెమ్మదిగా అందుకున్నాడు ధర్మరాజు:

"కృష్ణా ! మా వాళ్ళందరూ రాజసూయం చెయ్యమంటున్నారు నన్ను. అది కష్టసాధ్యమని ఎరుగుదును.

అయినా నీ ఆసరాతో అభిలాషపడుతున్నాను. నువ్వు ఏం చెపితే అది చేస్తాను. నువ్వు కాదంటే ఆ జోలికి పోను. ఆదేశించు" అన్నాడు.

"ఎదురులేని సంకల్పం నీది." అంటూ ఎత్తుకున్నాడు కృష్ణుడు, "రాజసూయానికి తగిన సాధన సంపత్తి అంతా వుంద నీకు. అయితే రాజసూయం చేయవలిసినవాడు సమ్రాట్టు కావాలి. సమ్రాట్టు కావాలంటే రాజులందరినీ గెలవాలి. దిగ్విజయం చేయాలి. నీ నలుగురు తమ్ములూ నాలుగు దిక్కులూ గెలుచుకు వస్తారు. సందేహం లేదు. అయితే వున్న రాజుల బలాబలాలు విచారించాలి. పగవాడెవడో లెక్క వేయాలి.

భీష్ముడు, దుర్యోధనుడు, ద్రోణుడు, కృపుడు, కర్ణుడు, రుక్మి, ఏకలవ్యుడు, శ్వేతుడు, శకునీ వీరాధివీరులు. కాని వీరు నీకు అడ్డురారు.

మా యాదవులలో పద్ధెనిమిది వేలమంది జ్ఞాతులున్నారు. అందరికందరూ బలవంతులు. బలరాముడు, సాత్యకీ, ప్రద్యుమ్నుడు, సాంబుడు, చారుదేష్ణుడు, చారుదేవుడు అతిరథులు. కృతవర్మా, ఉగ్రసేనుడు, అనాదృష్టీ, సమీకుడు, సమితింజయుడు, కంకుడు, శంకుడు, కుంతిభోజుడు మొదలైనవారు మహారథులు. వీరున్నా నీకు అడ్డురారు.

మేం పురూరవ వంశం వారమంటే మేం ఇక్ష్వాకు వంశం వారమంటూ అక్కడక్కడ మీసాలు మెలివేస్తున్న రాజులు వంద వంశాల వారన్నా వుంటారు. యయాతి

వంశంవారూ, భోజవంశంవారూ హెచ్చుగానే వున్నారు. భగదత్తుడూ, పురజిత్తూ, వంగ, పుండ్ర, కిరాత దేశాల రాజులూ, ఛేదిరాజు భీష్మకుడూ, పౌండ్రకుడూ, వీళ్ళంతా అదుగో ఆ జరాసంధుడికి దాసులు. అతడికి భయపడి భోజ వంశం పద్ధెనిమిది కులాలూ ఉత్తరాదికి పారిపోయాయి. శూర సేన, భద్రకార, శాల్వ, పడిచ్చర, కుళింద, కుంతి, శల్వా యన రాజులు దక్షిణాదిని తలదాచుకున్నాయి. దక్షిణ పాంచాలం, తూర్పు కుంతిభోజ, కోసల, మత్స్య దేశాల రాజులు, పాంచాలం వాళ్ళూ పలాయనం చిత్తగించారు. శిశుపాలుడంతటివాడు జరాసంధుడి సేనానిగా కుదురు కున్నాడు. దంతవక్త్రుడూ, అతగాడి బానిస.

ఇదంతా చూస్తే ధర్మరాజా, జరాసంధుడే ఇప్పుడు బలశాలి. అతడే సమ్రాట్టు. ఇంతెందుకూ, మా సంగతే చూడు. వాడితోనే వేగలేక పుట్టినవూరు మధుర వొదిలేసి, సముద్రంలోకి పారిపోయాం. కనక జరాసంధుడున్నంత వరకూ నువు సమ్రాట్టువి కాలేవు. రాజసూయం చెయ్య లేవు." అన్నాడు కొంచేపు ఆగి మళ్ళీ అందుకున్నాడు :

"అలా అని ఆగిపోనక్కరలేదు. దేనికయినా ఉపాయం వుండనే వుంటుంది. నేనూ, అర్జునుడూ, భీముడూ, వెళతాం. జరాసంధుణ్ణి అంతంచేసి వస్తాం. ఎంతోమంది రాజుల్ని చెరలోవుంచాడు వాడు. వాళ్ళందరినీ విడిపిస్తాం. నీ రాజ సూయానికి పిలుస్తాం. ఈ రాజుల్ని బలికోసమే బంధించాడు వాడు. అనుకున్నదానికి నూటికి ఇరవైపాళ్ళు తక్కువున్నారు

రాజులు. వెల్తి పూర్తికాగా అందరినీ బలివేసి తన వ్రతం పూర్తిచేయాలని వాడి సంకల్పం.

ఆయుధాలతో చావడు జరాసంధుడు. మల్ల యుద్ధంలో చస్తాడు. భీముడు వాడ్ని చీల్చి చంపుతాడు. జర సంధించిన రెండు చెక్కలూ రెండుగా చీల్చడమే దీనికి ఉపాయం. కనక మా ముగ్గురమూ మగధ, గిరివ్రజం వెళ్ళ డానికి అనుమతించు."

భీమార్జునులతో కలిసి బ్రాహ్మణవేషం వేసు కున్నాడు కృష్ణుడు. కొండలూ, అడవులూ, ఏళ్లూ, వూళ్ళూ దాటి వాళ్ళతో గిరివ్రజం వెళ్ళాడు. బ్రహ్మలతో కలిసి జరాసంధుడ్ని చూచాడు.

కండలు తిరిగిన వీరి ముగ్గురి శరీరాలూ, తీరుతెన్నులూ చూచాడు జరాసంధుడు, అనుమానిస్తూనే అడిగాడు:

"ఏం కావాలి?"

"యుద్ధం కావాలి." అన్నాడు కృష్ణుడు.

"ఎక్కడో విన్నట్టేవుంది నీ గొంతుక, ఎవరు నువ్వు? క్షత్రియుడివా?"

"అవును, కృష్ణుడంటారు నన్ను. నీకు తెలిసినవాణ్ణే. ఇతడు భీముడు, ఇతడు అర్జునుడు. నీతో ద్వంద్వయుద్ధం కోరివచ్చాం. విరగబడి నవ్వాడు జరాసంధుడు.

"నా పేరంటే తోకముడిచిన పిరికిపంద కృష్ణుడివేనా? యుద్ధం కావాలా? సరదా పుట్టిందా? ఇస్తాను. యుద్ధమే ఇస్తాను, రా! కాని మళ్ళీ పారిపోకండామాత్రం నిలబడు. వంటింటి కుందేలువి, ఎటుపోతావు! ఇది గిరివ్రజం. నేను

జరాసంధుణ్ణి, అయితే పిరికి పారుబోతుల్తో చెయ్యిచేసుకోను. కనక నీతో కాదు. ఇదిగో వీడు, ఈ భీముడు కంటికి ఆనుతున్నాడు కొంచెం. వీడితో పోట్లాడతాను, రమ్మను.”

జబ్బచరిచాడు జరాసంధుడు. భీముడి వీపుతట్టాడు కృష్ణుడు.

గిరివ్రజం వూరి పొలిమేర మైదానంలో జరాసంధుడూ, భీముడూ పోట్లాడారు. గదలతో ద్వంద్వయుద్ధం చేశారు. మల్లయుద్ధం కుస్తీపట్లు పట్టారు. ఆబోతుల్లాగ, ఏనుగుల్లాగ దెబ్బలాడారు. పగళ్ళు పగపట్టి పోరాడేవాళ్ళు, రాత్రుళ్ళు మిత్రుల్లా వుండేవాళ్ళు. అలా ఇరవయ్యేడు పగళ్ళు పోట్లాడారు. ఎవర్ని ఎవరూ గెలవలేకపోయారు.

మర్నాడు యుద్ధానికి సిద్ధపడుతూ “జరాసంధుడిని చంపలేను” అన్నాడు భీముడు.

“ పద ” అన్నాడు కృష్ణుడు.

జరాసంధుడితో చేతులు కలిపాడు భీముడు. కృష్ణుడి వేపు చూశాడు. చిన్నకొమ్మ పట్టుకుని, చీల్చిపడేశాడు కృష్ణుడు.

జల్దుకున్నాడు భీముడు. జరాసంధుడిని పడదోశాడు. అతడి ఒకకాలు తన కాలితో అణిచిపెట్టాడు. రెండో కాలు రెండుచేతులతోనూ పట్టుకుని బలంకొద్దీ చీల్చేశాడు. రెండు చెక్కలయిపోయాడు జరాసంధుడు. ప్రాణం వదిలేశాడు.

జరాసంధుణ్ణి భీముడిచేత అలా చంపించి, చెరలోని రాజులందరినీ విడిపించాడు కృష్ణుడు.

అంతమంది రాజులూ వచ్చి కృష్ణుడి అడుగులమీద వాలారు. కన్నీళ్ళతో అతడి అడుగులు కడిగారు. పరిపరి విధాల స్తోత్రాలు చేశారు. అంతకాలమూ తాముపడ్డ కష్టాలన్నీ మరిచిపోయారు.

అందరినీ ఆదరించాడు కృష్ణుడు. ధైర్యం చెప్పాడు. వారు ఖైదులో వేసుకున్న మురికిగుడ్డలు తీయించి విలువైన వస్త్రాలు ఇప్పించాడు. నగలు ముస్తాబు చేయించాడు. మంచి విందు భోజనాలు పెట్టించాడు. "ధర్మం తప్పకండా రాజ్యాలు పాలించండి" అంటూ ప్రబోధించాడు. అందరికీ అన్ని రథాలిప్పించి వారి వారి దేశాలకి సాగనంపాడు. మగధకి జరాసంధుడి కొడుకుని సహదేవుణ్ణి రాజు చేశాడు. అతడిచ్చిన విలువైన కానుకలు పుచ్చుకున్నాడు.

జరాసంధుడి దగ్గిర 'సోదర్యం' అని గొప్ప రథముండేది. ఇద్దరు రథికులు కూచుని యుద్ధం చేయదగిన రథమది. ఎంతమంది ఏకమై వచ్చినా ఓడించగలదది. దాన్ని తన వశం చేసుకున్నాడు శ్రీకృష్ణుడు. అదంతా అయాక భీమార్జునులతో కలిసి ఇంద్రప్రస్థం వచ్చేశాడతడు.

పట్నం పొలిమేర చేరగానే పాంచజన్యం పూరించాడు కృష్ణుడు. పౌండ్రకం పూరించాడు భీముడు. దేవదత్తం పూరించాడు అర్జునుడు.

మూడు శంఖాలూ విన్నాడు ధర్మరాజు. గెలుపు సాధించి కృష్ణుడు భీమార్జునులతో వచ్చేశాడు అని తెలుసుకున్నాడు. ఉన్నపాళాన లేచాడు. తమ్ములతోనూ, మంత్రులతోనూ ఎదురు వెళ్ళాడు.

భీమార్జునులతో ధర్మరాజుకి నమస్కరించాడు కృష్ణుడు. ముగ్గురినీ కౌగిలించుకున్నాడు ధర్మరాజు.

అలా తన పగవాడ్ని జరాసంధుడ్ని పాండవులచేత అంతం చేయించి, ధర్మరాజు రాజసూయానికి అడ్డులేకండా చేసి, పరివారంతో ద్వారక తిరిగి వచ్చేశాడు కృష్ణుడు. జరాసంధుడు చచ్చాడనగానే ఎగిరి గెంతేశారు యాదవులు.

బృందావనంలో బలరాముడు

ఉన్నట్టుండి బృందావనం గొల్లపల్లె వెళ్ళాలని దీవి పుట్టింది బలరాముడికి. కృష్ణుడితో చెప్పి, వెనకటి కోనారి వేషం వేసుకుని, రథంమీద బయలుదేరాడు. చిన్నప్పుడు ఆడుతూ, పాడుతూ తిరిగిన బృందావనం చూడగానే అతడి తనువు పులకరించింది. ఆనాటి దినాలు తనువుకి వచ్చాయి. అదే యమున. అదే గోవర్ధనం. అదే గొల్లపల్లె. అవే ఆల మందలు. ఒళ్ళు మరిచిపోయాడు బలరాముడు.

"బలరామయ్యా! బలరామయ్యా!" అంటూ పల్లెపల్లే పరిగెత్తుకు వచ్చారు.

నందుడికీ, యశోదకీ నమస్కరించాడు బలరాముడు. కన్నీళ్ళతో కావలించుకున్నారు వారు. కరువుతీరా ముద్దులాడారు.

"ఎన్నాళ్ళకి కనిపించావు బాబూ! నీ తమ్ముడు కృష్ణుడు కులాసాగా వున్నాడా? మీరు కంటపడక కళ్ళ వెలుగే మాసి పోయిందయ్యా! పెద్దవాడి వయిపోయావు. అమ్మనీ, నాన్ననీ తలుచుకుంటాడా బాబూ, కృష్ణుడు.

నీలాగే పెద్దవాడయి ఉంటాడు మా కన్న." ఇలా అడిగిందే అడుగుతూ, అతడి తెల్లటి శరీరం నిమురుతూ వుక్కిరి బిక్కిరి చేసేశారు.

అన్ని ప్రశ్నలూ వింటూ, అన్నిటికీ అన్ని జవాబులూ చెప్పాడు బలరాముడు. తనకంటే పెద్దలైన కోనార్లందరికీ దండాలు పెట్టాడు. చిన్నవాళ్ళని దీవించాడు. కొందరిని గుచ్చి కౌగిలించుకున్నాడు. అందరినీ కుశలమడిగాడు. ఎవరిని ఏ వరసతో పిలవాలో ఆ వరసతో పిలిచాడు. ఆ వావితో మాటలాడాడు.

"మమల్ని మరిచేపోయావు రామయ్యా!" చనువుగా, స్నేహంగా అన్నారు వాళ్ళు, "కృష్ణయ్యా అంతే! పట్నం చేరిన ప్రతివాళ్ళూ అంతేలే, మీ మేడలముందు మా గుడిసెలు కనబడవు. మీ రథాలముందు మా ఎడ్ల బండ్లు కనపడవు. మీ ఏనుగులూ, గుర్రాలముందు మా ఆల మందలూ అవుపడవు."

నవ్వుతూ అవన్నీ విన్నాడు బలరాముడు ఆనందించాడు.

"ఏది ఏమైనా వ్రేపల్లె నేను పుట్టినచోటు. తమ్ముడూ నేనూ ఇక్కడే పెరిగాం. ఏమాత్రమయినా మేం ప్రయోజకులమయామంటే అదంతా మీ చలవ. మేం మీవాళ్ళం. మీరు మా వాళ్ళు" అంటూ వాళ్ళని సంతోష పరిచాడు బలరాముడు.

బలరాముడు వచ్చాడంటే సంబరపడ్డారు గొల్ల భామలు. "ఒక్కడే వచ్చాడా?" అంటూ పరిగెత్తుకు

వచ్చారు. అతడి చుట్టూ మూగారు. "దారితప్పి వచ్చావా రామయ్యా? ఇన్నాళ్ళకి తనువులో పడిందా బృందా వనం? తమ్ముడు రాలేదా? ఆయనెందుకు వస్తాడులే! ఇక్కడెవ్వరున్నారుగనుక! పట్నం వన్నెల విసనకర్రల ముందు గొల్లపడుచులూ, పల్లెగుంటలూ ఏం పనికొస్తారు?

ఎంత మాయకాడయ్యా మీ నల్లతమ్ముడూ! నమ్మించి గొంతులు కోశాడు. అన్నీ నమ్మాం. ఒక్క మాటా నిలకడలేదు. అన్నీ నీటిమీద రాతలే.

విన్నామయ్యా, విన్నాం. ఎనమండుగురు రాణీల్ని పెళ్ళాడాడు. పదహారువేల రాజు కూతుళ్ళని కట్టుకున్నాడు. పిల్లా జెల్లా కన్నాడు. మమ్మల్ని మరిచిపోయాడు" అంటూ వెక్కి వెక్కి ఏడ్చారు. ఇంకా ఇలా అన్నారు:

"మా ఇళ్లూ, వాకిళ్లూ వొదిలేశాం. మగళ్ళని వొదులుకుని అతగాడి వెంట పడ్డాం. నువ్వెరగంది ఏముందికనక. ఆ యమునలో తానాలూ, ఇసుకతిన్నెల సలాపాలూ, వెన్నెల రాసక్రీడలూ, తలుచుకుని తలుచుకుని కుమిలిపోతున్నామయ్యా కుమిలిపోతున్నాం" అంటూ మరింత ఏడ్చారు.

నెమ్మదిగా ఓదార్చాడు బలరాముడు. కృష్ణుడు వారితో చెప్పమన్న మాటలు చెప్పి వినిపించాడు. వసంత కాలమంతా బృందావనంలోనే వున్నాడు. అక్రూరుడితో మధుర వెళ్ళినప్పటినుంచీ అంతవరకూ తాము చేసినవన్నీ కథలలాగ చెపుతూ, పాత నేస్తాలతో గడిపాడు. మద్యం తాగుతూ మత్తెక్కి తిరిగాడు. తాను తాగడమే కాక గొల్ల

భామలచేతా తాగించాడు. వాళ్ళతో తోటల్లోనూ, యమున ఇసక పర్రలలోనూ క్రీడించాడు.

ఒకనాడు బృదావనం అడివిలో కూచుని చిత్తుగా తాగి, గోపికలతో తాగించి, ఆ మత్తులో ఏమేమో చేశాడు. ఉన్నట్టుండి జలక్రీడకి బుద్ధిపుట్టింది. దూరాన యమున పారుతూవుంది. తాగిన మత్తులో "రావే యమునా దగ్గిరికి రా!" అన్నాడు. రాలేదు యమున. అంతేసి గుడ్లుచేసి లేచాడు. తన నాగలితో తవ్వితవ్వి యమునని బృందావనం పెరట్టిదాకా పారినట్టు చేశాడు. తాగినవాడితో తగువేమిట్రి అన్నట్టు అలాగే పారుతూ వచ్చింది యమున.

అలా తాగుతూ, గొల్లభామలతో రమిస్తూ, జలక్రీడలాడుతూ బృందావనంలో కొన్నాళ్ళు గడిపి ద్వారక వచ్చేశాడు బలరాముడు.

"హస్తిన గంగలో కలిపేస్తా"

దుర్యోధనుడికి లక్షణ అని ఒక కూతురుండేది. కృష్ణుడి కొడుకుల్లో సాంబుడు ఆమెని వలచి పెళ్ళిచేసుకోవాలనుకున్నాడు. కాని దుర్యోధనుడు ఇష్టపడలేదు. స్వయంవరం చాటించాడు. ఒడుపుచూసి లక్షణను ఎత్తుకురాబోయాడు సాంబుడు. పట్టుకున్నారు కౌరవులు.

సామాన్యుడుకాడు సాంబుడు. ఒక్కడే అయినా కౌరవులతో పోరాడాడు. వాళ్ళని ఏడుచెరువుల నీళ్ళు తాగించాడు. కాని కర్ణుడూ మొదలైనవారు ఒక్కసారి

మీదపడ్డారు. లక్షణతో కూడా సాంబుణ్ణి పట్టేసి తీసుకు పోయారు. కదలనివ్వకుండా కట్టిపడేశారు.

ద్వారకలో సాంబుడు కనపడలేదు. కలవరపడింది జాంబవతి. అంతటా వెదికారు యాదవులు. కౌరవులు కట్టి పడేశారని కబురు తెలిసింది తుదకి.

మండిపడ్డారు యాదవులు. హస్తిన ముట్టడికి బయలు దేరారు. కత్తులూ, కటార్లూ సవరించారు. "బప్పరిసింగా" అంటూ పొలికేకలు వేశారు. అట్టుడికినట్టు వుడికిపోయింది ద్వారక.

"ఆగండి" అన్నాడు బలరాముడు. "నేను వెళతాను. వాళ్ళు దారికి రాకపోతే అప్పుడు వుండనేవుంది దండో పాయం" అంటూ రథమెక్కి హస్తిన బయలుదేరాడు. ఉద్ధవుడూ మొదలైన కొద్దిమందినిమాత్రం వెంట తీసుకు వెళ్ళాడు. పట్నంబయటే వుండి, ఉద్ధవుణ్ణి ధృతరాష్ట్రుడి దగ్గిరికి పంపాడు.

బలరాముడు వచ్చాడంటే గౌరవించినా, సాంబుణ్ణి మాత్రం విడిచిపెట్టమన్నారు కౌరవులు. అంతేకాదు, అన రాని మాటలూ అని అవమానించారు.

భగ్గుమన్నాడు బలరాముడు. హస్తిన గంగలో కలి పేస్తాను అంటూ నాగలి తీశాడు. నాగలి మొనతో హస్తినా నగరం పెల్లగించాడు. ఊగిసలాడిపోయింది హస్తిన. భూకంపం పుట్టినట్టయింది. పట్టణమంతా దడదడలాడింది. కంగారు పడిపోయారు కౌరవులు. సాంబుడి కట్లు విప్పేశారు.

లక్షణతో కూడా అతణ్ని తెచ్చి బలరాముడి ఎదట పెట్టారు. మన్నించమని వేడుకున్నారు.

నాగలి నిలిపేశాడు బలరాముడు. వధూవరుల్ని కట్నాలూ, కానుకలూ ఇచ్చి సాగనంపారు కౌరవులు. పన్నెండువేల ఏనుగులూ, పదివేల గుర్రాలూ, ఆరువేల రథాలూ అరణమిచ్చాడు దుర్యోధనుడు.

అదిగో అవాళ బలరాముడు నాగలి మొనతో పెల్లగించడం చేతనే ఇప్పటికీ ఏటవాలుగా వుంటుంది గంగవేపు హస్తిన.

పౌండ్రకవాసుదేవుడు

కరూశదేశం రాజు పౌండ్రకవాసుదేవుడు. అతడి చుట్టూ చేరినవాళ్ళు అతణ్ని "నీ అంతవాడు లేడని పొగిడే వారు. అవుననుకునే వాడతడు. వసుదేవుడి కొడుకు కనక కృష్ణుణ్ని వాసుదేవుడనేవారు. "అదేమిటి? ఇద్దరు వాసుదేవులేమిటి? నేనే అసలు వాసుదేవుణ్ని" అనేవాడు పౌండ్రకుడు. కృష్ణుడిలాగే కిరీటం పెట్టుకునేవాడు. శంఖం, చక్రం, గదా, ధనుస్సూ పట్టుకునేవాడు. కృష్ణుడిలాగే తన చక్రం పేరు సుదర్శనమనీ, గదపేరు కౌమోదకమనీ, ధనుస్సు శార్ఙ్గమనీ, శంఖం పాంచజన్యం అనీ చెప్పుకునేవాడు. కృష్ణుడిలాగే పసుపురంగు పట్టుబట్ట కట్టుకునేవాడు. పూలదండలు వేసుకున్నాడు. "నేనే, నేనే వాసుదేవుణ్ని. మరొకడు లేడంటూ

చాటుతూ వచ్చాడు. అంతతో ఫూరుకోలేదతడు. ఓనాడు కృష్ణుడి దగ్గిరికి దూతని పంపాడు.

"కృష్ణా! నిజమయిన వాసుదేవుడ్ని నేను. నువ్వు వాసుదేవుడివి కావు. ఇకనించి ఆ పేరు నువ్వు మాను కోవాలి. అంతేకాదు. నీ చక్రమూ, గదా, విల్లూ, శంఖమూ పారెయ్యాలి. ఇలా చేశావా సరేసరి, కాదంటావా, చంపే స్తాను." అని సందేశం పంపాడు.

దూత వచ్చి యాదవుల సభలో ఉగ్రసేనుడి ముందు సందేశం వినిపించాడు. నవ్వుకున్నారు యాదవులు.

మాటలతో మానుకోలేదు పౌండ్రక వాసుదేవుడు. ఓనాటి రాత్రి, ఏకలవ్యుడితోనూ, కాశీరాజుతోనూ కలిసి ద్వారకమీద దాడి చేశాడు. కృష్ణుడు లేడారాత్రి. ఏక లవ్యుడి కిరాతసేనా, పౌండ్రకుడి కరూశసేనా ద్వారక చుట్టు ముట్టాయి. బలరాముడూ, సాత్యకీ మొదలైన యాదవ వీరులు సేనలతోఎదిరించారు. తెల్లవారులూ ఘోరంగా జరి గింది యుద్ధం.

తూరుపు పలకబారుతూ వుండగా కృష్ణుడి పాంచ జన్యం వినిపించింది. యాదవసేన సముద్రంలా వుప్పొంగింది.

తనలాగే వేషం వేసుకుని, తనలాగే ఆయుధాలు పట్టు కుని బోరవిరుచుకు నించున్న పౌండ్రక వాసుదేవుడ్ని చూశాడు కృష్ణుడు. నవ్వాపుకోలేకపోయాడు.

అంతవరకూ సరాసరి సాత్యకితో పోరాడుతున్న పౌండ్రక వాసుదేవుడు కృష్ణుడివేపు తిరిగాడు. సేనల్ని

రెచ్చగొట్టాడు. గదలూ, ముద్గరాలూ, శస్త్రలూ, కత్తులూ కురిపించారు సైనికులు. బాణాలతో ముంచెత్తారు.

కనుబొమలు ముడిపెట్టారు కృష్ణుడు. ధనుస్సు మోగించాడు. బాణాలు సంధించాడు. పౌండ్రకసేన పడగొట్టాడు. కాశీరాజుసేన కణుపు కొట్టాడు. సుదర్శనం ప్రయోగించాడు. ఏనుగులు పీనుగులు చేశాడు. గుర్రాలు కూలగొట్టాడు. రథాలు పిప్పిచేశాడు. సైనికుల తలకాయ లెగరగొట్టాడు. పగవాళ్ళ దండంతా పరుగులు తీసింది.

పౌండ్రక వాసుదేవుడి మీదికే వురికింది కృష్ణుడిరథం.

"పౌండ్రకా! నీ మాటే నిజం. ఇద్దరు వాసుదేవులుండకూడదు" అంటూ చక్రం విసిరాడు కృష్ణుడు. పౌండ్రకుడి తల ఎగరగొట్టేసింది చక్రం. ఆగలేదు కృష్ణుడు. పౌండ్రకుడి తలకిందపడిందో లేదో కాశీరాజు తలా నరికిపారేశాడు. ఏకలవ్యుణ్ణీ, అతడి కిరాతసేననీ తరిమితరిమికొట్టాడు బలరాముడు. ఒక్క ఊపిరితో వుడాయించాడు ఏకలవ్యుడు.

కాశీరాజు కొడుకు సుదక్షిణుడు. తండ్రిచావు సహించలేకపోయాడు. ద్వారకమీద దండెత్తాడు. సుదర్శనం వేసి, కాశీపట్నం కాల్చి వొదిలిపెట్టాడు కృష్ణుడు.

గ్రహణం నాడు

ఆ ఏడు సూర్యగ్రహణం పూర్ణగ్రాసం పడింది. దేశమంతటినించీ జనం శమంతపంచకంలో స్నానాలు చేయడానికి కురుక్షేత్రం దిగబడ్డారు.

వెనక పరశురాముడు రాజుల్ని నరికి, వాళ్ళ రక్తంతో అయిదు మడుగులు పెట్టి, తర్పణం చేశాడట. ఆ అయిదు మడుగులే శమంతకపంచకం.

ద్వారకనించి ఉగ్రసేనుడూ, దేవకీవసుదేవులూ, బలరామకృష్ణులూ, అక్రూరుడూ, గదుడూ, ప్రద్యుమ్నుడూ, సాంబుడూ, కృష్ణుడి యావన్మంది భార్యలూ, బలరాముడి తల్లి రోహిణీ, భార్య రేవతీ మొదలైనవారు రథాలమీదా మేనాలమీదా వచ్చారు. యాదవుల సేనాధిపతి కృతవర్మా, మరి కొందరూ పట్నం కాపలాకోసం ద్వారకలోనే వుంటూ వచ్చారు.

బృందావనం గొల్లపల్లెనించి నందుడూ, యశోదా, అంతమందీ గొల్లభామలూ బళ్ళమీదా వాట్టిమీదా బయలుదేరి వచ్చారు. ఇక్కడైనా కృష్ణుడు కనపడడా? అని గొల్లభామల కుతూహలం.

హస్తినాపురంనించి భీష్ముడూ, ధృతరాష్ట్రగాంధారులూ, విదురుడూ తమ్ములతో దుర్యోధనుడూ, ద్రోణాచార్యుడూ, కృపాచార్యుడూ, అశ్వత్థామా మొదలైనవారు వచ్చారు.

ఇంద్రప్రస్థం నించి కోడళ్ళతోనూ, కొడుకులతోనూ కుంతీదేవి వచ్చింది.

కుండినంనించి భీష్మకుడూ, మత్స్యదేశంనించి విరాటరాజూ, పాంచాలంనించి ద్రుపదుడూ వచ్చారు.

అలాగే కుంతిభోజుడూ, నగ్నజిత్తూ, పురజిత్తూ,

సాల్వుడూ, దృష్టకేతూ, దమఘోషుడూ, విశాలాక్షుడూ, యుధామన్యుడూ, సుశర్మా, బాహ్లికుడూ, మిథిల, మద్ర, కాశీ, కేకయ దేశాల రాజులూ వచ్చారు.

మత్స్య, కేరళ, ఉశీనర, కోసల, విదర్భ, కురు, సృంజయ, కాంభోజ, మద్ర, కుంతి, ఆనర్త దేశాల ప్రజలూ తండోపతండాలు వచ్చారు.

ఎవరి బంధువుల్ని వారు కలుసుకున్నారు. ఎవరి ఆప్తుల్ని వారు ఆదుకున్నారు. ఎవరి స్నేహితుల్ని వారు చేరదీశారు.

ఈ కలయికకి మంచి అవకాశం కల్పించింది గ్రహణం.

రామకృష్ణులు నందుడికీ యశోదకీ నమస్కరించారు. ఇద్దరినీ కన్నీళ్ళతో కౌగిలించుకున్నారు వాళ్ళు. కరువుతీరా ముద్దులాడారు. నన్ను "మరిచేపోయావు నాయనా!" అంటూ కృష్ణుణ్ణి పట్టుకుని ఏడ్చింది యశోద.

"ఎంత మారి పోయాడమ్మా!" అంటూ బొమ్మల్లాగ నిలబడిపోయారు నిచ్చెరపోతూ గొల్లభామలు. చెట్ల నీడల్లో ఏకాంతంగా అతడి దగ్గిర చేరారు. అతడి లావణ్యం కళ్ళతో తాగేస్తూ చూశారు. పెదవులు కరుచుకున్నారు. మనసా అతణ్ణి సందిటలోకి లాక్కున్నారు.

"ఎప్పుడయినా నేను తనువుకి వస్తుంటానా?" అంటూ చిరునవ్వులతో వాళ్ళని కౌగిలించుకున్నాడు.

"నా ప్రాణం ఒకటీ, మీారు ఒకటీ కాదు నాకు. ఎప్పుడూ నా మనసులోనే వున్నారు మీారు. నాకు తెలుసు మీా మనసులో వున్నానన్నేను. శారీరక ప్రేమ ప్రేమకాదు.

మానసిక మయిందే ప్రేమ." అంటూ ఎన్నో చెప్పి వాళ్ళని తృప్తిపరిచాడు.

కృష్ణుడి భార్యల్ని గొల్లభామలూ, గొల్లభామల్ని కృష్ణుడిభార్యలూ ఒకళ్ళనొకళ్ళు చూసుకున్నారు.

దేవకీ, రోహిణీ యశోదని గౌరవంగా కలుసుకున్నారు.

"అమ్మా నాన్నా లేని పిల్లల్ని, పసికందుల్ని కన్న కొడుకుల్లాగ పెంచావు. నువ్వే నిజమైన తల్లివి" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది దేవకి.

"చెల్లెలు ఏమయిందని ఒక్కమారూ అడిగావు కాదు కదా, అన్నయ్యా!" అంటూ వసుదేవుడి దగ్గిర చదికిలబడింది కుంతి.

కృష్ణుడి యావన్మంది భార్యలూ, ద్రౌపదీ మొదలైన పాండవులభార్యలూ, గొల్లభామలూ, తక్కిన ఆడంగులూ ఒక దగ్గిర మాటామంతీ ఆడుతూ కూచున్నారు. ఆ మాటా ఈ మాటా అయ్యాక నవ్వుతూ కృష్ణుడి భార్యల్ని ద్రౌపది అడిగింది.

"ఎన్నాళ్ళయో అనుకుంటున్నాను. మా అన్నయ్య ఇంతమందిని పెళ్ళాడాడు కదా! ఈ పెళ్ళిళ్ళు ఎలా జరిగాయో వినాలనివుంది వదినెలూ! మీరేమీ అనుకోకపోతే మీ పెళ్ళినాటి ముచ్చట్లు వినిపిస్తే సంతోషిస్తాను. మళ్ళీ ఇంతమందిమి ఇలా ఒక్కదగ్గిర ఎలా కలుస్తాం? నువ్వు ముందు చెప్పమ్మా రుక్మిణీ!"

"అయితే ఆలకించు" అంటూ అందుకుంది రుక్మిణి.

"నన్ను శిశుపాలుడికి కట్టబెట్టాలని మా వాళ్ళ నిర్ణయం. మా అన్న రుక్మి మరీనీ. నా కిష్టంలేదు. చెప్పొద్దూ, తెగించి మీ అన్నయ్యకి కబురు పంపాను. సమయానికి వచ్చి నన్ను పట్టుకు వచ్చేశారు. పెద్ద యుద్ధమే జరిగింది. గెలుపూ, నేనూ మీ అన్నయ్యకే దక్కాం."

"మరి నీ మాట వదినా?" సత్యభామ నడిగింది ద్రౌపది.

"నన్ను ఇంకొకరికిస్తానని మాట ఇచ్చాడు మా నాన్న సత్రాజిత్తు. అయితే శ్యమంతకమణి అడివిలో పోగొట్టుకుని చచ్చిపోయాడు మా చిన్నాన్న. మీ అన్నయ్యే మా చిన్నాన్నని చంపేసి మణి ఎత్తుకుపోయాడని నిందమోపాడు మా నాన్న. అసలు మణి పట్టుకుపోయింది ఈ జాంబవతి తండ్రి. పదిమందిలో నిందపడలేక, అడివికి వెళ్ళి అన్నాళ్ళు దెబ్బలాడి మణితెచ్చి మా నాన్నకిచ్చి నింద బాపుకున్నాడు మీ అన్నయ్య. ఊరికే నిందమోపాను కదా, అని నొచ్చుకుని, మీ అన్నయ్యకి నన్నిచ్చి తాళి కట్టించాడు మా నాన్న." అంది సత్యభామ.

"అవును, అక్కయ్య చెప్పినట్టు మణికోసం మా ఇంటికి వచ్చాడు మీ అన్నయ్య. మహాబలవంతుడు మా నాన్న. ఎన్నాళ్ళో దెబ్బలాడాడు, ఓడిపోయాడు. నన్నిచ్చి పెళ్ళిచేశాడు." అంది జాంబవతి.

"ఏముంది? నా స్వయంవరం జరిగింది. మా అన్న

దమ్ముల్ని ఓడించి నన్ను ఎగరేసుకు వచ్చాడు మీ అన్నయ్య." అంది మిత్రవింద.

"మరి నీ మాట వదినా! ?" నాగ్నజిత్తి వేపు చూస్తూ అంది ద్రౌపది.

"బావనే పెళ్ళాడాలనుండేది నాకు. అయితే మా నాన్న చిత్రమైన స్వయంవరం చాటించాడు. ఎంపికచేసి ఏడుగిత్తలు జతపరిచాడు. ఎవ్వడికీ లొంగేవి కావవి. వాటిని అదుపులోపెట్టి ముకుతాడు వేసిన వారికి నన్నిచ్చి పెళ్ళిచేస్తా నన్నాడు. ఎంతోమంది వచ్చారు. వాటి కొమ్ములూ, వాటి బుసకొట్టడాలూ చూసి వెళిపోయారు. మీ అన్న వచ్చాడు. నేను చూస్తూనేవున్నాను ఏమవుతుందోనని. ఇట్టే వాటిపొగరు అణిచేసి ముకుతాళ్ళు వేసి పట్టుకున్నాడు. గొప్పగా జరిగింది మా పెళ్ళి" అంది నాగ్నజిత్తి. నగ్నజిత్తు కూతురు కనక నాగ్నజిత్తి. ఆమె అసలుపేరు సత్య.

"నాకూ మేనమామ కొడుకే కదా, మీ అన్నయ్య" అంది భద్ర. "బావనే పెళ్ళాడతా నన్నాన్నేను. ఏముందీ? పిలిచి కన్యాదానం చేశాడు మా నాన్న ధృతకేతుడు. బాగా సారె అదీ పెట్టి పంపాడు."

"మరి నా మాట చెపుతాను, విను" అంటూ ఎత్తుకుంది లక్షణ. "నీ స్వయంవరంలాగే నా స్వయంవరం లోనూ మత్స్యయంత్రం పెట్టించాడు మా నాన్న బృహత్సేనుడు. మీ యంత్రంలో చేప కనపడేదట. మాది కడవ నీటిలో మాత్రం నీడగా అవుపడేది. నీడచూసి, కనపడని చేపని గురిచేసి కొట్టాలి. ఎంతెంతవాళ్ళో వచ్చారు. వెళ్ళి

పోయేవాళ్ళు. అందరినీ చూసేదాన్ని. మగధ, అవంతి, ఛేదిదేశాల రాజులు వచ్చారు. భీముడూ, దుర్యోధనుడూ, కర్ణుడూ, అర్జునుడూ వచ్చారు. కర్ణుడూ, అర్జునుడూ విల్లు తీశారు. నారి తొడిగారు. కర్ణుడు గురి కానలేకపోయాడు. అర్జునుడు గురి కనిపెట్టినా, చేప కొట్టలేకపోయాడు. అప్పుడు మీ అన్నయ్య వచ్చి, గురి చూసి, చేప పడగొట్టేశాడు. నా నోము పండింది.

నన్ను రథంమీద పట్టుకు వస్తుంటే, కళ్ళు కుట్టిన మచ్చరగొట్టు రాజులు కొందరు కుమ్మక్కయి, దారికి అడ్డం వచ్చారు. అందరినీ తోకలు ముడిపించి ద్వారక నన్ను తీసుకువచ్చాడు మీ అన్నయ్య. ఇదీ నా పెళ్ళి ముచ్చట." అంది.

"ఇంక మిగిలింది మీ మాటే, కానివ్వండి" అంటూ పదహారువేలమంది రాస పడుచుల వేపు చూసింది ద్రౌపది.

"ఖైదే కన్నవారిల్లయింది మాకు. పెళ్ళిలో" అంటూ అందుకుంది ఒకామె. "నరకుడు మా తండ్రుల్ని ఓడించాడు. మమ్మల్ని ఖైదులో పెట్టాడు. ముద్దూ ముచ్చటా మరిచిపోయాం. తిండికీ, గుడ్డకీ వాచిపోయాం. ఓమారు మూలల కొండకోనలో బంధించాడు వాడు. మా పుణ్యం పండి, మీ అన్నయ్య వచ్చాడు. వాణ్ణి చంపేసి, మా చెర విడిపించి పుణ్యం కట్టుకున్నాడు. దిక్కులేని మాకు దిక్కు కలిగించాడు. మమ్మల్ని పెళ్ళి చేసుకున్నాడు. ఆయన పాద సేవకయినా తగని మేం ఆయన ఇల్లాళ్ళమని చెప్పుకుంటున్నాం.

కృష్ణుడిమీద అంతమంది భార్యలూ కనపరిచిన ప్రేమా, అనురాగమూ విని మెచ్చుకుంది ద్రౌపది. సుభద్రా మొదలైనవారు ఆశ్చర్యపోయారు. గొల్లభామలు కుతూహలంగా విన్నారు.

వసుదేవుడు, నందుడు, బలరామకృష్ణులు, పాండవులూ మొదలైనవారు ఓ దగ్గిర మాట్లాడుకుంటూ కూచున్నారు. వారి దగ్గిరికి ఎంతోమంది మునులు వచ్చారు. వారిలో వ్యాసుడు, నారదుడు, చ్యవనుడు, దేవలుడు, విశ్వామిత్రుడు, వసిష్ఠుడు, శతానందుడు, అసితుడు, భరద్వాజుడు, అత్రీ, మార్కండేయుడు మొదలైన మహాఋషులు ఎందరో వున్నారు. వారి శిష్యులూ వున్నారు.

వారిని చూడడంతోనే రామకృష్ణులూ, వసుదేవుడూ మొదలైన యాదవులూ, పాండవులూ అందరూ తడబడుతూ లేచారు. ఋషుల అడుగులకి దండాలు పెట్టారు. అర్ఘ్య పాద్యాలు, ఆసనాలు ఇచ్చి గౌరవించారు.

"ఇవాళ మా జన్మ తరించింది" అంటూ ఆరంభించాడు కృష్ణుడు. "తెలివి తెలిసిన మునీశ్వర్లు మీరు. మీ పాదాలే తీర్థాలు, నీళ్ళు నిండిన ఏళ్ళు కావు. మీ వునికులే దేవాలయాలు, రాతిగుళ్ళు కావు. మీరే దేవుళ్ళు, రాతి బొమ్మలు కావు. అగ్నీ, సూర్యచంద్రులూ, చుక్కలూ, ఆకాశమూ, గాలీ, నీరూ, నేలా అజ్ఞానం పోగొట్టవు. తెలివికి మీ మాటలే రాజబాటలు. కఫ, వాత, పైత్యాల దేహం శవంతో సమానం. దీన్ని నమ్ముకున్నవాడూ, రాతి

బొమ్మ దేవుడనుకున్నవాడూ, ఏళ్ళూ, కోనేళ్ళూ తీర్థాలను కున్నవాడూ గాడిదతో సమానుడు" అన్నాడు.

"అవును, కృష్ణా! అన్నీ తెలిసిన వాడివి నువ్వు. నీ తెలివికి తుది లేదు, హద్దుల్లేవు. తెలిసినవాడే బ్రాహ్మడు. ఉత్తమ బ్రాహ్మడివి నువ్వు. నీకు మా నమస్కారం" అన్నారు మునులు.

ఇంకా ఇలా అన్నారు వారు :

"నిన్ను కని దేవకీవసుదేవులు ధన్యులయ్యారు. నీ సాంగత్యంతో గొల్లలూ, యాదవులూ, పాండవులూ తరించారు."

అప్పుడు వసుదేవుడు లేచి, జోడించిన చేతులతో అడిగాడు :

"భగవంతులారా! ఏం చేస్తే కర్మవించి విడుదల కలుగుతుంది?"

"వసుదేవా! అన్నీ తెలిసిన కృష్ణుడే ఉన్నాడయ్యా నీ దగ్గిర. అయినా అడిగావు కనక చెప్తున్నాం. ఏ కోరికా లేకుండా యజ్ఞం చెయ్యి. కోరికలు మానుకోడమే సన్యాసం. సన్యసించు" అన్నారు ఋషులు.

యజ్ఞం తలపెట్టాడు వసుదేవుడు. మునీశ్వర్లనే రుత్విజులుగా వరించాడు. యజ్ఞదీక్ష పూనాడు. అతడి భార్యలు రోహిణి, దేవకీ, శాంతిదేవ, ధృతదేవ, కౌసల్య, పౌరవి, మిత్రదేవి, శ్రుతదేవి, యశోధర మొదలైన పద్దెనమందీ దీక్ష పట్టారు. మాంగలిక ద్రవ్యాలతో ముస్తాబులయ్యారు.

వసుదేవుడు శుచిస్నానం చేశాడు. కాటుక పెట్టుకున్నాడు. వెన్న పూసుకున్నాడు. పద్ధెనమంది భార్యల చేతా అభిషేకం చేసుకున్నాడు. లేడితోలు కప్పుకున్నాడు.

బలరామకృష్ణులతో కలిసి యాదవులందరూ ముస్తాబులయి, భార్యలతో కూడా వచ్చి యజ్ఞం దగ్గిర సభలో కూచున్నారు. పాండవులు, కౌరవులు, యావన్మంది చుట్టాలు, పక్కాలు, స్నేహితులు, దేశదేశాల రాజులు, మహారాజులూ ఎవరి స్థానాలలో వారు కూచున్నారు.

శంఖాలు మోగాయి. మద్దెళ్ళూ, తాళాలూ, బూరాలూ గింగురుమన్నాయి. ఋషుల మంత్రాలు ప్రతిధ్వనించాయి.

గొప్పగా జరిగిపోయింది వసుదేవుడి యజ్ఞం. భార్యతో అతడి అవబృధస్నానం పూర్తయింది.

బ్రాహ్మలకే కాదు, కుక్కలూ మొదలయిన జంతువులకి కూడా ముప్పూటలా తృప్తిగా పిండివంటలతో కూడా భోజనాలు పెట్టారు. అడిగినా అడక్కపోయినా పేదలకి ధనం పంచిపెట్టారు. విదర్భ, కోసల, కురు, కాశి, కేకయ, సృంజయ, మొదలైన రాజులకీ, బంధువులకీ కానుకలిచ్చి సాగనంపారు.

భీష్ముడూ, ధృతరాష్ట్రుడూ, విదురుడూ, కుమాళ్ళతో కుంతీ, ద్రోణుడూ, వ్యాసుడూ మొదలైన ఋషులూ సగౌరవంగా వీడుకోలు తీసుకుని తమతమ నివాసాలకు వెళ్ళిపోయారు.

వసుదేవుడూ, ఉగ్రసేనుడూ వుండండని బలవంత

పెట్టడంవల్లా, రామకృష్ణుల స్నేహంవల్లా, నందయశోదలూ, గొల్లభామలు, మిగిలిన కోనారులు కొన్నాళ్ళు యాదవుల దగ్గిర వుండిపోయారు.

మాటామాంతీ ఆడుతూ ఒకనాడు నందుడి రెండు చేతులు పట్టుకున్నాడు వసుదేవుడు.

"ఏదయినా తెంపుకోగలం. కానీ అన్నా! స్నేహం మాత్రం తెంపుకోలేం, అందునా నీ స్నేహం, మీ ఆవిడ స్నేహం ఎన్నటికి తెగనిది. మీ మేలు ఎలా మరవడం. ఇదంతా మీ చలవ. మీరే ఆదుకోకపోతే నా రామ కృష్ణులు నా ఆరుగురు కూనల్లాగే అయిపోయేవారు.

నందా! ఇప్పటికీ ఆరుగురినీ మరవలేనయ్యా మళ్ళీ కనిపిస్తారా నా చిట్టిపాపలు!

అవాళ, ఈ నల్లనయ్య పుట్టినాడు. ఆ వానలో కటికి చీకట్లో, కంపునెత్తుకుని మీ ఇంటికి వచ్చాను. తలుచుకుంటే గుండె తరుక్కుపోతుంది. నువ్వు పెట్టిన పుత్ర భిక్షయ్యా, ఇది నువ్వు పెట్టిన భిక్ష. ఎన్ని జన్మలెత్తినా నీ ఋణం, యశోద ఋణం తీర్చుకోలేం మేము. దేవకి కొడుకు కాదు కృష్ణుడు, యశోద కొడుకు. వసుదేవుడి కొడుకు కాదు, నందుడి కొడుకు. గొల్లల రాజువి నువ్వు. గొల్లలరాణి యశోద. మా నాయన చిన్ననాటి ముద్దూ ముచ్చటా మీరే చూశారు. మా పాపిష్టి కళ్ళకి ఆ ప్రాప్తం లేక పోయింది. ఏం చేస్తే మీ స్నేహం తీర్చుకోగలం చెప్పూ! ధనంవల్ల కళ్ళు కనపడలేదిప్పుడు."

అంటూ అంటూ నందుణ్ణి పట్టుకుని ఏడ్చేశాడు వసు

దేవుడు. నందుడూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. అతడి నోట మాట పెగల్లేదు.

వసుదేవుడి స్నేహం తెంచుకోలేక బలరామకృష్ణుల మీద మమత ఒదులుకోలేక రేపూ, మాపూ అంటూ మూడు నెలలు వుండిపోయాడు నందుడు. ఎంత వున్నా వుండాలనే వుండేది గొల్లభామలకి.

తుదకి వదల్లేక, వదల్లేక ఓనాడు పయనం కట్టాడు. బళ్ళు పూశాడు.

వసుదేవుడూ, ఉగ్రసేనుడూ నందుడికీ, యశోదకీ, కడపకోనాగ్లకీ, గొల్లభామలకీ ఎన్నో అన్ని కానుకలిచ్చారు. కృష్ణుడూ, బలరాముడూ, ఉద్ధవుడూ, అక్రూరుడూ మొదలైన వారు ఎంతో దూరం సాగనంపారు.

మహిమలు

కృష్ణుడిలో విచిత్రమయిన మహిమలుండేవి. అవసరమైనప్పుడు వినియోగించేవాడతడు. అవన్నీ వింటూ వుండే వారు దేవకీవసుదేవులు, అబ్బురపడుతూ వుండేవారు.

ప్రతిదినమూ తల్లిదండ్రుల అడుగులకి దండం పెట్టే వారు బలరామకృష్ణులు.

ఓనాడు కుమాళ్ళతో నెమ్మదిగా అన్నారు దేవకీ వసుదేవులు :

"నాయనా, కృష్ణా! రామా! అందరూ అంటున్నారు, మీరు చెయ్యలేంది ఏదీలేదని, మీరు తలెత్తాక ఏ లోపమూ లేదు మాకు. కాని ఒక్కటి మాత్రం బాధగా వుంది. మీా

అన్నలు ఆరుగుర్నీ పాపిష్టి కంసుడు పొట్టలో పెట్టుకున్నాడు. కళ్ళారా వాళ్ళని చూడనన్నా చూడలేదు మేం. మీరు మీ గురువు కొడుకుని, చచ్చిపోయిన వాణ్ణి తెచ్చిచ్చారు కదా! మీ అన్నల్ని మాకు ఓమారు చూపించండి బాబూ!" అంటూ బతిమిలాడారు.

"అలాగే" అన్నారు రామకృష్ణులు. కంసుడు చంపేసిన ఆరుగురినీ అమ్మకీ నాన్నకీ అవుపరిచారు. స్మరుడూ, ఉద్గీథుడూ, పరిష్వంగుడూ, పతంగుడూ, క్షుద్రభృత్తుడూ, ఘృణీ అని ఆ ఆరుగురూ దేవకీ వసుదేవులికి నమస్కరించి వెళ్ళిపోయారు.

* * *

"ఒక్క భార్య రేవతితో కులాసాగా వుంటున్నాడు బలరాముడు. ఎనమండుగురు పట్టపు దేవేరులూ, పదహారు వేలమంది రాచకన్నెలూ కట్టుకున్నాడు కృష్ణమూర్తి. నిజానికి, గడుసుదయితే, ఒక్క ఇల్లాలితోనే వేగడం కష్టం మనిషి. అలాటిది ఇంతమందితో ఎలా నెగ్గుకువస్తున్నాడో మహానుభావుడు!"

అంటూ సందేహంగా వుండేది నారదుడికి.

"పోనీ వీళ్ళందరూ అలాంటి ఇలాంటి వాళ్ళా? ఒకళ్ళని మించిన వాళ్ళొకళ్ళు. మగడు రాత్రింబగళ్ళు తమ దగ్గరే వుండాలంటారు. తమ మాట జవదాటకూడదంటారు! ఈ గుండు గొమ్ముల అనుమానమేదో తీర్చేసుకోవాలి." అంటూ ఓ మంచిరోజు చూసి ద్వారక దిగబడ్డాడు.

కన్నుల పండువుగా వుంది ద్వారక, కలకలలాడుతూ.

రకరకాల పూలతో విరగబూసి వున్నాయి పూల తోటలు. ఆరముగ్గిన పళ్ళతో ఒంగి ఒంగి పడుతున్నాయి పళ్ళతోటలు. పద్మవనాలతో గమ్మ్మని పోతున్నాయి కోనేళ్ళు. తుమ్మెదలు సంగీతాలు పాడుతున్నాయి. రాజ హంసలు కిలకిలలాడుతున్నాయి. తోటలో నెమళ్ళు పురులు విప్పి ఆడుతున్నాయి. చిలకలూ, మైనగోరలూ, గండు కోయిలలూ కూస్తున్నాయి.

ఎత్తయిన తొమ్మిది లక్షల భవనాలున్నాయి పట్నంలో. అన్నీ స్ఫటికం మణులతో చేసినవి. బంగారం తోనూ, వెండితోనూ కట్టినవి. మరకతమణులూ, వజ్ర వైఢూర్యాలూ తాపినవి. వీధులన్నీ విశాలంగా వున్నాయి. అంగళ్ళు అందంగా వున్నాయి.

రథసాలలూ, ఏనుగుసాలలూ, గుర్రాలసాలలూ, గొప్పగా వున్నాయి.

సభామండపాలూ, రచ్చచావిళ్లూ సుందరంగా వున్నాయి.

రాజవీథిని ఎండ తగలకండా చందువాలు కట్టారు. చలివేంద్రాలు పెట్టారు.

నగరమంతటా జెండాలు ఎగురుతున్నాయి. వాద్యాలు మోగుతున్నాయి. అగరుధూపాలు రేగుతున్నాయి.

అవన్నీ చూస్తూ, తలవూపుతూ రాజవీథిని నడిచి వెళ్ళాడు నారదుడు.

భవనాలన్నిటి నడుమ, కొండల నడుమ మేరు పర్వతంలా వుంది కృష్ణుడి భవనం.

పదహారు వేలకిమించి గొప్ప గొప్ప మందిరాలున్నాయి.

బాగా చూసి అన్నిటిలోకి పెద్దమందిరంలోకే వెళ్ళాడు నారదుడు.

గరుడపచ్చల స్తంభాలు, వైఢూర్యాల పైకప్పులు. ఇంద్రనీలాల గోడలూ, మంచిముత్యాల చందువాలూ కళ్ళు జిగేలు మనిపిస్తూ వుంది భవనం. రతనాల నగలు ముస్తాబు చేసుకుని ముచ్చటగా వున్నారు పనికత్తెలు. అంతటా రతనాల దీపాలు వెలుగుతున్నాయి. సువాసన ధూపాలు రగులుతున్నాయి. అంతా అపురూపంగా వుంది. రుక్మిణీదేవి మందిర మది.

యాదవుల అంతఃపురాలకి ఆటంకం లేదు నారదుడికి. వేళాపాళా లేదు. అనుమతీ గినుమతీ అక్కరలేదు. చరచరా నడిచాడు లోపలికి.

రతనాల ఏనుగుదంతం పందిరిమంచం, పట్టుపానుపు మీద కూచున్నాడు కృష్ణుడు. పక్కని రుక్మిణి కూచుంది. చామరం వేస్తూ వుంది.

నారదుడు రాగానే వున్నపాళాన లేచాడు కృష్ణుడు. నమస్కారం చేశాడు. అర్ఘ్యమూ పాద్యమూ ఇచ్చాడు. ఉన్నతమయిన ఆసనం ఇచ్చి కూచోపెట్టాడు. నెమ్మదిగా నవ్వుతూ కుశల మడిగాడు. 'ఆజ్ఞాపించు' అన్నట్టు చల్లగా చూశాడు.

"ఏం లేదు, ఓమారు చూసి వెళదామని వచ్చాను, చూశాను. వెళ్ళివస్తాను." అని లేచాడు నారదుడు. గుమ్మం దాకా వచ్చి సాగనంపాడు కృష్ణుడు.

గబగబా నడిచి మరోలోగిలిలోకి వెళ్ళాడు నారదుడు. అదీ రుక్మిణి భవనంలాగ అపురూపంగానే వుంది. అక్కడా వున్నాడు కృష్ణుడు. తన దేవేరితోనూ, ఉద్ధవుడితోనూ కలిసి పాచికలాడుతున్నాడు.

నారదుడు రావడంతోనే పాచికలు పడేశాడు. తడ బడుతూ లేచి నమస్కరించాడు. నవ్వుతూ కుశల మడిగాడు. ఆసనం వేసి సేదదేర్చాడు. 'ఆజ్ఞాపించు' అన్నట్టు చల్లగా చూశాడు.

వెనకట్రిలాగే చెప్పి అక్కణ్ణుంచి బయలుదేరాడు నారదుడు. మరో లోగిలిలోకి వెళ్ళాడు.

అన్ని లోగిళ్ళూ అద్భుతంగానే వున్నాయి. దేనికేదీ తీసిపోయినట్టులేదు.

అక్కడా అవుపించాడు కృష్ణుడు. భార్యతో కలిసి కొడుకులతో ఆడుకుంటున్నాడు.

అలా ఒక లోగిలి తరవాత మరో లోగిలి తిరిగాడు నారదుడు. అన్ని లోగిళ్ళలోనూ భార్యతో కలిసి కనపడ్డాడు కృష్ణుడు. భార్యలందరితోనూ ఒకేలాగ మసులుతున్నాడు. అందరూ అతణ్ని ఒకేలాగ ప్రేమిస్తున్నారు. ప్రతి భార్యా తన దగ్గరే కృష్ణుడున్నాడనుకుంటూ వుంది. తనమీదే మక్కువ అని మురిసిపోతూ వుంది.

ఒక్క లోగిలీ వొదలకండా అన్ని లోగిళ్లూ, పదారు

వేల ఎనిమిది లోగిళ్ళూ తిరిగాడు నారదుడు. తెల తెల్ల పోయాడు. కాళ్ళుపీకి చదికిలబడ్డాడు.

కేవలం భార్యలతోనే గడపడం కాదు. రాజ కార్యాలూ నిర్వహిస్తూ కనిపించాడు కృష్ణుడు. ఓ దగ్గిర బల రాముడితో వుంటే ఓ దగ్గిర ఉద్ధవుడితో అవుపించాడు.

"చిత్రం!" అనుకుంటూ వచ్చినదారి పట్టాడు నార దుడు.

* * *

ఓ మారు మిథిల వెళ్ళాడు కృష్ణుడు. దారుకుడు రథం సిద్ధం చేశాడు. గరుడపక్షి జెండా గాలిలో ఎగిరిస్తూ బయలు దేరింది రథం.

దారి కడాకూ జనులు జేజేలు పట్టారు. కానుకలిచ్చి పూజించారు. నదీ నదాలు, పల్లెలు, పట్నాలు, దాటు కుంటూ వెళ్ళాడు కృష్ణుడు. ఆనర్త, మరుదేశాలు, కురు జాంగల, కంకణ దేశాలు, మత్స్య, కేకయ, పాంచాల,కుంతి, శూరసేన, కోసల దేశాలు దాటి మిథిలాపట్నం వెళ్ళాడు.

అప్పుడు మిథిల ఏలుతున్న జనకుడు బహులాశ్వుడు. (మిథిల రాజులకి 'జనకుడు' అన్నది బిరుదు పేరు)

కృష్ణుడు వచ్చాడనగానే మంత్రులతోనూ, పురో హితులతోనూ ఎదురు వచ్చాడు బహులాశ్వుడు. అర్ఘ్యమూ, పాద్యమూ ఇచ్చి గౌరవించాడు.

మిథిలలో శ్రుతదేవుడని ఒక బ్రాహ్మడుండేవాడు. బుద్ధిమంతు డతడు. ధర్మపరుడు. అతడూ అర్ఘ్యమూ పాద్యమూ ఇచ్చి కృష్ణుడ్ని గౌరవించాడు.

జనకుడు తన దగ్గిరికి వచ్చి ఆతిథ్యం పుచ్చుకో మన్నాడు కృష్ణుడ్ని. శ్రుతదేవుడు తన ఇంటికి ఆతిథ్యానికి రమ్మన్నాడు.

ఇద్దరి పిలుపులూ వొప్పుకున్నాడు కృష్ణుడు. ఇద్దరింటికీ వస్తానన్నాడు.

నా ఇంటికే వస్తాడనుకున్నాడు బహులాశ్వుడు. నా ఇంటికే వస్తాడనుకున్నాడు శ్రుతదేవుడు.

రాజువెంట నడిచింది కృష్ణుడి రథం. అలాగే బ్రాహ్మడి వెంటా నడిచింది. అయితే రాజువెంట వెళుతూన్న రథం బ్రాహ్మడికి అవుపడలేదు. బ్రాహ్మడి వెంట వెళ్ళిన రథం రాజుకీ అవుపడలేదు.

ఇద్దరి ఇళ్ళకీ ఒకేసారి వెళ్ళాడు కృష్ణుడు. ఇద్దరి దగ్గిరా ఒకేసారి ఆతిథ్యం పుచ్చుకున్నాడు. ఒకే కృష్ణుడు ఇద్దరయాడు.

తన ఇంటికే వచ్చాడని జనకుడూ, తనింటికే వచ్చాడని శ్రుతదేవుడూ ఆనందంతో ఆకాశమందుకున్నారు.

వెనక పౌండ్రక వాసుదేవుడు ద్వారక మీాద దాడి చేసే ముందు కృష్ణుడు బదరికాశ్రమం వెళ్ళి తపస్సు చేసి వచ్చాడు. తాను తిరిగి వచ్చేదాకా ద్వారకలో చేయవలసిన కట్టుదిట్టాలన్నీ చేశాడు. పట్నం వెయ్యికళ్ళతో కాపాడమని సాత్యకినీ, ఉద్ధవుణ్ణీ నియమించాడు. పట్నం నాలుగు ద్వారాలలో మూడు ద్వారాలు మూసేసి, ఒక్క ద్వారమే తెరిచి వుంచాడు. పట్నం బయటలు ఆటలూ, వేటలూ బందు

చేయించాడు. వచ్చిపోయే మనుషుల్లో తన వారెవరో, పగ వారెవరో పరీక్షించే ఏర్పాటు చేశాడు.

ఆలా అన్ని కట్టుదిట్టాలుచేసి, ఎవరికి చెప్పవలిసింది వారికి చెప్పి, బదరికాశ్రమం వెళ్ళి తపస్సులో కూచున్నాడు కృష్ణుడు.

గంగకి ఉత్తరంగా వున్న బదరికలో చలించని చిత్తంతో తపస్సులో వున్నాడు కృష్ణుడు. అర్ధరాత్రయింది. ఘోరమైన అరుపులు వినిపించాయతడికి. రకరకాల జంతువుల అరుపులవి. ఇంతలో మృగాలూ, మృగాల వెంట పిశాచులూ వచ్చారు. పిశాచుల చేతుల్లో దీపాలున్నాయి. వాళ్ళంతా నెత్తురు తాగుతున్నారు. పచ్చిమాంసం నములుతున్నారు. అందరి కందరూ వికారంగా వున్నారు.

వాళ్ళలో ఇద్దరు మరీ ఇదిగా వున్నారు. ఇద్దరిలో పెద్దవాడు:

"ఏడిరా కృష్ణుడు? ఎక్కడున్నాడురా?" అంటూ అరుచుకుంటూ వచ్చాడు.

"ఎవరు నువ్వు? ఏమిటి ఇదంతా?" అని అడిగాడు కృష్ణుడు.

"నేనా? నేను కనపడలేదూ, నేను పిశాచుల రాజుని. ఘంటాకర్ణుణ్ణి. "విష్ణువు" అన్నమాట నా చెవిలో పడకండా చెవులికి ఘంటలు కట్టుకున్నాను. వీళ్ళంతా నా వాళ్ళు. పచ్చిమాంసమూ, పచ్చిరక్తమూ మా తిండి. మనిషి మాంసం, అందులో బ్రాహ్మడి మాంసం, బ్రాహ్మడి నెత్తురు మా ఇష్టం. నువ్వు బ్రాహ్మడివా?"

"కాదు క్షత్రియుణ్ణి."

"బతికిపోయావు. మాంసం కావాలా? ఇదిగో ఇప్పుడే రెండుముక్కలు చేశాను, ఈ బ్రాహ్మణ్ణి. కావాలంటే ఈ మీాన ముక్క నములు బావుంటుంది. ఇంతకీ ఇలా ఎందుకు వచ్చానంటావు? పిశాచుడిగా వుండడం ఇష్టంలేదు నాకు. అందుకే కైలాసపర్వతం నించి వస్తున్నాను. వీడు నా తమ్ముడు. కైలాసంలో చెప్పారు. కృష్ణుడని ఎవడో వున్నాట్ట! అతగాడు పిశాచుల కులం పోగొడతాట్ట. ఇక్కడికే వస్తా డన్నారు. అందుకే వచ్చాను. అతగాడి వూరు ద్వారక అట! ఇక్కడ దొరక్కపోతే ద్వారకే వెళతాను. పడమటి సముద్రంలో వుందట కృష్ణుడి ద్వారక. ఆఁ, ఇంతకీ నువ్వె వడివో చెప్పావుకావు. చెప్పు, ఎవడివి నువ్వు?"

"నేను" నవ్వుతూ అన్నాడు కృష్ణుడు, "నేనే కృష్ణుణ్ణి."

కాళ్ళమీాద పడ్డాడు ఘంటాకర్ణుడు. లేవనెత్తాడు కృష్ణుడు. పిశాచరూపంపోయి నుంచున్నాడు ఘంటాకర్ణుడు.

తపస్సు పూర్తిచేసుకుని వచ్చేశాడు కృష్ణుడు.

* * *

యాదవకుమాళ్ళు ప్రద్యుమ్నుడూ, సాంబుడూ, గదుడూ, చారుభానుడూ, మరికొందరూ కులాసాగా తిరుగుతూ, తిరుగుతూ తోటలో ఒక నుయ్యి చూశారు. నూతిలో నీరులేదు. ఓ పెద్ద తొండ పడుంది. దాన్ని పైకి తీయాలని చూశారు కుర్రాళ్లు. తియ్యలేకపోయారు. కృష్ణుడితో వెళ్ళి చెప్పారు.

నవ్వుతూ వచ్చాడు కృష్ణుడు. నూతిలో తొండని ఎడమ చేత్తో ఇట్టే పైకి తీశాడు.

కృష్ణుడి చెయ్యి తగలడంతోటే, తొండ మనిషిగా మారి నుంచుంది. కుమాళ్లు నిచ్చెరపోయారు.

"ఎవరు నువ్వు ?" అడిగాడు కృష్ణుడు.

"ఇక్ష్వాకు వంశంలో ఒకప్పుడు మహారాజున్నాను. నృగుడు నా పేరు.

చేతికి ఎముక లేకండా దానాలు చేశాను. చెప్పకో కూడదు, ఎన్ని ఆవులు ఎంతమంది కిచ్చానో, ఎంత ధాన్యం, ఎంత బంగారం ఎంతమంది కిచ్చానో లెక్క లేదు.

ఒకనాడు ఒక ఆవు ఒక బ్రాహ్మనుడికిచ్చాను. అది కన్నె తెంపుకు వచ్చేసింది. మా ఆవుల్లో కలిసిపోయింది. తెలీక అది మరో బ్రాహ్మనుడికిచ్చేశాను. మొదటి బ్రాహ్మణుడు వెదుకుతూ వెళ్ళి ఆ ఆవు తనదన్నాడు. ఇద్దరూ తగువుపడ్డారు. దానికి బదులు ఎన్నో ఆవులిస్తానన్నాను. కాదు అదే కావాలని కూచున్నారు ఇద్దరూ. ఇచ్చింది తిరిగి తీసుకున్నట్టయింది. ఈ తొండ పుట్టుక వచ్చింది. సెలవు." అంటూ వెళ్ళిపోయాడు నృగుడు. నిచ్చెరపోయి నించుండిపోయారు యాదవకుమాళ్లు.

అసలు ఈ మహిమలు కృష్ణుడిలో పుట్టుకతోనే వుండేవి.

చిన్నప్పుడు మన్నుతినేవాడతడు. ఓనాడు అన్న బలరాముడు చూశాడు. అమ్మ యశోదతో చెప్పాడు. కర్ర పట్టుకు వచ్చింది యశోద.

"నేను తినలేదు కావలిస్తే చూడు" అంటూ నోరు తెరిచాడు కృష్ణుడు

మన్ను లేదు, ప్రపంచమంతా కనపడింది యశోదకి.

కలకాదు కదా అని కంగారుపడింది పిచ్చితల్లి.

కౌరవసభలో ద్రౌపది బట్టలు వూడదీయడానికి వచ్చాడు దుశ్శాసనుడు. "అన్నా" అని అరిచింది ద్రౌపది. ఆమె మానం బయటపడకండా కోకమీద కోక కల్పించాడు కృష్ణుడు.

అతడి మహిమ లన్నిటిలోకి అద్భుతమయింది విశ్వరూపం.

కౌరవుల దగ్గిరికి రాయబారం వెళ్ళాడతడు. అప్పుడు కట్టిపడెయ్యాలనుకున్నాడు దుర్యోధనుడు. అదిగో అప్పుడే మొదటిసారి విశ్వరూపం చూపించాడు కృష్ణుడు. కళ్ళులేని ధృతరాష్ట్రుడికి కూడా కనిపించునట్టు చేశాడు. కంగారు పడిపోయారు కౌరవులు. దుర్యోధనుడు మాత్రం "ఇలాంటి మహిమలు నేనూ కొన్ని నేర్చుకున్నాను." అన్నాడు తరవాత.

మహాభారత యుద్ధంలో అర్జునుడు కౌరవసేన చూసి కళవిళ పడ్డాడు. "తాతల్నీ, తండ్రుల్నీ, అన్నదమ్ముల్నీ, గురువుల్నీ, స్నేహితుల్నీ చంపడానికి నా చేతులు రావడం లేదు" అంటూ విల్లూ, అమ్ములు పడేసి, రథంమీద చతికిల బడి పోయాడు.

అతణ్ని యుద్ధంలో నిలబెట్టడం కోసం మళ్ళీ విశ్వరూపం చూపెట్టాడు కృష్ణుడు.

వేనవేలు శిరస్సులు. వేనవేలు కళ్ళు. వేనవేలు నోళ్ళు. వేనవేలు చేతులు. వేనవేలు నాలికలు.

ఎంత భయంకరమో అంత అద్భుతంగా వుండేది విశ్వరూపం. చూడలేక, చూడలేక చూశాడు అర్జునుడు. చేతులు జోడించాడు. జేజేలు పలికాడు.

అలాగే మరోమారు ఉదంకుడికి చూపించాడు. హస్తినసించి ద్వారక వెళ్లేదారి ఎడారిలో వుండేవాడు ఉదంకుడు. భారతయుద్ధమయిపోయాక ద్వారక వెళుతూ అతడి ఆశ్రమంలో ఆగాడు కృష్ణుడు. "భారతయుద్ధానికి నువ్వే కారణం. శపిస్తాను" అన్నాడు ఉదంకుడు. విశ్వరూపం చూపాడు కృష్ణుడు. శాంతించాడు ఉదంకుడు.

వానరుడు

ఓనాడు రైవత పర్వతంమీద తాగి సంగీతం పాడుతూ కూచున్నాడు. ప్రక్కనే మధుపాత్ర వుంది. ప్రియురాళ్ళూ, అందమైన అమ్మాయిలూ వున్నారు. చల్లగాలి సముద్రం కెరటాలమీంచి తేలి తేలి వస్తూవుంది.

ఇంతలో ఎక్కణ్ణుంచి చూశాడో పెద్ద వానరుడు, బలరాముడున్న చోటికి చెట్లమీంచి వురికాడు. అతడి పేరు ద్వివిదుడు. నరకుడి నేస్తం అతడు. నరకుణ్ణి కృష్ణుడు వెళ్ళి చంపేశాడని విని పగ తీర్చుకోవాలని దిగబడ్డాడు.

కృష్ణుడి ఆనర్త దేశంలో ఉపద్రవం పుట్టించాడు. ఉన్నట్టుండి వూళ్ళు తగలబెట్టేసేవాడు. పంటలు పాడుచేసేవాడు. తోటలు ధ్వంసం చేసేవాడు. నదుల గట్లు విరగ్గొట్టి

పూళ్ళు ముంచేసే వాడు. ద్వారకమీద రాళ్ళు రువ్వే వాడు. ఆలమందలు చెదరగొట్టేవాడు.

బలరాముణ్ణి చూసి ఒళ్ళు పొంగించాడు ద్వివిదుడు. అసలు వల్లమాలిన బలవంతుడతడు. ఆడాళ్ళ ఎదటికి వెళ్ళి చిందులు తొక్కాడు. వింతగా చూశారు వాళ్ళు. కొందరు సరదాగా నవ్వారు.

చెట్టుమీంచి చెట్టుకి దూకాడు ద్వివిదుడు. పూల చెట్లు దులిపాడు. పళ్ళచెట్లు దులిపాడు. భయపెట్టాడు. పర వళ్ళు తొక్కాడు.

తాగిన మత్తులో అదేమీ గమనించలేదు బల రాముడు. అరమూత కళ్ళతో పాటలు పాడుతూ కూచు న్నాడు. అతడి ఎదటికే దుమికాడు ద్వివిదుడు. అతడు తాగు తున్న బంగారం కల్లుముంత పట్టుకెళ్ళి పగలగొట్టాడు. పైగా విరగబడి నవ్వాడు.

రెప్పలెత్తి చూశాడు బలరాముడు. చిన్నరాయి తీసి బెదిరించాడు.

స్త్రీ జనంమీద పడ్డాడు ద్వివిదుడు. వాళ్ళ చీరెలు చింపేశాడు. వేళాకోళాలాడాడు. తేరి చూశాడు బల రాముడు. దేశంలో ఉపద్రవం చేస్తున్నవాడు వీడే అని గుర్తించాడు. నాగలి తీశాడు. ముసలం పట్టుకున్నాడు.

పెద్ద గుగ్గిలంచెట్టు పెరికాడు ద్వివిదుడు. బలరాముడి తలమీద గురిపెట్టి విసిరాడు.

ఎడమచేత్తో పట్టేశాడు బలరాముడు. ముసలంతో

ద్వివిదుడి నెత్తిమీద బాదాడు. తల చిట్లి నెత్తురు చివ్వున చిమ్మింది.

లక్ష్యపెట్టలేదు ద్వివిదుడు. చెట్టుమీద చెట్టు పెరికి చెట్లవాన కురిపించాడు. పెద్ద పెద్ద రాళ్ళు పెరికి విసిరాడు, వూపిరాడనివ్వకండా. చివరికి బలరాముణ్ణి అడిచి పట్టుకున్నాడు. రొమ్ముమీదపడి పిడిగుద్దులు గుద్దాడు.

ఎక్కడలేని కోపం తెచ్చుకున్నాడు బలరాముడు. అతడి కళ్ళు జోతుల్లాగ మెరిశాయి. పెదవులదిరాయి. కనుబొమలు ముడివడ్డాయి. విషనాగులా బుసకొట్టాడతడు. పిడుగుల్లాటి పోట్లు ద్వివిదుణ్ణి పొడిచాడు. కొండలదిరాయి. ద్వివిదుడి గుండెలు పగిలాయి. ముక్కంటా, నోటంటా రక్తం కక్కుకున్నాడతడు. నిండుప్రాణం నిలువునా వొదిలేశాడు.

అంతవరకూ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకున్న స్త్రీలు మెల్లిమెల్లిగా బలరాముడి చుట్టూ చేరి అతడి ఆయాసం పోగొట్టారు. అతడి ప్రతాపం పాటలకింద పాడారు.

రాజసూయంలో తొలిపూజ

ధర్మరాజు దిగ్విజయం పూర్తయింది. తూరుపు దిక్కు గెలిచి భీముడూ, దక్షిణాది గెలిచి సహదేవుడూ, పడమటి తట్టు గెలిచి నకులుడూ, ఉత్తరాది గెలిచి అర్జునుడూ లెక్కాజమా లేనంత ధనం పట్టించుకు వచ్చారు. ధర్మరాజు పిలుపు అందుకని దేశదేశాల రాజులు ఇంద్రప్రస్థం తర్లివచ్చారు.

దరద దేశం రాజూ, బాహ్లీకుడూ, అంగ, వంగ దేశాల రాజు కర్ణుడూ, దుర్యోధనుడూ, భీష్ముడూ, గాంధారం రాజు సుబలుడూ, శకునీ, జయద్రధుడూ, భీష్మకుడూ, భోజకటకం రాజు రుక్మి, కిన్నరదేశం రాజు ద్రుముడూ, దంతవక్త్రుడూ, భగదత్తుడూ, భూరిశ్రవుడూ, మగధ సహదేవుడూ, ద్రుపదుడూ, విరాటరాజూ, బృహద్బలుడూ, అవంతి విందానువిందులూ, మద్రరాజు శల్యుడూ, ఏకలవ్యుడూ, శిశుపాలుడూ, వృషసేనుడూ, కళింగం రాజూ మొదలైన రాజులూ,మహారాజులు కానుకలు పట్టుకువచ్చారు.

అందరి కంటే ముందే వచ్చి ధర్మరాజుకి చేదోడు వాదోడుగా నిలబడ్డాడు కృష్ణుడు. యాదవ ప్రముఖులూ అతడివెంట వచ్చారు.

వ్యాసుడు, భరద్వాజుడు, సుమంతుడు, గౌతముడు, అసితుడు, చ్యవనుడు, వసిష్టుడు, విశ్వామిత్రుడు, కణ్వుడు, కవషుడు, మైత్రేయుడు, త్రితుడు, వామదేవుడు, సుమతీ, జైమినీ, క్రతువూ, పైలుడు, పరాశరుడు, గర్గుడు, వైశంపాయనుడు, అధర్వుడు, కశ్యపుడు, ధౌమ్యుడు, మొదలైన వారు ఋత్విజులయ్యారు.

ప్రతి పనీ కృష్ణుడి మాట ప్రకారమే చేస్తూ వచ్చాడు ధర్మరాజు. బంగారపు నాగలితో యజ్ఞంచోటు దున్నాడు. విధిప్రకారం దీక్షపట్టాడు.

చెప్పలేనంత గొప్పగా జరిగింది రాజసూయం. యావన్మందీ అన్నివిధాలా తృప్తిపడ్డారు. సోమరసం తీసిన

అభిషేకంనాడు అంతర్వేదిలో యావన్మంది రాజులూ, మునులూ కూచున్నారు. అందరినీ వరసక్రమంలో పూజించాలి ధర్మరాజు. ఎవరిని ముందు పూజించాలి. అందరిలోనూ తొలిపూజకి తగినవారెవరు?

నిశ్శబ్దమయింది సభ. భీష్ముడివేపు చూశాడు ధర్మరాజు.

"చుక్కల్లో రాజు చంద్రుడని చెప్పాలా?" అంటూ కృష్ణుణ్ణి చూపించాడు భీష్ముడు.

"అవును, అందరిలోకీ కృష్ణుడు ఉత్తముడు." అంటూ అందుకున్నాడు పాండవుల సహదేవుడు, "ముందు అర్ఘ్యమిచ్చి ఇతడే పూజించదగిన పురుషోత్తముడు."

అవునంటే అవునన్నారు రాజులు. మునులూ తల లూపారు.

సంతోషించాడు ధర్మరాజు. పాద్యం తెచ్చి కృష్ణుడి కాళ్ళు కడిగాడు. సిరసుమీద వేసుకున్నాడు. పసుపురంగు బట్టలూ, రత్నాల నగలూ వాటితో అర్ఘ్యమిచ్చాడు. అలా అందరిలోనూ తొలిపూజచేశాడు. సభసభంతా సంతోషంతో కేకలు వేశారు. కృష్ణుణ్ణి పొగిడారు.

శిశుపాలుడి శివాలు

"ఏమిటీ నీచప్పని!" అంటూ తొకతొక్కిన తాచులా లేచాడు శిశుపాలుడు. "ఈ కృష్ణుడా తొలి పూజకి దొరికాడు మీకు! నిన్న మొన్నటిదాకా సొమ్ములు

కాస్తూ బతికాడు. పాలుపట్టడానికి వచ్చిన ఆడదాన్ని చంపి స్త్రీహత్యాపాతకం మూట కట్టుకున్నాడు. తోడ పెద్దుని చంపి గోహత్య చేశాడు. మేనమామ కూడు తిని, మేనమామనే చంపేశాడు. బృందావనంలో వీడు దూరని కొంప లేదు, తడవని ఆడపిల్ల లేదు. పచ్చి వ్యభిచారి, దొంగ, తాగుబోతు.

ఏం చూసి పూజించారయ్యా? రాజా, పోనీ ఓ మడి చెక్క రాజ్యమైనా వుందా? ఖైదులో పుట్టాడు, గొల్ల వాళ్ళ కూడుతిని బతికాడు.

భీష్మా! ముసలితనంలో మతి చెడింది నీకు. నపుంసకుడివి నువ్వు. చేతకాక బ్రహ్మచారినని చెప్పుకుంటావు. ఆ మాత్రం చేతనయితే పడుచు మరదళ్ళని పరాయి మగాడికి అప్పజెప్పి వంశం నిలుపుకుంటావా! అలాంటి సంతతి కనకనే పాండవులు ఈ అఘాయిత్యానికి పాలుపడ్డారు నీ మాటమీద.

రాజా కాడు, వృద్ధుడా కాడు, పండితుడా కాడు, కుల మున్నవాడా కాడు. మరి ఏం చూసి చేశారీ గౌరవం? తెలీక మీరు చేశారే కట్టండి, తగుదునమ్మా అని ఏ మొహం పెట్టుకుని పుచ్చుకున్నాడీ పెద్దమనిషి? రాజులంద రికీ ఎందుకీ అవమానం?" అంటూ తన పక్షం రాజుల్ని రెచ్చగొట్టాడు.

"శిశుపాలా! ఎందుకీ శివాలు! మాకు తెలుసు నీ కంటే, మాకంటే, ఇక్కడున్న యావన్మందికంటే లోక మంతటికంటేకూడా గొప్పవాడు కృష్ణుడు. అందుకనే ముందు అతణ్ణి గౌరవించాం. ఇది కాదన్నవాడి నెత్తిమీద

నా ఎడమకాలు పెడతాను" అంటూ ముందుకి వచ్చాడు సహదేవుడు.

"అవును, అంతే" అన్నాడు భీష్ముడు. అప్పటికే పళ్ళు కొరుకుతున్నాడు భీముడు.

అయినా ఆగలేదు శిశుపాలుడు. భీష్ముణ్ణి, కృష్ణుణ్ణి నోటికి వచ్చినట్టు తిట్టడం లంకించుకున్నాడు. తన జట్టురాజులతో కలిసి యుద్ధానికి సిద్ధపడ్డాడు.

అంతవరకూ గంభీరంగా కూచున్న కృష్ణుడు చివాల్న లేచాడు.

"ఇదిగో వినండి. వీడు మా మేనత్త కొడుకు. మా మేనత్త మొహంచూసి ఇంతవరకూ వీణ్ణి సహిస్తూ వచ్చాను. చుట్టరికమైనా చూడకండా, మా యాదవులంటే కంటిమంట వీడికి మొదటినించీ. మా పగవాడైన జరాసంధుడికి సేనాధిపతిగా వున్నాడు. నేను ప్రాగ్జోతం వెళ్ళినప్పుడు మా ఊరికి అగ్గిపెట్టాడు. ఉగ్రసేనుడు రైవత మీాద తిరుగుతూవుంటే దొంగచాటుగా అతడి మనుషుల్ని చంపేసి వచ్చాడు. మా తండ్రి సాక్షాత్తూ మేనమామ వీడికి. అతడు అశ్వమేధం తలపెడితే, గుర్రం దాచేశాడు. బభ్రుడి భార్యని ఎత్తుకుపోయాడు. విశాలరాజు కూతుర్ని భద్రని పట్టుకుపోయాడు. సహించినంతకాలం సహించాన్నేను. ఇవాళ-" అంటూ సుదర్శనచక్రం పట్టుకున్నాడు. చక్రున శిశుపాలుడి మీాదికి విసిరాడు. శిశుపాలుడి తల ఎగిరిపోయింది. మొండెం నేల దొర్లిపోయింది.

శిశుపాలుడు తెగిపోవడంతోనే, అంతవరకూ అతణ్ని వెనకేసుకు వచ్చిన రాజులు సేనలతోకూడా గుడారాలు వొదిలేసి పారిపోయారు. తమతమ దేశాల పొలిమేరలు చేరు కున్నాకగానీ వూపిరి తీసుకోలేదు.

అవబృథ స్నానానికి గంగానదికి బయలుదేరాడు ధర్మరాజు. బంగారం రథంమీద ద్రౌపదితో కూచున్నాడు. పట్టుబట్టలు కట్టుకుని రథంమీద అతడు వెళుతూవుంటే శంఖాలు మోగాయి. బూరాలు, వాద్యాలు గింగురు మన్నాయి. సానిమేళాలు వసంతాలాడుతూ, ఆడా మగా ప్రజలు ఉల్లాసంతో వెంటవెళ్ళారు. రాజులు, రక్షణతో రాణులు, మంత్రాలతో ఋత్విజులుకూడావెళ్ళారు. పల్లె పల్లెలనించి వచ్చిన ప్రజలు, పట్నంవాళ్ళూ ఆడా, మగా పిన్నా, పెద్దా పసుపుగుండా, బగ్గుండా ఒకళ్ళమీద ఒకళ్ళు పూసుకుంటూ నడిచారు. అపూర్వమయిన పండగలా అవు పించిందది.

అలావెళ్ళి గంగనీటితో అవబృథ స్నానంచేశాడు ధర్మరాజు. యజ్ఞం పూర్తయాక చేసే స్నానం అవబృథ స్నానం. స్నానమయాక పట్టుబట్టలు కట్టుకున్నాడు. బట్టలు, రతనాల నగలు వేసుకున్నాడు. నగలు, ఆవులు పంచి పెట్టాడు. ప్రజలందరినీ సంతోషపెట్టాడు.

దేశదేశాలనించి వచ్చిన రాజుల్ని సాదరంగా సాగ నంపాడు. ధర్మరాజు ధర్మగుణమూ, చెప్పుకుంటూ వారంతా తమ తమ దేశాలు దూరదూరాలు తర్లివెళ్ళారు.

సాంబుడూ మొదలైన కుమాళ్ళనీ, యాదవ ప్రము

ఖుల్నీ పంపేసి, భార్యలతోనూ బలరాముడితోనూ కలిసి కొన్నాళ్ళు ఇంద్రప్రస్థంలో పాండవులతో గడిపాడు కృష్ణుడు. తమ్ములతో దుర్యోధనుడూ కొన్నాళ్ళున్నాడు.

మచ్చరం మంట

రాజసూయంతో ధర్మరాజు చక్రవర్తులలో చక్రవర్తి అయాడు. కృష్ణుడూ, దుర్యోధనుడూ, భీముడూ, అర్జునుడూ నకులసహదేవులూ, కర్ణుడూ, సాత్యకీ, విదురుడూ, ద్రౌపది, మొదలైనవారు యజ్ఞంలో ఒకొక్కపనీ నిర్వహించారు. రాజులు తెచ్చిన కట్నాలూ, కానుకలూ ఇన్నీ అన్నీ కావు.

ఇవన్నీ ఒక ఎత్తు, మయుడు తయారు చేసిన మహాసభ ఒక ఎత్తు. చిత్రవిచిత్రమైన సభ అది. కృష్ణుడి వేలాది భార్యలూ, ద్రౌపదీ, సుభద్రా ముస్తాబులయి అందులో తిరుగుతూ రత్నాలు తాపిన వారి బంగారం కాలిఅందెలూ, మొలనూళ్ళూ, జడగంటలూ ఘల్లంటే ఘల్లుమంటూ వుంటే, వారి అంగరాగాలూ, పూలదండలూ ఘుమఘుమలాడుతూ వుంటే, వారి నవ్వులు, నాట్యాలు విని పిస్తూ వుంటే అపురూపంగా వుండేది. అదంతా అందరికీ వేడుకగా వుండేది. ఒక్క దుర్యోధనుడికి మాత్రం మనసులో మచ్చరం మండిపోతూ వుండేది.

అవాళ మయసభలో కొలువు తీర్చి కూర్చున్నాడు, బంగారం సింహాసనం మీద. పక్కనే మరో బంగారం

సింహాసనం మీద కృష్ణుడు కూర్చున్నాడు. భీమార్జునులు, నకులసహదేవులూ రెండువేపులా కూర్చున్నారు. మంత్రులు కూచున్నారు. వందిమాగధులు కృష్ణుణ్ణి, ధర్మరాజునీ పొగుడుతూ పాటలు పాడుతున్నారు.

ఇంతలో దుశ్శాసనుడూ మొదలైన తమ్ములతో కలిసి మయసభ చూడడానికి వచ్చాడు దుర్యోధనుడు.

ఎంతటివాడయినా మయసభలో తికమకపడతాడు తెలియకపోతే. అసలే దురభిమాని దుర్యోధనుడు. ఒకణ్ణి అడగడం అతడికి అవమానం. తలమీద కిరీటం, మెళ్ళో హారాలూ, చేతిలో చంద్రహాసం కత్తీ—ఠీవిగా లోపలికి రాబోయాడు. "అది ద్వారం కాదు మహారాజా!" అన్నారు ద్వారపాలకులు.

ధుమధుమలాడుతూ వాళ్ళు చూపినదారిని లోపల దూరాడు దుర్యోధనుడు. కోనేటిలా చిత్రించిన నేలచూసి, కోనేరే అనుకుని బట్టలు మీదికెత్తాడు. నీరు లేకపోవడంతో తెల్లపోయాడు. అలాగే నీరు కాదనుకుని నిజమైన కోనేటిలో దిగబడి పోయాడు. అతడి అవస్థచూసి భీముడు విరగబడి నవ్వాడు హేళనగా. మిగిలిన రాజులూ నవ్వారు. స్త్రీలు కిలకిల నవ్వారు. ధర్మరాజు తప్పు తప్పన్నాడు. కృష్ణుడు పురికొల్పాడు.

చిన్నబుచ్చుకున్నాడు దుర్యోధనుడు. అసలే దురభిమాని అతడు. చెప్పకుండా చెయ్యకుండా హస్తినాపురం వెళ్ళిపోయాడు. మచ్చరంతో మండిపోతున్న అతడికి ఈ అవమానం పుండు మీద కారం చల్లినట్లయింది. మహా

భారత యుద్ధానికి కారణమయింది. నవ్వుతూ వూరుకున్నాడు కృష్ణుడు.

సౌభం : సాల్వుడు

కృష్ణుడి మీదా యాదవుల మీదా కత్తి కట్టిన ముఖ్యులలో సాల్వుడొకడు. తపస్సు చేసి 'సౌభం' అని గొప్ప విమానం సంపాదించాడతడు. చిన్నదీ చిట్టికదీ కాదది. పట్నం వంటిది. దానవుల దగ్గర మాయయుద్ధం కూడా నేర్చుకున్నాడు సాల్వుడు. కృష్ణుడూ బలరాముడూ లేక పోవడం చూసి పెద్దదండు వేసుకుని ద్వారక ముట్టడించాడు. పట్నం పాడుపాడు చేశాడు. సౌభంమీంచి రాళ్ళూ రప్పలు కుమ్మరించాడు. కనపడీ కనపడకుండా యుద్ధం చేశాడు. భయపడి పోయారు ప్రజలు.

దాంతో ప్రద్యుమ్నుడూ, సాత్యకీ, చారుదేష్ణుడూ, సాంబుడూ, అక్రూరుడూ, కృతవర్మా, భానువిందుడూ, గదుడూ, సుకసారణులూ మొదలైన యాదవవీరులు సాల్వుణ్ణి ఎదిరించారు. కవచాలు కట్టుకుని, ఆయుధాలు పట్టుకుని రథాలమీద రాణువలతో బయలుదేరారు.

సాల్వుడిసేనా యాదవసేనా కలపడింది. రెండు సేనలూ హోరాహోరి పోరాడాయి. మాయాయుద్ధం చేశాడు సాల్వుడు. సుడిగాలి పుట్టించాడు. రాళ్ళవాన కురిపించాడు. పాములూ, తేళ్లూ కురిపించాడు. ఉరుములు వురిమించాడు. మెరుపులు మెరిపించాడు.

అతడి విమానం రకరకాలయింది. కిందికి దిగేది,

లిప్తలో మీదికెగిరేది. ఒక్కటే పదిలాగ అవుపించేది. అంతలో మాయమయేది.

చిమ్మచీకట్లు కల్పించాడు సాల్వుడు. వెలుగుబాణాలు వేశాడు ప్రతివింధ్యుడు. సాల్వుడి సేనాపతిని బాణాలతో ముంచెత్తాడు. సాల్వుడి మాయ మాయ చేశాడు. సాల్వుడి మీద సానపెట్టిన వందబాణాలు నాటించాడు. అతడి చతు రంగసేన నురుమాడాడు. అతడి ప్రతాపం చూసి యావ న్మందీ, భళీ ప్రతివింధ్యా భళీ, అన్నారు.

ఇంతలో సాల్వుడి మంత్రి ద్యుమంతుడు దూసుకు వచ్చాడు. "బప్పరిసింగా" పొలికేక పెట్టాడు. పాతిక వాడి వాడి బాణాలు వరసపెట్టి తగిలించాడు ప్రద్యుమ్నుడు.

అన్నీ ఆపుకుంటూ పెద్ద గదతీసి విసిరాడు ద్యుమం తుడు. ప్రద్యుమ్నుడి ఎదుర్రొమ్ముమీద తగిలింది గద. తెలివి తప్పిపోయాడు ప్రద్యుమ్నుడు. రథం తప్పించి పట్టుకు పోయాడు దారుకుడి కొడుకు సారథి. అంతలోనే తెలువు కున్నాడు ప్రద్యుమ్నుడు. యుద్ధం తప్పించి తెచ్చావని సార థిని గదిమాడు ప్రద్యుమ్నుడు. "నిన్ను రక్షించడం నా ధర్మం" అంటూ సాల్వుడిమీదికి రథంతోలాడు సారథి. "కాదు ద్యుమంతుడి మీదికే పోనీ రథం" అన్నాడు ప్రద్యు మ్నుడు.

బరిమీద పాములాగ పరిగెత్తింది ప్రద్యుమ్నుడి రథం. వెళుతూనే నాలుగుబాణాలు వేశాడు. ద్యుమంతుడి నాలుగుగుర్రాలూ చంపేశాడు. అతడి సారథి తల నరికేశాడు.

అతడి ధనుస్సూ, రథంమీాది జెండా నరికేసి అదే వూపున అతడి తలా నరికేశాడు.

సాత్యకీ, సాంబుడూ, కృతవర్మా మొదలయిన యాదవయోధులు పెట్రేగిపోయారు. సాల్వుడిసేన తరిమి తరిమి కొట్టారు. తరిమి తరిమినా తరుగు లేకండా తిరగబడింది సాల్వుడిసేన-మాయసేన.

అలా విడుపూ విరామం లేకండా రోజుకాదు రెండు రోజులుకాదు, ఇరవయ్యేడు రోజులు సాగింది సాల్వుడి సౌభ యుద్ధం.

యాదవుల సైన్యం ఎంతో నాశనమయింది. పట్నం పాడయింది. తోటలు, కోనేళ్ళు, వీధులు, మేడలు, మిద్దెలు ఎన్నో నాశనమయాయి.

ఇంద్రప్రస్థంలో కృష్ణుడి మనస్సు మనస్సులో లేకండా పోయింది. ద్వారకమీాదికి తనువుపోయింది. మేనత్త కుంతి తోనూ, చెల్లెలు సుభద్రతోనూ, ద్రౌపదితోనూ, బావ మరుదులు పాండవులతోనూ "వెళ్ళివస్తాను" అనిచెప్పి ద్వారక పయనమయాడు. అన్న బలరాముడ్నీ, యావన్మంది భార్యల్నీ తర్లించుకువచ్చాడు.

ఊరి పొలిమేర చేరేసరికే అంతా అవగతమయిం దత డికి. పాంచజన్యం పూరించాడు. పిడుగు లురిమింది పాంచ జన్యం. అటు సాల్వుడిసేనా, ఇటు యాదవసేనా జల్దుకుంది.

బలరాముడితో స్త్రీ జనాన్ని పట్నంలోకి పంపిం చేశాడు కృష్ణుడు. తాను సాల్వుడిమీాదికి నడుం కట్టాడు.

"నీ కోసమే చూస్తున్నాను" అంటూ సౌభంతో ఎదురు వచ్చాడు సాల్వుడు. అంటూనే దారుకుడి మీద శక్తి గురిపెట్టి విసిరాడు. బాణం వేసి ముక్క-ముక్క-లు కొట్టేశాడు కృష్ణుడు. అదే వడిని పదహారు బాణాలు సాల్వుడి గుండెలు దూసెళ్ళిపోయినట్టు గుప్పించాడు. సౌభం బాణాలతో కప్పెట్టాడు.

జంకలేదు సాల్వుడు. ఒడుపు చూసి కృష్ణుడి ఎడమ జబ్బ మీద పిడుగులాటి బాణాలు కొట్టాడు. దెబ్బతో కృష్ణుడి చేతివిల్లు పట్టుతప్పి కిందపడిపోయింది.

సింహనాదం చేశాడు సాల్వుడు. "కృష్ణా! మా శిశుపాలుడికిచ్చిన పిల్లని దొంగచాటున ఎత్తుకు వచ్చావు. బాపనాడిలా మారువేషం వేసుకుని, దొంగదారిని వెళ్ళి, నీకు చేతకాక భీముడిచేత అధర్మంగా జరాసంధుణ్ణి చంపించావు. ఆదమరిచి నించున్న శిశుపాలుణ్ణి అన్యాయంగా నరికేశావు. అన్నీ ఇవాళ తీర్చేస్తాను. ఇదిగో ఇది సౌభం. నీ చావుకే తెచ్చాను. అప్పుడు మధురనించి ద్వారక పారిపోయావు. ఇప్పుడు ద్వారకనించి వల్లకాటికే పరిగెడతావు." అంటూ వింటి నారి మోగించాడు.

"అరిచే కుక్క- కరవదు సాల్వా. కరిచే కుక్క- మొరగదు. వల్లకాడు నిన్నే పిలుస్తూవుంది. అందుకే తలుచుకుంటున్నావు." అంటూ గద తీశాడు కృష్ణుడు. పూనిపట్టి సాల్వుడి మీద తగిలించాడు. ఊగిపోయాడు సాల్వుడు. సౌభంతో మాయమయాడు. చూస్తూ నించున్నాడు కృష్ణుడు.

ఇంతలో ద్వారకనించి ఒక మనిషి రొజుకుంటూ వచ్చాడు.

"ప్రభూ! ప్రభూ!" అంటూ బావురుమన్నాడు.

"ఏం, ఏం జరిగింది?" అడిగాడు కృష్ణుడు.

"దేవకీదేవి పంపింది. సాల్వుడు వచ్చి వసుదేవుణ్ణి ఈడ్చుకు పోయాడు. ఏడుస్తూ ఆ తల్లి నీకీమాట చెప్పమంది" అన్నాడు వాడు

నిజమే అనుకున్నాడు కృష్ణుడు. ఒక్క క్షణం తడబడి పోయాడు.

మరుక్షణంలో వసుదేవుణ్ణి పట్టుకుని సాల్వుడు ఎదట నిలబడ్డాడు. కత్తితీసి వసుదేవుడి తల నరికేశాడు.

కళ్ళు మూసుకున్నాడు కృష్ణుడు. అదంతా నిజమా అనుకున్నాడు. కళ్ళు విప్పాడు. ఎదట సౌభం లేదు, సాల్వుడు లేడు. వసుదేవుడి తలా లేదు, మొండెమూ లేదు. అంతా మాయ అని తెలుసుకున్నాడు కృష్ణుడు.

సౌభంమీాంచి సకిలించాడు సాల్వుడు. రకరకాల ఆయుధాలు కుమ్మరించాడు.

ఇక వీణ్ణి వూరుకోకూడదనుకున్నాడు కృష్ణుడు. సౌభం ముక్కకి ముక్కా, చెక్కకి చెక్కా చితకగొట్టేశాడు. సాల్వుడి కవచం చీల్చేశాడు, అతడి చేతులు నరికేశాడు. సుదర్శన చక్రం వేసి సిరసూ నరికేశాడు.

చచ్చినంత చచ్చి, కడప సాల్వసేన కాళ్ళకి బుద్ధి చెప్పేసింది. కనపడినంతమేరా కణువు కొట్టారు యాదవులు.

పెద్ద గద పట్టుకువచ్చి కృష్ణుడి తల మీద కొట్టాడు దంతవక్త్రుడు. చలించలేదు కృష్ణుడు. కౌమోదకి గదతో దంతవక్త్రుడి ఎదురురొమ్ముమీద ఒక్కటి కొట్టాడు. రక్తం కక్కుకున్నాడు దంతవక్త్రుడు. వెల్లకిలాపడి, చచ్చి ఫూరుకున్నాడు.

"మా అన్నని చంపావు. నిన్ను నరికిపారేస్తాను. అంటూ కత్తిదూశాడు విదూరథుడు. సుదర్శన చక్రం వేసి అతడి సిరసు ఎగరగొట్టేశాడు నవ్వుతూ కృష్ణుడు.

అలా గెలుపు సాధించి పట్నంలో ప్రవేశించాడు కృష్ణుడు. పాంచజన్యం పూరించాడు. గరుడ పతాకం గాలిలో ఎగిరింది. దారికడాకూ పువ్వులు చల్లారు ద్వారక స్త్రీలు. అతడి మీద గెలుపు పాటలు పాడారు. శంఖాలు పూరించారు జనం. భేరీలు మోయించారు. యాదవవీరులందరూ అతణ్ణి పొగుడుతూ వెంట నడిచారు.

దేవకీ వసుదేవులకి మొక్కి, నవ్వుతూ లోగిళ్ళలోకి వెళ్ళాడు కృష్ణుడు.

కుచేలుడు

రామకృష్ణులు గురుకులంలో సాందీపుడి దగ్గిర చదువుకుంటూ వున్నప్పుడు ఒక బీద బ్రాహ్మడు కూడా వారితో చదువుకుంటూ వుండేవాడు. బట్టలులేక చింకిగుడ్డలే కట్టుకునే

వాడతడు. అందుకని అందరూ కుచేలుడు (చింకి గుడ్డలవాడు) అని పిలిచేవారు. కృష్ణుడికీ అతడికీ బాగా స్నేహంగా వుండేది. ఆకులకోసం, పుడకలకోసం అడివికి వెళ్ళినా, గురువు చెప్పిన ఏ పనికీ ఇద్దరూ కలిసే వెళ్ళేవారు. కలిసే చదువుకునే వారు.

విద్యపూర్తిచేసి రామకృష్ణులు వచ్చేశారు. కుచేలుడూ తనవూరు తాను వెళిపోయాడు. తనలాటి పేదపిల్లనే ఒక దానిని పెళ్ళిచేసుకున్నాడు. కాని దినం గడవడం కష్టంగా వుండేది. పూటకి బత్తెముండేది కాదు. పస్తులు పడుకుండే వాడు. ఎముకలగూడులాటి శరీరం. కప్పేందుకు గుడ్డముక్క వుండేదికాదు. అలా అని బాధపడేవాడు కాడు. ఒకరిని బాధ పెట్టి బిచ్చమడిగేవాడు కాడు. మాట వచ్చినప్పుడు భార్యతో కృష్ణుడు నా నేస్తం అని చెపుతూ వుండేవాడు.

ఎప్పట్టిలాగే అవాళా పస్తు పడుకున్నారు ఆలూ మగలూ కుచేలుడు. ఆకలితో కిరకిరలాడిపోతూ అంది ఇల్లాలు:

"ఏమండీ! మీా నేస్తం కృష్ణుడు ద్వారకలో మహా రాజులా వున్నాట్ట! వేలాదిమంది వెళుతున్నారు. కావలిసిన సొమ్ములు తెచ్చుకుంటున్నారు. హాయిగా వుంటున్నారు. నేస్తాన్ని ఆమాత్రం చూడడా? ఆకలితో చచ్చిపోతున్నా నండీ."

"అయితే స్నేహితుణ్ణి ఇబ్బంది పెట్టమంటావుటే? బావుంటుందా? ఏమనుకుంటాడో! ఇంతకీ మనకి ఇంతే ప్రాప్తం. ఏం చేస్తాం?" అన్నాడు కుచేలుడు.

"ఆ మహానుభావుడికి ఇబ్బందేవిటండీ! చెడి స్నేహితుడింటికే వెళ్ళమన్నారు. సందేహించకండి. ఓమారు వెళ్ళిరండి."

"అయితే తప్పదంటావు. నాకూ వెళ్ళాలనే వుంది. ఎన్నాళ్ళయిందో నేస్తాన్ని చూసి. ఓమారు చూసి వస్తాను. అవునుగాని, వెళ్ళక వెళ్ళక వెళుతున్నాను, పట్టికెళ్ళడానికి ఏమైనా వుందా? ఉత్తిచేతులతో ఎలా వెళ్ళను! చూడూ, ఇంట్లో ఏమైనా వుందేమో!"

ఇల్లంతా వెదికింది ఇల్లాలు. అయ్యవారి నట్టిల్లు ఇంత కంటే నయం. ఇరుగు పొరుగు ఇళ్ళకి వెళ్ళి నాలుగు పిడికిళ్ళు అటుకులు సంపాదించి తెచ్చింది. చింకిపాతలో మూటకట్టాడు బ్రాహ్మడు పదిలంగా. వేకువనే లేచి ద్వారక పయనం కట్టాడు. దారికడాకూ నడుస్తూ, కూచుంటూ చివరికి ద్వారక చేరాడు.

ఎటుచూసినా వెలిగిపోతూ వుంది ద్వారక. "పోలుస్తాడో, పొమ్మంటాడో!" జంకుతూ, జంకుతూ వెళ్ళాడు బ్రాహ్మడు. ఆ ప్రాకారాలూ, మేడలూ, మండపాలూ కళ్ళు తిరిగిపోతూ వుంది కోట. పదహారు వేల లోగిళ్ళు. మబ్బుల్ని తాకుతున్న పట్టపు దేవేరుల మేడలు. మేడలమీద గుమ్మటాలు, గుమ్మటాల మీద జెండాలు, చిరుగంటలు, వాటి మధ్య కృష్ణుడి బంగారు భవనం ధగధగా మెరిసిపోతూ వుంది.

"ఎవరేమంటారో?" జంకుతూ, జంకుతూ లోపలికి వెళ్ళాడు కుచేలుడు. బంగారం మంచం పట్టుపానుపుమీద

ప్రియురాళ్ళతో కులాసాగా కూచున్నాడు కృష్ణుడు. అల్లంత దూరాన కుచేలుణ్ని చూశాడు. ఉన్నపాళాన లేచి ఎదురు వచ్చాడు.

"కుచేలా! కుచేలా!" అంటూ గుచ్చి గుచ్చి కౌగిలించుకున్నాడు. చెయ్యి పట్టుకు తీసుకువెళ్ళి తన ఏనుగు దంతాల బంగారం మంచంమీద, పట్టుపరుపుమీద కూచో పెట్టాడు. రుక్మిణీదేవిచేత చామరం వేయించాడు. "నడిచి వచ్చావా?" అంటూ కాళ్ళు వొత్తాడు. కుశల మడిగాడు.

"ఎప్పుడూ నిన్ను తలుచుకుంటూనే వుంటాను. మనం చదువుకున్న దినాలు ఎంత సరదాగా గడిచాయి. జ్ఞాపకముందా? ఒకనాడు సమిధలకోసం అడివికి పంపారు గురువుగారు. రాత్రిపడింది. గాలీ, వానా వచ్చాయి. తెల్లవార్లూ అడివిలోనే వుండిపోయాం. మనకోసం గురువుగారు నిద్ర లేకండా వెదికారు. ఎంత ప్రేమ శిష్యులంటే ఆయనకి! సరే, నాకోసం ఏం తెచ్చావు నేస్తం?" అని చెయ్యి చాచాడు.

చింకిపీలికనించి అటుకులు విప్పి అందిచ్చాడు కుచేలుడు.

"ఓ! ఓ! అటుకులంటే ఇష్టం నాకు" అంటూ గుప్పెడుతీసి నోట్లో వేసుకున్నాడు కృష్ణుడు.

"ఎంత బావున్నాయి!" అంటూ నమిలేసి మరో గుప్పెడు తీయబోయాడు.

"చాలు" అంటూ చప్పున అడ్డుకుంది రుక్మిణి. కుచేలుడికి ఘుమ ఘుమ లాడుతున్న నలుగులు పూయించాడు

కృష్ణుడు. పన్నీరు జలక మాడించాడు. చందనం పూయించాడు. ఆరురసాలతోనూ తృప్తిగా భోజనం పెట్టించాడు. కప్పూరపు తాంబూలమిప్పించాడు.

"ఈ బక్క బాపనయ్యకి, మురికి పాతలరాయుడికి ఇంత వైభోగ మెందుకమ్మా?" అంటూ నవ్వుకున్నారు ఆడంగులు.

కొన్నాళ్ళుండి వచ్చేశాడు కుచేలుడు. "ఎందుకు వచ్చావు? ఏం కావాలి?" అని అడగలేదు కృష్ణుడు.

"ఇందుకు వచ్చాను. ఇది కావాలి" అని అడగనూ లేదు కుచేలుడు. ఏమీ ఇవ్వలేదని విచారించనూలేదు. ఉత్తి చేతులతోనే ఇంటిదారి పట్టాడు బ్రాహ్మడు.

ఎలా వెళ్ళాడో అలాగే ఇంటికి వచ్చేశాడు కుచేలుడు. అయితే 'ఏదీ తన పాక? ఈ నాలుగిళ్ళ భవంతి తనదేనా? ఈ గుమ్మాలేమిటి! ఈ మండువాలేమిటి? ఈ నౌకర్లేమిటి?' నిచ్చెరపోతూ గుమ్మంలో నించున్నాడు బ్రాహ్మడు.

"రండీ లోపలికి రండీ, అలా నించుండిపోయారేమిటీ? ఇంకా రాలేదేమని చూస్తున్నాన్నేను." అంటూ నవ్వుతూ ఎదురు వచ్చింది ఇల్లాలు. ఆమె వంటినిండా బంగారు నగలున్నాయి.

పాండవుల పరామర్శ

మయసభ పరాభవంతో కుమిలిపోతూ వచ్చాడు దుర్యోధనుడు. మాయజూదం కల్పించి పాండవుల్ని అడివికి

పంపించాడు. విని విచారించాడు కృష్ణుడు. యాదవులతో కలిసి వెళ్ళి, కామ్యక వనంలో పాండవుల్ని కలుసుకున్నాడు. ద్రౌపదినీ, తమ్ముల్లతో ధర్మరాజునీ పరామర్శించాడు. కౌరవుల అన్యాయం విని మండిపడ్డాడు. "మాయజూదం మాటే ఎరగన్నేను అప్పుడు సాల్వుడితో యుద్ధంలో వుండి పోయాను. నేనే వుంటే ఇంతపని జరిగేది కాదు." అంటూ ఓదార్చాడు. ద్రౌపదిని సముదాయిస్తూ "చెల్లెమ్మా, విచారించకు. కౌరవులకు కాలం మూడింది." అంటూ ఓదార్చాడు. ధర్మరాజుకి ధైర్యం చెబుతూ కామ్యకంలో కొద్దిరోజులున్నాడు.

ఓనాడు ఏకాంతంగా ద్రౌపదితో కబుర్లు చెబుతూ కూచుంది సత్యభామ. ఆమాటా, ఈమాట చెబుతూ అడిగింది:

"చూడమ్మా, ద్రౌపదీ! నాకు నచ్చిన ఆడబడుచువి నువ్వు. ఏమీ అనుకోనంటే ఓమాట అడుగుతాను. మీ అన్నయ్యని అదుపులో పెట్టలేక సతమతమయిపోతున్నాను. మా అన్నదమ్ములు అయిదుగురినీ ఎలా తిప్పుకుంటున్నావో, ఆశ్చర్యం వేస్తుంది నాకు. దీని గుట్టేమిటో అడగాలని ఎన్నాళ్ళయో అనుకుంటాను. అవకాశం చిక్కలేదు. నువ్వు చెప్పినట్టు వింటారు వాళ్ళు. వాళ్ళంటే నువ్వూ, నువ్వంటే వాళ్ళూ ప్రాణం పెడతారు. ఏమిటి రహస్యం? ఏమైనా మందు పెట్టావా? మంత్రం సాధించావా? పడకలో ఏమైనా మెలకువ సంపాదించావా? అది నాకూ కాస్త చెబితే..."

నవ్వుకుంది ద్రౌపది. చీదరించుకుంది.

"అలాంటి వేవీ తెలీవు వదినా" అంది. "మందులూ,

మాకులూ మా ఇంటా వంటా లేవు. మెలకువలూ, మెరుపులూ ఎరగన్నేను.

మగడు మన మనసు పట్టి నడవాలంటే, వదినా! మనం మగడి మనసు పట్టి నడవాలి. నేనెరిగిన రహస్యమంతా ఇదే నమ్మా!"

పాండవులతో కొద్ది దినాలు గడిపి ద్వారక వచ్చేశాడు కృష్ణుడు. చెల్లెలు సుభద్రనీ, మేనల్లుడు అభిమన్యుణ్ణీ తనతో తీసుకు వచ్చేశాడు. యుద్ధ విద్యలో అభిమన్యుణ్ణి ఆరితేరి నట్టు తరిబీదు చేశాడు.

రుక్మి

చెల్లెలు రుక్మిణీ పెళ్ళిలో కృష్ణుడిచే ఓడిపోయి, ఒట్టు పెట్టుకున్న ప్రకారం కుండిన పొలిమేర చూడలేదు రుక్మి. భోజకటమే రాజధాని చేసుకున్నాడు. అతడికి రుక్మవతి అని కూతురుండేది. చక్కని చుక్క. కూతురికి స్వయంవరం చాటించాడు రుక్మి. మేనమామ కూతురని స్వయంవరానికి వెళ్ళాడు ప్రద్యుమ్నుడు. ఒక్కడే వెళ్ళాడు.

రుక్మవతి ప్రద్యుమ్నుణ్ణి వరించింది. కృష్ణుడి పగ వుండినా చెల్లెలి కొడుకు కదా అని కాళ్ళు కడిగి కన్య నిచ్చాడు రుక్మి. దీంతో యాదవులతో చుట్టరికం మరింత దగ్గరయింది. వెనకటి విరోధం సన్నగిల్లుతూ వచ్చింది.

అయితే తాను బలవంతుడు అన్న భావం ఎన్నడూ పోలేదు రుక్మికి. ఆ భావంతోనే కౌరవులూ, పాండవులూ, యుద్ధానికి సిద్ధపడుతున్నపుడు ఉభయుల దగ్గిరికీ వెళ్ళి "మీకు

భయంవేస్తే నా సాయం కోరండి" అన్నాడు. ఉభయులూ ఇతడి సాయం అక్కరలేదన్నారు. అందుకని అంత వీరుడైనా భారత యుద్ధంలో రుక్మికి చోటు లేకండాపోయింది.

రుక్మికి రోచన అని మనమరాలుండేది. ఆమెని రుక్మిణి మనవడికి - అంటే ప్రద్యుమ్నుడి కొడుకు అనిరుద్ధుడికిచ్చి పెళ్ళిచేశాడు. అసంగతమే అయినా రెండువేపుల వారూ అంగీకరించారు పెళ్ళి.

మనవడి పెళ్ళికి కృష్ణుడూ, బలరాముడూ మొదలైనవారు ద్వారకనించి భోజకటం తర్లివచ్చారు. ఘనంగా జరిగింది పెళ్ళి.

పెళ్ళిలో సరదాగా రుక్మీ, బలరాముడూ పాచికలాట పెట్టుకున్నారు. బలరాముడు చెయ్యి తిరిగిన ఆటగాడు కాడు. కాని సరదా హెచ్చు.

ఒకట్రెండాటలు రుక్మి గెలుచుకున్నాడు. పెద్ద మొత్తం ఒడ్డాడు బలరాముడు. ఆ ఆట రుక్మి ఓడిపోయాడు. కాని బుకాయించాడు. కళింగ దేశం రాజూ మొదలైన రుక్మి స్నేహితులు "అవును, రుక్మే గెలిచాడు" అంటూ గల్లంతు చేశారు.

పదికోట్ల పందెం వొడ్డాడు బలరాముడు. ఈమారూ రుక్మి వోడిపోయాడు. కాని మళ్ళీ "నేనే గెల్చాను" అని బుకాయించాడు. పైగా "ఇది గొల్లపల్లె కాదు బలరామా! భోజకటం. ఛేది రాజధానికి. ఇది సొమ్ములు కాయడం కాదు.

రాజులాడే పాచికలాట!" అంటూ విరగబడిన అతడికి తాళం వేశారు, కళింగరాజూ మొదలైనవారు.

భగ్గుమన్నాడు బలరాముడు. ముసలం తీసి, రుక్మి నడినెత్తిని కొట్టాడు. సిరసుపగిలి చచ్చిపోయాడు రుక్మి. కళింగం రాజు కనపడితే ఒట్టు. కడమరాజులూ కాలికి బుద్ధి చెప్పారు. ఏమీ అనకండా చూస్తూ వూరుకున్నాడు కృష్ణుడు.

ఉష కల

ఉష బాణుడి కూతురు. బాణుడు బలిచక్రవర్తి కొడుకు. శోణితపురంరాజు. బలిచక్రవర్తికి నూరుగురు కొడుకులుండే వారు. వారిలో పెద్దవాడు బాణుడు.

ఉష అల్లారు ముద్దుబిడ్డగా పెరిగింది. అపురూపమైన అందకత్తె. దోరవయసులో ఉంది. ఒకనాడు ఆమెకిమంచి కల వచ్చింది.

తన ఈడు అందగాడొకడు- ముసిముసి నవ్వులతో తన దగ్గరికి వచ్చాడు. ప్రేమ కలాపాలు సాగించాడు. పొదివి పట్టుకున్నాడు. ముద్దులు కురిపించాడు. కళలు కరిగించాడు. పొత్తు కలిశాడు.

తెలువుకుంది ఉష. అంతా నిజంలాగే వుంది. అతడు మాత్రం అవుపడలేదు. ఎవరతడు? ఎలా దొరుకుతాడు? ఉస్సురంటూ కూచుంది ఉష.

బాణుడికి కుంభాండుడు అని ఒక మంత్రి వుండేవాడు. అతడికి చిత్రలేఖ అని ఒక కూతురుండేది. ఉషని చూడక

పోతే వుండలేక పోయేది చిత్రలేఖ. ఇద్దరికీ అంత స్నేహం. ఎప్పటిలాగే వచ్చి ఉషని చూసిందామె. ఆవలిస్తే పేవులు లెక్కపెట్టేస్తుంది తాను. అన్నికళలూ తెలుసు తనకి. "ఏమిటి ఉషా! అలా వున్నావు?" అని అడిగింది.

"ఏం లేదూ, కల."

"ఆఁ! ఏం కల? చెప్పు, చెప్పు! మంచి కలేనా? ఎవడైనా__?"

"పోవే. ఎవడో ఏమిటి? అంత అందమయినవాడు ఎక్కడా వుండడు."

"ఆఁ, ఏం చేశాడట?"

"ఏం చెయ్యాలో అదే చేశాడు. అతణ్ణే పెళ్ళి చేసుకుంటాను. చిత్రలేఖా! అతడు లేకపోతే బతకనే, బతకను"

"ఎవరో చెప్పగలవా? పేరయినా చెప్పాడా?"

"లేదు. నువ్వే వెదకాలి."

"నీ కలలో మనిషిని నేనెలా వెదకనూ? పోనీ ఎలా వుంటాడట?"

"చెప్పాను గదా, చెప్పలేనంత అందంగా వుంటాడు. అబ్బా! నేను మరి బతకనే."

"విచారించకు. చిత్రపటం చూస్తే పోల్చగలవు కదా?"

"పోలుస్తాను."

"నా సంగతి నీకు తెలుసుకదా ? నా పేరే చిత్రలేఖ. ప్రపంచంలోని రాజకుమాళ్ళ చిత్రపటాలన్నీ వేస్తాను. అందులో నీవాడెవరో నువ్వు పోల్చిపడితే చాలు, ఎక్కడున్నా, ఎవడైనా లాక్కు వస్తాను విచారించకు."

దేశదేశాల రాజకుమాళ్ళ చిత్రాలు రాసింది చిత్రలేఖ. ఆ వరసలో ఒక చిత్రపటం చూసి ఉలిక్కిపడింది ఉష. "ఇతడే, ఇతడేనే" అంటూ తల వంచుకుంది.

"ఇంకేం, ఇతడా? ఇతడు అనిరుద్ధుడు. కృష్ణమూర్తి గారి మనవడు. ప్రద్యుమ్నుడి కొడుకు, ద్వారక. మరి బాధ పడకు ఉషా! ఉషారుగా వుండు, ఈ రాత్రే వస్తాడు" అంది చిత్రలేఖ.

శక్తిమంతురాలు చిత్రలేఖ. అసుర మాయలన్నీ ఎరుగునామె. అర్ధరాత్రి దాటాక ఆకాశమార్గాన ద్వారక వెళ్ళి అనిరుద్ధుడ్ని పట్టుకు వచ్చింది. రెండో కంటి వాడికి తెలీకండా ఉష గదిలోకి చేర్చింది.

ఉషా, అనిరుద్ధులు రాణివాసంలో రహస్యంగా ప్రేమకలాపాలు సాగిస్తూ వచ్చారు.

బాణుడికి వుప్పందింది. వెళ్ళి కళ్ళారా చూశాడు. అనిరుద్ధుడ్ని పాశాలతో కట్టి ఖైదులో పడేశాడు.

ఉన్నట్టుండి అనిరుద్ధుడు అవుపడకపోడంతోనే ఆందోళన పడ్డారు యాదవులు.

మనవడ్ని శోణితపురంలో బాణుడు బంధించాడని విన్నాడు కృష్ణుడు. పెద్ద యాదవ సేనతో వెళ్ళి శోణితపురం ముట్టడించాడు. బలరాముడూ, సాత్యకీ, ప్రద్యుమ్నుడూ, గదుడూ, సాంబుడూ, సారణుడూ, నందుడూ, ఉపనందుడూ, భద్రుడూ - ఇంకా ఎంతోమంది యాదవవీరులూ వెళ్ళి బాణుడి రాజధానిమీద విరుచుకు పడ్డారు. పట్నం పాడు చేశారు. సైనికుల్ని చావగొట్టారు.

బాణుడు బలమంతా ప్రయోగించాడు. ఘోరంగా పోరాడాడు. తుదకి కృష్ణుడితో ఓడిపోయాడు. ఉషని అని రుద్ధుడికిచ్చి పెళ్ళిచేశారు. సారె పెట్టి సాగనంపాడు.

ఉష కల నిజమయింది.

ఉత్తర పెళ్ళి

పాండవులు పన్నెండేళ్ళ వనవాసం పూర్తిచేశారు. ఒకయేడు అజ్ఞాతవాసమూ గడిపారు. అదంతా అయ్యాక విరాటరాజు తన కూతురు ఉత్తరని, సుభద్ర కొడుకు అభిమన్యుడి కిచ్చి పెళ్ళిచేశాడు. ద్వారకనించి అభిమన్యుడ్నీ, సుభద్రనీ తీసుకుని విరాటనగరం వచ్చాడు కృష్ణుడు. బలరాముడూ, సాత్యకీ, కృష్ణుడి వియ్యంకుడు కృతవర్మా, అక్రూరుడూ, ప్రద్యుమ్నుడూ, సాంబుడూ, గదుడూ మొదలైన కుమారుళ్ళు, యాదవ ప్రముఖులూ వచ్చారు. అలాగే ద్రుపదుడూ మొదలైన బంధువులూ వచ్చారు. ముచ్చటగా జరిగిపోయింది ఉత్తరాఅభిమన్యుల పెళ్ళి.

నాగవిల్లి నాలుగోనాడు, "తరవాత ఏం చెయ్యాలి?" అంటూ హెచ్చరించాడు, "మాయజూదంలో కౌరవులు పాండవుల రాజ్యం కాజేశారు. న్యాయమో అన్యాయమో పన్నెండేళ్ళు అడవుల్లో వుండి, పదమూడో ఏడు అవుపడకండా వుండి, ఒప్పందం పూర్తిచేశాడు ధర్మరాజు. గడువు పూర్తియినా కాలేదంటున్నాడు దుర్యోధనుడు. ఈ తగువు తెమలకపోతే యుద్ధం తప్పదు. నాకు వాళ్ళెంతో వీళ్ళూ

అంతే. కనక మనలో తగినవారు మధ్యవర్తులుగా వుండి పాండవుల రాజ్యం పాండవుల కిప్పించాలి" అన్నాడు.

"నిజమే" అంటూ అందుకున్నాడు బలరాముడు. "కాని మాయజూద మేముంది? ధర్మరాజుకి ఆటలో సరదా తప్ప, నేరుపు లేదు. ఓడిపోయాడు. కనక కౌరవుల దగ్గిరికి కబురుపంపి, వినయంగా ప్రార్థించి కార్యం సాధించాలి" అన్నాడు.

"ప్రార్థించడం దేనికి?" అంటూ సాగదీశాడు సాత్యకి. "పాండవుల రాజ్యం పాండవులకి రావాలి. దయాధర్మ భిక్షు కాదిది. కాదంటే యుద్ధం చేసి తమరాజ్యం తాము తీసుకుంటారు పాండవులు. మేమంతా వుండనే వున్నాం."

"మీారు ఒప్పుకుంటే మా పురోహితుణ్ణి హస్తిన పంపుతాను" అన్నాడు ద్రుపదుడు.

"బాగుంది" అన్నాడు కృష్ణుడు, "మీా మాట విని ధర్మరాజు రాజ్యం ధర్మరాజుకి ఇస్తే సరేసరి. కాదు, యుద్ధమే తప్పనప్పుడు, సహాయం కోరవలిసిన వారందరికీ కబురుపంపాక, మాకు కబురంపండి ద్వారక."

సభ ముగిసింది. రాజులూ, చుట్టాలూ ఎవరి వూళ్ళకి వాళ్ళు వెళ్ళారు. రామకృష్ణులూ, తక్కిన యాదవులూ ద్వారక వచ్చేశారు.

సహాయం

ద్రుపదుడు పంపిన రాయబారం ఫలించలేదు. పాండవులూ, కౌరవులూ యుద్ధం తప్పదే అనుకున్నారు.

సహాయంకోసం రాజులందరికీ సందేశాలు పంపారు. ద్వారకకి స్వయంగా దుర్యోధనుడే వచ్చాడు. ముందు కృష్ణుడి దగ్గిరికే వెళ్ళాడు. నిద్రపోతున్నాడు కృష్ణుడు. అతడివేపు ఆసనం మీద కూచున్నాడు దుర్యోధనుడు. అంతలో అర్జునుడూ అక్కడికే వచ్చాడు. కృష్ణుడి కాళ్ళవేపు కూచున్నాడతడు.

కొంచేపట్టిలో మేలుకున్నాడు కృష్ణుడు. ముందు అర్జునుణ్ణి పలకరించాడు. తరవాత వెనక్కి తిరిగి దుర్యోధనుణ్ణి చూశాడు, కుశలమడిగాడు.

దుర్యోధనుడూ, అర్జునుడూ ఇద్దరూ "యుద్ధంలో నీ సాయం కావాలి" అని కృష్ణుణ్ణి కోరారు.

"నా దగ్గిర పదివేల సేన వుంది. మీలో వాళ్ళ నొకరికిస్తాను. నేను ఒక్కణ్ణీ ఒకరివేపు వస్తాను. నేను ఆయుధం పట్టుకోను, యుద్ధం చేయను. నా సేన యుద్ధం చేస్తుంది. సేన కావాలో నేను కావాలో మీరే కోరుకోండి" అన్నాడు కృష్ణుడు.

"నేను ముందు వచ్చాను, కనక నేను ముందు కోరుకుంటాను" అన్నాడు దుర్యోధనుడు.

"నువ్వు ముందు వచ్చావు. నేను ముందు అర్జునుణ్ణి చూశాను. అంచేత ఇద్దరూ సమానమే. అయితే అర్జునుడు చిన్నవాడు. చిన్నవాడు ముందు కోరుకోవాలి" అన్నాడు కృష్ణుడు.

కృష్ణుడ్ని కోరుకున్నాడు అర్జునుడు.

దుర్యోధనుడు వెళ్ళాక అర్జునుడ్ని అడిగాడు కృష్ణుడు:

"యుద్ధం చేసే సైన్యం ఒదిలేసి, ఆయుధమైనా పట్టుకోని నన్ను కోరుకున్నావేమిటి అర్జునా ?"

"నువ్వు ఎక్కడుంటే అక్కడే గెలుపు బావా!" అన్నాడు అర్జునుడు.

"నువ్వే గెలుస్తావు. నువ్వు రథివయితే, నేను సారథిగా కూచుంటాను" అన్నాడు కృష్ణుడు.

అర్జునుడితో కలిసి, ధర్మరాజు దగ్గిరికి వచ్చేశాడు.

రాయబారం

"పోరు నష్టం, పొందు లాభం." ఆలోచించాడు ధర్మరాజు. హస్తిన వెళ్ళి సంధి చేసుకురమ్మని కృష్ణుణ్ని వేడుకున్నాడు. "మా ఐదుగురికీ అయిదూళ్ళయినా ఇమ్మను. యుద్ధం రాకండా ఆపద తప్పించు" అన్నాడు.

సాత్యకినీ, కృతవర్మనీ వెంట పెట్టుకుని హస్తినాపురం వెళ్ళాడు కృష్ణుడు. విదురుడి ఇంటికి అతిథిగా వెళ్ళాడు. మేనత్త కుంతిని చూశాడు. పాండవుల క్షేమం చెప్పాడు. మర్నాడు కౌరవుల సభకి వెళ్ళాడు. ధర్మరాజు సందేశం ధృతరాష్ట్రుడికి వినిపించాడు.

"నా కొడుకు నా మాట వినడంలేదు." అన్నాడు ధృతరాష్ట్రుడు.

"అయితే అతడ్ని తరిమేయి. ఒక్కడికోసం కులమంతా బుగ్గి చేసుకోకు" అన్నాడు కృష్ణుడు. నల్లమబ్బు లురిమినట్టు కౌరవ సభలో సందేశం వినిపించాడు.

శకునీ, కర్ణుడూ, దుశ్శాసనుడూ, దుర్యోధనుడూ కుమ్మక్కయ్యారు. కృష్ణుడ్ని పట్టుకుని కట్టెయ్యాలని చూశారు.

కనిపెట్టాడు కృష్ణుడు. విశ్వరూపం కనపరిచాడు. సాత్యకీ, కృతవర్మలతో కలిసి కౌరవసభనించి వచ్చేశాడు. కుంతీతోనూ, విదురుడితోనూ చెప్పి ద్వారక వచ్చేశాడు. సాగనంపవచ్చిన కర్ణుడితో అతడి పుట్టుగుట్టు చెప్పి, పాండవులతో చేరమన్నాడు.

"నువ్వు కుంతీ కుమారుడివి. కన్యగా వున్నప్పుడు నిన్ను కన్నదామె, పాండవులలో నువ్వే రాజువవుతావు. ద్రౌపది నిన్నూ మగడిగా వరిస్తుంది." అన్నాడు.

వినుకోలేదు కర్ణుడు. "నన్నే నమ్ముకున్నాడు దుర్యోధనుడు. స్వామి ద్రోహం చెయ్యలేను" అన్నాడు.

పాండవుల దగ్గిరికి వచ్చేశాడు కృష్ణుడు. యుద్ధానికి కురుక్షేత్రం బయలుదేరండన్నాడు. రణభేరీ వేయించాడు.

బలరాముడి తటస్థ భావం

యుద్ధంకోసం దేశాలన్నీ కుతకుతలాడి పోతున్నాయి. అదంతా నచ్చలేదు బలరాముడికి. ఓవేపు తన ప్రియ శిష్యుడు దుర్యోధనుడు. మరోవేపు తమ్ముడు కృష్ణమూర్తి. అందుకని ఏ వేపూ వెళ్ళక తటస్థంగా వుండిపోయాడు. ముందుగానే తీర్థయాత్రకి వెళిపోయాడు. ప్రభాసం, పృథూదకం, బిందుసరం, సుదర్శనం, విశాలం, బ్రహ్మతీర్థం, చక్ర

తీర్థం వెళ్ళాడు. సరస్వతీ, గంగా, యమునా నదులలో స్నానాలు చేస్తూ, నైమిషారణ్యం వెళ్ళాడు.

అక్కడ సత్రయాగం చేస్తున్నారు మునులు. రోమహర్షణుడు పురాణ కథలు చెపుతున్నాడు. రోమహర్షణుడు సూతుడు. వ్యాసుడి శిష్యుడు. సూతులు ప్రతిలోమ జాతి వారు. అంటే బ్రాహ్మణ స్త్రీకీ, క్షత్రియ పురుషుడికీ కాని, క్షత్రియ స్త్రీకీ వైశ్యుడికీ గాని పుట్టినవారు.

బలరాముడిని చూసి నైమిషారణ్యం మునులు లేచి గౌరవించారు. రోమహర్షణుడు లేవలేదు, గౌరవించనూలేదు.

"వీడు బ్రాహ్మడు కాడు. అయినా ఎత్తు పీటమీద కూచున్నాడు. పైగా నన్ను చూసి లేవలేదు" అని కోపం తెచ్చుకున్నాడు బలరాముడు. రోమహర్షణుడిని చంపేశాడు.

"అన్యాయం! బలరామా, అన్యాయం" అంటూ అరిచారు మునులు. "దీనికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలి నువ్వు" అన్నారు.

చేసిన పనికి నొచ్చుకున్నాడు బలరాముడు. సూతుడికి దీర్ఘాయు విచ్చాడు.

సంతోషించారు మునులు. "రామా! ఈ ప్రాంతంలో వల్వలుడని ఒక రాక్షసుడున్నాడు. అప్పుడప్పుడు వచ్చి, మా సత్రయాగం పాడుచేస్తూ వుంటాడు. అతడి బాధ లేకండా అనుగ్రహించు" అన్నారు.

ఇలా మునులు అంటూనే వున్నారు. వచ్చి పడ్డాడు వల్వలుడు. ఇల్వలుడి కొడుకతడు. నల్లటి మబ్బులా వున్నాడతడు.

నాగలి తీసి ఒక్కటి వేశాడు బలరాముడు. చచ్చి పూరుకున్నాడు వల్వలుడు.

నైమిషారణ్యంనించి కౌశిక, సరయూ, ప్రయాగ, పులహాశ్రమం, గండకి, గయ, గంగా సముద్ర సంగమం, మహేంద్రం, అఖండగోదావరి, శ్రీశైలం, తిరుమల, వేణా, పంపా, కావేరీ, కన్యాకుమారి మొదలైన తీర్థాలు తిరిగాడు బలరాముడు. కురుక్షేత్రంలో పద్దెనిమిది దినాలు జరిగింది భారతయుద్ధం. పద్దెనిమిది అక్షోణీల సైన్యం హతవయింది. చివరి రోజున కాని తిరిగి రాలేదతడు.

కృష్ణుడి సారథ్యం

కురుక్షేత్రంలో భారతయుద్ధం ఆరంభమయింది. కృష్ణుడు యుద్ధం చెయ్యలేదు. ఆయుధమూ పట్టుకోలేదు. పట్టుకోవలిసిన పగ్గాలు మాత్రం పట్టుకున్నాడు. రథంమీద సారథిగా కూచున్నాడు. సారథ్యం చేశాడు. యుద్ధం చెయ్య లేదు. కాని యుద్ధమంతా తానే నడిపించాడు. అంత సేనా తానే చంపించాడు. కృష్ణుడు లేని యుద్ధంలేదు.

అర్జునుడికే కాదు, పాండవులకే సారథి కృష్ణుడు. సారథి మాత్రమే కాదు—మంత్రి, బంధువు, గురువు, దేవుడు.

పద్దెనిమిది దినాలు ఘోరంగా జరిగిపోయింది భారత యుద్ధం. పద్దెనిమిది అక్షోణీల సైన్యం హతవారిపోయింది. చివరినాడు భీముడికీ దుర్యోధనుడికీ గదాయుద్ధం నిశ్చయ మయింది.

తీర్థయాత్ర ముగించి ప్రభాసతీర్థంకి వచ్చి విన్నాడు బలరాముడు.

ఈ గదాయుద్ధం కాకండా చూడాలని కురుక్షేత్రం వచ్చాడు.

"సమయంకాని సమయంలో వచ్చాడు అన్నయ్య. ఎటుపోయి ఎటొస్తుందో!" అనుకున్నాడు కృష్ణుడు. ధర్మ రాజుతో కలిసి ఎదురు వెళ్ళాడు. నమస్కరించి రణస్థలానికి తీసుకువచ్చాడు.

భీముడూ, దుర్యోధనుడూ గదలెత్తి పట్టుకున్నారు. కొట్టుకోడానికి సిద్ధంగా వున్నారు.

"ఆగండి" అన్నాడు బలరాముడు, "భీమా! నువ్వు బలవంతుడివి. నాకు తెలుసు. కాని గదలో మెలకువ లెరగవు. కనక దుర్యోధనుణ్ణి గెలవ లేవు. దుర్యోధనా! గదలో నేర్పుంది నీకు. కాని బలంలో భీముడి ముందు తీసికట్టు. కనక నువ్వూ గెలవలేవు. ఇద్దరికిద్దరూ సమానమే కనక గదా యుద్ధం కట్టిపెట్టండి."

బలరాముడి మాట చెవిని పెట్టలేదు దుర్యోధనుడు. అటువేపు చూడన్నా చూడలేదు భీముడు.

"సరే, అనుభవించండి" అంటూ ద్వారక వెళ్ళి పోయాడు బలరాముడు.

భీముడూ, దుర్యోధనుడూ కలబడ్డారు. ఖణేల్ ఖణేల్ మని నిప్పులు కక్కాయి గదలు కళ్ళు మూసుకుపోయాయి. ఒళ్ళు గరిపొడిచింది. బలరాముడు సరిగానే బేరీజు కట్టాడు.

ఒకడు బలంలో గట్టివాడయితే, ఒకడు ఒడుపులో గడుసు వాడు.

చూస్తూనే వున్నాడు కృష్ణుడు. గెలుపు తక్కెడ ముల్లులాగ అటూ, ఇటూ వూగిసలాడి నప్పుడు, భీముడు చూసినట్టు తన తొడమీద చరుచుకున్నాడు. సైగ గ్రహించాడు భీముడు. దుర్యోధనుడి తొడలమీద కొట్టేశాడు. తొడలు విరిగి పడిపోయాడు దుర్యోధనుడు.

అక్కణ్ణుంచి సాత్యకినీ, పాండవులైదుగురినీ గుడారాలకి దూరంగా తీసుకుపోయాడు కృష్ణుడు ఆ రాత్రి పాండవుల గుడారాలలో చొరబడ్డాడు అశ్వత్థామ. అందరితో పాటు ద్రౌపది కుమార్ళని అయిదుగురినీ చంపేశాడు.

కొడుకుల చావువిని నేల గేవుతూ ఏడ్చింది ద్రౌపది. అశ్వత్థామని హతవారుస్తానని బయలుదేరాడు అర్జునుడు. రథం వూసి పగ్గాలు పట్టుకు కూచున్నాడు సారథి కృష్ణుడు. విల్లూ, బాణాలూ పట్టుకు కూచున్నాడు అర్జునుడు. పారిపోయిన అశ్వత్థామ మీదికి పరుగులు తీసింది అర్జునుడి తెల్లగుర్రాల రథం.

ఆపద గమనించాడు అశ్వత్థామ. అమాంతం బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు.

"నువ్వూ బ్రహ్మాస్త్రం వెయి" అంటూ అర్జునుణ్ణి తొందర చేశాడు కృష్ణుడు. బ్రహ్మాస్త్రానికి బ్రహ్మాస్త్రమే వేశాడు అర్జునుడు. ప్రళయం పుట్టినట్టయింది. పెద్దపెద్ద మునులు పరిగెత్తుకు వచ్చారు. అశ్వద్ధామనీ అర్జునుణ్ణీ అస్త్రాలు ఉపసంహరించమన్నారు.

అర్జునుడు ఉపసంహరించాడు. బ్రహ్మాస్త్రం వెయ్యడమే తెలుసు అశ్వత్థామకి. ఉపసంహరించడం తెలీదు. అందుకని అతడి అస్త్రమూ అర్జునుడే ఉపసంహరించాడు.

అయితే అశ్వత్థామని పట్టేశాడు అర్జునుడు. "కనికరించకు వీణ్ణి" అన్నాడు కృష్ణుడు.

అశ్వత్థామని కట్టేసి ద్రౌపది దగ్గిరికి తీసుకు వచ్చాడు అర్జునుడు.

అశ్వత్థామ తలలో సహజమైన మణి వుండేది. కృష్ణుడి మాట మీద అతడి తల కత్తిరించి మణి తీసుకున్నాడు అర్జునుడు.

"ఇదిచాలు, విడిచిపెట్టు" అన్నాడు కృష్ణుడు, "ఎంతయినా బ్రాహ్మడు. గురువు కొడుకు. జుత్తు కత్తిరించడమూ, మణి లాక్కోడమూ చంపడంతో సమానం" అన్నాడు.

"అవును, కొడుకులకోసం నా కడుపు తరుక్కుపోతున్నట్టే ఇతణ్ణి చంపేస్తే, ఇతడి తల్లి కృపి కడుపు చెరువయిపోతుంది. కట్లువిప్పి, వదిలేయండి" అంది ద్రౌపది.

భీముడు మాత్రం పళ్ళు పటపట కొరికాడు.

కట్లు విప్పేశాడు అర్జునుడు. తల వంచుకు వెళిపోయాడు అశ్వత్థామ.

భారతయుద్ధం అయిపోయింది. పెద్ద వల్లకాడులా వుంది కురుక్షేత్రం. హస్తిన నుంచి గాంధారీ, ధృతరాష్ట్రుడూ, తలచెడిన వందమంది కోడళ్ళూ, ఎంతో మంది రాణివాసం స్త్రీలూ వచ్చారు. ద్రౌపదీ, సుభద్రా మొదలయిన

పాండవుల స్త్రీలూ వచ్చారు. తమతమ భర్తలా, కుమాళ్ళా శవాల మీదపడి గోలుగోలుమన్నారు.

గాంధారికీ ధృతరాష్ట్రుడికి నమస్కరించారు పాండవులు. భీముణ్ణి కౌగిలించుకోబోయాడు ధృతరాష్ట్రుడు. భీముణ్ణి వెనక్కిలాగి, ఉక్కుభీముణ్ణి గుడ్డిరాజుకి అందించాడు కృష్ణుడు. ధృతరాష్ట్రుడి కౌగిలిలో గుండపిండి అయిపోయింది ఉక్కుభీముడు. ముందే పనికట్టి ఉక్కుభీముణ్ణి పెట్టాడు కృష్ణుడు.

శవాల రణరంగం గమనించింది గాంధారి. "ఇదంతా నువ్వే చేశావు" అంటూ కృష్ణుణ్ణి శపించింది.

"కౌరవవంశంలాగే ముప్ఫయ్యారేళ్ళ తరవాత మీ యాదవవంశం నాశనమవుతుంది" అంది.

"నువ్వు అన్నా, అనకపోయినా అది అలాగే జరుగుతుంది" అన్నాడు కృష్ణుడు.

పరీక్షిత్తు

"అపాండవం కావాలి" అంటూ మహాస్త్రం ఒదిలాడు అశ్వత్థామ. అగ్గికురుస్తూ పాండవుల మీదికి వచ్చిందది. అస్త్రాలు పట్టుకు సిద్ధపడ్డారు పాండవులు.

"అస్త్రాలు దీనిమీద పని చెయ్యవు. కింద పడెయ్యండి" అంటూ తన సుదర్శనంతో దాన్ని చెదరగొట్టాడు కృష్ణుడు.

అయితే అభిమన్యుడి భార్య ఉత్తర చూలాలుగా వుంది అప్పటికి. పాండవుల వంశం నిలవాలంటే ఆమె

గర్భంలోని మొలకే ఆధారం. అశ్వత్థామ అస్త్రం ఉత్తర గర్భాన్ని వేధించింది. కృష్ణుడి ముందు మొరపెట్టింది ఉత్తర. శిశువుని రక్షించాడు కృష్ణుడు. కుమారుణ్ణి కంది ఉత్తర. అతడే పరీక్షిత్తు.

యుద్ధానంతరం పాండవులతో హస్తిన వెళ్ళాడు కృష్ణుడు. ధర్మరాజు పట్టాభిషేకం ఘనంగా జరిపించాడు. అతడి విచారం పోగొడుతూ కొన్నాళ్ళు అక్కడే వున్నాడు.

అన్నీ అయినా కోలుకోలేదు ధర్మరాజు. అంతమంది బంధువుల్ని, ప్రజల్నీ యుద్ధంలో చంపినందుకు దుఃఖంగా వుండే దతడికి. రాజ్యభోగాలు రుచించేవి కావు. అప్పుడప్పుడు అన్నీ వొదిలి అడివికి పోవాలనుకునేవాడు. అతడు కుదుట పడాలంటే జ్ఞానం ఉపదేశించడం అవసరం అనుకున్నాడు కృష్ణుడు. తాను చెప్పిందంతా చెప్పాడు. భీష్ముడిచేతా చెప్పించా లనుకున్నాడు. అంపశయ్యమీద పడున్నాడు భీష్ముడు. అన్నీ తెలిసిన మహాత్ము డతడు.

ధర్మరాజుని తమ్ముళ్ళతోకూడా భీష్ముడి దగ్గిరికి తీసుకువెళ్ళాడు కృష్ణుడు. అంపశయ్యమీంచే అందరినీ ఆద రించాడు భీష్ముడు. కృష్ణుడ్ని కీర్తించాడు. అతడి మాట ప్రకారం ధర్మరాజుకి అంతులేని జ్ఞానం ఉపదేశించాడు. ధర్మరాజు అడుగుతూ వచ్చాడు. భీష్ముడు విసుగు లేకండా చెపుతూ వచ్చాడు.

ధర్మాలూ, ధర్మరహస్యాలూ, ఆశ్రమాలూ, ఆశ్రమ ధర్మాలూ, ధర్మార్థ కామమోక్షాలూ, వాటి మర్మాలూ,

రాజనీతులూ, వాటి లోతులూ, ఉపఖ్యానాలతో వినిపించాడు.

తనచావు తన చేతిలోనే వుండేది భీష్ముడికి. ఉత్తరాయణం వచ్చేవరకూ అంపశయ్యమీదే వున్నాడతడు. ఉత్తరాయణం వచ్చాక కృష్ణుడిమీద దృష్టినిలిపి శరీరం వొదిలి పెట్టాడు. తుది ఘడియల్లో కృష్ణుడూ, పాండవులూ, మునులూ, పర్వతుడూ, నారదుడూ, ధౌమ్యుడూ, వ్యాసుడూ, భరద్వాజుడూ, వశిష్ఠుడూ, త్రితుడూ, అసితుడూ, గౌతముడూ, అత్రీ, విశ్వామిత్రుడూ, అతడిచుట్టూ కూచున్నారు.

కృష్ణుడ్నీ, పాండవుల్నీ ఓమారు కళ్ళువిప్పి చూశాడు భీష్ముడు. అతడి కళ్ళల్లో నీళ్ళు కమ్మాయి. పాండవులతో ఇలా అన్నాడు:

"వెళుతున్నానయ్యా నేను. కృష్ణుడినీడ వుంది మీకు. ఇంతకంటే ఏం కావాలి? పడరాని కష్టాలు పడ్డారు మీరు. దీనికి కాలమే కారణం. మనిషి ఏమీ చెయ్యలేడు. కాలగతి కానలేం. వీరాధి వీరులు మీరు. పైగా కృష్ణుడు బంధువు. అయినా తప్పలేదు కష్టాలు! మీ కష్టాలు తలుచుకుంటే గుండె తరుక్కుపోతుంది.

ఇవేవీ కళ్ళ చూడకండా వెళిపోయాడు పాండురాజు. పసికూనల్ని పట్టుకుని హస్తిన వచ్చింది పాపం కుంతి. తండ్రి లేని బిడ్డలకోసం ఎన్ని పాట్లు పడింది! పాండురాజు తరువాత నువ్వే అండ అని నీకే అప్పగించింది కొడుకుల్ని.

మీకు నమ్మిన చుట్టమయ్యాడు కృష్ణుడు. మంత్రి అయ్యాడు. దూత అయ్యాడు తుదకి. సారథిగా పని చేసాడు. ఎంత గొప్పవాడు! ఎవరు గుర్తించగలరితడ్ని!

అర్జునుడి రథం నామీదికి వురికించినప్పుడు, నా బాణాలతో కవచం పగిలి, నన్ను చంపుతానని రథం దూకినప్పుడు చూశాను, సామాన్యుడా కృష్ణుడు! ఆయుధం పట్టనన్నా నాకోసం ఆయుధం పట్టుకున్నాడు.

అంత మహాయుద్ధంలో, ఆ పది రోజులూ, అర్జునుడి రథంమీద పగ్గాలు పట్టుకుని రణరంగ మంతా తానే కన పడ్డాడు నాకు. వీరులు తెగిపోతూ వుంటే, రక్తాలు వరద కడుతూ వుంటే చిరునవ్వు మాయని ఈ కృష్ణుడి మొహం కళ్ళముందే వుంటుంది నాకు.

ఈ చిరునవ్వే గొల్లభామల్ని వెర్రెత్తించి వుంటుంది.

ప్రణయమూ, ప్రళయమూ ఒకటే ఈ కృష్ణుడికి. ఇతడు మీవాడు, కొరతేమిటి మీకు?"

అలా అని కృష్ణుడ్ని స్తుతించి కళ్ళు మూశాడు భీష్ముడు.

గొల్లుమన్నారు పాండవులు. కంటతడి పెట్టుకున్నాడు కృష్ణుడు. గంభీరముద్ర వహించారు మునులు.

భీష్ముడి అపర క్రియలు యథావిధిగా జరిపించాడు ధర్మరాజు. తాత మరణంతో మరింత కుంగిపోయాడతడు.

"రాజ్యంకోసమని తాతవంటివాణ్ణి చంపుకున్నాను." అంటూ దుఃఖపడ్డాడు, "తెలివిమాలిన వాణ్ణి. నిలకడలేని

బతుకుకోసం, కాకులూ గెద్దలూ పీక్కుతినే ఈ పాడు దేహం కోసం, జానెడు పొట్టకోసం పద్దెనిమిది అక్షౌహిణీల సేన వల్ల కాటిపాలు చేశాను. నెత్తురుకూటికి తెగించాను. ఎంతమంది తల్లులు కొడుకుల కోసం ఏడుస్తున్నారు! ఎంతమంది మగల కోసం మొత్తుకుంటున్నారు. ఎంత నిష్ఠురం క్షత్రియధర్మం!

ఎంతపాపం చేశాను. గృహస్థాశ్రమంలో శాంతిలేదు నాకు. కల్లు పులుముకుని, కల్లుతో కడగడమే అవుతుందిది. అందుకని అడివికి పోతాను." అంటూ కన్నీళ్ళు కారుస్తూ కూచున్నాడు. విచారిస్తూ కూచున్నాడు.

జ్ఞానం బోధించి ఓదార్చాడు కృష్ణుడు:

"రాజా! తెలియని మనిషిలా విచారిస్తున్నావు. నీ దుఃఖం, మరణించిన వారికీ దుఃఖం కలిగిస్తుంది. నువ్వు విచారించిన మాత్రాన వారు మళ్ళీ రారు కదా! అన్నీ భీష్ముడి దగ్గిర తెలుసుకున్నావు. తిరిగీ అజ్ఞానంలో పడి పోతున్నావు. తాతతండ్రుల రాజ్యం, ధర్మయుద్ధంలో గెల్చుకున్న రాజ్యం విడిచిపెట్టి అడివికి పోతాననడం అవివేకం. పలాయనం పాపం. ధర్మరాజువి నువ్వు. ధర్మం పాలించు. నీ విచారానికి మోహమే కారణం. ఇది పోవాలంటే బయటి శత్రువుల్ని కాదు, లోపలి శత్రువుల్ని జయించు. విచారం విడిచిపెట్టు. విచారం వినాశనం కలిగిస్తుంది" అన్నాడు.

"అవును" అంటూ కృష్ణుణ్ణి సమర్ధించాడు వ్యాసముని, "ధర్మరాజా! నువ్వేదో పాపం చేశానని బాధపడుతున్నావు కదూ, నువ్వు చేసిన పాపమేమీ లేదు. యుద్ధం రాజుల ధర్మం. తాను చావడమో ఎదటివాణ్ణి చంపడమో యుద్ధంలో

తప్పనిసరి. దీనికింత దుఃఖందేనికి? అయినా నీ విచారం పోడానికి ఉపాయం చెపుతాను. అశ్వమేధ యజ్ఞం చెయ్యి. పాపాలు పోతాయి. తాపాలు తీరతాయి" అన్నాడు.

"యజ్ఞాలకి ధనమెక్కువుంది తండ్రీ!" జాలిగా అన్నాడు ధర్మరాజు, "ధనాగారంలో ధనమంతా యుద్ధంలో వినియోగించేశాడు దుర్యోధనుడు."

"ధనంకోసం విచారించకు" - అందుకున్నాడు వ్యాసుడు. "పూర్వం మరుత్తరాజు యజ్ఞంలో గుట్టలుగుట్టలు బంగారం మిగిలింది. అదంతా హిమాలయం దగ్గర గుప్తంగా పడుంది. ఇప్పుడు ఎవరిదీ కాదది. ఎవరయినా తెచ్చుకో వచ్చు. అది తెచ్చుకో, అశ్వమేధం చెయ్యి."

"బాగుంది" అన్నాడు కృష్ణుడు. తమ్ముళ్ళని పంపాడు ధర్మరాజు.

భీమార్జునులూ, నకుల సహదేవులూ వెళ్ళారు. రథాలమీదా, ఏనుగులమీదా, లొట్టిపిటలమీదా, గుర్రాల మీదా, కంచర గాడిదలమీద బంగారం రాసులు పట్టించుకు వచ్చారు. ఏ లోపమూ లేకుండా "ఔరా!" అన్నట్టు జరిగింది అశ్వమేధం.

అలా ధర్మరాజు చేత మూడు అశ్వమేధాలు చేయించాడు కృష్ణుడు. అతడి ఉపదేశం పాలిస్తూ రాజ్య మేలుతూ వచ్చాడు ధర్మరాజు. తమ్ములు తలలో నాలుకలాగ మసులుకుంటూ వుండేవారు.

అదునికి వానలు పడేవి. పాడీ పంటా పుష్కలంగా వుండేవి. దారిదోపుళ్ళు, దొంగతనాలూ నాశనమయాయి.

అబద్ధాలూ, లంచాలూ అంతరించాయి. కరువులూ, కాటకాలూ కరువయాయి. మనవడు ఉత్తర కొడుకంటే ముచ్చట పడేవాడు ధర్మరాజు. ధౌమ్యుడిచేతా, కృపాచార్యుడిచేతా జాతకర్మలు చేయించాడు. గొప్పవాడవుతాడంటే మురిసిపోయేవాడు. పాండురాజంత వాడవుతాడంటే పక్కున నవ్వేవాడు.

తల్లి కడుపులో వున్నప్పుడు కృష్ణుణ్ణి కలలో చూశాడు ఉత్తరకొడుకు. అందుకని అలాటి మనిషి - నల్లకలవలాటి శరీరమూ, తామర రేకుల్లాటి కళ్ళూ, పసుప్పచ్చటి పట్టు బట్టలూ, చిరునవ్వుతో కలకల్లాడుతున్న మొహమూ - ఎంచక్కా కనబడ్డాడు కలలో కృష్ణుడు. ఆ కలలో మనిషి కనపడతాడా అని అందరినీ పరీక్షగా చూసేవాడు కుర్రాడు. అందుకని అతడిపేరు పరీక్షిత్తు అన్నాడు ధర్మరాజు.

ద్వారక తిరుగుపయనం

భీష్ముడిమరణంతో కౌరవుల అఖండజ్యోతి ఆరిపోయింది. కురుక్షేత్రం రణరంగంలో కృష్ణుడూ, అతడి బావమరుదులూ అయిదుగురు పాండవులూ, అతడి తమ్ముడు సాత్యకీ, వియ్యంకుడు కృతవర్మా, కృపుడూ అతడి బావ అశ్వత్థామా, యుయుత్సుడూ మాత్రం మిగిలారు.

ఆయుధం పట్టకండా, తల పూవు వాడకండా అంతా తానే నిర్వహించాడు కృష్ణుడు. ధర్మరాజుని గద్దె ఎక్కించాడు. అతడిచేత అశ్వమేధం చేయించాడు. తన మేనల్లుడి కొడుకుని కౌరవ రాజ్యానికి వారసుడిగా నిలిపాడు.

అలా కొన్నాళ్ళు హస్తినలో వుండి ద్వారక పయన మయాడు కృష్ణుడు. "వెళ్ళి వస్తాను" అంటే ఒప్పుకోక, ఒప్పుకోక తల వూపాడు ధర్మరాజు. అర్జునుడు పాదివి పట్టు కుని ఏడ్చాడు. భీముడూ, నకులసహదేవులూ, అలాగే కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు. ద్రౌపదీ, సుభద్రా, కుంతీ, ఉత్తరా, గాంధారీ - ఇంకా వుండమంటూ బలవంత పెట్టారు.

అందరికీ అన్ని విధాలా నచ్చచెప్పి బయలుదేరాడు కృష్ణుడు. అంతకాలం కలిసిమెలిసి వున్నవాళ్ళని విడిచి వెళ్ళడమంటే తనకీ కష్టంగానే వుంది.

రథం సిద్ధమయింది. శంఖాలు పూరించారు. మద్దెళ్ళు మోయించారు. భేరీలు వాయించారు. వీణలు మీటారు.

రథమెక్కి కూచున్నాడు కృష్ణుడు. అర్జునుడు ముత్యాలతెల్లగొడుగెత్తాడు. సాత్యకీ, ఉద్ధవుడూ చామరాలు వీచారు.

అర్జునుడితోపాటు ధర్మరాజూ, భీముడూ, నకులసహ దేవులూ ఎంతో దూరం వెళ్ళి సాగనంపారు. హస్తిన రాజ వీధి పూలవాన కురిపించారు ప్రజలు. మేడలమీదా, మిద్దెల మీదా స్త్రీలు గుంపులు గుంపులు చూశారు. కృష్ణుడి 'థలే చెప్పుకున్నారు.

వెంట వచ్చిన వాళ్ళని మళ్ళించి రథం పోనిచ్చాడు ృష్ణుడు. కురుజాంగలం, పాంచాలం, శూరసేనం, యామునం, బ్రహ్మావర్తం, కురుక్షేత్రం, మత్స్యం, సారస్వతం మొదలైన దేశాలమీంచి మరుదేశం వెళ్ళాడు. అక్కడ ఉత్తంకుడి ఆశ్రమంలో ఆగాడు.

కుశల మడిగాక కృష్ణుడితో అన్నాడు ఉత్తంకుడు. "కృష్ణా! సర్వ సమర్థుడివి నువ్వు. నువ్వే ప్రయత్నించి వుంటే, భారతయుద్ధం జరిగేదికాదు. ఈ రోజున నాశనం జరిగేదికాదు. కనక నువ్వే అపరాధివి. నిన్ను శపిస్తాను."

"పొరపడుతున్నావు" అంటూ విశ్వరూపం చూపాడు కృష్ణుడు. చేతులు జోడించాడు ఉత్తంకముని.

అక్కడ్నుంచి ఆనర్తదేశం వచ్చేశాడు కృష్ణుడు. దారి కడాకూ పల్లెలూ, పట్టణాలూ జేజేలుచేస్తూ వచ్చాయి కృష్ణుడికి. పగలు ప్రయాణంచేస్తూ, పొద్దుగూకే వేళకి నీళ్ళున్న దగ్గిర మకాం జేస్తూ అలా ఆనర్తదేశం చేరాడు.

ఆనర్త పొలిమేర తగలగానే పాంచజన్యం పూరించాడు.

"వచ్చేశాడు కృష్ణుడు, వచ్చేశాడు. రండి, రండి" అని పిల్చుకుంటూ రథానికి ఎదురు వచ్చారు ఆనర్తం ప్రజలు. ఆడా మగా గుంపులు గుంపులు వచ్చి సాగిలబడ్డారు.

అంతమందినీ ఆదరిస్తూ, ద్వారకలోకి వెళ్ళాడు కృష్ణుడు. మెరికల్లాంటి భటులూ, దశార్హ, కుకుర, అంధక వృష్ణి వీరులూ కంటికి రెప్పలా కాపాడుతున్నారు, ద్వారక. అందరూ చేతులు జోడించి బారులుతీరి నించున్నారు.

చిత్రకం, పంచవర్ణం, పాంచజన్యం, మేరుప్రభ, పుష్పకం, శతావర్తం, చైత్రం, నందనం, భావనం, రమణం అని రకరకాల ఉపవనాలతోనూ, బంగారం ప్రాకారాల తోనూ, లోతుసీటి కందకాలతోనూ, మేఘాలంటే మేడల

తోనూ, నాలుగిళ్ళ భవంతులతోనూ, ముత్యాల ముగ్గుల ముంగిళ్ళ తోనూ, గంధర్వ నగరంలా వుంది ద్వారక.

పాంచజన్యం వినపడడంతోనే వసుదేవుడూ, బలరాముడూ, ఉగ్రసేనుడూ, అక్రూరుడూ, ప్రద్యుమ్నుడూ, సాంబుడూ, చారుదేష్ణుడూ, ఎలా వున్నవాళ్ళు అలా లేచారు. ఎదురు వెళ్ళారు. బాజాలూ, భజంత్రీలూ, శంఖాలూ, భేరీ మృదంగాలూ, భోగం మేళాలూ, ఏనుగులూ, గుర్రాలూ- పెద్ద ఉత్సవమే ఎదురు వెళ్ళింది. వంది మాగదులు యాదవవంశం కీర్తించారు. కృష్ణుడి కథలు పాటలు పాడారు. ఆడా మగా, ఆబాల గోపాలం వీధుల నిండా మూగారు. దారికడాకూ కిటకిటలాడారు.

వసుదేవుడికీ, ఉగ్రసేనుడికీ, బలరాముడికీ నమస్కారం చేశాడు కృష్ణుడు. బంధువుల్నీ, స్నేహితుల్నీ కౌగలించుకున్నాడు. కుమాళ్ళ వందనాలందుకున్నాడు. సిరసులు ముద్దాడాడు. అందరి క్షేమం విచారించాడు.

లోగిళ్ళలోకి వెళ్ళి ఏడుగురు అమ్మలకీ నమస్కారాలు చేశాడు. రుక్మిణీ మొదలైన ఎనమండుగురు దేవేర్ల లోగిళ్ళకీ, పదహారువేల మంది భార్యల లోగిళ్ళలోకీ వెళ్ళాడు. అందరితోనూ ఆనందంగా పలకరించాడు. చిరు చిరు నవ్వులతో సల్లాపాలాడాడు.

అమావాస్యపోయి, పున్నమిలో ఎలా వుంటుంది ప్రపంచం, అదిగో అలాగ కలకలలాడింది ద్వారకా పట్నం. రోజుకి రోజు పెరుగుతూ వుండేది. యాదవకులం తామర తంపరగా పెరిగింది. యాదవ కుమాళ్ళ లెక్క కోట్లకి

మించింది. సేనలు ఇక చెప్పనే అక్కఱలేదు. ఒక్క ద్వారకా నగరంలోనే ఎనిమిది వేల రథాలు తిరుగుతూ వుండేవి. బురుజుల మీద ఒకేసారి వందేసిమంది పగవాళ్ళ చంపే యంత్రాలూ, చక్రాలూ అమర్చి వుండేవి. రైవతక పర్వతం మీద ఆడాళ్ళు కూడా యుద్ధం చెయ్యడానికి అనువయిన కోటలుండేవి.

కృష్ణుడి భార్యలు

ద్వారకలో ఆడంగులందరూ అందంగా వుండేవారు. నిండుగా ముస్తాబులయే వాళ్ళు. పాటలు పాడే వాళ్ళు. బంతులాడే వాళ్ళు. కోకిలలు కో అంటే కో అనేవాళ్ళు. చిలకలు కిలకిలమంటే కిలకిలమనేవాళ్ళు. తామరకోనేళ్ళలో జలక్రీడలాడేవాళ్ళు.

కృష్ణుడి పదహారువేలమంది భార్యల లోగిళ్ళలోనూ కోనేళ్ళుండేవి. అన్నిటిలోనూ రకరకాల తామరలు పూసేవి. తుమ్మెలు పాడేవి. రాజహంసలు ఈదేవి. అన్నిటిలోనూ అన్ని రూపాలయి జలక్రీడలాడేవాడు కృష్ణుడు. భార్యలమీద నీళ్ళు చిమ్మేవాడు. వాళ్ళందరూ ఒక్కటయి అతడిమీంద పడే వాళ్ళు. వాళ్ళ రొమ్ముల పరిమళాలు అతడి ఒళ్ళంతా పరిమళించేవి.

కృష్ణుడు కనుమరుగయితేచాలు విరహంతో వెర్రెత్తి పోయేవారు అతడి భార్యలు. విరహగీతాలు పాడేవారు మిష పెట్టి.

"కన్ను మూతపడదా కురరీ? రాతిరి గుసగుస విన పడదూ! నాలాగే ఏడుస్తున్నావంటే నీవాడికోసం!"

అనేది వొకామె.

"నల్లని సామిలాగే కనపడలేదటే చక్రవాకీ? రాత్రంతా ఏడుపుతోనే గడిచిపోతుందే?"

అనేది మరొకామె.

"కడలీ! నాలాగే మరుగుతూందా నీ మనసు? సిటమైనా పూరుకోవు, పగలనవు, రేయనవు. హోరుమని ఏడుస్తావు. ఎందుకమ్మా ఈ విరహం?"

అంటూ వుస్సురనేదొకావిడ.

"అయ్యో, సంపంగీ! ఎందుకని ఇలా చిక్కిపోతావూ? కనికరిస్తాడా కృష్ణుడు?"

అనేది మరొకావిడ.

"అబ్బా! ఎందుకమ్మా గాలీ, మండుతున్న వాళ్ళు మరింత మండిస్తావు? ఏ పొదలో వున్నాడమ్మా, అతణ్ణి రాసుకువచ్చావు?"

అంటూ కళ్ళు తుడుచుకునేది ఒక భామ.

"కన్నీరు కార్చినా, కంఠమెత్తి వేడ్చినా, నా బతుకూ, నీ బతుకూ ఒకటేనా మబ్బూ! నల్లనివాణ్ణి నమ్ముకుంటే బతుకంతా చీకటే."

అంటూ ఆకాశం చూసే దొకతె.

"కుహూ, కుహూ! కోకిలమ్మా! నాలాగే పిలుస్తున్నావా? పిల్లంగోవి వూత్తున్నావా?" అనేది వేరొకామె.

"రావే, రావే, రాజహంసీ! కబురు తెచ్చావా? రమ్మన్నాడా? నన్నే రమ్మన్నాడా?"

అంటూ హంసలాగే నడిచేది ఒకామె.

ఇలా రకరకాలయేవారు వాళ్ళు. ఇంతలోనే కృష్ణుడ్ని చూసి వింతవింతలయే వాళ్ళు. అందరినీ ఆనంద పరిచేవాడు కృష్ణుడు. ఎవరికి వారు తమనే ప్రేమిస్తున్నాడన్నట్టు నటించేవాడు.

కుబ్జ కొడుకు

అవాళ మథురలో కృష్ణుడితో పొత్తుకలిసి, గర్భవతి అయింది కుబ్జ—త్రివక్రి. నెలలు నిండాక కొడుకుని కంది. అతడి పేరు ఉపశ్లోకుడు.

కృష్ణుడి స్పర్శతో గూనిపోయి అందాల రాణిగా వుండేది కుబ్జ. కృష్ణుడి పొందుతో కొడుకుని కని మహారాణిలా మురిసింది. కొడుకుని అల్లారుముద్దుగా పెంచింది. విద్యాబుద్ధులు నేర్పింది. ప్రయోజకుణ్ణి చేసింది.

తండ్రిని కృష్ణుణ్ణి సేవించాడు కుబ్జ కొడుకు ఉపశ్లోకుడు. గొప్ప జ్ఞానవంతుడయాడు. "సాత్వతసంహిత"అని తంత్రశాస్త్రం రాశాడు. ఆడాళ్ళకీ, అన్నికులాల వాళ్ళకీ వైష్ణవ సంస్కారం కల్పించాడు. శూద్రుడనీ, బ్రాహ్మడనీ భేదం లేకుండా చేశాడు.

ఉపశ్లోకుడి సాత్వతతంత్రం ముక్తి మార్గానికి మేలిబాట అయింది.

కృష్ణుడి కుమారుళ్ళూ, మనవలూ ఇంతమంది అని

చెప్పడం అంత తేలికపని కాదు. వాళ్ళకి చదువు చెప్పే గురువుల సంఖ్యా ఇంతా అంతా కాదు.

కృష్ణుడి కొడుకులూ, మనవలూ వీరాధివీరులు. వాళ్ళందరిలోకీ రుక్మిణి కొడుకు ప్రద్యుమ్నుడు కృష్ణుడంత ప్రతాపవంతుడు. అతడి కొడుకు అనిరుద్ధుడు తండ్రికి తగిన కొడుకు. ఎన్నో ఏనుగులంత బలశాలి అతడు.

అనిరుద్ధుడి కొడుకు వజ్రుడు. అతడి కొడుకు ప్రతిబాహుడు. ప్రతిబాహుడి కొడుకు సుబాహుడు. ఇతడి కొడుకు ఉగ్రసేనుడు. ఈ ఉగ్రసేనుడి కొడుకు శాంతసేనుడు. శాంతసేనుడి కొడుకు శతసేనుడు.

అనిరుద్ధుడి కొడుకు వజ్రుడు యాదవుల మలితరానికి మొలకగా నిలిచాడు.

కృష్ణుడి కుమాళ్ళలో అనిరుద్ధుడని ఒక కుమారుడు కూడా వుండేవాడు.

ద్వారకలో యాదవ కుమాళ్ళు యావన్మందీ గుండెలు తీసినబంట్లు. వారిలో కృష్ణుడి కొడుకులు అగ్గిపిడుగులు. వారిలో ఇంకా చెప్పాలంటే ప్రద్యుమ్నుడూ, అనిరుద్ధుడూ, దీప్తిమంతుడూ, సాంబుడూ, మధుడూ, బృహద్భానుడూ, మిత్రవిందుడూ, అరుణుడూ, పుష్కరుడూ, దేవబాహుడూ, శ్రుతదేవుడూ, సునందుడూ, చిత్రబాహుడూ, విరూపుడూ, కపి, న్యగ్రోధుడూ, వృకుడూ – ఈ ఎంపికయిన పదిహేను మందీ సాటిలేని మేటివీరులు.

యాదవకులంలో ముసలం

మహాభారత యుద్ధంతో ఛప్పన్న దేశాలూ చల్లారి పోయాయి. ఎన్నో రాజవంశాలు సన్నగిల్లి పోయాయి. యాదవులు మాత్రం అడ్డూ ఆపూ లేకండా పెరిగారు. కృష్ణుడి బలం చూసుకుని, కిందూ మీదూ కనపడేది కాదు వారికి. యువకులలో అవినీతి అలుముకుంది. విచ్చలవిడితనం హెచ్చింది. పెద్దలమీద పిన్నలు తిరగబడ్డారు. కొడుకు తండ్రిని లెక్కచేయలేదు. ఆలు మగణ్ణి మన్నించలేదు. చిన్నా పెద్దా తాగి తందనాలాడారు. తాగుడు మానండని ఉగ్రసేనుడు శాసనం చాటించాడు. ఫలితం కలగలేదు. తగు మనుషులే తాగుడు మానలేదు.

ఇదంతా చూస్తూనే వున్నాడు కృష్ణుడు. ఏం చెయ్యాలో ఆలోచిస్తూనే వున్నాడు.

యాదవుల్ని మరొకరు మట్టిపెట్టలేరు. తమలో తామే ఒకళ్ళ నొకళ్ళు కొట్టుకోవాలి. ఒకళ్ళ నొకళ్ళు చంపుకోవాలి. అదిమాత్రం అంత సామాన్యమా?

ఇలా వుండగా ఓనాడు అక్కడి పిండారక తీర్థానికి విశ్వామిత్రుడూ, అసితుడూ, కణ్వుడూ, దూర్వాసుడూ, అంగీరసుడూ, అత్రీ మొదలైన మునులు వచ్చారు.

అక్కడే తందనాలాడుతున్నారు కొంతమంది యాదవ కుమాళ్లు. మునుల్ని చూసి ఓ గమ్మత్తు చేశారు.

సాంబుడికి ఆడవేషం వేశారు. కడుపుమీద గుడ్డలు కట్టి, చూలాలులా తయారుచేశారు. మునుల ముందుకి

పట్టుకు వచ్చారు. దొంగ వినయంతో వంక దండాలు పెట్టి, అడిగారు:

"మునీశ్వరులారా! ఈవిడగారు మా బభ్రుడి భార్య, చూడండి కడుపుతో వుంది. నేడో రేపో కంటుంది. చెప్పండీ చూస్తాం, ఈవిడ కడుపులో ఏం పుడుతుందో? కొడుకు పుడతాడా? కూతురు పుడుతుందా? ఏం పుడుతుంది?"

ఈ వేళాకోళానికి ఒళ్ళుమండింది మునులకి. "కొడుకూ కాదు, కూతురూ కాదు, ఇనపముసలం పుడుతుంది" అన్నారు, "అది మీ యాదవకులం అంతం చేస్తుంది" అంటూ వెళ్ళిపోయారు.

మునులు వెళ్ళిపోయాక సాంబుడి ఆడవేషం విప్పేసి, కడుపుమీద కట్టిన గుడ్డలు చూస్తే నిజంగానే ముసలముంది. యాదవకులంలో ముసలం పుట్టింది!

భయపడ్డారు యాదవకుమాళ్ళు. ముసలం ఉగ్రసేనుడి దగ్గిరికి తీసుకువెళ్లారు. జరిగింది జరిగినట్టు చెప్పారు. విచారించాడు ఉగ్రసేనుడు. ముసలం రంగరించి గుండ చేయించాడు. సముద్రంలోపల పారబోయించాడు. ఇనపగుండే అయినా సముద్రంలో మునిగిపోలేదు ముసలంగుండ. కెరటాల్లో ఒడ్డుకి కొట్టుకు వచ్చింది. దట్టంగా తుంగగడ్డి అయి బలిసింది.

నూరగా నూరగా చిన్న ముక్క మిగిలిపోయింది ముసలం. అదికూడా సముద్రంలోనే పారవేయించాడు ఉగ్రసేనుడు. ఒక చేప మింగేసింది దాన్ని. జాలర్ల వలలో పడిం

దది. దాని కడుపులోని ఆ ముసలం ఇనపముక్క జరాకిరా తుడు తన బాణానికి మొనగా చేసుకున్నాడు.

మునులు రావడమూ, కుమాళ్ళు వెటకారం చేయ డమూ, ముసలం పుట్టడమూ, ఉగ్రసేనుడు సముద్రంలో వేయించడమూ, తుంగ పుట్టడమూ, జరాకిరాతుడు బాణం చేసుకోవడమూ అన్నీ తెలుసు కృష్ణుడికి. అయినా ఏమీ చెయ్యలేదతడు. కాగల కార్యం కాలానికే వొదిలిపెట్టాడు.

అవాళ కురుక్షేత్రంలో గాంధారి కృష్ణుణ్ణి శపించింది. "కౌరవ వంశంలాగే ముప్ఫయిఆరేళ్ళ తరవాత మీ యాదవ వంశం నాశనమవుతుంది" అని.

"నువ్వు అన్నా అనకపోయినా అది అలాగే జరుగు తుంది" అన్నాడు కృష్ణుడు. అదిగో ఆ కాలం దాపురించి నట్టుంది ఇప్పుడు.

ద్వారకలో విడ్డూరాలు పుట్టాయి.

అవన్నీ చూసి, దిగాలుపడుతూ, యాదవులలో వృద్ధులు కొందరు కృష్ణుడి దగ్గిరికి వచ్చారు. వారు రోజురోజుకీ చూస్తున్న విడ్డూరాలు విన్నవించారు.

"అవును నేనూ చూస్తున్నాను. మనమంతా ప్రభాస తీర్థానికి వెళ్ళి జాతర చెయ్యాలి. బయలుదేరే ప్రయత్నంలో వుండండి" అన్నాడు.

ఉద్ధవుడు

కృష్ణుణ్ణే నమ్ముకున్న అనుచరుడు ఉద్ధవుడు. అయి

దేళ్ళ చిన్నవయసునించీ కృష్ణుణ్ణే అంటిపెట్టుకు బతుకు తున్నాడు నీడలాగ. అరమరిక లేని కృష్ణభక్తుడు.

ద్వారకలోని విధ్వంసాలు చూసీ, కృష్ణుడు పూరు కోడం చూసీ, అవాళ గాంధారి అన్నమాటలు తలుపుకి తెచ్చుకున్నాడు. మునుల కోపమూ, ముసలం పుట్టడమూ తలుచుకున్నాడు. బాధపడ్డాడు. ఒక్కడూ వున్నప్పుడు కృష్ణుడి దగ్గిరికి వెళ్ళాడు. అడుగులమీద తలమోపి వల వలా ఏడ్చాడు.

"కృష్ణా! నీ దాసుడ్ని, నువ్వు తప్ప లోకంలేదు నాకు. నువ్వు వేసుకుని పారేసిన పూలదండలు వేసుకున్నాను. నువ్వు కట్టి విప్పేసిన బట్టలు కట్టుకున్నాను. నువ్వు తిని ఒది లేసిన అన్నం తిన్నాను.

ప్రభూ! ఎందుకీ ఉదాసీనత? మునుల ముసలం, గాంధారి మాటా మళ్ళించడం నీకు ఓ గొప్ప పనా?

కృష్ణా! నాకు తెలుసు. నువ్వే ఇంత పెంచిన ఈ యాదవకులం నువ్వే ముంచెయ్యాలనుకుంటున్నావు. నీ అంతట నువ్వే కనపడకపోవాలనుకుంటున్నావు.

ప్రభూ! నా ప్రభూ! నీ ఉద్ధవుడిని ఒదిలేసి వెళ్ళి పోతావా? వద్దు. నన్నుకూడా తీసుకుపో. నువ్వులేని బ్రతుకు చీకటి నాకు. ఉండలేను ప్రభూ! వుండలేను" అంటూ జాలిగా ఏడ్చాడు.

"ఉద్ధవా!" ఓదారుస్తూ అన్నాడు కృష్ణుడు. "నీతి మాలిన యాదవకులం నిలవదిక. నేనూ వెళిపోవాలి మరి. మరో వారంరోజులయాక ఈ ద్వారకా నగరం సము

ద్రంలో మునిగిపోతుంది. నేను వుండను కనుక నువ్వూ వుండకూడదిక్కడ. బదరికాశ్రమం వెళ్ళిపో. మమకారం ఒదిలిపెట్టు. వైరాగ్యం కుదుర్చుకో. అందరినీ ఒక్కలాగే చూడు. కనపడేదీ, వినపడేదీ అంతా మాయ అని తెలుసుకో. నిజాం గమనించు. నిజంవేపు వేలు చూపుతాయి వేదాలు. అలా అని వేదాలే నిజమనుకోకు.

నీ ఇంద్రియాలు నువ్వే లొంగదీసుకో. మనస్సు నిలకడ చేసుకో. గుణదోషాలు అంటనివ్వకు. కోరికలు ఒదిలి పెట్టు.

ఉద్ధవా! ఇదంతా సాధ్యం కావాలంటే వెనకటి ఇతిహాసమొకటి చెపుతాను.

యదుమహారాజు కాలంలో ఒక అవధూత వుండే వాడు. ఏ కోరికా లేకండా సంతోషంగా తిరుగుతుండేవాడు. ఏ వికారమూ అతడిలో వుండేది కాదు. అతణ్ణిచూసి యదు మహారాజు అడిగాడు. 'మహాత్మా! ఈ సిద్ధి పొందడానికి ఎక్కడ, ఏ విద్య నేర్చుకున్నావు?' అని.

అవధూత ఏమన్నాడో, విను. "అంతా లోకంనించే నేర్చుకున్నాను. భూమి దగ్గిర ఓర్పు, ఇతర్లకి ఉపకారం చెయ్యడమూ నేర్చుకున్నాను. గాలి దగ్గిర మనోవికారం లేకండా వుండాలనీ, ఆకాశం దగ్గిరదేన్నీ అంటకండా వుండాలనీ తెలుసుకున్నాను. నీటి దగ్గిర నిర్మలత్వం గ్రహించాను. అగ్గిదగ్గిర అంతా ఒకలాగే చూడాలని గ్రహించాను. శరీరానికి వికారం కలుగుతూవున్నా ఆత్మకి వికారం లేదని

చంద్రుణ్ణి చూసి తెలుసుకున్నాను. సూర్యుడి దగ్గిర ఏకాత్మ రహస్యం అలవరుచుకున్నాను. సంసారం మీాద మమకారం పెట్టుకుంటే నాశనం తప్పదని గువ్వపిట్టవల్ల గ్రహించాను! అదెలాగో వినిపిస్తాను, విను.

అడివిలో ఓ గువ్వపిట్ట పెంటిపిట్టతో కాపురం చేస్తూ వుండేది. దానికి నాలుగుపిల్లలూ వుండేవి. పెంటి అంటే ప్రాణం గువ్వకి. పిల్లలంటే అంతకంటే ప్రాణం పెంటిపిట్టకి. ఓనాడు గువ్వజంట మేత తేడానికి వెళ్ళింది. ఇంతలో ఓ పిట్టల వేటకాడు పన్నిన వలలో గువ్వపిట్టలు చిక్కుకున్నాయి. అమ్మకోసం ఏడుస్తూ గింజుకున్నాయి. పిల్లల అరుపులు విని ఎగిరివచ్చింది పెంటిగువ్వ. 'అయ్యో, నా పిల్లలు' అంటూ వలలో పడిపోయింది. పెంటి వెంటే వచ్చింది మగ గువ్వపిట్ట. 'అయ్యో, నా పెళ్ళాం, పిల్లలు అంటూ తాను వలలో పడి పోయింది. అన్నిటినీ మూటకట్టుకు పట్టుకుపోయాడు పిట్టల వేటకాడు. రాజా! నా పెళ్ళాం, నా బిడ్డలు అని మమకారం పెట్టుకుంటే మనిషిగతీ ఇంతే అని తెలుసుకున్నాను.

కొండచిలువ దగ్గిర, ప్రయత్నం లేకండా దొరికిందాంతో తృప్తిపడడం గ్రహించాను. సముద్రం దగ్గర గాంభీర్యం నేర్చుకున్నాను. అగ్నిలో పడే శలభం దగ్గర ఆడదాని వలపు ప్రాణం తీస్తుందని గ్రహించాను. వలపు అగ్ని. వలచినవాడు శలభం.

కూడబెడితే కీడు తప్పదని తేనెపట్టు దగ్గర తెలుసుకున్నాను.

పెంటి ఏనుగుకోసం గోతిలోపడే మగఏనుగుని చూసి, ఆడదానికోసం ఆసపడకూడదని తెలుసుకున్నాను.

ఎరకి ఆసపడి, ముల్లు మింగిన చేపని చూసి, ఆశ కూడదని గ్రహించాను.

మిథిలా నగరంలో పింగళ అని ఒక సాని వుండేది. దాని కథా, దాని పాటా విని ఆస ఒదులుకోడం అన్నిటికంటే సుఖం అని గ్రహించాను.

డబ్బుకోసం పడుచుకునేది పింగళ. ఓ రాత్రి ఆమె దగ్గరికి ఎవ్వడూ రాలేదు. తెల్లవార్లూ నిద్ర మానుకుని గుమ్మంలో కూచుంది. తుదకి నిరాశ చేసుకుంది. ఆసతో వున్నంతసేపూ బాధగా వుండే దామెకి. ఆస విడిచిపెట్టగానే హాయి అనిపించింది. అవాళనించీ డబ్బుమీద ఆశ ఒదులు కుని సుఖపడింది. తన అనుభవమే తాను పాటగా పాడింది.

ఒక లకుముకి పిట్ట చేసిన పని చూసి, దాచుకుంటే దుఃఖమనీ, ఒదులుకుంటే సుఖమనీ తెలుసుకున్నాను. లకుముకిపిట్ట చిన్న మాంసం ముక్క దాచుకుంది. తక్కిన పిట్టలు దాన్ని ఆక్రమించాయి. లకుముకి మాంసం ముక్క ఒదిలేసింది. దాని గండం గడిచిపోయింది.

పిల్లడిదగ్గర చీకూ చింతా లేకండా వుండడం నేర్చుకున్నాను.

ఒంటరితనమే సుఖమని ఒక కన్నెపిల్ల దగ్గిర తెలుసుకున్నాను. ఆ పిల్లకి పెళ్ళి నిశ్చయమయింది. చుట్టాలు చూపులకి వచ్చారు. సమయానికి ఇంట్లో ఎవరూ లేరు. చుట్టాలకి అన్నం పెట్టాలి. బియ్యం చాలవు. పెరట్లో

వడ్లు దంచబోయింది పెళ్ళికూతురు. గాజులు చప్పుడయ్యాయి. బావుండదని కొన్ని గాజులు తీసేసింది. అయినా చప్పుడయింది. అన్నీ తీసేసి, రెండేసి గాజులుంచి దంచింది. రెండేసీ గిలు గిలుమంటూ వచ్చాయి. అప్పుడు ఒక్క గాజు మాత్రమే వుంచుకుని, తక్కింది తీసేసింది. చప్పుడు కాకండా పని ముగించింది. అంటే హెచ్చుమంది వుంటే గొల్లు తప్పదు. ఇద్దరే వున్నా జగడం తప్పదు.

మనస్సు స్థిరంగా వుంచాలని బాణం తయారు చేసే పనివాడి దగ్గర తెలుసుకున్నాను. బాణానికి మొనవేస్తూ అతడు, రాజు వచ్చినా కన్నెత్తి చూడలేదు.

ఎవరి సహాయం అక్కర లేకండా తిరగడం పాము దగ్గిర తెలుసుకున్నాను."

గయ్యాళి సవతులు మగణ్ణి పీక్కుతిన్నట్టు శరీరాన్ని ఇంద్రియాలు పీక్కుతిని కవుకులు పెడతాయి. వీటిని అదుపులో పెట్టడం లోకం దగ్గరే తెలుసుకున్నాను."

ఇలా చెప్పి తనదారిని తాను వెళ్ళాడు అవధూత. కనక ఉద్ధవా! ఆత్మతత్వం అవగాహన చేసుకో. నేను చెప్పిన స్వధర్మం మననం చేసుకో. ఆత్మతత్వం తెలిశాక కర్మలు చేసినా, చెయ్యకపోయినా ఒక్కటే.

మచ్చరం, అభిమానం, బద్ధకం మురికితనం విడిచి పెట్టు.

ఉద్ధవా! నువ్వు నా అనుచరుడివి. నమ్మకమైనవాడివి. అందుకే ఇంతగా నీకు చెబుతున్నాను. మంచివాళ్ళ సాంగత్యం కంటే మించింది మరొకటిలేదు. మంచివాళ్ళ సాంగత్యం

వల్లే వెనక ప్రహ్లాదుడూ, వృషపర్వుడూ, బలీ, విభీషణుడూ, సుగ్రీవుడూ, జటాయువూ, ధర్మవ్యాధుడూ మొదలైనవారు తరించారు అలాగే.

ఇప్పటిప్పటిమాట - గొల్లపల్లి గోపికలూ, మధుర కుబ్జ త్రివక్రీ, యజ్ఞశాల బ్రాహ్మల భార్యలూ సత్సాంగత్యం వల్లే ధన్యులయ్యారు. వీళ్ళు ఎవరూ వేదాలు వల్లించలేదు; నోములు నోచలేదు; తపస్సులూ చెయ్యలేదు. మంచివాళ్ళ సాంగత్య మహిమే అదంతా."

ఉద్ధవుడు అడిగాడు :

"విషయాలు విషాల వంటివి. ఇది తెలిసినా మనుషులు కుక్కల్లా, పందుల్లా, గాడిదల్లా ఆ విషయాల వేపే ఎందుకు పరిగెడతారు ?"

కృష్ణుడు చెప్పాడు:

"సత్వము, రాజసము, తామసము - ఈ మూడూ ప్రకృతి గుణాలు, ఆత్మగుణాలుకావు. సత్వంతో రాజస, తామస గుణాలు అణచిపెట్టాలి. సత్వం ధర్మం పెంచుతుంది. విషయాశక్తిని అరికడుతుంది.

రజోగుణం పెరిగితే మనస్సు కోరికలకి బానిస అవుతుంది. కోరికలు దుఃఖాలకి దారి తీస్తాయి. ఉద్ధవా ! నువ్వు ఈ గుణాలకి అతీతుడివి కావాలి. తమోగుణం మనిషిని కుక్కని చేస్తుంది; పందిని చేస్తుంది; గాడిదని చేస్తుంది.

మనస్సు మాయే ఈ ప్రపంచం. అంతా భ్రమ. కుమ్మరిసారె వంటిది. ఒక్కటే రకరకాలవుతుంది. కల లాంటిది. అంతా అబద్ధం.

వివేకం వికసిస్తే, భ్రమ విడిపోతుంది. వివేకం సత్వగుణం వల్ల కలుగుతుంది. వివేకమే కాదు శమమూ, దమమూ, ఓర్పూ, తపస్సూ, దయా, సత్యమూ, స్మృతీ, ఉల్లాసమూ, త్యాగమూ, శ్రద్ధా, లజ్జా, దానమూ, వినయమూ మొదలైనవి కూడా సత్వగుణంవల్లే పుడతాయి.

కామమూ, ప్రయత్నమూ, గర్వమూ, తృష్ణా! భేదమూ, పోరుబిగువూ, మిడిసిపాటు, పట్టుదలా మొదలయినవి రాజసగుణంవల్ల పుడతాయి.

అలాగే క్రోధమూ, లోభమూ, అసత్యమూ, హింసా, కలహమూ, దుఃఖమూ, మోహమూ, దీనత్వమూ, కునికిపాటూ, ఆశా, దిగులూ, మొదలయినవి తమోగుణం లోంచి పుడతాయి.

సత్వగుణంతో జాగ్రదవస్థా, రజోగుణంతో స్వాప్నికావస్థా, తమోగుణంతో సుషుప్త్యవస్థా ఏర్పడుతుంది.

మూడు గుణాల ముప్పిరివల్ల తురీయగుణం ఏర్పడుతుంది.

ఆసక్తిలేని కర్మ సాత్విక కర్మ. రాగకర్మ రాజస కర్మ. విచక్షణలేని కర్మ తామసకర్మ. అహంకార వికారాలు లేని కర్మ నిర్గుణకర్మ.

ఉద్ధవా! ఇంకా విను. దేహం గుణాలకి పునికిపట్టు ౹లకడ లేంది. అసత్యమైంది. అజ్ఞానంవల్ల ఇది సత్యమని పిస్తుంది. లోకమూ అంతే. కనపడేదంతా కలవంటిదే. కల ఎంత నిజమో కాయమూ అంతే నిజం. లోకమూ అంతే నిజం. ఇది తెలిసినవాడు కర్మలకి కట్టువడడు. కర్మలు చేసినా,

చెయ్యకపోయినా ఒకటే అతడికి. దుఃఖమూ, సుఖమూ ఒక్కలాగే భావిస్తాడతగాడు."

ఇలా ఎంతో జ్ఞానమూ; విజ్ఞానమూ ఉద్ధవుడికి ఉపదేశించాడు కృష్ణుడు. ఆత్మతత్వమూ, సత్సంగ మహిమా, గుణవిశ్లేషణా, యోగసిద్ధులూ, జ్ఞాన, కర్మ, యోగాలూ, తత్వ రహస్యాలూ, క్రియా, యోగమూ, జ్ఞాన యోగమూ, సాంఖ్యయోగమూ మొదలైనవి ఉపదేశించాడు.

"ఉద్ధవా! విచారం విడిచిపెట్టు. బదరికాశ్రమం వెళ్లు. కోరికలు విడిచిపెట్టు. తపస్సు చెయ్యి. జ్ఞానాగ్నితో అజ్ఞానం తగలబెట్టు" అంటూ ప్రబోధించాడు.

కన్నీటితో నుంచున్నాడు ఉద్ధవుడు! తనకి కలిగిన సందేహాలన్నీ అడిగి తెలుసుకున్నాడు. పదేపదే పాదాభివందనం చేశాడు. పదేపదే ప్రదక్షిణ చేశాడు. కదపలేక కదపలేక కాలు కదిపాడు. వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళిపోయాడు. చలనం లేని చూపులతో చూస్తూ వుండిపోయాడు కృష్ణుడు.

విదురుడు

నీతి తెలిసిన గొప్ప జ్ఞానవంతుడు విదురుడు. విదురనీతి విఖ్యాతమైంది. వెనక పాండవుల రాయబారిగా హస్తిన వెళ్ళినప్పుడు కృష్ణుడు, కృష్ణుడి రాయబారం ఫలించలేదు. దుర్యోధనుడు మొండిపట్టుపట్టాడు. సూదిమొనంత నేల అయినా పాండవుల కివ్వనన్నాడు. కృష్ణుణ్ణి కట్టెయ్యడానికి ప్రయత్నించాడు. కృష్ణుడు వెళ్ళిపోయాక విదురుణ్ణి పిలిచి

హితబోధ చెయ్యమన్నాడు ధృతరాష్ట్రుడు. హితమే చెప్పాడు విదురుడు:

"మహారాజా! పాండవులకి జరిగిన అన్యాయానికి నువ్వే బాధ్యుడివి. నీ తమ్ముడి కొడుకులు వాళ్ళు, తండ్రిలేని బిడ్డలు. వాళ్ళని ఎడబెట్టావు. నీ కొడుకుల మీదే ఆస పెట్టుకున్నావు. వాళ్ళని లక్క యింట పెట్టి నిప్పు పెట్టించావు. మాయజూదమాడించావు. ద్రౌపది బట్టలు విప్పించావు. అడివికి వెళ్ళగొట్టావు. గడువు పూర్తిచేసి వచ్చారు వాళ్ళు. వాళ్ళ రాజ్యంకోసం కృష్ణుడంతవాడు రాయబారానికి వస్తే ఇవ్వం పొమ్మన్నారు మీరు. న్యాయం కాలదన్ని, చావు కోరుకున్నారు.

ఎంత ఓర్చాలో అంతా ఓర్చారు పాండవులు. ఆకలితో వున్న సింహాల్లా వున్నారిప్పుడు. నీ కొడుకులకీ, మనవలకీ చావు తప్పదు. ఇప్పుడయినా మించిపోలేదు. వాళ్ళ రాజ్యం వాళ్ళకిచ్చి సంధి చేసుకో.

దుర్యోధనుడు వినుకోడంటావు. అయితే అతణ్ణి విడిచిపెట్టు. తరిమికొట్టు. ఆ మూర్ఖుడు ఒక్కడికోసం వంద మంది కొడుకుల్ని బలిపెట్టకు.

అయిదుగురూ అయిదుగురే పాండవులు. వాళ్ళకి కృష్ణుడు సాయమిప్పుడు. దుర్యోధనుడు దుష్టుడు. తన చావు తాను కానలేకపోతున్నాడు. కౌరవుల నాశనం కోరుకుంటున్నాడు."

కర్ణ, శకుని, దుశ్శాసనులతో వచ్చి ఇదంతా విన్నాడు దుర్యోధనుడు. విదురుడి మీద విరుచుకుపడ్డాడు.

"ఏమిటే, కూస్తున్నాడు దాసీకొడుకు! పాండవులంటే పడి చస్తాడు. కౌరవులంటే కంటి మంట. మా వుప్పతింటూ మాకే ఎసరుపెడుతున్నాడు. హస్తిన రాజ్యంనించి గెంటెయ్యండి, వీణ్ణి పొమ్మనండి" అంటూ అడ్డమాని తిట్లూ తిట్టాడు.

పల్లెత్తుమాట బదులాడలేదు విదురుడు. కట్టుబట్టలతో ఇల్లు వదిలేశాడు. హస్తిన విడిచిపెట్టాసు. తీర్థయాత్రలు తిరుగుతూ వచ్చాడు. అవధూతలా దినాలు గడిపాడు. దుంపాదుట్రా, కాయా పండూ తినేవాడు. కట్టికినేల పడుకునేవాడు. నారలే కట్టుకునేవాడు. అలా కొండలూ, కోనలూ, నదులూ, నదాలూ తిరిగితిరిగి ముప్ఫయిఆరేళ్ళకి ఓనాడు యమున ఒడ్డుకి వచ్చాడు. అక్కడ, ద్వారకనించి బదరికాశ్రమం వెళుతూన్న ఉద్ధవుణ్ణి చూశాడు. "ఉద్ధవా!" అంటూ అమాంతంగా అతణ్ణి కౌగిలించుకున్నాడు. యాదవులా, పాండవులా క్షేమమడిగాడు.

"ఉద్ధవా! బలరాముడూ, కృష్ణుడూ బాగున్నారా? వసుదేవుడూ, దేవకీ, ఉగ్రసేనుడూ, కృష్ణుడికుమాళ్ళు, ప్రద్యుమ్నుడూ, సాంబుడూ, గదుడూ అందరూ హాయిగా వున్నారా ద్వారకలో? పాండవులంటే ప్రాణం వారందరికీ.

సాత్వతులూ, వృష్ణి, భోజులూ, దశార్హులూ- అంతా తనువుకి వస్తున్నారు నిన్ను చూస్తే. అందరు కులాసాయేకదా!

అన్నట్టు సాత్యకి ఎలా వున్నాడు? మా అర్జునుడి

ప్రియశిష్యుడతడు. కృష్ణుడిదగ్గిర యోగరహస్యాలు నేర్చుకున్నాడు.

అనిరుద్ధుడూ, అక్రూరుడూ, హృదీకుడూ, చారుధేష్ణుడూ, గదుడూ ఎలా వున్నారట!

మా హస్తినకబుర్లు అందుతున్నాయా? అంత భారత యుద్ధమూ కృష్ణుడి చేతులమీద జరిగింది. కౌరవులు నన్ను కాదన్నారు.. అందరూ హతవారిపోయారు. అంతా విన్నానయ్యా విన్నాను. ధర్మరాజు ధర్మంతో రాజ్యమేలుతున్నాడట కదా! కృష్ణుడు కుడిభుజమయితే అర్జునుడు ఎడమభుజం అతడికి. అతడి మయసభ కన్నుకుట్టింది మా దుర్యోధనమహారాజులుంగారికి. భీముడి గదతో తొడలు విరిగి పడిపోయాడట, పాపం! ఎంతపోరాను! అంతా పైత్యరోగికి పంచదారయింది.

భీమార్జునులూ, నకులసహదేవులూ బాగున్నారా?

పాపం, ద్రౌపది! అయిదుగురు కొడుకుల్నీ చంపేశాడట అశ్వత్థామ. సుభద్ర భద్రమేనా! మనవడుముప్ఫయి ఆరేళ్ళ వాడయుంటాడు. తాతల్నేకాని తండ్రిని నెరగడు. అందరి తండ్రులలాటివాడా అభిమన్యుడు! బుద్ధిమంతుడేనా పరీక్షిత్తు?

కోడలు కుంతి బతికుందా! కొడుకులకోసం పడరాని పాట్లుపడింది.

మా అన్న ధృతరాష్ట్రుడు కళ్ళులేని మనిషి. తన మేలు కోరి ఎంతగానో మొత్తుకున్నాను. కొరగాని కొడుకు కోసం కులమంతా చెరుచుకున్నాడు, తమ్ముడ్ని నన్ను తరిమేశాడు.

ఉద్ధవా! దేనికీ విచారంలేదు నాకు. దేశాలు తిరుగు

తున్నాను. అడివినించి అడివికి తిరుగుతున్నాను. కొండనించి కొండకి తిరుగుతున్నాను. నదులలో మునిగాను. దొరికింది తింటున్నాను. ఏది ఎలా అవాలనుంటే అది అలా అవుతుంది.”

విదురుడి మాటలు వింటూనే వున్నాడు ఉద్ధవుడు. ఉలికులికి పడుతున్నాడు. కృష్ణుడి క్షేమం అడుగుతున్నాడు విదురుడు. గుండెపగిలి పోతున్నట్టుంది ఉద్ధవుడికి. యాదవుల క్షేమం అడుగుతున్నాడు విదురుడు; పేరుపేరునా అడుగుతున్నాడు. తల తిరిగిపోతూ వుంది ఉద్ధవుడికి.అతడి నోట మాట రాలేదు. మొహమంతా కన్నీళ్ళతో నిండిపోయింది.

అయిదేళ్ళ వయస్సప్పటినించీ కృష్ణుడితో నేస్తం కట్టాడు ఉద్ధవుడు. కలిసిమెలిసి తిరిగాడు. కలిసి ఆటలాడాడు. కలిసి కూచున్నాడు. కలిసి నిదరపోయాడు. అలాంటి కృష్ణుడు తనని వదిలేసి, ఈలోకంనించే వెళిపోతున్నాడు. అతడి క్షేమం విచారిస్తున్నాడు విదురుడు. ఏమిటని బదులు చెప్పడం! ఎలా నోరు విప్పడం? అతడిశరీరం గరిపొడిచింది. కృష్ణుడి ఉపదేశం చెవిలో గింగురుమంది. కన్నీరు వరద కట్టింది.

“విదురా!” ఎంతోసేపటికి బొంగురు గొంతుకతో అన్నాడతడు, “క్షేమమడుగుతున్నావా నన్ను. కాలం కాల సర్పం. కబళించడమే దాని స్వభావం. పొద్దుగుంకిపోయాక అంతా చీకటే. అదిగో అలాగేవుంది నా అవస్థ, యాదవుల అవస్థాకూడా.

విదురా! ఇంతప్పటినించీ కృష్ణుడితోనే పెరిగాను.కృష్ణుడితోనే బతికాను.అంత చిన్నప్పుడూ కృష్ణుడి బొమ్మతోనే ఆడుకునేవాణ్ణి. కృష్ణుడి బొమ్మతోనే వూసులాడేవాణ్ణి. అతడి

సేవకుణ్ణి. అతడి భక్తుణ్ణి. ఇలాగే ముసిలి వాణ్ణయిపోయాను. చిన్నప్పుడు అతడితో ఆటలాడేవాణ్ణి. పాటలు పాడేవాణ్ణి. అతడి కథలే వినేవాణ్ణి. అమ్మ తిండికి పిలిచినా వెళ్ళేవాణ్ణికాను. అతడు నవ్వితే నవ్వేవాణ్ణి. అతడు ఏడిస్తే ఏడ్చేవాణ్ణి.

విదురా! మామూల్మాలు మనిషా కృష్ణుడు? అతడి చల్లని చూపులు గొల్లభామలకి వలపు పుట్టించాయి. అతడి అడుగుల గుర్తులమీద దొర్లిపోయేవారు వాళ్ళు. అతడి ఎరుపు చూపులు పగవాళ్ళని భస్మం చేసేవి. అతడి మురళి పాటకి బృందావనం పులకరించేది. ఆకాశం వెన్నెల వొలక పోసేది. అన్నీ నిన్నటిలా వుంది నాకు.

ఇంకేముంది? తన కొడుకుల చావుకి దుఃఖపడి గాంధారి శపించింది. కాలం రావడంతో యాదవ యువకులు మిడిసి పడ్డారు. సాంబుడికి చూలాలు వేషం వేశారు. మునులముందు తెయితెక్కలాడారు. కోపదారి మునులు సాంబుడి కడుపులో ముసలం పుడుతుందన్నారు. యాదవకులంలో ముసలమే పుట్టింది.

కృష్ణుణ్ణి తమలో ఒకడే అనుకున్నారు యాదవులు. అతణ్ణి గుర్తించలేకపోయారు. ఇంకేముంది!

కృష్ణుడి విరహంతో కుంగిపోతున్నాన్నేను. నన్ను బదరికాశ్రమం వెళ్ళిపొమ్మన్నాడు. వెళుతున్నాను."

వెక్కి వెక్కి ఏడ్చాడు ఉద్ధవుడు. విదురుడూ ఏడ్చాడు విని.

ఆ రాత్రి యమునానది ఒడ్డున కృష్ణుడి కథలే చెప్పు

కుంటూ విదురుడూ, ఉద్ధవుడూ గడిపేశారు. మర్నాడు ఉద్ధవుడు బదరికాశ్రమం దారి పట్టాడు. విదురుడు హస్తినాపురం వేపు మళ్ళాడు.

ఇల్లూ వాకిలీ ఒదిలి వెళిపోయి, ముప్ఫయి ఆరేళ్ళకి తిరిగీ హస్తినలో అడుగుపెట్టాడు విదురుడు. ధృతరాష్ట్రుడూ, ధర్మరాజూ, భీమార్జునులూ, నకుల సహదేవులూ యుయుత్సుడూ, సంజయుడూ, కృపుడూ మొదలైన యావన్మందీ అతడ్ని ఆప్యాయంగా ఆదరించారు. గాంధారీ, కుంతీ, ద్రౌపదీ మొదలైన రాణీవాసం స్త్రీజనమూ యథావిధిని గౌరవించారు. పరీక్షిత్తు పాదాభివందనం చేశాడు.

అన్న ధృతరాష్ట్రుడికీ, వదినెలు గాంధారీ కుంతీలకీ నమస్కరించాడు. అందరినీ కుశలమడిగాడు.

అతడ్ని ధృతరాష్ట్రుడితో సమంగా చూసుకున్నాడు ధర్మరాజు. ధృతరాష్ట్రుడి దగ్గిరే వున్నాడు విదురుడు.

అప్పటికే హస్తినలో విడ్డూరాలు అవుపిస్తున్నాయి. ప్రజల్లో దగా, అబద్ధం, కుటిలత్వమూ, క్రోధమూ, నీతి మాలిన తనమూ పెచ్చుపెరిగాయి. కుక్కలు మోరలెత్తి మొరుగుతున్నాయి. దిక్కులు పొగలుకమ్ముతున్నాయి. ఇలాటివన్నీ చూసి, కాలగతి గమనించాడు విదురుడు. అన్నగారికి తత్వబోధ చేశాడు.

"అన్నయ్యా, మనకాలం మళ్ళింది. మిగిలిన మూన్నాళ్లు వైరాగ్యంతో గడపాలిక.

ఈ శరీరం చివికిన గుడ్డపేలికలా అయిపోతుంది. మతిమంతుడు పాడిల్లు విడిచిపెడతాడు. అలాగే ప్రాణం పాడు

దేహం విడిచిపెడుతుంది. చూడు, నీ శరీరం ఒడిలిపోయింది. పళ్ళు పడిపోయాయి. కళ్ళు లేవు. చెవుడు వచ్చింది. అయినా ఒకప్పుడు మహారాజువయిన నువ్వు పాండవుల పంచని పడున్నావు. కుక్కలా కూడు తింటున్నావు.

ఇంతటితో ఈ మమకారం విడిచిపెట్టు. జంజాటం నించి బయటపడు. తపస్సు చెయ్యి. తరించు."

విదురుడి మాటలతో తెలువుకున్నాడు ధృతరాష్ట్రుడు. సంసార బంధాలు తెంచుకున్నాడు. మోహం విడిచిపెట్టాడు. వైరాగ్యం కుదుర్చుకున్నాడు. తపస్సుకని అడివికి పయనమయాడు. గాంధారితో కలిసి అర్ధరాత్రి ఎవరికీ తెలియకుండా విదురుడివెంట ఇల్లువిడిచి వెళ్ళిపోయాడు. ఆ వెళ్ళడంవెళ్ళడం వెళ్ళి హిమాలయం చేరుకున్నాడు. అక్కడ గంగానది ఏడుపాయలు పారుతున్న చోట యోగంలో కూచున్నాడు. నీరు మాత్రం ఆహారం చేసుకున్నాడు. వెళ్ళిన అయిదో రోజున కారుచిచ్చులో కాలిపోయాడు. మగడితోనే మంటలో మండిపోయింది గాంధారి.

అన్నగారూ, వదినెగారూ కార్చిచ్చులో కాలిపోడం కళ్ళారా చూశాడు విదురుడు. తల వాల్చుకుని ఉత్తరంవేపు వెళిపోయాడు.

* * *

రోజూ నిత్యకృత్యాలు తీర్చుకుని వచ్చి, గాంధారీ ధృతరాష్ట్రుల అడుగులకి మొక్కి, క్షేమమడిగి వెళ్ళేవాడు ధర్మరాజు. అలాగే విదురుడూ, గాంధారీ ధృతరాష్ట్రులూ వెళిపోయిన మర్నాడు పెదతండ్రి మందిరానికి వచ్చాడతడు. ముగ్గురికి ముగ్గురూ కనపడలేదు. కంగారుపడి సంజయుడ్నడి

గాడు. కంటికి రెప్పలా కనిపెట్టుకు వుండేవాడు సంజయుడు. అతడికీ తెలియకండా వెళిపోయాడు ధృతరాష్ట్రుడు.

ద్వారకలో విడ్డూరాలు

ద్వారకలో విడ్డూరాలు మితిమీరిపోయాయి. సుడి గుమ్ములు పుట్టాయి. ఎలకలు మందలుగా వీధుల్లో పరుగులు పెట్టాయి. నిద్రలో వున్నవాళ్ళ జుత్తులూ, గోళ్ళూ కొరికి తినేసేవి. మట్టికడవలు కన్నాలు పెట్టేసేవి. యాదవుల ఇళ్ళల్లో మైనగోరలు పొద్దస్తమానం గీపెట్టాయి. సారస పక్షులు పులుగు పిట్టల్లా కూసేవి. మేకలు గాడిదల్లా అరిచేవి.

ఆవుల కడుపులో గాడిదలూ, కంచరగాడిదల కడుపులో ఏనుగుగున్నలూ, కుక్కల కడుపులో పిల్లికూనలూ పుట్టాయి. ముంగిస కడుపులో ఎలకలు పుట్టాయి.

సిగ్గుమాలి తిరిగారు యాదవులు. నీతిమాలి తిరిగారు ఆడంగులు. పిన్నలు పెద్దలమీద తిరగబడ్డారు. తల్లిని కొడుకు దగా చేశాడు. మగడ్ని మగనాలు మోసంచేసింది.

సూర్యుడి చుట్టూ కబంధాలు మూగినట్టు కనపడింది. చుక్కలతో చుక్కలూ, గ్రహాలతో గ్రహాలూ గుద్దు కున్నట్టూ, ఢీకొన్నట్టూ అవుపడింది.

కృష్ణుడు పాంచజన్యం పూరిస్తే యాదవుల మంది రాల్లో గాడిదలు ఓండ్ర పెట్టినట్టు వినిపించేది.

అవన్నీ కనిపెడుతూనే వున్నాడు కృష్ణుడు. మహా భారతయుద్ధం జరిగి ముప్ఫయారేళ్ళూ నిండాయి. రేపే చివరి దినం.

సుధర్మ సభలో యాదవుల్ని సమావేశ పరిచాడు. కిటకిటలాడుతూ వుంది సభంతాను. మధ్య సింహాసనం మీద కూచున్నాడు. అన్నదమ్ముల్నీ, జ్ఞాతుల్నీ, కుమాళ్ళనీ, చుట్టాల్నీ, స్నేహితుల్నీ - యావన్మందినీ - ఓసారి, అదే- చివరిసారి కలయచూశాడు.

ఆ చూపుల్లో ఆందోళన లేదు. తొందరపాటు లేదు. ఏ వికారము లేదు.

ప్రళయానికి ముందు ప్రశాంతంగా వుండే నీలి సముద్రంలా వున్నాడు కృష్ణుడు. ఎంత ప్రశాంతంగా వున్నాడో అంత గంభీరంగానూ వున్నాడు.

"అంతా వినండి"- అందుకున్నాడు కృష్ణుడు, "కనీ వినీ ఎరగని విడ్డూరాలు కనిపిస్తున్నాయి మన ద్వారకలో. మనకి అపశకునాలివి. అనిష్టం సూచిస్తున్నాయి. కాలం కాల సర్పంవంటిది.

ఈ పట్నంలో మనం వుండకూడదిక, దీనిని విడిచి పెట్టి వెళ్ళిపోవాలి, తప్పదు.

వ్యవధి లేదు. ఇప్పుడే పయనం కావాలి. రేపు తెల్లవారక ముందే మనం ప్రభాస తీర్థంలో వుండాలి.

వృద్ధుల్నీ, చిన్నపిల్లల్నీ, స్త్రీ జనాన్నీ శంఖో ద్ధార తీర్థం దగ్గర చేర్చాలి.

పొద్దుటిపూట స్నానాలు మనమంతా సరస్వతీ నదిలో చేయాలి."

యాదవుల మహాయాత్ర

సుధర్మ తుది మహాసభ ముగిసింది. "ప్రభాసానికి పయనంకండి" అని నగరంలో దండోరా వేయించాడు కృష్ణుడు.

రథాల మీదా, మేనాలమీదా, బళ్ళమీదా బయలు దేరారు యాదవులు. పడవలమీదా, ఓడలమీదా సముద్రం దాటారు. ప్రభాసతీర్థం చేరారు. పడమరగా పారుతూ సముద్రంలో పడుతున్న సరస్వతిలో మునిగారు. మున్నాబులు చేసుకున్నారు. రకరకాల బట్టలు కట్టుకున్నారు. రకరకాల గంధాలు పూసుకున్నారు. రకరకాల దండలు వేసుకున్నారు. రకరకాల పిండివంటలు తిన్నారు. మాంసాలు, మద్యాలు తాగారు. కేరింతలాడారు. మీసాలు దువ్వారు. రోసాలు పలికారు. కారుకూతలు కూశారు. కయ్యాలకి కాలు దువ్వారు. ధనుస్సులు తీశారు. కత్తులు దూశారు.

కృష్ణుడి కళ్ళముందే కల్లు తాగారు. పదేపదే తప్ప తాగారు.

ఒకడు రథమెక్కితే, ఒకడు ఏనుగెక్కాడు. ఒకడు గుర్రమెక్కితే ఒకడు లొట్టిపిట మీదికి ఎగబడ్డాడు. ఒకడు గాడిదెక్కితే ఒకడు మనిషిమీదెక్కాడు.

బాజాలు వాయించారు. సానిమేళాలాడించారు. పాటలు పాడారు. ఆటలాడారు.

కృష్ణుడి ఎదటే కూచుని అతడి వియ్యంకుడు కృత

వర్మా, అన్న బలరాముడూ, తమ్ముడు సాత్యకీ, గదుడూ, బభ్రుడూ, తప్ప తాగారు. మత్తులో మతీ సుతీ లేకండా పోయింది.

ఉన్నట్టుండి వ్యూరికే కృతవర్మమీాద ఎగిసిపడ్డాడు సాత్యకి.

"ఏయ్, కృతవర్మా! అవాళ నిద్రపోతున్న వాళ్ళ మీాదపడి చంపావు అర్ధరాత్రి. యదువంశం వాళ్ళందరూ 'ఛూ' అన్నారు!"

"అవును. ఉన్నమాటే అది." అంటూ పల్లవి పాడాడు ప్రద్యుమ్నుడు.

"సాత్యకీ" వురిమాడు కృతవర్మ. "చెయ్యి తెగి చావడానికి కూర్చున్న భూరిశ్రవుణ్ణి చంపినవాడివేనా, పెద్ద కబుర్లు చెబుతున్నావు!"

చురచురా చూశాడు కృష్ణుడు.

చర్రున కత్తి తీశాడు సాత్యకి. కృతవర్మ తల నరికేశాడు.

భోజులూ, అంధకులూ చుట్టుముట్టి సాత్యకిని చంపేశారు.

యాదవకులంలో గాలి గుమ్మి రేగింది. ప్రభాసం సముద్రపొడ్డంతా మూడు పలకల తుంగ బలిసుంది. ఉగ్రసేనుడు సముద్రంలో పారబోయించిన ముసలంగుండే అలా తుంగ బలిసింది.

కల్లు నిషాలో తుంగగాలి గంగవెర్రు లెత్తించింది పొగరబోతు యాదవుల్ని. సాత్యకీ కృతవర్మల రక్తం కళ్ళ

చూసి రాక్షసులే అయిపోయారు వాళ్ళు. అయినవాళ్ళెవరో కానివాళ్ళెవరో అయిపు లేకండా పోయింది. అన్న తమ్ముడిమీద పడ్డాడు. తమ్ముడు అన్నమీద పడ్డాడు. తండ్రి కొడుకుమీద పడ్డాడు. కొడుకు తండ్రిమీద పడ్డాడు.

ప్రద్యుమ్నుడూ, సాంబుడూ కొట్టుకున్నారు. అక్రూరుడూ భోజుడూ కొట్టుకున్నారు. సుభద్రుడూ, సంగ్రామజితుడూ కొట్టుకున్నారు. గదుడూ, అనుగదుడూ కొట్టుకున్నారు. సుమిత్రుడు అలాగే అనిరుద్ధుడూ, నిశకుడూ, ఉల్ముకుడూ, శతజిత్తూ, సహస్రజిత్తూ, భానుడూ పరస్పరం నరుక్కున్నారు; పొడుచుకున్నారు, ఒకళ్ళ నొకళ్ళు చంపుకున్నారు.

వీరందరూ వీరాధివీరులు, అసహాయశూరులు. మంచి చెడ్డ లెరిగిన వాళ్ళు. బుద్ధిమంతులలో బుద్ధిమంతులు. ఒక్కొక్కడూ ఒక్కొక్క రాజ్యమేలగల వాళ్ళు. అయితేనేం మధుపానంతో మతులు పోగొట్టుకున్నారు. ఆయుధాలతో కొట్టుకున్నారు. ఆయుధాలు అంతమయాక, ముసలం తుంగతో కొట్టుకున్నారు. యాదవుల చెయ్యి తగిలితేచాలు తుంగగడ్డి ఇనప ముసలాలలాగ బిగుసుకునేది. దానిదెబ్బ తగిల్తే చాలు తారుమనిపోయేవారు.

దాశార్హ, వృష్ణి, అంధక, భోజ, సాత్వత, మధు, అర్బుద, మాథుర, శూరసేన, కుకుర, కుంతీ వంశీయులందరూ చుట్టరికాలు మరిచిపోయి స్నేహాలకి స్వస్తి చెప్పారు. చంపడమే, చావడమే సరదాగా సేనలతో కూడా చావులపండగ సాగించారు.

ఆ ఆవేశంలో బలరాముడూ, కృష్ణుడూ కలిశారు.

అనుకోకుండానే పిడికిళ్ళతో ముప్పేకల తుంగ పెరికారు. తమ జ్ఞాతుల్నే తరిమి చంపారు మారి మసిగినట్లు, దావానలం రేగినట్లు, ప్రళయం పరుగెత్తినట్లు, నిప్పుకొండ పగిలినట్లు, పేట్రేగిపోయింది తుంగ.

వందలు వందలు వేలు వేలు కుప్పలు పడ్డాయి శవాలు. తమలో తామే కొట్టుకు చచ్చారు యాదవులు. అంతమందీ అయిపోయారు. అయితే కృష్ణుడు విసరిన తుంగతోనే హెచ్చుమంది చచ్చిపోయారు. అయితే ఏ వికారమూ కలగలే దతడిలో.

అంత యాదవకులమూ అంతమయిపోయింది. కారణం ఏదయినా జరిగిందంతా తాగుడువల్లే జరిగింది.

తాగిన మత్తుతోనే సముద్రం గట్టున కూచుని కళ్ళు మూశాడు బలరాముడు.

జరాకిరాతుడు

అన్నగారి చావూ చూశాడు కృష్ణుడు. జీబుగా వున్న రావిచెట్టుకింద, చేరబడి కూచున్నాడు. చెట్టుకింద కారు మబ్బు వాలినట్టయింది.

ఎప్పటిలాగే పసుప్పచ్చటి పట్టుబట్ట కట్టుకున్నాడు. అలాటిదే వుత్తరీయం వేసుకున్నాడు. ఒంటరిగా కూచున్నాడు. ఎక్కడా ఏ అలికిడీ లేదు.

కుడితొడమీద ఎడమకాలు వేసుకుని, కటికినేల కూచున్నాడు.

అంతయినా చింతా వంతా లేదు. మొహంలో కలి విడి మాయలేదు. తామరరేకుల్లా వున్నాయి కళ్ళు. ఎంచక్కా ఎఱ్ఱ తామరలా అవుపిస్తూ వున్నాయి అడుగులు.

అదే సమయానికి అడివిలో వేటాడుతూ ఒక కిరాతుడు అక్కడికి వచ్చాడు. అతడి పేరు జరుడు.

భయంకరంగా వున్నాడు జరుడు. చేతిలో ధనుస్సూ, వాడి వాడి బాణాలూ వున్నాయి. మృగాలు వెదుకుతూ వచ్చాడతడు.

చెట్టుకింద కృష్ణుడు మృగమే అనుకున్నాడు జరుడు. కృష్ణుడి పాదం లేడి నోరులా కనపడింది. చప్పున బాణం తొడిగాడు.

వెనక చేప కడుపులో దొరికిన ముసలం ముక్క మొన చేసిన బాణమది. అదే ధనుస్సుకి తొడిగాడు కిరాతుడు. గురిచూసి కొట్టాడు.

కృష్ణుడి ఎడమ పాదానికి తగిలింది బాణం. జంతువు కోసం పరిగెత్తాడు జరుడు. తాను కొట్టింది జంతువు కాదు కృష్ణుడు.

జజ్జరిల్లిపోయాడు జరుడు. గుండెలు బాదుకున్నాడు. విల్లూ, అమ్ములూ పడేశాడు. కష్ణుడి కాళ్ళమీద పడ్డాడు గోలు గోలుమన్నాడు.

"ఎంత పని చేశాను! ఎంత పని చేశాను! అపరాధమయిపోయింది ప్రభూ! ప్రభూ! నన్ను చంపెయ్యి. నా చేతులు నరికెయ్యి." అంటూ కింద దొర్లిపోయాడు.

నెత్తీ, నోరూ మొత్తుకున్నాడు. మెల్లిమెల్లిగా కళ్ళు విప్పాడు కృష్ణుడు.

"విచారపడకు" నెమ్మదిగా అన్నాడు, "ఇది ఇలాగే జరగాలి, వెళ్ళు."

తుది మాట

ప్రభాసతీర్థం, యోజనాపొడవు విశాలమైన అంతమేరా శవాలే శవాలు. కృష్ణుణ్ణి వెదుక్కుంటూ తిరిగాడు దారుకుడు. కనబడలేదు కృష్ణుడు. వెదికి వెదికి ఎలాగో, కృష్ణుడు పడున్న రావిచెట్టు దగ్గిరికి వచ్చాడు. కృష్ణుడు అవుపడగానే పరిగెత్తుకు దగ్గిరికి వెళ్ళాడు. బావురుమన్నాడు.

"వచ్చావా, సారథీ!" నెమ్మదిగా అన్నాడు కృష్ణుడు, "విచారించకు. ఏం జరగాలో అదే జరిగింది. నువ్వు చెయ్యవలసిన పని కొంచెం మిగిలింది. ద్వారక వెళ్ళు. అమ్మనీ, నాన్ననీ చూడు. అంతా అయిపోయింది. అన్నయ్య బలరాముడు వెళిపోయాడు. నేనూ వెళుతున్నాను.

అర్జునుడు వస్తాడు. అతడితో మనవాళ్ళందరినీ ఇంద్రప్రస్థం వెళిపోమను. నా తరవాత ద్వారక సముద్రంలో మునిగిపోతుంది. గొడ్డూ, గోదా ఏదీ ద్వారకలో వుంచకూడదు. వెళ్ళు ఇక్కడ ఆగకు".

కృష్ణుడి తుదిమాట విన్నాడు దారుకుడు. లోకం చీకటే అయిపోయిందతడికి. ఏడుస్తూ ద్వారక వెళ్ళాడు.

ప్రపంచం చిత్రమైన నాటకశాల. నాటకం మొదలవుతుంది. నటుడు రకరకాల వేషాలతో వస్తాడు. అంతా

నిజమే అనిపిస్తాడు. నాటకమయిపోతుంది. వేషాలూ వుండవు, నటుడూ వుండడు, మరుగయిపోతాడు.

అదిగో అలాగే కృష్ణచరిత్ర చిత్రమైన మహా నాటకం.

బందిఖానాలో ఖైదీల కడుపున పుట్టాడు కృష్ణుడు. గొల్లపల్లె గొల్లలఇంట పెరిగాడు. ఆవులు మేపుతూ బతికాడు. గొల్లపడుచులతో తిరిగాడు. బృందావనం పులకలెత్తించాడు. మధుర వెళ్ళి యాదవరాజ్యం ఉద్ధరించాడు. సముద్రంలో ద్వారక నిర్మించాడు. మహాయుద్ధాలు చేశాడు. రాజకీయాలు నిర్వహించాడు. మహాభారత యుద్ధం ఒక్క చేతిమీద నడిపించాడు. పాండవుల వంశాంకురం నిలిపాడు. యాదవకులం తుదముట్టించాడు. పరలోకం వేంచేశాడు.

అర్జునుడు

అర్జునుడు ద్వారక వచ్చాడు. మగడు చచ్చిన ముండలా వుంది ద్వారక. దుఃఖంతో కుంగిపోయాడతడు.

అతడ్ని చూసి కృష్ణుడి భార్యలందరూ గొల్లుమన్నారు. ఏడుస్తూనే వాళ్ళని ఓదార్చాడు అర్జునుడు. అక్కడ్నుంచి మామ వసుదేవుడి దగ్గిరికి వెళ్ళాడు. కుమాళ్ళ చావు విని కుమిలి కుములి ఏడుస్తున్నాడు వసుదేవుడు. నేలపడున్నాడు.

దుఃఖం ఆపుకోలేకపోయాడు అర్జునుడు. మామ పాదాలు పట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చాడు.

అర్జునుడ్ని లేవనెత్తబోయాడు వసుదేవుడు. కాని లేవలేకపోయాడు. ఎలాగో అతడ్ని గుండెల కదుముకున్నాడు. కుమాళ్ళనీ, తమ్ముళ్ళనీ, మనవల్నీ, చుట్టాలనీ తలుచుకుని పనివి పనివి ఏడ్చాడు.

"అర్జునా! ఏరయ్యా! నావాళ్ళు? అయినా బతికే వున్నాను! చావు నాకు లేదా?"

"మామయ్యా! ఏడుస్తూ అన్నాడు అర్జునుడు. "కృష్ణుడు లేని ఈ లోకం చూడలేను. అన్నయ్యలు ధర్మరాజూ, భీముడూ, కవల తమ్ములూ, ద్రౌపదీ నాలాగే కృష్ణుడు లేని లోకంలో వుండలేరు.

కృష్ణుడు వెళిపోయాడు, మేమూ వెళిపోతాం మామయ్యా! కాలం వచ్చేసింది.

స్త్రీలనీ, పిల్లల్నీ, వృద్ధుల్నీ ఇంద్రప్రస్థం తీసుకు వెళతాను."

వసుదేవుడ్ని ఓదార్చి, సుధర్మ సభలోకి వెళ్ళి కూచున్నాడు అర్జునుడు. మంత్రుల్నీ, వయసు మళ్ళినవాళ్ళనీ సమావేశపరిచాడు.

"ఎన్నో గొప్పగొప్పసభలు జరిగినసభ సుధర్మ - కృష్ణుడి గంభీరమయిన ఉపన్యాసాలతో మారుమోగిన మహాసభ. నిత్యకల్యాణం పచ్చతోరణంగా వుండిన యాదవసభ. దీపంలేని కొంపలా దిన్నపోయిందిప్పుడు. దీనంగావుంది. ఎవరి మొహంలోనూ చిక్కితే నెత్తురు చుక్క లేదు. కన్నీళ్ళు తుడుచుకుంటూ అన్నాడు అర్జునుడు:

"ఇవాళనించీ ఏడోనాడు ద్వారకాపట్నం సముద్రంలో మునిగిపోతుంది.

ఏడోరోజు పొద్దుపోయేసరికి ద్వారకలో పిట్టమనిషి వుండకూడదు.

డబ్బూదస్కం, గొడ్డూగోదా, పిల్లాజెల్లా-అన్నీ తీసుకుని మీరంతా పట్నం వొదిలిపెట్టెయ్యాలి.

వృష్ణి, అంధక వంశాలవారి స్త్రీలనీ, పిల్లల్నీ నేను ఇంద్రప్రస్థం పట్టుకు వెళతాను. కృష్ణుడి మనవణ్ణి వజ్రుణ్ణి యాదవులరాజుగా అభిషేకిస్తాను. కృష్ణుడి ఆదేశమిది."

ఆ రాత్రి కృష్ణుడి మందిరంలోనే గడిపాడు అర్జునుడు.

తెల్లవారేసరికి వసుదేవుడి మందిరంలో ఏడుపులు వినిపించాయి. రాత్రి వసుదేవుడు కాలం చేశాడు.

దేవకీ, రోహిణీ, భద్రా, మదిరా మొదలయిన వసుదేవుడి భార్యలు మగడి చితిమీద సహగమనం చేశారు.

యాదవులందరికీ అగ్నిసంస్కారం జరిగించాడు అర్జునుడు. ఎంతోమంది యాదవ స్త్రీలు తమ భర్తల చితుల మీద అగ్గిలో ఆహుతి అయిపోయారు.

బలరాముడి భార్యలూ, కృష్ణుడి కోడళ్ళూ అలాగే సహగమనం చేశారు. రుక్మిణీ మొదలయిన దేవేరులూ అగ్ని

ప్రవేశం చేశారు. సత్యభామా మరికొందరూ తపస్సుకని అడివికి వెళిపోయారు.

ఏడోనాడు ద్వారక విడిచిపెట్టేశాడు అర్జునుడు. మిగిలిన కృష్ణుడి భార్యల్నీ, పిల్లల్నీ, ముసిలాళ్ళనీ తీసుకుని ఇంద్రప్రస్థం బయలుదేరాడు. వజ్రుణ్ణి ముందుంచుకుని పయనమయారు యాదవులు. ఏనుగులమీాదా, గుర్రాలూా, గాడిదలూా, ఎడ్లూ, ఎనుపోతులూా, ఒంటెలూా పూసిన బళ్ళమీాదా, రథాలమీాదా పట్నంలో పిట్టమనిషి వుండకండా వచ్చేశారు. రహస్యంగా ఆయుధాలు కట్టి ఏనుగులమీాద పెట్టారు. వాటి రక్షణకోసం పదాతుల్ని పెట్టారు.

కృష్ణుడి పదహారువేలమంది భార్యలూా, అతడి మనవలూా వజ్రుణ్ణి అంటిపెట్టుకుని నడిచారు. భోజ, వృష్ణి, అంధక వంశాల వితంతువుల సంఖ్య ఎన్నో అన్ని వేలుంది.

ఇటు అర్జునుడు వచ్చేస్తూవుంటే అటు పట్నం ముంచేస్తూ వచ్చింది సముద్రం.

ద్వారకా నగరం సముద్రంలో మునిగిపోయింది. కృష్ణుడి భవనముండినచోటు మాత్రం మిగిలిపోయింది.

సముద్రం పాలబడకుండా ద్వారక ప్రజల్ని తప్పించి, అంతమందితోనూ ముందుకి నడిచాడు అర్జునుడు. అంతమందికీ అతడు ఒక్కడే దిక్కు. అలా వెళ్ళి వెళ్ళి పంచనద దేశంలో ఆగాడతడు.

అక్కడి దోపిడి దొంగలు చూశారు. అంతమంది ఆడాళ్ళు. అంతమందీ వితంతువులు. నగలు కోకొల్లలు. అందరూ అందగత్తెలు. రాణివాసం రాజహంసలు. దొంగలకి ఆసపుట్టింది. ఒకళ్ళతో ఒకళ్ళు కూడబలుక్కున్నారు.

"మంచి బేరం తగిలింది మనకి. అంతా ఆడంగులు. మగాళ్ళలో ఒక్కడే మొనగాడు. మిగతా అంతా మూడు కాళ్ళ ముసిలాళ్ళు, ముక్కుపచ్చలారని పిల్లకాయలు."

అంటూ వేలాదిమంది కర్రలూ, కత్తులూ పట్టుకుని యాదవస్త్రీలమీద విరుచుకుపడ్డారు. సేవకుల్ని చిదక గొట్టారు. చేతికందిన స్త్రీలనల్లా లాక్కుపోడం లంకించు కున్నారు.

అర్జునుడు గర్జించాడు. లెక్కచేయలేదు దొంగలు. గాండీవం తీశాడు అర్జునుడు. చిత్రం, ఎక్కుపెట్టడానికే ఉక్కిరిబిక్కిరి అయాడు. ఎలాగో ఎక్కుపెట్టాడు. బాణం పట్టుకున్నాడు. ప్రయోగించలేకపోయాడు. సిగ్గుతో తల వంచుకున్నాడు. శాయశక్తులా పోరాడాడు. కాపాడగలిగి నంత మందిని కాపాడాడు.

నాలుగువేపులా ముట్టడించారు దొంగలు. అంద మయిన ఆడాళ్ళని ఎత్తుకుపోయారు. ధనరాసులు కొల్ల గొట్టారు. కొంతమంది స్త్రీలని బలవంతంగా ఎత్తుకుపోయారు. కొంతమంది తమంతతామే దొంగలవెంట వెళ్ళారు.

శక్తి సన్నగిల్లినా ఝారుకోలేదు అర్జునుడు. చెమటలు పోసుకుంటూనే బాణాలు వేశాడు. ఎంతోమందిదొంగల్ని చంపాడు. తరుగులేనివి తన తూణీరాలు. కాని వృత్తి పోయాయి. తెల్లబోయాడు అర్జునుడు. గాండీవం వింటితోనే కంటపడిన వాణ్ణల్లా కొట్టి తరిమాడు.

హెచ్చుమంది స్త్రీలని ఎత్తుకుపోయారు దారిదోపుడు దొంగలు. చేతికందిందల్లా చేజిక్కించుకుపోయారు. మిగిలిన స్త్రీలనీ, పిల్లల్నీ, ముసిలాళ్ళనీ తీసుకుని ముందుకి సాగాడు అర్జునుడు. అతడి హృదయం కుంగిపోతూవుంది.

"అర్జునుణ్ణేనా నేను. నా భుజాల శక్తి ఏమయిపోయింది? గాండీవం ఇంత నిస్సారమయిపోయింది! అక్షయతూణీరాలు వృత్తిపోయాయి. అస్త్రవిద్యకూడా అశాశ్వతమేనా?"

పాండవుల మహాయాత్ర

అర్జునుడు ద్వారక వెళ్ళి ఇంకా హస్తినకి తిరిగిరాలేదు. ధర్మరాజు మనస్సు మనస్సులో లేదు. దినాలు తిన్నగా లేవు. అపశకునాలకి అంతులేకుండా వుంది. దిగులు దిగులుగా వుంది. రాళ్ళు తేలిపోతూ బెండ్లు మునిగిపోతున్నట్టున్నాయి.

విచారిస్తూ కూచున్నాడు ధర్మరాజు. భీముణ్ణి పిలిచి ఇలా అన్నాడు:

"భీమన్నా, అర్జునుడింకా రాలేదు. ఎన్నాళ్ళయి పోయింది! మనస్సేమీ బాగుండలేదు.

మహాయుద్ధం జరిగి ముప్పయ్యేళ్ళు అయిపోయింది. యాదవులు—మనవాళ్ళంతా ఎలావున్నారో! మామ వసుదేవుడూ, మేనత్త దేవకీ బాగా ముసిలాళ్ళయిపోయివుంటారు. పాపం ఎన్ని కష్టాలు పడ్డారు!

కృష్ణుడు పుట్టి, కంసుణ్ణిచంపాక కాని వాళ్ళ ఖైదు తప్పలేదు. కృష్ణుడే యాదవుల కష్టాలు ఆదుకున్నాడు. మహానుభావుడు. సామాన్యుడా కృష్ణుడు.

యాదవుల సంగతి అలా వుంచు. మనం ఇవాళ ఇలా వున్నామంటే-ఇదంతా కృష్ణుడు పెట్టిన భిక్ష.

మనమీద ఈగ వాలితే, అతడిమీద ఏనుగు వాలేది. పాండవులే పంచప్రాణాలు కృష్ణుడికి. ఎన్నెన్ని ఆపదలలో అడ్డుపడ్డాడు ! జయద్రథుడి వధలో అర్జునుణ్ణి రక్షించాడు. బాబయ్యగారికి నీ వుక్కు-బొమ్మ అందిచ్చి నీ ప్రాణం కాపాడాడు. మనిషికాదయ్యా, కృష్ణుడు మన పాలి దేవుడు.

ఇవాళయినా వస్తాడా అర్జునుడు ! తమ్ముడి మొహం కళ్ళముందు దీనంగా కనపడుతుంది. ఎడమకన్ను అదురుతుంది. ఎడమ భుజం బెదురుతుంది. ఎన్నడూ లేదు, మనస్సంతా కలిచేస్తూవుంది.

తమ్ముడూ ! కొన్నాళ్ళయి ఎన్నో విడ్డూరాలు చూస్తున్నాను. ఏం ఆపద వస్తుందో ఏమో !

అవాళ గాంధారి అంతమాట అనేసింది. గడువు నిండి పోయింది. నిజంగా కృష్ణస్వరూపం ఈ భూమండలంమీద కనపడదా ? ఆ అడుగుల గుర్తులు ఈ నేలమీద అవు పడవా ?"

గొంతుక నొక్కుకుపోయింది ధర్మరాజుకి. కళ్ళనీళ్ళు కమ్మాయి.

ధర్మరాజు కళ్ళు తుడుచుకుంటున్నాడు "అన్నయ్యా!" అంటూ అర్జునుడు వచ్చి కాళ్ళమీద పడ్డాడు.

అతడి మొహమంతా కన్నీటితో వుంది. దీనత్వం వుట్టి పడుతూ ఉంది.

తడబడిపోయాడు ధర్మరాజు.

"ఏం నాయనా, ఏమయింది ? ఏమయింది బాబూ ? క్షేమంగా వచ్చావుకదా ? ఎన్నడూ లేదు? కంటతడి పెట్టు కుంటున్నావేం తండ్రీ ?"

నోటమాట రాలేదు అర్జునుడికి. అంతా శూన్యంగా అవుపడుతూ వుందతడికి. గుండెలు కుమిలిపోతున్నాయి. నోరు ఆర్చుకుపోతూవుంది. కన్నీళ్ళు వరదలు కడుతున్నాయి.

"చెప్పు తండ్రీ ! ఇన్నాళ్ళుండిపోయావు ! జరగరాని

పని ఏదయినా జరిగిందా? చెయ్యరాని పని ఏదయినా చేశావా? చంపరాని వాళ్ళని చంపేశావా?"

అర్జునుడి దుఃఖం మరింత కలవరపెట్టింది ధర్మరాజుని. అతడి గుండెలు కొట్టుకున్నాయి. వేగిరపడుతూ అడిగాడు.

"ద్వారకలో మరేమీ చెడ్డ జరగలేదుకదా! యాదవకులమంతా హాయిగా వుందా? మధు, భోజ వంశాలవారూ, అర్హ, దశార్హ, సాత్వతులూ, అంధకులూ, వృష్ణులూ, అందరూ బాగున్నారా బాబూ?

కుల వృద్ధుడు మన తాత శూరసేనుడూ, భోజుల రాజు ఉగ్రసేనుడూ కులాసాగా తిరుగాడుతున్నారా?

మేనత్త దేవకీ, మామ వసుదేవుడూ, అక్రూరుడూ, దేవకుడూ, హృదీకుడూ, కృతవర్మా, జయంతుడూ, గదుడూ, సారణుడూ, ప్రద్యుమ్నుడూ, అనిరుద్ధుడూ, సుషేణుడూ, చారుదేష్ణుడూ, సాంబుడూ, ఋషభుడూ కులాసాయేనా తండ్రీ?

మరి ఎందుకని ఇంత బాధ తమ్ముడూ?

బలరామకృష్ణులు – వారికేం, యాదవ లోకానికి సూర్యచంద్రులు.

నువ్వే తాను, తానే నువ్వు కృష్ణుడు. అతడి నీడ లోనే యాదవుల పెంపు. యాదవులకే కాదు, పాండవులకీ అతడే శ్రీరామరక్ష.

"అర్జునా ! ద్వారకలోనే వున్నాడా కృష్ణుడు? సుధర్మలో సభలు సాగిస్తున్నాడా ?"

"అంతా అయిపోయిందన్నయ్యా!" అంటూ బావురుమన్నాడు అర్జునుడు. "కృష్ణుడు లేడు, యాదవులు లేరు, సుధర్మ లేదు, ద్వారకా లేదు అంతా అయిపోయింది.

"మన కృష్ణుడు మరి లేడు. మన సారథి మరి లేడు. మన దేవుడు మరి లేడు. నన్నూ, నిన్నూ దిక్కుమాలిన వాళ్ళని చేసి వెళిపోయాడన్నయ్యా, వెళిపోయాడు. శాశ్వతంగా వెళిపోయాడు. నన్ను నడ పీనుగుచేసి వెళిపోయాడు. లోకం చిట్టచీకట్టిచేసి వెళిపోయాడు.

"క్షేమంగా వచ్చావుకదూ' అని అడుగుతున్నావా అన్నయ్యా? క్షేమంగానే వచ్చాను. ప్రాణంలేని కట్టెలా వచ్చాను. సిరసులేని మొండెంలా వచ్చాను. నీ తమ్ముడు- ఆ అర్జునుడు మరి లేడన్నయ్యా!

"భీష్ముడ్నీ, ద్రోణుడ్నీ, కర్ణుడ్నీ, అశ్వత్థామనీ ముచ్చెమటలు పోయించిన అర్జునుడు, అతిరథ మహారథుల్ని పరిగెత్తించిన అర్జునుడు, దోపిడి దొంగలముందు, పల్లెటూరి గొల్లమూకలముందు వోడిపోయాడన్నయ్యా.

యాదవులు తప్పతాగి తమలో తాము కుమ్ములాడారు. తమని తామే చంపుకున్నారు. బలరాముడు తనువు చాలించాడు. నా కృష్ణుడ్ని కిరాతుడు బాణంతో కొట్టేశాడు.

శూరసేన, ఉగ్రసేన, వసుదేవులు కళ్ళు మూశారు. ద్వారక సముద్రంలో మునిగిపోయింది. రుక్మిణి మొదలైనవారు అగ్నిలో దూకారు. కృష్ణుడు పదహారువేలమంది భార్యల్ని భద్రంగా తీసుకువస్తున్నాను. పంచనద దేశంలో దొంగలు వచ్చిపడ్డారు. స్త్రీలని ఎత్తుకుపోయారు. ఏమీ చెయ్యలేక పోయాన్నేను. నా శక్తి నీరసపడిపోయింది. గాండీవం కదల్లేదు బాణాలు పనిచెయ్యలేదు. అక్షయ తూణీరాలు వుత్తిపోయాయి. అంతా కృష్ణుడితోనేపోయింది.

ఉసురులేని పాడు కట్టె, కృష్ణుడులేని ఈ అర్జునుడు రెక్కలులేని పిట్ట. నూనెలేని దివ్వె.

కృష్ణుడి ఆశ్రయం వుండేది కనకనే మత్స్యయంత్రం కొట్టాను, రాజుల్ని తరిమాను. అతడి సాయంతోనే ఖాండవ వనం కాల్చేశాను. దిగ్విజయం సాధించాను. గంధర్వుల్ని పారదోలి దుర్యోధనుణ్ని విడిపించాను.

కృష్ణుడి బలంతోనే విరాటరాజు ఆవులు మళ్ళించాను. అతడి సారథ్యంవల్లే అంత భారతయుద్ధం అవలీలగా సాధించాను. జయద్రథుణ్ని చంపి, ప్రతిజ్ఞ నిలబెట్టాను. కర్ణుడంతవాణ్ని కడతేర్చాను.

అలాంటి నేను ఇవాళ అతడి భార్యల్ని ఆదుకోలేకపోయాను! గాండీవం కదపలేకపోయాను.

నేనంటే ప్రాణం నా కృష్ణుడికి, నన్ను వొదిలేసి వెళిపోయాడు. ఆ చల్లని చూపులు, ఆ తియ్యనిమాటలు, ఆ నవ్వులు, ఆ ప్రేమ, ఆదరణ - ఎంత స్నేహం నామీద! ఎంత దయ!

కలిసి మెలిసి తిరిగాం. కలిసి కూచున్నాం. కలిసి నిదర పోయాం. కలిసి తిళ్ళు తిన్నాం. కబుర్లు చెప్పుకున్నాం. ఊసులాడుకున్నాం. ఈసులాడుకున్నాం. అవునంటే కాదనుకున్నాం. ఎత్తిపొడుచుకున్నాం. నువ్వా తప్పా అంటే నువ్వా తప్పా అనుకున్నాం. ఒక్కనాడూ తప్పు పట్టలేదు నన్ను. అమృతహృదయంతో అన్ని తప్పులూ మన్నించేవాడు 'అర్జునా!' అని పిలిచేవాడు. 'నేస్తం!' అని వచ్చేవాడు.

అవాళ సహాయంకోసం వెళ్ళాను. 'నేను ముందు వచ్చా'నన్నాడు దుర్యోధనుడు. 'నేను అర్జునుణ్ని ముందు చూశాను' అన్నాడు కృష్ణుడు. 'భీష్ముణ్ని నువ్వుకాదు నేనే చంపుతా' నని వురికాడు. అన్నయ్యా, 'ఆయుధం పట్టను' అన్నవాడు నాకోసం ఆయుధం పట్టుకున్నాడు. ఇవాళ నన్ను వొదిలేసి వెళ్ళిపోయాడు. నా కృష్ణుడు నన్ను వొదిలేసి వెళిపోయాడు!"

అర్జునుడు అలా ఏడుస్తూవుంటే, యాదవకుల నాశనం చెబుతూ వుంటే, కృష్ణుణ్ని తలుచుకుని కుమిలిపోతూ వుంటే- గుండెలు పగిలిపోయినట్టు గోలు మన్నారు పాండవులు.

"కృష్ణా!" అంటూ కూలబడిపోయింది కుంతి. తండ్రినీ, అన్ననీ తలుచుకుంది. తనువు చాలించింది.

"అమ్మకూడా వెళిపోయింది" కూలబడిపోయారు పాండవులు. కృష్ణుడి ఉపదేశాలు తనువుకి తెచ్చుకున్నారు. గుండెరాయి చేసుకున్నారు. మహాయాత్రకి సిద్ధపడ్డారు.

మహాభారతయుద్ధంలో పద్ధెనిమిది అక్షౌణీల సేన తుడుచుకుపోయింది. అతిరథులూ, మహారథులూ అంతమై పోయారు. కంసుడూ, కాలయవనుడూ, జరాసంధుడూ, సాల్వుడూ వంటివారు అంతకు ముందే గతించారు. ఒక్క యాదవకులమే మిగిలింది. పరాయివాడు తేరిచూడలేనంతగా పెరిగింది. పెంచినవాడే తుంచేశాడు. యాదవుల్ని యాదవులే చంపుకున్నారు. వెదుళ్ళ అడివి పెరిగింది. కాకులు దూరని కారడివి. చీమలు దూరని చిట్టడివి. వెదుళ్ళు వెదళ్ళని రాపాడాయి. కారుచిచ్చు రగులుకుంది. వెదుళ్ళ వనం మండిపోయింది. బూడిద మిగిలింది.

కాలానికి కనికారంలేదు. కౌరవుల్ని మింగింది. యాదవుల్నీ మింగింది. పాండవుల మీదికీ దొర్లింది.

కలికాలం కాళ్ళు చాపుతోంది.

కాలగతి తెలిసినవాడు ధర్మరాజు. అందుకనే మహాయాత్రకి సిద్ధపడ్డాడు. అభిమన్యుడి కొడుకుని పరీక్షిత్తుని

హస్తిన సింహాసనానికి అభిషేకించాడు. అలాగే అనిరుద్ధుడి కొడుకుని వజ్రుణ్ణి యాదవుల రాజ్యానికి రాజు చేశాడు. మధురాపట్నం పట్టం కట్టాడు.

తన రాజ లాంఛనాలన్నీ విడిచిపెట్టాడు ధర్మరాజు. నారలు కట్టుకున్నాడు. తిండి మానేశాడు. మాటలూ మానేశాడు. యోగం అవలంబించాడు. వెర్రివాడిలా తల విరబోసుకున్నాడు.

ఎవరి వేపూ దృష్టి లేదతడికి. ఎవరి వూసూ అక్కర లేదు. ఎవరి అపేక్షా లేదు. మూగివాడిలాగ, చెవిటివాడిలాగ, కంటిచూపు లేనివాడిలాగ చెప్పకండా చెయ్యకండా కోట లోంచి వెళిపోయాడు. ఉత్తరం వేపు నడిచిపోయాడు. తిరిగి రాని దీక్షతో వెళిపోయాడు. అదిగో అదే మహాయాత్ర. అదే మహాప్రస్థానం. తనువు విడిచి పెట్టడమే మహాప్రస్థానం.

తమ్ములు భీమార్జునులూ, నకుల సహదేవులూ; ధర్మరాజులాగే మహాయాత్రకి బయలుదేరారు. అతడి వెంట నడిచారు. ఒకరి వూసు ఒకరికి లేదు. ఒకరితో ఒకరు మాటా లేదు, మంతీ లేదు.

నిమిషం చూడకపోతే వుండలేకపోయే భర్తలు తన మాటే ఎత్తకండా వెళ్ళిపోడంతోనే తానూ యోగం

పూనింది ద్రౌపది. అప్పటి కృష్ణుడి విషయం విని ఏడుస్తోం దామె. భర్తలలాగే తానూ తనువు చాలించింది.

కృష్ణుడు లోకం విడిచి వెళ్ళడంతోనే, భారతానికీ, భాగవతానికీ ఒక్కమారే సమాప్తి సంభవించింది. రెంటికీ ఒక్కడే సూత్రధారుడు శ్రీ కృష్ణుడు.

—: సమాప్తం :—

భాగవతం

రాముడి కథ రామాయణం.
కృష్ణుడి కథ భాగవతం.

భారతం, హరివంశం, విష్ణుపురాణం భాగవతం— ఇవి కృష్ణ కథకి ప్రధానమయిన గ్రంథాలు. ఇవికాక ఇతర పురాణాలూ లేకపోలేదు. అవి అంత ప్రధానమయినవి కావు.

పాండవులు లేని భాగవతం వుండవచ్చు. కృష్ణుడు లేని భాగవతం లేదు. యాదవుల చివరి కథకోసం ప్రత్యేకం ఒక పర్వమే వుంది భారతంలో— మౌసలపర్వం.

హరి వంశం అంటే- యాదవ వంశమే. విష్ణు పురాణం అంటే కృష్ణ పురాణమే నిజానికి.

అయితే భారతం, హరివంశం, విష్ణుపురాణం, భాగవతం— ఈ నాలుగూ ఒకదాంతో ఒకటి సరిపోవు ఎన్నో చోట్ల.

ఉదాహరణకి :

కృష్ణుడు కాలంచేశాక అతడి భౌతిక శరీరానికి అర్జునుడు సంస్కారం జరిపించాడంటుంది భారతం.

అతడు శరీరంతో పరలోకానికి వెళ్ళాడంటుంది భాగవతం.

ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో చెప్పి, గాంధారితో ఆశ్రమవాసానికి వెళ్ళాడనీ, అతడితో కుంతీ, విదురుడూ వెళ్ళారనీ, వారు ఆశ్రమవాసంలో వుండగా పాండవులు సపరివారంగా వెళ్ళి చూచివచ్చారని భారతం.

చెప్పకుండా, చెయ్యకుండా గాంధారీ ధృతరాష్ట్రులు అర్ధరాత్రి విదురుడితో వెళ్ళారని భాగవతం.

ఈ కథకోసం వేరే ఒక పర్వమే వుంది— భారతంలో ఆశ్రమవాస పర్వం.

కుంతి గాంధారీ ధృతరాష్ట్రులతో అగ్గిలో కాలి పోయిందని భారతం.

హస్తినలోనే కుమాళ్ళ దగ్గిర వుండి యాదవుల నాశనం విని, పాండవులు మహాయాత్రకి బయలుదేరినప్పుడు దేహం చాలించిందని భాగవతం.

నరకుడి చెరనించి విడిపించి, కృష్ణుడు పెళ్ళి చేసుకున్న రాజకన్యలు పదహారువేల వందమంది అని విష్ణుపురాణం. పదహారువేలు అని భాగవతం.

పాండవులు అయిదుగురూ, ద్రౌపదీ వరసగా మహ-యాత్ర - అదే మహాప్రస్థానం చేశారనీ ద్రౌపదినించి

294.592 Acc No. 2000

భీముడిదాకా ఒకరి తరువాత ఒకరు పడిపోతూ వుంటే వారి లోపాలు చెపుతూ ధర్మరాజు ముందుకి సాగిపోయాడనీ, అతడితో ఒక కుక్కకూడా వెళ్ళిందనీ భారతం.

మాటా మంతీ లేకండా ధర్మరాజు వెళిపోయాడనీ, తమ్ముళ్లు మాత్రం వెంట వెళ్ళారనీ, ద్రౌపది ఇంటిదగ్గిరే వుండి తనువు చాలించిందనీ భాగవతం.

ఇలా విదురుడి విషయంలోనూ, మరి కొన్ని విషయాలలోనూ ఎన్నో తేడాలు అవుపిస్తాయి.

పద్దెనిమిది పురాణాలూ దేంతోనూ ఒకటి సమంగా సరిపోదు.

భారతమూ, పద్దెనిమిది పురాణాలూ ఒక్కరే రాశారంటారు కొందరు. ఈ తేడాలు చూస్తే అది పొరపాటని ఎవరికయినా అనిపిస్తుంది.

పద్దెనిమిది పురాణాలూ ఒక్కరు రాసినవి కావు. పద్దెనమండుగురు రాసినవి.

పురిపండా భాగవతం సంస్కృతంలోని భారతం, హరివంశం, విష్ణుపురాణం, భాగవతం - ఈ నాలుగింటినీ అనుసరించిన స్వతంత్ర రచన. వెనక నేను రాసిన **2096** పుటల భాగవతానికి కుదింపు కాదు.

—పురిపండా అప్పలస్వామి